# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 6 | మార్చి 2024 | వెల : రూ.15




# 2024 ఎన్నికలు

## ప్రజా సంఘాల ఎజెండాలు

## ప్రత్యామ్నాయ రాజకీయాలు

మార్చి - 2024

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 6


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1). రాజకీయ ప్రత్యామ్నాయం - ప్రత్యామ్నాయ రాజకీయం : సంపాదకీయం 3
2). 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సీట్లు పెరిగేనా ? తరిగేనా ? 4
3). ఒక్క ఓటుతో బీజేపీకి బుద్ధి చెప్పండి ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టండి 6
4). 2024 ఎన్నికలలో బీజేపీ, అనుకూల పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యకూడదు - వడ్డే శోభనాద్రీశ్వరరావు - కె.విజయరావు 7
5). ఉమ్మడి కార్యాచరణకు ఎజెండా - వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావు 10
6). అసమానతలు లేని అభివృద్ధి కోసం.. ప్రజా ప్రణాళిక - వి.శ్రీనివాసరావు 12
7). కనీస ఉమ్మడి అజెండాను ఆమోదించాలి - వడ్డే శోభనాద్రీశ్వరరావు 14
8). ఒకే ఎజెండాతో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన 18
9). ఆం.ప్ర. కౌలు రైతుల సంఘం మేనిఫెస్టో - ఎ.కాటమయ్య, పి.జమలయ్య 18
10). బీజేపీ, దాని వంది మాగధులను ఓడించాలి - ట్రూన్యూస్ 20
11). మైనారిటీల హక్కుల పరిరక్షణకు ముస్లిం ఆలోచనాపరుల వేదిక ఎజెండా 21
12). మహిళల సాధికారతకు ఎజెండా 26
13). కులం మూలాలను గుర్తించడం ద్వారానే ఆ మహమ్మారిని తుదముట్టించగలం!! - పేరూరి మురళీకుమార్ 29
14). ప్రజల ఎజెండా రూపకల్పనకు కొత్త చూపు - కొత్త దారి - డీవీవీఎస్ వర్మ 31
15). 'వికల్ప' ప్రజా సంఘాల వేదిక మేనిఫెస్టో 35
16). లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలి ? - డాక్టర్ కొల్లా రాజమోహన్ 39
17). రైతుల సంక్షేమానికి ప్రత్యామ్నాయ విధానాలు - డాక్టర్ కిలారు పూర్ణచంద్రరావు 41
18). నియోలిబరల్ ఉత్పత్తి విధానాలు - ప్రత్యామ్నాయాలు - డాక్టర్ మర్ల సోము 46
19). సహకార రంగం - నూతన దృక్పథం - డాక్టర్ సి.కృష్ణమోహన్‌రావు 49
20). ప్రాథమిక విద్యారంగం : ప్రస్తుతం - ప్రత్యామ్నాయాలు - విఠపు బాలసుబ్రహ్మణ్యం 53
21). 2020 నూతన విద్యా విధానానికి ప్రత్యామ్నాయం - ఎస్.గోవిందరాజులు 59
22). మోదీ రాజకీయం లోగుట్టు - డీవీవీఎస్ వర్మ 63
24). కార్టూన్స్ 67
25). ఎన్నికల ఎజెండాలు.. కొన్ని పుస్తకాలు 2024 68




కార్టూన్ : సతీష్ ఆచార్య

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

## దారి దీపం

### మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# రాజకీయ ప్రత్యామ్నాయం - ప్రత్యామ్నాయ రాజకీయం

రాజకీయ ప్రత్యామ్నాయం, ప్రత్యామ్నాయ రాజకీయం అన్న భావనలు వాడుకలో వున్నవే. ఈ రెండింటినీ కలగాపులగం చేసి వాడడం కూడా మనం చూస్తున్నదే. అయితే ఈ రెండు భావనలు ఒకటి మాత్రం కాదు. దారిదీపం మార్చి సంచికకు ప్రత్యామ్నాయ రాజకీయ భావనను పరిచయం చేస్తున్నది. ఇది ఒక ప్రయత్నం మాత్రమే. రోజూ మనకు వినిపించే మాట రాజకీయ ప్రత్యామ్నాయం. దీని ప్రధాన లక్ష్యం ఒక పాలక పక్షాన్ని గద్దె దించడం లేదా మరొక పాలక పక్షాన్ని గద్దెనెక్కించడం. ఇది వ్యవస్థను మార్చే ప్రయత్నం కాదు. ప్రస్తుత వ్యవస్థ పరిధిలో కొన్ని ఉపశమనాలు. కొన్ని ప్రజా ప్రయోజనాలతో సరిపెట్టుకునేది. రాజకీయ ప్రత్యామ్నాయం ప్రధానంగా వ్యతిరేక ప్రచారం మీదే ఎక్కువగా ఆధారపడుతుంది. ఎదుటి పక్షం బలహీనతలనే తన బలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నది. దీనికితోడు కొన్ని జనాకర్షణ పథకాలను, నినాదాలను దానికి జోడిస్తుంది. ఇలాంటి రాజకీయ సంఘర్షణలో రాజకీయ విలువలు వుండవు. అధికారాన్ని నిలుపుకోవడానికి, లేదా సంపాదించుకోవడానికి ఎలాంటి అడ్డదారులైనా వీరికి తప్పుకాదు. మతం, కులం, ప్రాంతం వగైరా భావోద్రేక సమస్యలన్నీ అధికారాన్ని పొందడానికి సాధనాలుగా వాడుకుంటారు. డబ్బు, ప్రలోభాలతో ఓటర్లను వశపర్చుకునే ప్రయత్నాలు సాగిస్తారు. విధానాలు, సిద్ధాంతాలు లేనప్పుడు పార్టీల నేతల కుండువాల మార్పిడి సునాయాశంగా జరిగిపోతుంది. ఇది ప్రస్తుతం నడుస్తున్న రాజకీయం. మన కళ్ల ముందు కనిపిస్తున్న రాజకీయం. అధికారం కోసం సాగే క్షుద్రకళగా అది పెచ్చరిల్లుతున్నది. ఈ రాజకీయం అధికారం చుట్టూ తిరుగుతుంది. అధికారం కోసం పనిచేస్తుంది.

ప్రత్యామ్నాయ రాజకీయం దీనికి పూర్తిగా విరుద్ధమైంది. ప్రస్తుత దోపిడీ వ్యవస్థను మార్చే లక్ష్యంతో ఉంటుంది. ధన రాజకీయాన్ని జన రాజకీయం చేయడానికి పూనుకుంటుంది. దీనికోసం ప్రత్యామ్నాయ రాజకీయం నిర్దిష్టంగా తన విధానాలను, ఎజెండాను ప్రకటిస్తుంది. సంపద గల దేశంలో పేదరికం ఎందుకు వుంది ? అన్న మౌలిక సమస్య లేవనెత్తుతుంది. అంతరాలు లేని అభివృద్ధి ఎజెండాను ప్రకటిస్తుంది. సమ సమాజం, వివక్ష లేని సమాజాన్ని సాధించడానికి ప్రజలను చైతన్య పరుస్తుంది.


రాజకీయ ప్రత్యామ్నాయం అధికారం చుట్టూ తిరిగితే ప్రత్యామ్నాయ రాజకీయం ప్రజల చుట్టూ, వారి జీవన సమస్యల పరిష్కారం చుట్టూ తిరుగుతుంది. ప్రత్యామ్నాయ రాజకీయం ప్రజా ఉద్యమాల మీద ఆధారపడుతుంది. ధన శక్తి కంటే ప్రజా శక్తి మిన్నగా భావిస్తుంది. దేశ ప్రజలు తమ భవిష్యత్‌ను తామే నిర్మించుకునేలా వారికి సాధికారతను నేర్పిస్తుంది. నిరంతరాయంగా దోపిడీ చేస్తూ దేశ జనాభాలో పది శాతంగా వున్న సంపన్నులు దేశ సంపదలో దాదాపు 81 శాతాన్ని సొంతం చేసుకోవడం మీద ప్రజా ఉద్యమాన్ని ఎక్కు పెడుతుంది. సంపద పన్ను పంపిణీ జరిగి తీరాలని ప్రకటిస్తుంది. ఇలా వ్యవస్థను మార్చే విధానాలను ప్రకటిస్తుంది. ప్రజలను కేవలం ఓటర్లుగా, లబ్ధిదారులుగా మార్చి ప్రస్తుత ప్రజాస్వామ్యంలో ప్రజల్ని హక్కుదారులుగా మార్చే ఎజెండాను ప్రకటిస్తుంది.

స్థూలంగా ఇలాంటి మౌలిక రంగాలను ఈ సంచికలో ప్రచురించిన ఎజెండాలలో, వ్యాసాలలో కనిపిస్తాయి. ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనకు అది మనకు దారి చూపిస్తాయి. ఈ సంచిక ప్రత్యామ్నాయ రాజకీయాల మీద చర్చకు దోహదం చేస్తుందని, వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు ప్రేరణ ఇస్తుందని ఆశిస్తున్నాము. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సీట్లు పెరిగేనా ? తరిగేనా ?

**మోదీ మైండ్ గేమ్ మొదలుపెట్టారు. బీజేపీకి 370 సీట్లు వస్తాయంటున్నారు. ప్రతి మీటింగ్‌లోను ఇదే పాట పాడుతున్నారు. మళ్లీ ప్రభుత్వం తమదేనంటూ ప్రకటిస్తున్నారు. 2019 ఎన్నికలలో బీజేపీకి 37.36 శాతం ఓట్లే వచ్చాయి. కాని, 303 సీట్లు దక్కించుకుంది. కాంగ్రెస్‌కు 19.49 శాతం ఓట్లు వచ్చినా 52 సీట్లను మాత్రమే పొందింది.**




**బీజేపీకి మొత్తం సీట్లను గెలుచుకున్న రాష్ట్రాలు :** 2019 ఎన్నికలలో గుజరాత్, ఢిల్లీ, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, చండీఘర్, దయ్యూ డామన్‌లలో వున్న 58 స్థానాలనూ బీజేపీ గెల్చుకుంది. ఇతరులకు ఒక్క స్థానం కూడా రాలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ప్రాంతాల్లో అన్నిచోట్ల బీజేపీకి సీట్లు తగ్గడమే కాని పెరిగేది లేదు.

**బీజేపీ దాదాపు అన్ని స్థానాలనూ దక్కించుకున్న రాష్ట్రాలు :** బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, కర్నాటకలలో మొత్తం 147 స్థానాలు ఉంటే 136 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో కూడా బీజేపీ సీట్లు తగ్గుతాయే గానే పెరిగే అవకాశాలు కనిపించడం లేదు.

ఇక ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఒడిసా రాష్ట్రాలలో ప్రస్తుత స్థానాలు నిలబెట్టుకోవడమే గగనంగా వుంది. దేశం మొత్తం మీద బీజేపీ ఈ ఎన్నికలలో కనీసం 80, 90 స్థానాలు కోల్పోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ వాస్తవాన్ని కప్పి వెయ్యడానికి మోదీ నంబరు గేమ్ ఆడుతున్నారు. ఈ ఎన్నికలలో బీజేపీ ఓటమికే ఎక్కువ అవకాశాలున్నాయి.

**మొదటిది..** 2019 ఎన్నికలలో మోదీని ఢీకొట్టగల నాయకత్వం ప్రతిక్షానికి లేదు. ఇప్పుడు ప్రతిరోజూ మోదీని సవాలు చేస్తూ దేశంలో రాహుల్‌గాంధీ, రాష్ట్రాలలో ప్రతిపక్ష ముఖ్యమంత్రులు రంగంలో ఉన్నారు. మోదీ ఏకఛత్రాధిపత్యానికి గండిపడింది. మరో ప్రత్యామ్నాయం లేదన్న వాదనకు తెరపడింది.

**రెండవది..** ప్రతిక్షాలు ఇండియా కూటమిగా ఒకతాటి మీదకు రావడం. చాలా రాష్ట్రాలలో ఈ కూటమి విజయావకాశాలు మెరుగయ్యాయి. అయితే కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో ఈ కూటమి పరస్పర పోటీ వల్ల నష్టం జరుగుతుందన్న వాదన పైకి నిజమేననిపించినా వాస్తవానికి అక్కడ త్రిముఖ పోటీలో బీజేపీయే నష్టపోతుంది. ఇలాంటి పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత వుంది. ఈ రాష్ట్రంలో ఎవరు గెలిచినా 25 సీట్లు బీజేపీ పంచకేపోవడం అన్నది ప్రమాదకరమైన పోకడ. ఇదే దేశ రాజకీయం మీద తీవ్ర ప్రభావాన్ని చూపించేదిగా వుంది. అందువల్ల ఈ రాష్ట్రంలో బీజేపీని దాని ప్రత్యక్ష, పరోక్ష సమర్థకులని ఓడించడం అవసరం.

**రాష్ట్రంలో ఇండియా కూటమి బలహీనంగా వుంది. ఇప్పటికిప్పుడు దాని బలం పెరగాలంటే కొన్ని సంచలన నిర్ణయాలను ఇండియా కూటమి పార్టీలు, ప్రజలు తీసుకోవాలి. ఈ రాష్ట్రంలో బీజేపీ పోటీ చేస్తున్న ఆరు స్థానాల్లోనూ కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల రాష్ట్ర నాయకులు పోటీకి దిగితే రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించగలుగుతారు. బీజేపీ కేంద్ర బిందువుగా ఎన్నికల ప్రచారం కొత్త రూపం ధరిస్తుంది. అలాగే తెలుగుదేశం, జనసేన, వైసీపీ పార్టీల అభిమానులు ఈ రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించాలి. తమ పార్లమెంట్ ఓటును ఇండియా కూటమికి వేయడం ద్వారా బీజేపీ దొంగాటకు బుద్ధి చెప్పాలి. ఇలాంటి సముచిత నిర్ణయాలను ఇండియా కూటమి పార్టీలు, ఓటర్లు తీసుకోవాలి.** ❑

## 2019 ఎన్నికల్లో రాష్ట్రాలు.. గెలుపొందిన పార్టీలు.. సీట్లు

| State | Total Seats | INC | BJP | Others | Party Seats Won |
|---|---|---|---|---|---|
| 1.Uttar Pradesh | 80 | 1 | 62 | 17 | BSP 10, SP 5, ADS 2 |
| 2.Maharashtra | 48 | 1 | 23 | 24 | SHS 18, NCP 4, AIMIM 1 |
| 3.West Bengal | 42 | 2 | 18 | 22 | AITC 22 |
| 4.Bihar | 40 | 1 | 17 | 22 | JD(U)16, LJP 6 |
| 5.Tamil Nadu | 38 | 8 | - | 30 | DMK23, CPI(M)2, CPI 2 |
| 6.Madhya Pradesh | 29 | 1 | 28 | - | - |
| 7.Karnataka | 28 | 1 | 25 | 2 | IND 1, JD(S)1 |
| 8.Gujarat | 26 | - | 26 | - | - |
| 9.Rajasthan | 25 | - | 24 | 1 | RLP1 |
| 10.Andhra Pradesh | 25 | - | - | 25 | YSRCP 22, TDP 3 |
| 11.Orissa | 21 | 1 | 8 | 12 | BJD12 |
| 12.Kerala | 20 | 15 | - | 5 | IML 2, KCM 1, RCP1 |
| 13.Telangana | 17 | 3 | 4 | 10 | TRS 9, AIMIM 1 |
| 14.Assam | 14 | 3 | 9 | 2 | IND 1, AIUDF 1 |
| 15.Jharkhand | 14 | 1 | 11 | 2 | JMM 1, AJSU 1 |
| 16.Punjab | 13 | 8 | 2 | 3 | SAD 2, AAP 1 |
| 17.Chhattisgarh | 11 | 2 | 9 | - | -- |
| 18.Haryana | 10 | - | 10 | - | -- |
| 19.Delhi | 7 | - | 7 | - | -- |
| 20.Jammu & Kashmir | 6 | - | 3 | 3 | JKN 3 |
| 21.Uttarakhand | 5 | - | 5 | - | -- |
| 22.Himachal Pradesh | 4 | - | 4 | - | -- |
| 23.Manipur | 2 | - | 1 | 1 | NPF1 |
| 24.Goa | 2 | 1 | 1 | - | -- |
| 25.Tripura | 2 | - | 2 | - | -- |
| 26.Meghalaya | 2 | 1 | - | 1 | NPEP 1 |
| 27.Arunachal Pradesh | 2 | - | 2 | - | -- |
| 28.Sikkim | 1 | - | - | 1 | SKM 1 |
| 29.Lakshadweep | 1 | - | - | 1 | NCP 1 |
| 30.Chandigarh | 1 | - | 1 | - | -- |
| 31.Pondicherry | 1 | 1 | - | - | -- |
| 32.Nagaland | 1 | - | - | 1 | NDPP 1 |
| 33.Mizoram | 1 | - | - | 1 | MNF 1 |
| 34.Andaman&Nicobar Islands | 1 | 1 | - | - | -- |
| 35.Dadra&Nagar Haveli | 1 | - | - | 1 | IND 1 |
| 36.Daman & Diu | 1 | - | 1 | - | -- |
| **Total** | **542** | **52** | **303** | **187** | |

# ఒక్క ఓటుతో బీజేపీకి బుద్ధి చెప్పండి ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టండి

ప్రగతిశీల పౌరసంఘాల వేదిక-తణుకు

**ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు వస్తున్నాయి. ఈ ఎన్నికలలో మనందరికీ రెండు ఓట్లు వుంటాయి. ఒక ఓటు శాసనసభకు పోటీ చేసే వారికి, మరొక ఓటు లోక్‌సభకు పోటీ చేసే వారికి వెయ్యాలి. రాష్ట్ర శాసనసభకు మీరు అభిమానించే పార్టీకి - "తెలుగుదేశం-జనసేన కూటమికి" లేదా వైసీపీకి లేదా వామ పక్షాలు, కాంగ్రెస్ పార్టీ లేదా ఇతర పక్షాలకు - ఒక ఓటు వేసుకోండి. పార్లమెంటుకు వేసే రెండవ ఓటును మాత్రం ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం బీజేపీకి బుద్ధి చెప్పడానికి వెయ్యండి.**

ఎందుకంటే మీరు అభిమానించే "తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి" లేదా వైసీపీకి చెందిన ఏ పార్లమెంటు అభ్యర్థికి ఓటు వేసినా అది బీజేపీకి వేసినట్లే అవుతుంది. తెలుగుదేశం, జనసేనలు, వైసీపీ పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీ ఉచ్చులో చిక్కుకుని ఉన్న సంగతి అందరికీ తెలిసిందే ! 2014 ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థులను పార్లమెంటు ఎన్నికల్లో అధికంగా గెలిపిస్తే, వారు కేంద్రంలో బీజేపీ కూటమిలో చేరి రెండు మంత్రి పదవులు తీసుకుని రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హెూదాను, విభజన హామీలను తుంగలో తొక్కారు. తెలుగుదేశం పార్టీ బీజేపీతో కుమ్మక్కై రాష్ట్రానికి ద్రోహం చేసిందని 2019లో వైసీపీ పార్లమెంటు అభ్యర్థులను అత్యధికంగా గెలిపిస్తే, ఈ పార్టీ కూడా తన స్వప్రయోజనాల కోసం బీజేపీ పంచన చేరి ప్రత్యేక హెూదాకు, విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చింది. ఈసారి పార్లమెంటు ఎన్నికలలో "తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి" అభ్యర్థులకు లేదా వైసీపీ అభ్యర్థులకు ఓటు వేసి మనం మరోసారి మోసపోకూడదు. మీ రెండవ ఓటును పార్లమెంటు అభ్యర్థులకు వేసేటప్పుడు మోదీ ప్రభుత్వం చేసిన దగాను గుర్తుకు తెచ్చుకోండి. మోదీ ఇచ్చే గ్యారంటీల బూటకాలను జ్ఞాపకం చేసుకోండి.

రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామని స్వయంగా మోదీ గారే 2014 తిరుపతి ఎన్నికల సభలో ప్రకటించారు. గెలిచిన తర్వాత ప్రత్యేక హెూదా ముగిసిన అధ్యాయం అంటూ దగా చేశారు. దేశంలోనే అతి గొప్ప రాజధాని నిర్మాణానికి సహాయం చేస్తామని చెప్పి చారెడు మట్టి, చెంబుడు నీళ్ళతో సరిపెట్టారు. విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన పోలవరం జాతీయ ప్రాజెక్టును నత్తనడకలో పెట్టారు. విశాఖ రైల్వే జోన్ ప్రకటనతో సరిపెట్టారు. మిగిలిన విభజన హామీలను చెత్త బుట్టలో పడేశారు. పైగా తెలుగు ప్రజలు త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మేస్తున్నారు. ఆంధ్రాబ్యాంకు పేరు లేకుండా చేశారు. ఇలా తెలుగు ప్రజలను వంచించి మన ఆత్మ గౌరవాన్ని కించపర్చిన బీజేపీని, దానితో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములుగా వున్న తెలుగుదేశం, జనసేన, వైసీపీ అభ్యర్థులకు మీ పార్లమెంటు ఓటుతో గుణపాఠం చెప్పాలి. ఇది అసాధ్యం కాదు. మీరు తలుచుకుంటే పార్లమెంటుకు వేసే ఒక్క ఓటుతో దీనిని సాధించగలరు. మీకు ఉండే రెండు ఓట్లలో ఒకటి రాష్ట్ర శాసనసభకు మీరు అభిమానించే పార్టీలకు వేసుకోండి. దీనివల్ల రాష్ట్రంలో మీరు అభిమానించే మీ పార్టీకి ఎలాంటి నష్టం జరగదు.

ఇలా బీజేపీ పంచన చేరి తెలుగు ప్రజల భవిష్యత్తును, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన తెలుగుదేశం, జనసేన, వైసీపీ అభ్యర్థులకు మీ పార్లమెంటు ఓటును వెయ్యకండి. మన రాష్ట్ర ప్రయోజనాల కోసం, ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం బీజేపీ దొంగాటను ఓడిచడానికి మీరు పార్లమెంటుకు వేసే రెండవ ఓటును ఆయుధంగా వినియోగించండి. పార్లమెంటుకు వేసే రెండవ ఓటును బీజేపీ దేశవ్యాపితంగా బీజేపీని ప్రతిఘటిస్తున్న ఇండియా కూటమిలో వున్న పార్టీలకు గాని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర పార్టీలకు స్వతంత్ర అభ్యర్థులకు వెయ్యండి. మీ చేతిలో వున్న ఒక్క పార్లమెంటు ఓటుతో దేశ రాజకీయం మారుతుంది. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన చట్టం హామీలు సాధించుకోడానికి దారి దొరుకుతుంది. పార్లమెంటుకు వేసే ఒక్క ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుదాం. రాష్ట్రానికి మంచి భవిష్యత్తును సాధించుకుందాం. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుందాం. ❑

**ఇట్లు**
**ఆంధ్రప్రదేశ్ సామాజిక న్యాయ పోరాట సమితి**
**ప్రగతిశీల పౌరసంఘాల వేదిక-తణుకు,**
**పేరూరి మురళీకుమార్, 93978 73331**

# 2024 ఎన్నికలలో బీజేపీ & అనుకూల పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యకూడదు



- వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావు

- రాజ్యాంగ మౌలిక సూత్రాలను కాలరాస్తూ, అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్న, విభజిత నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం, ద్రోహం చేసిన కేంద్ర బీజేపీ మోడి ప్రభుత్వంపై పోరాడకుండా, పోటీలు పడుతూ వైసీపీ, టీడీపీ, జనసేనలు తమ భుజాలపై బీజేపీని మోస్తున్నాయి.
- విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర ద్రోహం చేసింది.
- ఉమ్మడి రాష్ట్రంలో వున్న రూ.75,000/- కోట్ల ఉమ్మడి ఆస్తుల విభజన ఈ నాటికీ జరగలేదు.
- ఆర్థిక-పారిశ్రామిక ప్రోత్సాహకాలు లేనిదే ఆంధ్రప్రదేశ్ ఎట్లా - ఎప్పటికి అభివృద్ధి అయ్యేను ?
- కడపలో స్టీల్ ప్లాంట్ కట్టకపోగా, ఇనుము, బొగ్గు గనులను కేటాయించకుండా, 32 మంది ఆంధ్రుల బలిదానంతో సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని అమ్మబోతోంది.
- ఢిల్లీని తలదన్నేలా అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరిస్తానన్న హామీని మరిచి, జగన్ మూడు రాజధానులు అన్నప్పుడు, శంకుస్థాపన చేసిన మోడి తప్పుని ఖండించలేదు.
- జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు భూసేకరణ - పునరావాస ఖర్చు రాష్ట్రమే భరించాలనే మెలిక దుర్మార్గం. రాష్ట్రంలో ఒక మేజర్ పోర్టును నిర్మించాలన్న హామీని అమలు చేయలేదు.
- విశాఖపట్నం - కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ అభివృద్ధి ప్రారంభమే కాలేదు.
- విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పురోగతి నత్తనడకను తలపిస్తోంది.
- విశాఖపట్నంలో రైల్వే జోన్ ఇప్పటికీ ఏర్పాటు అవలేదు.
- 12వ ఆర్థిక సంఘం, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫారసు ప్రకారం కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజ వాయువులు రాష్ట్రానికి కనీసం 50 శాతం లాభం ఇవ్వాలి. మన అవసరాలు తీరిన తర్వాతే గుజరాత్‌కు తరలించాలి.
- భారత రైతాంగానికి, వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం చేకూర్చే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించకపోగా, రద్దు చేయాలని కోరుతూ 13 మాసాలపాటు సాగిన రైతు ఉద్యమానికి సంఘీభావం తెలుపకపోవడం సబబా ?
- C2+50% చట్టబద్ధ ఎం.యస్.పి.కి అంగీకరించకపోగా, ప్రస్తుత రైతు ఉద్యమంపై అత్యంత కిరాతకంగా వ్యవహరిస్తూ వుండడం అత్యంత కిరాతకం.
- డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మరియు చౌదరి చరణ్ సింగ్‌లకు 'భారతరత్న' ప్రదానం చేయడం కేవలం రైతులను మభ్యపరిచి ఓట్లు దండుకొనడానికేనని కనిపిస్తోంది.
- రైతుల పాలిట ఉరి తాళ్ళు కాగల ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించినా, అందుకు మూలమైన కేంద్ర ఎలక్ట్రిసిటీ బిల్లు 2020ను వ్యతిరేకించలేదు. పలు విద్యుత్ సంస్థలను కేంద్రం అమ్మబోతూ వుంది.
- పేదలతో సహా ప్రజలందరికీ నిత్యావసర సరుకుగా మారిన విద్యుత్ సబ్సిడీని 2025 నాటికి తీసివేయాలని, వివిధ అదనపు చార్జీలతో టారిఫ్ నిర్ణయించబడేలా చేసి, ప్రజలపై భారాన్ని పెంచింది.
- సాగు నష్టాలకు గురైన రైతులకు ఒక్క పర్యాయం రుణ మాఫీ చేయాలని కోరినా పట్టించుకోని ప్రధాని కార్పోరేట్లకు, బడా వాణిజ్యవేత్తలకు రూ.14.60 లక్షల కోట్లను మాఫీ చేశారు.
- సన్న కారు, చిన్న రైతుల్లో 40 శాతం, కౌలు రైతుల్లో అత్యధిక శాతం హెచ్చు వడ్డీలతో ప్రైవేట్ రుణాలపై ఆధారపడుతూ ఉండగా, బడా బాబులకు మాత్రం బ్యాంకులు పోటీపడి మరీ రుణాలు ఇస్తున్నాయి.
- రైతుల ఆత్మహత్యలను ఆపటానికి కేరళలో తరహా 'రుణ ఉపశమన చట్టం'ను చేయాలని కోరినా చెయ్యలేదు.
- ప్రకృతి వైపరీత్యాల వలన చేకూరే నష్టాలకు ఎకరాకు రూ.10,000/- ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదు. ఇన్సూరెన్స్ కంపెనీలకే తప్ప రైతులకు మేలు చేయని పంటల బీమా (పీఎంఎఫ్‌బీవై).
- ఏటా దాదాపు రూ.1.5 లక్షల కోట్లను జాతీయ రహదారుల అభివృద్ధికి ఖర్చు చేస్తూ, రైతాంగానికి మేలు చేసే ఇరిగేషన్ రంగానికి వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఎంత వరకు సబబు?
- సుదీర్ఘకాలంలో ఎన్నెన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు లాభాలను పెంచేలా 4 లేబర్ కోడ్లను తెచ్చింది.

- పేదలపై పన్నుల భారాన్ని పెంచుతూ కార్పొరేట్లకు లక్షలాది కోట్ల రూపాయల రాయితీలు సబబా? సంపద పన్ను (Wealth Tax) రద్దు చేయబడగా, కార్పొరేట్ ట్యాక్స్ 30 నుంచి 20 శాతానికి తగ్గించడం వల్ల రూ. 1.48 లక్షల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది.
- కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి ఆరు శాతానికి తగ్గించి, సామాన్యులపై భారం పడే ఎక్సైజ్ డ్యూటీలను 12 నుంచి 19 శాతానికి పెంచింది.
- MSME సెక్టారు 12.36 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ ఎగుమతులకు 50 శాతం, జీడీపీకి 27 శాతం జమ చేస్తూ ఉంటే, రుణం రూ. 22.60 లక్షల కోట్లు అందగా భారీ పరిశ్రమల రంగానికి రూ. 25.3 లక్షల కోట్లు అందింది.
- మనదేశంలో 50 శాతం దిగువ ప్రజల సంపద 6 శాతం. వీరు జీఎస్టీకి 60 శాతం కడుతున్నారు. అత్యంత అధిక ఆదాయం పొందే 10 శాతం మంది ప్రజల వద్ద దేశ సంపదలో 48 శాతం వుంది. వీరి నుంచి జీఎస్టీకి మూడు శాతం మాత్రమే జమ అవుతూంది!
- మోడీ హయాంలో బిలియనీర్ల సంఖ్య 100 నుంచి 142కి పెరిగింది.
- పదేళ్ల మోడీ పాలనలో అదాని సంపద $7Bn (రూ. 56,000 కోట్లు) నుండి హిండెన్ బర్గ్ నివేదికకు ముందు $ 120 Bn (రూ. 9.6 లక్షల కోట్లు) దరిమిలా $ 43 Bn (రూ. 3.50 లక్షల కోట్లు)కు చేరింది.
- పెద్ద నోట్ల రద్దు వల్ల 15 లక్షల అసంఘటిత - చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయారు .
- కాంట్రాక్ట్ పనులు, దినసరి కూలీ నాలీ పనులు చేసే నిరుపేదలు 2020లో 6 నుంచి 13 కోట్లకు పెరిగారు.
- ఏటా రూ. 4.96 లక్షల కోట్లను కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లిస్తూ రూ. 1.64 లక్షల కోట్ల లాభాలను ఆర్జిస్తూ వున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆశ్రిత కార్పొరేట్లకు కట్టబెడుతూ వుంది.
- మోడీకి అప్పుడు అనిల్ అంబాని, రిలయన్స్ కమ్యూనికేషన్ సంస్థ కట్టాల్సిన రూ. 46,460 కోట్ల బకాయిని రూ. 460 కోట్లు చెల్లింపుతో సరిపుచ్చి రైటాఫ్ చేశారు.
- బ్యాంకులే ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా పేర్కొన్న వారికి రూ. 79,000 కోట్లు రైటాఫ్ చేయబడింది.
- మోడి దత్తపుత్రుడు గౌతమ్ అదానీకి 12 పోర్టులను, ఏడు ముఖ్యమైన ఎయిర్ పోర్టులను, కోట్లాది టన్నుల బొగ్గు నిల్వలున్న గనులను మోడి కట్టబెట్టారు.
- 71 కోట్ల మంది భారతీయుల సంపద మొత్తం 21 మంది కోటీశ్వరుల సంపదకన్నా తక్కువే.
- రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో మోడీ ప్రభుత్వ అవినీతి రికార్డు స్థాయికి చేరింది.
- తానే దివాళా తీసినట్లు ప్రకటించుకొన్న అనిల్ అంబానీని, ఫ్రెంచ్ దసాల్ట్ కంపెనీతో "ఆఫ్సెట్" ఒప్పందంలో భాగస్వామిని చేయడం అత్యంత విడ్డూరం.
- మాటలలో తప్ప చేతలలో కనిపించని నీతి. PM Cares ఫండ్‌లో పారదర్శకత లేదు.
- అవినీతి, అక్రమాలకు ఆస్కారమిస్తున్న 'ఎలక్టోరల్ బాండ్స్'ను సుప్రీంకోర్టు ఈ మధ్యనే కొట్టివేసింది.
- ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు జమ కాకపోగా, పనామా పేపర్ల లీకేజీలో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ మరికొందరి పేర్లున్నా ఎట్టి చర్యలు లేవు.
- అజిత్ పవార్, హేమంత్ బిశ్వాస్‌శర్మ మున్నగు వారిపై మోపబడిన అవినీతి ఆరోపణలు అటకెక్కాయి.
- పలు కేసులలో అనుకూలంగా తీర్పులు ఇచ్చిన జస్టిస్ అరుణ్‌మిశ్రా, రిటైరైన దరిమిలా 'నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్' అధ్యక్షునిగా నియమించబడ్డారు.
- ఎరువులపై సబ్సిడీని, ఆహార సబ్సిడీని, NREGP పథకానికి నిధులను గణనీయంగా తగ్గించిన మోడి, సెమీ కండక్టర్ల తయారీ సంస్థల స్థాపనకై వేదాంతకు మరికొన్ని సంస్థలకు రూ. 75,000 కోట్లు కేటాయించబోతున్నారు.
- దక్షిణాది ఐదు రాష్ట్రాల నుండి 2018-23 మధ్య జీఎస్టీ మరియు ప్రత్యక్ష పన్నులు కేంద్రానికి రూ. 22.27 లక్షల కోట్లు జమ కాగా, కేంద్రం నుండి విడుదలైనది రూ. 6.42 లక్షల కోట్లు మాత్రమే.
- ఉత్తరప్రదేశ్ నుంచి రూ. 3.42 లక్షల కోట్లు కేంద్రానికి జమ కాగా ఆ రాష్ట్రానికి రూ. 6.91 లక్షల కోట్లు విడుదలయ్యాయి. బి.జె.పి. పాలిత రాష్ట్రాలకే అధిక నిధులు.
- 180 ప్రపంచదేశాల్లో అవినీతి సూచికలో భారత్ 2005లో 62, 2022లో 85వ స్థానం.
- 125 ప్రపంచ దేశాల ఆకలి సూచికలో చైనా 4, పాకిస్తాన్ 102, భారత్ 111వ స్థానం.
- సరైన ఆహారం, వైద్యసేవల కొరతల వలన 17 శాతం గర్భిణులు, 21 శాతం చిన్న పిల్లలూ మరణిస్తున్నారు.
- నెలకు 7 కోట్ల కోవిషీల్డ్ డోసులు సీరమ్ ఇన్‌స్టిట్యూట్, 5.8 కోట్ల కో-వ్యాక్సిన్ డోసుల ఉత్పత్తి సామర్థ్యం భారత్ బయోటెక్‌కు ఉంది. కాని దేశ ప్రజానీకానికి అవసరమైన వ్యాక్సిన్లకు ముందుగా ఆర్డర్ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం లక్షలాది ప్రజల మరణాలకు కారణమైంది.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలహీనపడుతోంది. పార్లమెంట్ పనిదినాలు తగ్గి కీలకమైన బిల్లులను స్టాండింగ్

కమిటీలకు పంపకుండానే మూజువాణి ఓటుతో పాస్ చేస్తున్నారు.

- భారత రాజ్యాంగం ఆర్టికల్స్ 19, 20, 21 ద్వారా ప్రజలకు కల్పించబడిన ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కలుగుతూ వుంది.
- రాజ్యాంగ విరుద్ధంగా, అప్రజాస్వామికంగా ఉపా (UAPA), దేశద్రోహం, మనీ లాండరింగ్ (PMLA), టెర్రరిస్టు మొదలైన చట్టాలకు సవరణలతో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోంది.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 14-16లకు భిన్నంగా వలస వచ్చిన ప్రజలలో ముస్లింలను మాత్రం మినహాయించి CAA తేవడం ఎంత మాత్రం తగదని ఆందోళనలు జరిపిన విద్యార్థులపై, ప్రజలపై కేసులు దాఖలు అయ్యాయి.
- వంద మందికి పైగా రిటైర్డ్ సివిల్ సర్వెంట్లు అటవీ (కన్జర్వేషన్) చట్ట సవరణ వలన అటవీ భూములలోని ఆదివాసీలకు నష్టం జరుగుతోంది. కావున దానిని ఉపసంహరించాలని కేంద్రానికి రాసినా స్పందన లేదు.
- 2017-21 సంవత్సరాల మధ్య విభిన్న మత వర్గాల మధ్య 2900 ఘర్షణ సంఘటనలు చోటు చేసుకున్నాయి.
- రాష్ట్రాల జాబితా (లిస్టు-2)లో ఉన్న వ్యవసాయం, మార్కెట్లు, మైనర్ పోర్టులు మున్నగు వాటికి సంబంధించి, ఉమ్మడి జాబితాలో వున్న విద్యుత్ అంశంపైన రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకొంటూ వుంది.
- న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు భంగం కలిగిస్తూ, కొలీజియం సిఫార్సులకు అడ్డుపడుతోంది.
- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మరియు కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సెలక్షన్ కమిటీగా ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రధాన న్యాయమూర్తిని తప్పించి ఒక మంత్రిని పెట్టి, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయన్న విశ్వాసం ప్రజలలో లేకుండా చేసింది.
- ఇటీవల చండీఘర్ మేయర్ ఎన్నికలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య అక్రమానికి ఒడిగట్టిన బీజేపీకి చెంపపెట్టు.
- రఫెల్ అంశంపై తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్‌కు రాజ్యసభలో సభ్యత్వం కల్పించింది.
- ప్రపంచ పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన కొలబద్దలో భారత్ స్థానం 150/180.
- Fact Check Unit (FCU)కి వార్తలను సెన్సార్ చేయు అధికారాన్ని ఇచ్చి, అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ, వాస్తవాలను రాస్తున్న జర్నలిస్టును జైళ్ళలో కుక్కుతోంది.
- మోడి ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించిన ప్రముఖ సుప్రీం కోర్టు న్యాయవాది ఇందిరా జైసింగ్ సంస్థపైన, శ్రీమతి తీస్తా సెతల్వాద్‌పైన, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయిస్తా, దివైర్ సిద్ధార్థ వరదరాజన్, ది కేరవాన్, పరేషానాథ్, స్వామి ఆవాజ్ జాఫర్ ఆఘా మున్నగు వారిపైన FCRA చట్ట అతిక్రమణ కేసులు పెట్టబడ్డాయి.
- భీమా కొరేగావ్ అల్లర్లకు కారకులైన బి.జె.పి. నాయకులను వదిలివేసి, సంబంధం లేని పౌరహక్కుల నాయకులు ప్రొ॥ సాయిబాబా, స్టాన్ స్వామి, వరవరరావు, అఖిలొగోయ్, సుధీర్ ధవాలే మున్నగువారిని జైల్లో వేశారు.
- పౌరహక్కులు, దళిత, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల పట్ల అన్యాయాలను ప్రశ్నించిన విద్యార్థి, యువజన నాయకులపై దాడులు, హత్యలకు పూనుకోవటమే కాక జేఎన్‌యూలోకి మాస్కులతో గూండాలు ప్రవేశించి దేశ రాజధానిలో అరాచకాన్ని సృష్టించడం గర్హనీయం.
- యువత, మహిళలు, రైతులు, పేదలనే నాలుగు వర్గాల కోసమే తాను పాటుపడుతున్నట్లు మోడీ చెబుతుండే మాటలలో ఎంత మాత్రమూ వాస్తవం లేదు.
- "బేటీ బచావో - బేటీ పఢావో" వాక్యాన్ని పదేపదే వల్లిస్తుండే మోడి, ఢిల్లీలో మహిళా రెజ్లర్లు తమకు జరిగిన అవమానంపై మూడు నెలలపాటు నిరసన తెలియజేసినా ఒక్కమాట మాట్లాడకపోవడం సిగ్గుచేటు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ - సబ్ కా విశ్వాస్" మాటలలో తప్ప చేతలలో లేదు.
- యూపీ, బీజేపీ రాష్ట్రాలలో కుంటిసాకులు చూపుతూ, వందలాది ముస్లింల ఇళ్లను, దుకాణాలను, మసీదులను అడ్డగోలుగా బుల్ డోజర్లతో ధ్వంసం చేశారు.
- దేశవ్యాప్తంగా మహిళలపైన నాలుగు లక్షల దాడుల కేసులు నమోదుకాగా, అందులో 32,000 కేసులు, మానభంగాలకు సంబంధించినవేనని ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది.
- మణిపూర్ హింసాత్మక ఘటనలలో 35,000 మంది నిర్వాసితులు కాగా, 200 మంది చనిపోగా, 1700 ఇళ్ళు, వందలాది చర్చిలు ధ్వంసం చేయబడ్డాయి.
- కుకీ జో తెగ మహిళలను నగ్నంగా ఊరేగించడం, సామూహిక మానభంగాలు - హత్యలను ప్రపంచ దేశాలు ముక్త కంఠంతో ఖండించినా ప్రధాని ఒక్కమాట మాట్లాడకపోవడం సిగ్గుచేటు.
- గత 10 ఏళ్లలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు 48% పెరిగాయని ఎన్‌సీఆర్‌బీ సమాచారం.
- గాల్వాంగ్ లోయ ప్రాంతంలో చైనా దాదాపు 2,000 చ.కి.మీ భూమిని ఆక్రమించినా పట్టించుకోని కేంద్రం.
- 140 ఏళ్లుగా.. పదేళ్లకు ఒకసారి నిర్వహించే Censusను మొదటిసారి నిలిపివేశారు. ❑

# ఉమ్మడి కార్యాచరణకు ఎజెండా

- వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావు

**విజయవాడ బాలోత్సవ భవన్‌లో 2024 మార్చి 21వ తేదీ జరిగిన 'ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు మరియు సారూప్య, రాజకీయ, మహిళా, రైతు, శ్రామిక, పౌరహక్కుల సంఘాల ప్రతినిధుల సమావేశం'లో చర్చించి, ఆమోదించిన కామన్ మినిమం యాక్షన్ అజెండాలోని ముఖ్యాంశాలు.**

### 1. ఏపీ పునర్విభజన చట్టం.. ఇచ్చిన హామీలు

- ఎ) రాష్ట్రానికి ప్రత్యేక హోదా.
- బి) వెనుకబడిన ఉత్తరాంధ్ర, నిత్య క్షామ పీడిత రాయల సీమ ప్రాంతాల ప్రగతికి ప్రత్యేక నిధులు, ఆర్థిక ప్రోత్సాహకాలు.
- సి) ఉమ్మడి ఆస్తుల విభజనలో రాష్ట్రానికి రావలసిన వాటా నిధులు.
- డి) పోలవరం జాతీయ బహుళార్ధక సాధక ప్రాజెక్టులో భూసేకరణ మరియు పునరావాస వ్యయంతో సహా కేంద్ర నిధులతో పూర్తి చేయడం.
- ఇ) రాష్ట్రంలో ఒక మేజర్ పోర్టు నిర్మాణం
- ఎఫ్) కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం సాధనతోపాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పేందుకు కృషి జరుగుతోంది.

### 2. వ్యవసాయ ప్రగతి రైతు సంక్షేమం

- ఎ) పంటలన్నింటికీ సమగ్ర పంట ఉత్పత్తి వ్యయం 50 శాతం ఎంఎస్‌పీనకు చట్ట బద్ధత కల్పించడం.
- బి) ఒక పర్యాయం పంట రుణాల రద్దు.
- సి) నష్టాల వలన అప్పుల పాలైన రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు వ్యవసాయ రుణాలు, ఉపసంహరణ కమిషన్ ఏర్పాటు.
- డి) పంటలకు నష్టం జరిగిన 30 రోజుల్లో ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా పంటల బీమా పథకంలో మార్పులు.
- ఇ) దేశీయ రైతు ప్రయోజనాల మెరుగుదలకు 'ఎగుమతులు-దిగుమతులు విధానం'ను సవరించటం.
- ఎఫ్) వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ అంశాన్ని పరిశీలించి తొలగించటం వంటి అంశాలతోపాటు వ్యవసాయరంగంలో ఉత్పాదకతను, ఉత్పత్తిని, పనిదినాలను పెంచేందుకు దోహదపడే ఇరిగేషన్ రంగానికి కేటాయింపులను పెంచి, దీర్ఘకాలంగా నిర్మాణం కొనసాగుతూ ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి జరగటం.

### 3. కార్మిక సంక్షేమం :

- ఎ) కార్మికుల హక్కులకు తీవ్రమైన భంగం కలిగించిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి.
- బి) పెరిగిన ద్రవ్యోల్బణం, జీవన వ్యయంతో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకాలలో పని చేస్తున్న మహిళా శ్రామికుల వేతనాలు గణనీయంగా పెంచాలి.

### 4. మహిళా సంక్షేమం :

- ఎ) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్.
- బి) పేద కుటుంబాలలోని మహిళలకు స్వావలంబనకై ఆర్థిక సహాయం.
- సి) ప్రతి జిల్లా కేంద్రంలో 'సావిత్రిబాయి పూలే వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటు

### 5. యువత సంక్షేమం - ఉపాధి :

- ఎ) కేంద్ర ప్రభుత్వ శాఖలు / సంస్థలలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం.
- బి) యువతకు నైపుణ్య శిక్షణ, మరియు స్టైఫండ్ ఏర్పాటు
- సి) యువత స్వావలంబనకై చేపట్టే 'స్టార్టప్'లకు ఆర్థిక సహాయం.
- డి) కాంట్రాక్ట్ కూలీల సమస్యల పరిష్కారానికి కృషి.

### 6. రాజ్యాంగ విరుద్ధ అప్రజాస్వామిక చట్టాల రద్దు :

- రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం పాస్ చేసిన 'ఎలక్ట్రిసిటీ బిల్ 2020', ఫ్రీ పెయిడ్, స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయడానికి, నియంతృత్వ ఊపా (UAPA), PMLA చట్ట సవరణలు మరియు ఆదివాసీలు, అడవి బిడ్డల హక్కులను కాలరాస్తూ 'అటవీ సంరక్షణ చట్టం'కు సవరణ చట్టం 2023 మొదలైన వాటిని రద్దు చేయించేందుకు కృషి.




**7. బీద, సామాన్య కుటుంబాలకు తక్కువ వ్యయంతో విద్య, ఆరోగ్య సదుపాయాలు అందించాలి :**

- 1.ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పైన పేర్కొన్న పలు అంశాలను అమలు చేస్తామని ఇప్పటికే జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చారు.
- 2.ఈ అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను, సూచనలను, మార్పులు, చేర్పులను లిఖిత పూర్వకంగా లేదా సమావేశంలో చెప్పి తుది రూపం ఇచ్చి, ప్రజల ముందు ఉంచాలి.

**ఉమ్మడికార్యాచరణ ప్రణాళిక**

- 1. ఇండియా కూటమి పక్షాన ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికి మన రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసిన బీజేపీని దానికి ప్రత్యక్షంగా–పరోక్షంగా సహకరిస్తూ వస్తున్న పార్టీలకు ఎందుకు ఓటు వేయరాదో వివరించే కరపత్రం చేరాలి.
- 2.నియోజవర్గ సమస్యలు, కూటమి పక్షాన అభ్యర్థి గుణగణాల వివరాలతో కరపత్రం అందించబడాలి.
- 3.వాల్ పోస్టర్లు, డోర్ పోస్టర్లు కూటమి పక్షాన విస్తృతంగా అందించబడాలి.
- 4.కూటమి పక్షాలు చర్చించుకుని సమష్టిగా ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలి.
- 5.అత్యంత ప్రాధాన్యత గల నగరాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులను ఆహ్వానించి భారీ బహిరంగ సభలు నిర్వహించాలి.
- 6.కూటమి భాగస్వామ్య పక్షాలు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఒక "స్టీరింగ్ కమిటీ" మరియు భాగస్వామ్య పక్షాలన్నింటి ప్రాతినిధ్యంతో జనరల్ బాడి కమిటీ ఏర్పాటు చేయాలి.
- 7.జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలలో కూటమి పక్షాన సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలి.
- 8.ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా విస్తృతంగా దేశ స్థాయిలో రాజ్యాంగానికి, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల హక్కులకు, లౌకిక స్ఫూర్తికి, కేంద్ర ప్రభుత్వం భంగం కలిగిస్తూ ఉన్న అంశాలను మరియు దేశ ప్రజా సంపదను క్రోనీ క్యాపలిస్టు పద్ధతిలో ఆదాని, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతూ వున్న వైనాన్ని, అలాగే మన రాష్ట్రంలో కొనసాగుతూ ఉన్న దళితులు, మైనారిటీలు, మహిళలు, పేదలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలు, ఆస్తుల విధ్వంసం మొదలైన అంశాలలో నిరంతరం ప్రజలకు గుర్తు చేస్తూ ఉండటం.
- 9.ఉత్తరప్రదేశ్ ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో మైనారిటీలపైన 'లవ్ జిహాద్', గోసంరక్షణ పేర్ల మీదుగా దాడులు, హత్యలు, పేద వారి షాపులను, మసీదులను బుల్డోజర్‌తో కూలగొట్టడం అంశాలను మరియు మణిపూర్‌లో అత్యంత అమానవీయ, అనాగరిక రీతిలో మహిళలపైన దాడులు, నగ్న ప్రదర్శనలు, సామూహిక మానభంగాలు, హత్యలు వందలాది చర్చిలను తగలబెట్టడం మున్నగు వాస్తవాలను విస్తృతంగా ప్రజలకు తెలియపరచాలి. కూటమి పక్షాన మీడియా కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పత్రికలకు ఇండియా కూటమి సమాచారాన్ని అందిస్తూ ఉండాలి. కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరిని మరొకరు విమర్శించకుండా కూటమి అభ్యర్థులను పిలిపించుకోనడానికి సమిష్టిగా తీవ్రమైన కృషి జరగాలి. రానున్న ఎన్నికలలో ఎన్‌ఏఈ కూటమికి మరియు ఇండియా కూటమికి పార్లమెంట్ సీట్లు సమానంగా వచ్చే అవకాశం ఉండటం వల్ల మన రాష్ట్రంలో పార్లమెంట్ స్థానాల పైనా ప్రత్యేకంగా బీజేపీ పోటీ చేస్తున్న స్థానాలపైన మరింత అధికంగా కృషి జరిపి వీలైనన్ని పార్లమెంట్ స్థానాలను ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకొనేందుకు సమన్వయంతో సమష్టి కృషి జరగాలి. ❑

# అసమానతలు లేని అభివృద్ధి కోసం..
# ప్రజా ప్రణాళిక



- వి.శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్ర విభజన అనంతరం ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు జరుపుతామన్న మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాట తప్పి విద్రోహానికి పాల్పడింది. కేంద్రం నుండి రావాల్సిన సహాయం రాకపోగా తెలుగు ప్రజల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేయాలనే కుట్ర చేస్తున్నది. పోలవరం నిర్వాసితులను గోదాట్లో కలిపింది. రాజధాని అభివృద్ధి కలిసింది. వెనుకబడిన ప్రాంతాలకు సహాయం చేయకపోగా ఇచ్చిన నిధులను వెనక్కు తీసుకున్నది. ఈ కాలంలో ఒక్క భారీ పరిశ్రమ రాలేదు. విద్యావంతులకు ఉద్యోగాలూ లేవు. నేడు రాష్ట్రం కరువు కాటకాలకు నిలయంగా మారింది. ఉపాధి లేక వ్యవసాయ కూలీలు, ఉద్యోగాలు లేక విద్యావంతులు వలసబాటపట్టారు. తెలంగాణ, కర్నాటక ఎన్నికల ప్రయోజనాల కోసం మన రాష్ట్ర భవిష్యత్తును ఫణంగా పెట్టింది. జాతీయ ప్రాజెక్టు పోలవరానికి నిధులివ్వని కేంద్రం అప్పర్ భద్రాకు జాతీయ హోదా కల్పించి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయడానికి కమిషన్‌కు నివేదించింది. ఆంధ్రా, తెలంగాణ మధ్య ఘర్షణ పెట్టడానికి సిద్ధపడింది. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని బలహీన పరుస్తున్నది. అమెరికా అడుగులకు మడుగులొత్తుతూ యుద్ధోన్మాద ఇజ్రాయల్‌ను వెనకేసుకొస్తున్నది. ఇన్ని రకాలుగా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ కాని, ప్రతిపక్ష తెలుగుదేశం గానీ ఈ పదేళ్ళ నుండి కిమ్మనడం లేదు. బీజేపీకి సాష్టాంగపడ్డాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని విస్మరించిన జనసేన ఏకంగా బీజేపీ పొత్తులో కుదురుకుంది. ఈ మూడు పార్టీల అవకాశ వాదం వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. పార్లమెంటులో బీజేపీ ప్రవేశపెట్టిన ప్రతి ప్రజా వ్యతిరేక బిల్లును ఈ రెండు పార్టీలు బలపర్చాయి. ప్రజలపై భారాలు మోపే కేంద్రం నిర్ణయాలను వైసీపీ ప్రభుత్వం తూచా తప్పకుండా అందరికన్నా ముందు అమలు చేస్తున్నది. కరెంటు ఛార్జీలు మోయలేని భారం అయింది. ఆస్తి పన్ను పెంచారు. చెత్త పన్ను వేసింది. ఇసుక, మద్యం ధరలు పెరిగాయి. భారాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించిన ప్రజలపై తీవ్ర నిర్బంధానికి పూనుకుంటున్నది. తమ సొంత రాజకీయ అవసరాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఈ మూడు పార్టీలు కేంద్రానికి తాకట్టుపెట్టాయి. గొర్రె కసాయిని నమ్మినట్లుగా టీడీపీ - బీజేపీని నమ్ముకుంటున్నది. ప్రాంతీయ పార్టీలను అడ్రసు లేకుండా చేస్తున్న బీజేపీ నైజాన్ని వైసీపీ, టీడీపీ, జనసేనలు అర్థం చేసుకోకుండా రాష్ట్రానికి హాని చేస్తున్నాయి. ఇప్పటికైనా ఆ పార్టీలు బీజేపీని వదిలి తమ స్వంత కాళ్ళపై నిలబడి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలి. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా వామపక్ష పార్టీలు కృషి చేస్తున్నాయి.

అసమానతలు లేని అభివృద్ధి నినాదంతో సీపీఐ(ఎం) రెండు నెలలపాటు ప్రజారక్షణ భేరి క్యాంపెయిన్ నిర్వహించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపుతూ ప్రజా ప్రణాళికను విడుదల చేసింది. దీనికోసం రాష్ట్రస్థాయిలో మేధావులను ఆహ్వానించి రెండు రోజులపాటు (అక్టోబర్ 7,8 తేదీలలో) సెమినార్ నిర్వహించింది. ఆ తరువాత వివిధ అంశాలపై అన్ని అక్టోబర్ 2-29 మధ్య జిల్లాల్లో సదస్సులు నిర్వహించింది. అక్కడ వచ్చిన అభిప్రాయాలను తీసుకొని నిర్దిష్టమైన ప్రతిపాదనలతో డిమాండ్లను రూపొందిం చాము. ఆ డిమాండ్స్‌ను ప్రజల్లోకి తీసుకుపోవడానికి మూడు బస్సు యాత్రలు జరిగాయి. 12 రోజులపాటు 26 జిల్లాల్లో 120 నియోజక వర్గాలను కలుపుతూ 3500 కిలోమీటర్లు ప్రయాణించాయి. 170 సభలు జరిగాయి. లక్ష మందికి పైగా వీటిల్లో పాల్గొన్నారు. ప్రజారక్షణ భేరి ముగింపుగా నవంబర్ 15 విజయవాడలో భారీ బహిరంగ సభ జరిగింది. దీనికి పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సహా జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు.

ఈ క్యాంపెయిన్ రాష్ట్రంలో బీజేపీ విద్రోహాన్ని ఎండగట్టడానికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎలుగెత్తి చాటడానికి, సీపీఐ(ఎం) స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి, ప్రజా ప్రణాళికను ప్రచారం చేయడానికి తోడ్పడింది. వామపక్ష పాలనలో ప్రజా ప్రణాళికలు అమలయ్యాయి. మానవాభివృద్ధిలో మొదటిస్థానంలో వున్న కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలో రాజకీయ అవినీతికి అతీతంగా ఉన్న పార్టీ సీపీఐ(ఎం), వామపక్ష పార్టీలు, వివిధ సదస్సుల్లో ఆమోదించిన తీర్మానాలను, రాష్ట్ర సెమినార్లో రూపొందిన ప్రజా ప్రణాళికను పుస్తక రూపంలో మీకు అందిస్తు న్నాము. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి, చర్చించడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు దీనిని అధ్యయనం చేయాలని కోరుతున్నాను.

## ప్రజా ప్రణాళిక

- 1.కరెంటు యూనిట్ రూపాయికే, పేదలకు 300 యూనిట్లు ఉచితం. స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు.
- 2.రూ.400 లకే గ్యాస్, రూ.60లకే లీటర్ పెట్రోల్, డీజిల్, ఇసుక ఉచితం.
- 3.తలకు 10 కేజీల ఉచిత బియ్యం, పప్పు, నూనెల సరఫరా, నిత్యావసర సరుకుల ధరలు తగ్గింపు.
- 4.అందరికీ సంక్షేమం-పెన్షన్లు, రేషన్ కార్డులు, అన్ని రకాల పెన్షన్లు రూ.5000లు, పేద మహిళలకు ప్రత్యేక సహాయం.
- 5.రెండు సెంట్ల ఇల్లు, 5 లక్షల ఆర్థికసాయం, నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్ళకు పట్టాలు, కొత్త కాలనీలకు సౌకర్యాలు, చెత్తపన్ను, డ్రైనేజీ ఛార్జీలు రద్దు, ఇంటిపన్ను తగ్గింపు.
- 6.ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతిలోనే రాజధాని.
- 7.పోలవరం నిర్వాసితులకు పునరావాసం, అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక డీఎస్సీ, ఏజెన్సీలో నాన్ షెడ్యూలు గిరిజన గ్రామాలు, జిఓ 3 అమలు
- 8.ఓపీఎస్ పునరుద్ధరణ, ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్.
- 9.భూమి లేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు రెండు ఎకరాల భూమి, సేకరించిన భూముల్లో పరిశ్రమలు, లేదంటే రైతులకు వాపస్.
- 10. అసలు పట్టాదారులకే అసైన్డ్ భూములపై హక్కులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు.
- 11.గ్రామీణ ఉపాధి 200 రోజులు, రోజు వేతనం రూ. 600, పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం, సమానపనికి సమాన వేతనం
- 12.చిన్న పరిశ్రమలు, వ్యాపారులకు రక్షణ, మెగా మాల్స్‌పై ఆంక్షలు, రాష్ట్రంలో ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, జూట్, పేపర్, అగ్రి,సినీపరిశ్రమల అభివృద్ధి, స్థానికులకు75% ఉద్యోగాలు
- 13.అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, సమగ్ర సంక్షేమ చట్టం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యుల రైజేషన్, ప్రభుత్వ ఉద్యోగులుగా స్కీం వర్కర్స్.
- 14.అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, కిడ్నీ పేషెంట్లకు మందులు, పెన్షన్, సుజాతరావు కమిటీ సిఫార్సుల అమలు.
- 15.రైతులకు గిట్టుబాటు ధర, ప్రతి ఎకరాకు సాగునీరు, మోటార్లకు ఉచిత విద్యుత్, ప్రతీకౌలు రైతుకూ గుర్తింపు కార్డు, రుణం గ్యారెంటీ, స్వామినాథన్, జయంతీఘోష్, రాధాకృష్ణ కమిషన్ల సిఫార్సుల అమలు.
- 16.40 వేల టీచర్లకు మెగా డీఎస్సీ, 2 లక్షల 50 వేల ప్రభుత్వ ఖాళీలు భర్తీ, నిరుద్యోగ భృతి నెలకు రూ.5000.
- 17.2024 నుండే చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు, మహిళల రక్షణ, అభివృద్ధికి కమిషన్, మద్యపానంపై నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన
- 18.సామాజిక న్యాయం, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, కులగణన, వివక్షపై కఠిన చర్యలు, సబ్ ప్లాన్ అమలు, దళితులకు రక్షణ, జస్టిస్ పున్నయ్య కమిటి సిఫార్సుల అమలు, డప్పు, చర్మ కళాకారులందరికీ పెన్షన్లు.
- 19.వెనుకబడిన ప్రాంతాలకు లక్ష కోట్లతో ప్యాకేజీ, నిర్ణీత కాల పరిమితిలో వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టుల పూర్తి, నిర్వాసితుల పునరావాసానికి ప్రాధాన్యత, 2013 భూసేకరణ చట్టం పకడ్బంధీగా అమలు.
- 20.పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఉచిత వృద్ధాశ్రమాలు, శ్రామిక మహిళల పిల్లలకు డేకేర్ సెంటర్లు, జానపద, వృద్ధ కళాకారులకు భృతి.
- 21.మైనార్టీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు, మత సామరస్యం, సచార్, రంగనాధ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల అమలు.
- 22.వృత్తులకు రక్షణ, ఆధునిక పరికరాల సరఫరా, బీసీలకు సబ్ ప్లాన్, ప్రత్యేక నిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు, స్వయం ఉపాధికి రుణాలు - సబ్సిడీలు.
- 23.వికలాంగుల చట్టానికి రూల్స్ నోటిఫై, ఇతర పెన్షన్లతో సంబంధం లేకుండా నెలవారీ భృతి రూ.6000.
- 24.విస్తారమైన పాసింజర్ రైళ్ళ పునరుద్ధరణ, జనరల్ బోగీల పెంపు, ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు, మహిళలు, వికలాంగులు విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణం.
- 25.స్థానిక సంస్థలకు నిధులు - విధులు, స్థానిక సంస్థల పరిధిలోకి సచివాలయాలు, గ్రామీణాభివృద్ధికి నిధులు.
- 26.రాష్ట్రాల అధికారాలు, అభివృద్ధి వికేంద్రీకరణ, పట్టణాభివృద్ధికి చర్యలు.
- 27.ప్రభుత్వ రంగం బలోపేతం, సహకార వ్యవస్థ పటిష్టం, డెయిరీ, చక్కెర మిల్లుల పున: ప్రారంభం.
- 28. కర్నూలుకు హైకోర్టు, విజయవాడ, విశాఖ బెంచీలు, సత్వర న్యాయం - యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, అవినీతిపై ప్రజాయుద్ధం - పకడ్బంధీగా చట్టాల అమలు, బడా కార్పొరేట్లపై పన్ను, **(మిగతా 20వ పేజీలో)**

# కనీస ఉమ్మడి అజెండాను ఆమోదించాలి



- వడ్డే శోభనాద్రీశ్వరరావు

అసమాన త్యాగాలతో అసంఖ్యాక భారతీయులు కొనసాగించిన చారిత్రాత్మక పోరాటం ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్య ఫలితాలు, నేటికీ కోట్లాది మంది ప్రజలకు చేరలేదు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో మహోన్నత రాజకీయ నాయకులు, మేధావులు రెండు సంవత్సరాల 11 నెలల 17 రోజులు శ్రమించి, చర్చించి రూపొందించిన భారత రాజ్యాంగంలో ప్రజలకు ప్రసాదించబడిన ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోంది. రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలను సాధించేందుకు ప్రభుత్వం అనుసరించవలసిన విధి-విధానాల లో పాటించాల్సిన ఆదేశిక సూత్రాలను విస్మరిస్తున్నారు. నాడు ఈస్టిండియా కంపెనీ ఇంగ్లండ్‌లోని పరిశ్రమల అభివృద్ధికి భారత ప్రజల సంపదను దోచుకెళ్ళినట్లు, ఈనాడు ప్రజల నుండి వసూలు చేసిన పన్నులతో, బ్యాంకుల నుండి రుణాలు, లక్షలాది కార్మికుల శ్రమ శక్తితో అభివృద్ధి చేయబడిన ప్రభుత్వరంగ సంస్థలను (ప్రజల సంపద) క్రోనీ క్యాపిటలిస్టు పద్ధతిలో కారుచౌకగా, గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీ, అనిల్ అంబానీ, వేదాంత వంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. భారత రాజ్యాంగం బేసిక్ స్ట్రక్చర్‌లో ప్రధాన భాగాలైన ఫెడరల్ స్ఫూర్తికి, లౌకికతత్వానికి భంగం కలిగిస్తున్న నరేంద్ర మోడి - బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మీరందరూ ఐక్యంగా ఒక వేదికపైన రావడం శుభపరిణామం. అయితే ఒక విషయాన్ని మీరందరూ గమనించాలి.

**2024లో ఏర్పడబోయే మీ అందరి సమష్టి ప్రభుత్వం కోట్లాది భారతీయులు, ప్రత్యేకంగా రైతులు - కార్మికులు, బలహీన వర్గాలు, మైనారిటీలు, సామాన్య ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పును తీసుకొచ్చేందుకు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంటుంది. అందుకు "కనీస ఉమ్మడి ఎజెండా"ను చర్చించి, ఆమోదించి మీ, మీ పార్టీల ఎన్నికల ప్రణాళికలలో పొందుపర్చి ఎన్నికల అనంతరం తప్పనిసరిగా ఆ ఎజెండాను అమలు చేయవలసిన బాధ్యత వుంటుంది. ఇందుకు రాజకీయ పార్టీలపైన ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రజా సంఘాలు, ప్రజలు కృషి చేయాలి.**

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలలోని లోపాలను, ప్రభుత్వ పెద్దలు చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతున్న ప్రజాసంఘాలు, న్యాయవాదులు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అమరావతి రైతులతో సహా రైతు సంఘాలపైన వేధింపులు, దళిత, మహిళ, గిరిజన, బలహీన బడుగు వర్గాల ప్రజలపైన అత్యంత పాశవికంగా దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల వేధింపులను తట్టుకోలేక కొందరు పౌరులు, ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడిన పలు సందర్భాలు ఉంటున్నాయి. రాష్ట్రంలోని పాల సహకార డెయిరీ లను నిర్లక్ష్యం చేస్తూ, 'అమూల్' కొరకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, ఎంతో విలువైన చిత్తూరు సహకార డెయిరీ ఆస్తులను అమూలుకు చౌకగా కట్టబెట్టడం జరిగింది. ఇటువంటి తప్పిదాలనే కేంద్రంలోని నరేంద్రమోడి సారధ్యంలోని బి.జె.పి. ప్రభుత్వం చేస్తూ వుండగా, బి.జె.పి. సహకారంతో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనుకోవడంలో హేతుబద్ధత లేదు. కేంద్ర బి.జె.పి. ప్రభుత్వ అండతో పరోక్ష సహకారంతోనే జగన్ ప్రభుత్వం అరాచకపాలన కొనసాగుతూ వుంది. ప్రజలు అమాయకులు కాదు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను గద్దె దింపాలని కృత నిశ్చయంతో వున్నారు. కావున రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ఐక్యతతో రానున్న కాలంలో కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

### కనీస ఉమ్మడి ఎజెండా

- 1.మనదేశంలో 54.6% ప్రజలకు జీవనాధారమై, దేశంలో ఉత్పత్తి చేయబడు మొత్తం జీవీఏ (GVA)లో 17.8 శాతాన్ని సమకూరుస్తూ, పరిసరాలకు కాంతినిస్తూ.. తాను కరిగిపోయే కొవ్వొత్తి చందంగా వున్న వ్యవసాయరంగం సంక్షోభాన్ని అధిగమించేందుకు.., యావన్మంది రైతులు తమ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించుకొంటూ.. ఆత్మ గౌరవంతో బ్రతకగలిగేందుకు ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, జాతీయ రైతు కమీషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాథన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం 2కి 50% కలిపి (d¾2+50%) చట్టబద్ధ కనీస మద్దతు ధర (యం.ఎస్.పి) నిర్ణయించబడాలని చేసిన సిఫార్సును విధిగా అమలు చేయాలి. రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ మిషనరీ, ఇతర పనిముట్లకు ఇతర ఇన్‌పుట్‌లన్నింటికి ఎం.ఆర్.పి. ఉండాలి.

- 2.వ్యవసాయ విద్యుత్‌ను ఉచితంగా లేక అతి తక్కువ టారిఫ్ కు సరఫరా చేయాలి. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ ఎలక్ట్రిసిటీ మీటర్లను బిగించరాదు.
- 3.వాస్తవ సాగుదారులందరికీ రుణ సదుపాయం అందించ బడాలి. "మోడల్ అగ్రికల్చరల్ ల్యాండ్ జ్ యాక్టు"లో కొన్ని మార్పులు చేసి, కౌలు రైతులకు మేలు చేయాలి.
- 4.కేరళ రాష్ట్రంలో ఉన్నట్లుగా "వ్యవసాయ రుణ ఉపశమన చట్టం"ను పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యల పరంపరకు అడ్డుకట్ట వేయాలి.
- 5.ఇరిగేషన్ అంశం రాష్ట్రాల జాబితాలోవున్నా, పంటల ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుదల, కరువులు, వరదల నష్ట నివారణకు ఉపయోగం కావున రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టి నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో సహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందచేసి అవి త్వరగా పూర్తయ్యేం దుకు సహకారాన్ని అందించాలి.
- 6.రాజ్యాంగంలో ఆర్టికల్ 19లో ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలుగనీయరాదు. జర్నలిస్టులపైన, పౌరహక్కుల కార్యకర్తలపైన పెట్టిన కేసులు ఉపసంహరించబడాలి. ఆదివాసీల, గిరిజనుల హక్కులను కాపాడే అటవీ చట్టానికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించరాదు.
- 7.రాజ్యాంగంలో పేర్కొనబడిన ఫెడరల్ స్ఫూర్తికి, లౌకికతత్వానికి భంగం కలగనీయ రాదు. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను గౌరవించాలి. సి.ఎ.ఎ.ను రద్దు చేయాలి.
- 8.న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు భంగం కలుగనీయరాదు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను ఆమోదించాలి. నిరుపేదలకు సత్వరన్యాయం అందించేందుకు అవసరమైన న్యాయ సంస్కరణలు చేపట్టాలి.
- 9.మాటలలో తప్ప చేతలలో కనిపించని నీతి-రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు, బొగ్గు మరియు ఐరన్ గనుల అమ్మకాలలో లోపాలు.
- 10.రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 (బి), (సి) లకు విరుద్ధంగా వ్యవహరించరాదు. విశాఖ స్టీల్ ప్లాంట్, బి.పి.సి.ఎల్. ఎల్.ఐ.సి., రైల్వేల ఆస్తులతో సహా ప్రభుత్వ రంగ సంస్థలను (ప్రజా సంపద) ప్రైవేటీకరణ చేయరాదు. పాల రైతుల సహకార డెయిరీలను కార్పొరేట్లకు బదలాయించరాదు.
- 11.పేదలకు తక్కువ వ్యయంతో వైద్య సేవలు అందించేందుకు, సెకండరీ స్థాయి వరకు నాణ్యమైన విద్యను అందించేందుకు దేశ రాజధాని ఢిల్లీ, కేరళ మున్నగు రాష్ట్రాలలో అమలు చేయబడుతూన్న పథకాలను అధ్యయ నం చేసి, మెరుగైన విధంగా అట్టి సేవలను, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా కొంత తోడ్పాటును యివ్వాలి.
- 12.ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా వుండగా అమలు చేసిన జనతా వస్త్రాల పథకాన్ని అమలు చేయడం ద్వారా చేనేత కార్మికులకు మరింత ఉపాధిని, సగం ధరలకు పేదలకు వస్త్రాలను అందించవచ్చు. ఒక వ్యక్తి కొరకు లేదా ఒక పార్టీ కొరకు కాకుండా అధికార మార్పిడి అనేది కోట్లాదిమంది ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పుకు దారితీసి, వారికి అభివృద్ధి - సంక్షేమం చేకూర్చేందుకు దోహదపడాలి. అందువలన రాజకీయ పార్టీలలోని నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు/సామాజిక ఉద్యమకారులు, పౌరహక్కుల నాయకులు, రైతులు, శ్రామికులతో సహా యావన్మంది ప్రజానీకం పార్టీల నాయకత్వాలపై ఒత్తిడి తెచ్చి ఈ కనీస ఉమ్మడి ఎజెండాలోని అంశాలు అమలయ్యేలా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా వుంది. People get a Govt. they Deserve అను సామెత వుంది. 75 సంవత్సరాల స్వపరిపాలన తర్వాత ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలు అతి దుర్భరమైన జీవితాలను గడుపుతూ వుండటం, కోట్లాది మంది చిన్న బిడ్డలు పోషకాహార కొరతతో తగిన పెరుగుదల లేకపోవడం మున్నగు దయనీయ పరిస్థితులలో మార్పు తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయవలసి వుంటుంది.

**75 సంవత్సరాల స్వపరిపాలన తర్వాత కూడా కోట్ల మంది ప్రజలు అతి దుర్భర జీవితాలను గడుపుతున్నారు. కోట్లాది మంది చిన్న బిడ్డలు పోషకాహార కొరతతో తగిన పెరుగుదల లేక దయనీయ పరిస్థితులలో ఉన్నారు.**

గమనిక: ఇంగ్లీషులో ఈ విజ్ఞప్తిని మోడిని - బి.జె.పి.ని 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓడించేందుకు ఇటీవల 23-06-2023న బీహార్ రాజధాని పాట్నాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఏర్పాటుచేసిన ప్రతిపక్ష పార్టీల సమావేశానికి హాజరైన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజీవాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎన్.సి.పి. నాయకుడు శరద్‌పవార్, శివసేన నాయకుడు ఉద్దవ్ థాక్రే, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, సి.పి.ఐ. సి.పి.యం. పార్టీల నాయకులకు పంపటం జరిగింది. ఇటీవల బెంగళూరులో సమావేశమైన INDIA కూటమి పక్షాలన్నింటికి ఇంగ్లీషు ప్రతి పంపబడుతుంది. ❑

# ఒకే ఎజెండాతో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన

- సోషల్ మీడియా నుంచి..

ఉమ్మడి డిమాండ్ల ఆధారంగా ఒకే వేదికపై నుంచి కార్మికులు, రైతాంగం, వామపక్ష పార్టీలు, వాటి వర్గ, ప్రజా సంఘాలు, వామపక్ష గ్రూపులు, మేధావులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీలకు చెందిన ప్రజాతంత్ర సంస్థలు, పీడిత ప్రజల సమస్యలు తీసుకొని పనిచేస్తున్న సామాజిక ఉద్యమాలు, వివిధచోట్ల చెదురుమదురుగా ఉన్న సోషలిస్టు శక్తులు, ప్రజాతంత్ర సెక్షన్లు.. ఇవన్నీ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన కేంద్రకాన్ని ఏర్పాటు చేయగల శక్తులుగా ఉన్నాయి. ఈ శక్తులన్నింటినీ, బూర్జువా-భూస్వామ్య పార్టీల విధానాలకు వ్యతిరేకమైన, నిర్దిష్ట కార్యక్రమం ఆధారంగా ఉన్న వేదిక మీదకు తీసుకురావటం ద్వారా మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఒక రూపాన్ని సంతరించుకుంటుంది.

### ఆర్థిక స్వావలంబనను కాపాడటం

- ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి.
- మంచినీరు, విద్యుత్, ప్రభుత్వ రవాణా, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక సర్వీసులు అందజేయాలి.
- జాతీయ నగదీకరణ పైప్‌లైన్‌నూ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేటైజేషన్‌లను రద్దు చేయాలి.
- ఆశ్రిత పెట్టుబడి దారీ విధానాన్ని అంతం చేయాలి.
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి.
- అసంఘటిత రంగానికి రక్షణ కల్పించాలి.
- అతి సంపన్నులపై పన్ను విధించాలి.
- సమతుల్య అభివృద్ధిని పునరుద్ధరించాలి.
- బాగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, ఉద్యోగాల కల్పనకు, దేశీయ గిరాకీని పెంచటానికి ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి.
- భూ సంస్కరణలు అమలు చేయాలి. సహకార వ్యవసాయం, ఉత్పత్తి, మార్కెటింగ్‌లను అభివృద్ధి చెయ్యాలి. భారతదేశ ఆహార భద్రతని పెంచాలి.

### కార్మిక వర్గం, రైతాంగం

- నైపుణ్యం లేని కార్మికునికి వినియోగదారుల ధరల సూచితో లింక్ చేసే విధంగా నెలకు రూ. 26,000/-కు తగ్గకుండా కనీస వేతనం ఇచ్చేట్లు చట్టం చేయాలి.
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి.
- అంతర్ రాష్ట్ర వలస కార్మిక చట్టం 1979 ని పునరుద్ధరించి, అందరు వలస కార్మికులకు వర్తించే విధంగా విస్తరించి బలోపేతం చేయాలి.
- రహస్య బ్యాలెట్ ద్వారా ట్రేడ్ యూనియన్‌లను గుర్తించాలి.
- కార్మికులకు సామాజిక భద్రత, యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించేందుకు గ్యారంటీ ఇవ్వాలి.
- d¾2+50 శాతం ఫార్ములా ఆధారంగా అన్ని పంటలకూ, అందరు రైతులకూ చట్టబద్ధంగా కనీస మద్దతు ధర ఇవ్వటాన్ని న్యాయబద్దం చేయాలి.
- రైతులకు కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలి.
- వ్యవసాయ కార్మికులకు వేతనాలు, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలి.

### సామాజిక న్యాయం

- కుల వ్యవస్థనూ, అన్ని రకాల కుల అణచివేతలనూ రద్దు చేయాలి.
- ఎస్టీ, ఎస్సీలకు మౌలిక మానవ హక్కులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- ఎస్సీలకు సబ్ ప్లాన్ అమలు కోసం సాధికార కమిటీ, దాని అమలును పర్యవేక్షించటం, అటవీ భూములపై ఆదివాసీ హక్కులు, వారి జీవనోపాధి, సంస్కృతి రక్షణ కోసం రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన నిబంధనలు తయారు చేయడం.
- ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఇచ్చేదుకు చట్టం చేయాలి.
- రిజర్వుడ్ కేటగిరిలోని బ్యాక్‌లాగ్ పోస్టులన్ని భర్తీ చేయాలి.
- మనుషుల చేత దొడ్లను శుభ్రం చేయించే విధానాన్ని కచ్చితంగా రద్దు చేయాలి.
- అంటరానితనాన్ని పాటించే వారికి కఠిన శిక్షలు విధించాలి.
- అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.
- ఇతర వెనుకబడిన తరగతుల జనాభా తెలుసుకునేందుకు కులగణన అమలుచేయాలి.

### భారత రాజ్యాంగ పరిరక్షణ

- భారత గణతంత్ర రాజ్య లౌకిక ప్రజాతంత్ర లక్షణాన్ని కాపాడాలి.
- రాజ్యాంగ వ్యవస్థ యొక్క మూల స్తంభాలను పటిష్టపరచ టానికి ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయాలి.
- లౌకికతత్వం యొక్క మౌలిక సూత్రం, అంటే మతాన్ని రాజ్యం నుండి రాజకీయల నుండి వేరుగా ఉంచటం అనేదాన్ని రాజ్యాంగ సూత్రంగా ప్రకటించాలి.
- మతపరమైన విభజన కోసం విద్వేష ప్రచారాలు చేయడాన్ని, హింసాకాండను రెచ్చకొట్టడాన్ని నిషేధించాలి.
- మతపరమైన మైనారిటీ జీవితాలకూ, స్వేచ్ఛలకూ, మతపరమైన హక్కులకూ రక్షణ కల్పించాలి.
- వ్యవస్థ నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి పచ్చి మతోన్మాద శక్తులను ఏరిపారేయాలి.
- అన్ని రకాల ప్రైవేటు సైన్యాలను, నిఘా గ్రూపులను రద్దు చేయాలి.
- మనుషులను కొట్టి చంపే కిరాతక చర్యలకు వ్యతిరేకంగా చట్టం చేయాలి.
- అస్సాంలో ఎన్.ఆర్.సి. అప్‌గ్రేడ్‌ను మినహాయించి, సీఏఏ – ఎన్‌పీఆర్‌లను రద్దు చేయాలి.

### ప్రజాతంత హక్కులను రక్షించటం

- తీవ్రంగా దుర్వినియోగం అవుతున్న ప్రస్తుత రూపంలోని యూఏపీఏ(ఉపా) చట్టాన్ని రద్దు చేయాలి.
- దేశద్రోహ చట్టాన్ని, ఏఎఫ్ఎస్‌పీఏ, జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ)లను రద్దు చేయాలి.
- మరణశిక్షను రద్దు చెయ్యాలి.
- ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయాలి.
- పాక్షిక లిస్టు పద్ధతితో కూడిన దామాషా ప్రాతినిధ్య పద్ధతిని ప్రవేశపెట్టడం సహా ఎన్నికల సంస్కరణలను పూర్తిగా అమలు చేయాలి.
- సామాజిక ఆడిటింగ్, జవాబుదారీతనాన్ని చట్టబద్ధం చేయాలి.
- సమాచార హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి.

### ఫెడరలిజం

- రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కల్పించే విధంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలను పునర్వ్యస్థీకరించాలి.
- కేంద్ర సర్‌చార్జీలనూ, సెస్‌లనూ పంచడం ద్వారా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన పన్నేతర ఆదాయాన్ని పంపిణీ చేసే పూల్‌లో భాగం చేయటం ద్వారా ద్రవ్య ఫెడరలిజాన్ని పటిష్టపరచాలి.
- అంతరాష్ట్ర మండలిని, ప్రణాళికా సంఘాన్ని, జాతీయాభివృద్ధి మండలిని పునరుద్ధరించాలి.
- గవర్నర్ల వ్యవస్థపై పునఃసమీక్ష చేయాలి.
- 356 ఆర్టికల్ తొలగించి దాని స్థానంలో తగిన రక్షణలు ప్రవేశపెట్టాలి.
- జమ్మూ-కాశ్మీర్ స్వయం ప్రతిపత్తితో సహా దానికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి.
- 370, 35ఎ అధికారణల రద్దును వెనక్కు తీసుకోవాలి.

### మహిళలు

- మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టం చేయాలి.
- మహిళలకు సమాన హక్కులు, వేతనాలు ఇవ్వాలి.
- మహిళలు, పిల్లలపై భయంకరంగా పెరుగుతున్న హింసా కాండకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఇలాంటి వాటిని నివారించడానికి, అరికట్టడానికి, నేరస్తులను కఠినంగా శిక్షించటానికి చర్యలు తీసుకోవాలి.
- కుల దురహంకార నేరాలను నిషేధిస్తూ చట్టం చేయాలి.

### పిల్లలు

- సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీస్)ను పిల్లలందరికి వర్తించేట్లు సార్వత్రికం చేయాలి.
- విద్యాహక్కు చట్టాన్ని గట్టిగా అమలు చేయాలి.
- అన్ని రూపాల బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలి.
- పిల్లల అమ్మకానికి వ్యతిరేకంగా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి.

### ఎల్‌జిబిటి

- ట్రాన్స్‌జెండర్ పౌరుల హక్కులను రక్షించి, అభివృద్ధి చేయాలి.
- ఎల్‌జీబీటీ పౌరులపై నేరాలు, వేధింపుల నివారణకు న్యాయ పరమైన చర్యలు కఠినంగా తీసుకోవాలి.

### వికలాంగులు

- వికలాంగుల చట్టం కిందకు, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం కిందకు వచ్చే వ్యక్తుల హక్కులను గట్టిగా రక్షించడం కోసం బడ్జెట్‌లో సరిపడినన్ని నిధులు కేటాయించాలి.
- జాతీయ వికలాంగుల విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలి.
- వికలాంగుల హక్కులపై ఐక్యరాజ్యసమితి సదస్సు సిఫార్సుల కు అనుగుణంగా ఇతర చట్టాలను మార్పుచేయాలి.
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
- ప్రాథమిక సదుపాయాలు, రవాణా, ఐటీతో సంబంధిత సర్వీసుల వారికి అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలి. ❑

# ఆం.ప్ర. కౌలు రైతుల సంఘం మేనిఫెస్టో





- ఎ.కాటమయ్య, పి.జమలయ్య

**2024 ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో కౌలు రైతుల డిమాండ్స్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాం.**

### సాగుదారు హక్కుల చట్టం 2019 సవరించాలి

- ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం 2019ను సవరించి భూయజమాని ప్రమేయంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు (క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డులు) ఇవ్వాలి.
- దేవదాయ, ధర్మదాయ భూములను, వక్ఫ్ భూములను సాగు చేసే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి.
- ప్రతి సంవత్సరం ఖరీఫ్ ప్రారంభం ముందే గ్రామ సభలు జరిపి కౌలు రైతుల సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా సాగు చేసే భూమి మొత్తాన్ని నమోదు చేసి(సీసీఆర్‌సీలు) గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- కౌలు రైతులు ఎప్పుడు దరఖాస్తు చేసుకుంటే అప్పుడే కార్డులు (సంవత్సరం పొడవునా) జారీ చేయాలి.
- కార్డు ఒకసారి పొందిన తర్వాత అదే భూమిని అదే కౌలు రైతు సాగు చేస్తే క్రమం తప్పకుండా సీసీఆర్సీ కార్డులను రెన్యువల్ చేయాలి.
- వెబ్ ల్యాండ్‌లో నమోదు కానీ సాగు భూములకు, కూడా మాన్యువల్ పద్ధతిలో సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలి.
- ఆర్.బి.కె. కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతు సలహా కమిటీల లో కౌలు రైతులకు భాగస్వామ్యం కల్పించాలి.

### కౌలు రైతులకు పంట రుణాలు

- సాగు చేసే భూమి నిష్పత్తిని బట్టి పంటల హామీతో పంట రుణాలు ఇవ్వాలి.
- పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి ప్రతి పంటకు రుణాలు అందించాలి. రూ.2 లక్షల వరకు వడ్డీ లేకుండా, రూ.3 లక్షల వరకు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలి.
- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కౌలు రైతులకు సభ్యత్వం ఇచ్చి పంట రుణ సదుపాయాలు కల్పించాలి.
- ఎన్నికల ప్రక్రియలో కౌలు రైతులు పాల్గొనే సౌకర్యం కల్పించాలి.
- భూ యజమాని రుణం తీసుకున్నా, భూ యజమాని బ్యాంకు కు బకాయి ఉన్నప్పటికీ, గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులకు ఏ ఇతర పత్రములు అడగకుండానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ష్యూరిటీ లేకుండానే రూ.1.60 లక్షల వరకు పంట రుణాలు జారీ చేయాలి.

### కౌలు,పెట్టుబడి ఖర్చులు

- ఎకరానికి పెట్టుబడి సాయం క్రింద (రైతుభరోసా) రూ.15 వేలు ఆర్థిక సహకారం అందించాలి.
- ముందస్తుగా చెల్లించే కౌలు మొత్తాన్ని వడ్డీ లేకుండానే రుణ రూపంలో మంజూరు చేయాలి.
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాలు, టార్పాలిన్ పట్టాలు, పవర్ ట్రిలర్స్, పవర్ స్ప్రేర్స్ లాంటి చిన్న చిన్న వ్యవసాయ యంత్ర పరికరాలు పూర్తి సబ్సిడీతో అందించాలి.
- వ్యవసాయానికి అవసరమయ్యే డీజిల్ 50% రాయితీ కల్పించి రైతులకు అందించాలి.

### ఈ-క్రాప్ బుకింగ్ నమోదు

- యజమాని భూములను సాగుచేస్తున్న కౌలు రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని ఫీల్డ్‌కు వెళ్లి నిర్ధారించుకొని వారి పేర్లను, వారి పంటలను ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయాలి.
- వెబ్ ల్యాండ్‌లో నమోదు కాని భూములు, లంకభూములు, బంజరు భూములు, సొసైటీ భూములు, పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల భూములను, దేవదాయ, ధర్మదాయ, వక్ఫ్ భూములను సాగుచేస్తున్న కౌలు రైతుల పేర్లను, వారి పంటలను కౌలు రైతులచే సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని ఈ - క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయాలి.

### ప్రకృతి విపత్తుల నష్ట పరిహారాలు

- కరువు, తుఫాన్లు, వరదలు, చీడ పీడల వల్ల పంటలు దెబ్బ తిన్నపుడు ఆహార పంటలకు ప్రతి ఎకరానికి రూ.30 వేలు వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.70 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి.
- ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో కౌలురైతులను చేర్చి విపత్తుల వల్ల పంట నష్టపోయినపుడు సర్వే నెంబర్ ఆధారంగా బీమా పరిహారం చెల్లించి ఆదుకోవాలి.
- రెండో పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి

సంహారక మందులు ఉచితంగా ఇవ్వాలి.

- ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించి పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినప్పుడు ప్రభుత్వమే ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి భూ యజమానులతో మాట్లాడి కౌలు తగ్గించే చర్యలు చేపట్టాలి.
- కౌలు రైతులను ఆదుకునేందుకు ఏటా బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ. 1000 కోట్లు విపత్తుల నిధి ఏర్పాటు చేయాలి.

**కౌలు రైతుల రుణమాఫీ**

- వ్యవసాయం గిట్టుబాటుగాక పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన కౌలురైతు కుటుంబాలకు చెందిన అన్ని రకాల పంట రుణాలను ఒక పర్యాయం బ్యాంక్లు మరియు ప్రైవేట్ అప్పులు కలిపి రూ. 2 లక్షల వరకు మాఫీ చేయాలి.
- పంటలు పండించి కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితులలో దిక్కుతోచని స్థితిలో బలవన్మరణం చెందకుండా అప్పుల ఊబిలో నుంచి కౌలు రైతులను రక్షించడానికి కేరళ తరహాలో "రుణ ఉపశమన చట్టం" తీసుకు రావాలి.
- ప్రకృతి విపత్తులైన తుఫానులు, వరదలు, కరువులు, చీడపీడల ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పంటల రుణాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రద్దు చేయాలి.

**భూసార పరీక్షలు- భూమి హెల్త్ కార్డులు**

- ఏటా భూసార పరీక్షలు నిర్వహించి భూమి హెల్త్ కార్డులు భూ యజమానితోపాటు కౌలురైతులకు కూడా ఇవ్వాలి.
- జింకు, బోరాన్, జిప్సం తదితర 11 రకాల సూక్ష్మ పోషకాలను అందించాలి.
- వేప పిండి, వేప నూనె, భూసారాన్ని పెంచే మూలకాలు ఎరువులు ఉచితంగా ఇవ్వాలి.

**సహకార సంఘాలు ఏర్పాటు**

- ప్రతి గ్రామంలో కౌలు రైతులతో సహకార సంఘాలు ఏర్పాటు చేయాలి.
- రైతుబజారులో చిన్న, సన్న, కౌలు రైతులకు ప్రాధాన్యత.
- కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, నర్సరీలు, విత్తనం తయారీకి అవసరమైన వాటిని సహకార సంఘాలకు ఇవ్వాలి.
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో కౌలు రైతులకు భాగస్వామ్యం కల్పించాలి.

**సాంకేతిక పరిజ్ఞానం**

- ప్రతి మార్కెట్లో పంటలు లాభసాటి ధరలకు అమ్ముకోవడానికి ఈ – ట్రేడింగ్ విధానం తీసుకురావాలి.
- ఈ- క్రాప్ బుకింగ్ వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేరు నమోదు చేయాలి.
- ఎప్పటికప్పుడు పంటలను ఆశిస్తున్న తెగుళ్ళను గుర్తించడానికి ట్యాబ్ ఫోన్ లాంటి పరికరాలు అందించాలి.
- వ్యవసాయ వాతావరణ సూచనలు కౌలురైతులకు అందించటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి.
- ప్రతి గ్రామంలో కిసాన్ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పంటల సస్యరక్షణ, సూచనలు, సలహాలు ఇవ్వాలి.
- కస్టమర్స్ హైరింగ్ సెంటర్స్ గ్రూపులో కౌలురైతులను విధిగా భాగస్వామ్యం చేయాలి.
- ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, టార్పాలిన్ పట్టాలు, పవర్ స్ప్రేర్స్, డీజిల్ ఇంజిన్లు, రోటవేటర్లు, హార్వెస్టర్స్, డ్రోన్లు వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలి.

**మార్కెట్ యార్డ్లు**

- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి కౌలు రైతుల దగ్గర నుండి మద్దతు ధరలకు పంటలు కొనుగోలు చేయాలి.
- పొలాల్లో, కల్లాల్లోనే అన్ని పంటలను నేరుగా మద్దతు ధరలకు కౌలురైతుల నుండి సేకరించాలి.
- అన్ని రకాల పంటలకు రైతుబంధు పథకం ద్వారా లోన్ సౌకర్యం కల్పించాలి.
- డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిపార్సుల మేరకు అన్ని పంటలకు సి2+50శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలి.

**కౌలు రైతుల సంక్షేమం**

- 50 సంవత్సరాలు పైబడిన ప్రతి కౌలు రైతుకు నెలకు రూ. 10 వేలు ఫించను ఇవ్వాలి.
- ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు కుటుంబానికి పంచనామాతో సంబంధం లేకుండా గ్రామ సభ నిర్ధారణతో రైతు ఆత్మహత్యగా గుర్తించాలి.
- ప్రస్తుతం ఇచ్చే రూ. 7 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- కౌలు రైతుల సంక్షేమం – రక్షణకై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి.
- రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, బ్యాంకు, మార్కెటింగ్ తదితర సంస్థల అధికారులతో ప్రతి గ్రామంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి.
- దేవదాయ, ధర్మదాయ, వక్ఫ్ భూముల సాగు చేస్తున్న కౌలు రైతులకు రక్షణ కల్పించాలి
- రాష్ట్రంలో దేవదాయ, ధర్మదాయ మరియు వక్ఫ్ సంస్థలకు చెందిన సుమారు 4 లక్షల ఎకరాలు పైగా సాగు భూములు ఉన్నాయి. తరతరాలుగా ఈ భూములను సాగు

(మిగతా 29వ పేజీలో)

# బీజేపీ, దాని వంది మాగధులను ఓడించాలి

## రైతు కూలి సంఘం ఎజెండా



- ఝాన్సీ

**మన ప్రాంత ప్రజానీకం, రైతులు, కార్మికులు, చిన్న మధ్యతరహా వ్యాపారవేత్తలు, యువకులు, నిరుద్యోగులంతా - మన వనరులపై మన అధికారం కోసం, మన ఉపాధుల కోసం, ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం కదులుదాం. నిర్దిష్ట ఉద్యమ కార్యాచరణతో ముందుకు పోదాం. ఎన్నికల వాడి, వేడిలో మనకు మనం చీలిపోయి కొట్టుకొని పోకుండా నిర్దిష్టమైన ప్రజా అజెండాను ముందుకు తెద్దాం. బీజేపీని, దాని వంది మాగధులను ఓడించమని పిలుపునిద్దాం. ప్రజా ఉద్యమమే నిజమైన సమాధానం అని నమ్మి దాని కోసం కృషి చేద్దాం.**

### ప్రస్తుత డిమాండ్లు

- రాజధాని రాద్ధాంతాన్ని ఆపివేయాలి. ప్రజల మధ్య భావోద్వేగాల్ని ప్రేరేపించడాన్ని ఆపాలి.
- పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి-నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించి, ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలి.
- విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేసి, స్వంత గనులు మంజూరుచేయాలి. ప్లాంటు భూములు, ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదు.
- విశాఖ రైల్వేజోన్, కడప స్టీలు ఫ్యాక్టరీ, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీలను ఇవ్వాలి.
- రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి భర్తీచేయాలి. గిరిజన ప్రాంతాల్లో అన్ని పోస్టులు ఆదివాసులకే కేటాయించాలి.
- రాష్ట్రంలో మూతపడిన అన్ని వ్యవసాయాధారిత పరిశ్రమలను యుద్ధ ప్రాతిపదికన పునరుజ్జీవింప చేయాలి.
- రాష్ట్ర ప్రజల పురోగమనానికి ఆటంకంగా ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర చట్టాలను రద్దు చేయాలి.
- న్యాయమైన ప్రజా అసమ్మతిని సైతం తెలియజేయనీయకుండా అడ్డుకొంటున్న ప్రభుత్వ నిర్బంధ పద్ధతులు రద్దుకావాలి.
- విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఎట్టి పరిస్థితిలో అమలు చేయరాదు. విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలి.
- కేజీ బేసిన్లను కార్పోరేట్ల లాభాల కోసం కాక, దేశ ప్రజల కోసమే వినియోగించాలి. అందులో మన రాష్ట్ర న్యాయమైన వాటా ప్రజలకు చెందాలి.
- కౌలు దోపిడీ అరికట్టి, కౌలుదారులందరికీ రైతాంగంతో పాటు రుణమాఫీ చేయాలి. రుణాలను అందరికీ అందజేయాలి. దున్నేవారిని గుర్తించి, వారికి భూ వసతి కల్పించాలి.
- గ్రామాల నుంచి, పట్టణాల నుంచి శ్రమజీవులు ఉపాధి కోసం వలసలు పోకుండా నివారించి, అందరికీ పనులు కల్పించాలి. గౌరవప్రదమైన కనీస వేతనం చెల్లించాలి.
- ఆదివాసుల భూమి, అడవి, ఉపాధి హక్కులను గౌరవించి అమలు చేయాలి.
- రాష్ట్రాల సంపదలను పీల్చి పిప్పి చేస్తున్న అక్రమ పన్నులన్నింటినీ రద్దు చేయాలి.
- డ్యాం సేఫ్టీ చట్టాన్ని రద్దు చేయాలి. నదీ జలాల పంపకం స్వతంత్ర సంస్థ ఆధ్వర్యంలో జరగాలి.
- నీటి వనరుల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
- అన్ని నీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.
- ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత్ వైదొలగాలి!! వగైరా డిమాండ్లను ఎన్నికల ప్రచార నినాదాలుగా చేపట్టాలని కోరుతున్నాం. ❑

# అసమానతలు లేని అభివృద్ధి కోసం

**(13వ పేజీ తరువాయి)**

బ్యాంకు బకాయిల వసూళ్ళు

- 29. పరిశుభ్రమైన వాతావరణం, సముద్ర తీర సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- 30. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ - రాజ్యాంగానికి లోబడి సుపరిపాలన, ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల బాండ్లు రద్దు, కార్పొరేట్ నిధులకు చెక్, పౌరుల వ్యక్తిగత గోప్యానికి భద్రత.
- 31. ప్రజాస్వామ్య, లౌకిక సంస్కృతి పరిరక్షణ, భారతీయ ఉత్తమ సాంప్రదాయాలు, స్వాతంత్ర్యోద్యమ వారసత్వం కొనసాగింపు. ❑

# మైనారిటీల హక్కుల పరిరక్షణకు ముస్లిం ఆలోచనాపరుల వేదిక ఎజెండా

**- 2019 ఎన్నికల కోసం ముస్లిం ఆలోచనాపరుల వేదిక ప్రకటించిన మేనిఫెస్టో**

## ఎ. రాజకీయ ప్రాతినిధ్యం - గౌరవ స్థానం

రాజకీయ పార్టీ ఆధారిత పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో ఏ సమూహమైనా సరే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో గౌరవ ప్రదంగా మనుగడ సాగించాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ప్రాణ ప్రదమైనది. రాజకీయ ప్రాతినిధ్యం వున్న సమూహాలే చట్ట సభల్లోనూ, అధికార వాకిళ్లలోనూ తమ సమస్యలకు పరిష్కారాలను సాధించుకోగలుగుతాయి. రాజకీయ ప్రాతినిధ్యం లేని సమూహాలు సామాజికంగానూ అంతరించిపోతాయి.

**గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన జాతీయ ప్రజాస్వామిక కూటమి సమస్త ప్రజాస్వామిక వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, మూక స్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, మత సామరస్య విలువలను చిదిమేస్తూ, సమాజంలో అసహన వాతావరణాన్ని సృష్టిస్తూ, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి పథకాలతో భారత సామాన్య ప్రజల జీవితాలను ఉక్కుపాదంతో తొక్కేస్తోంది. ఈ ఫాసిస్టు పాలనకు తొలి బాధితులు ముస్లింలు.**



- 1.భారతీయ జనతా పార్టీని, దాని నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమిని జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఓడించాలి.
- 2.బీజేపీ, ఎన్డీఏ శక్తులతో తలపడే పార్టీలు, కూటములరె జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో బలపరచాలి.
- 3.జనాభా ధామాష (ఆంధ్రప్రదేశ్‌లో 9 శాతం, తెలంగాణలో 12 శాతం) ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 16 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటరీ స్థానాల్లోనూ ముస్లిం అభ్యర్థులకు పార్టీలు టిక్కెట్లు ఇవ్వాలి.
- 4.శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో ముస్లింలకు తొమ్మిది శాతం సీట్లు కేటాయించాలి.
- 5.మంత్రి వర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి.
- 6.ఉప సీఎం పదవిలో ఒక ముస్లింను నియమించాలి.
- 7.ముస్లిం మంత్రులను మైనార్టీల సంక్షేమం వంటి శాఖలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రాధాన్యంగల శాఖలను కేటాయించాలి.
- 8.పంచాయతీ, మునిసిపాలిటి, నగర పాలక సంస్థల పాలక వర్గ ఎన్నికల్లో ముస్లింలకు తొమ్మిది శాతం సీట్లు కేటాయించాలి.
- 9. వెనుకబడిన తరగతుల రిజర్వుడు స్థానాల్లో బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-ఈలలోని ముస్లిం సామాజిక వర్గాలకు జనాభా ధామాషా ప్రకారం తొమ్మిది శాతం అవకాశం కల్పించాలి.
- 10.కొత్త పాలక వర్గాల్లో ముస్లింల ప్రాతినిధ్యం తక్కువగా వున్న చోట్ల నామినేటెడ్ పోస్టుల్లో వారిని నియమించాలి.
- 11. వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు తొమ్మిది శాతం కేటాయించాలి.
- 12. పార్టీ సంస్థాగత నిర్మాణంలో ముస్లింలను మైనారిటీ సెల్‌లకు పరిమితం చేయకుండా ఇతర విభాగాల్లోనూ సముచిత పదవులు ఇవ్వాలి.
- 13.సమాజంలో ముస్లింల ప్రాధాన్యం పెరగడానికి వీలుగా గ్రామీణ, పురపాలక, జిల్లాస్థాయిల్లో అధికారిక ప్రొటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాలకు ముస్లింలను ఆహ్వానించాలి.

### బి.ఆర్థికరంగం

మనిషి ఆర్థిక జీవి. ఆర్థిక ఆలంబన లేని సమూహం వర్తమాన సమాజంలో నిలదొక్కుకోలేదు. అనేక చారిత్రక సామాజిక కారణాల వల్ల కొన్ని సమూహాలు ఆర్థిక ఆలంబనను పొందలేక పోవడమేగాక, వున్న ఆర్థిక ఆలంబనను సహితం కోల్పోతుం టాయి. ఆ సమూహాలను ప్రత్యేకంగా ఆదుకోనంత కాలం, వాళ్లను ప్రధాన స్రవంతితో సమానంగా అభివృద్ధి చేయనంత కాలం భారత రాజ్యాంగ లక్ష్యమైన ప్రజాహిత సమాజాన్ని నిర్మిం చుకోలేము. ప్రభుత్వాలు ముస్లింల అభ్యున్నతికి కేటాయిస్తున్న నిధులే తక్కువ. అలా కేటాయించిన నిధులను సైతం ఖర్చు పెట్టకుండా మురగబెడుతున్నారు. ప్రభుత్వ బడ్జెట్‌లో ముస్లిం సబ్ ప్లాన్ ప్రకటిస్తామని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ 2013లో ఒక వాగ్దానం చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఈ ఏడాది సబ్ ప్లాన్ చట్టాన్ని సవరించింది. సబ్ ప్లాన్ కేటాయింపుల్లో వినియోగం కాని నిధులను వేరే శాఖలకు మళ్లించే అధికారులకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు చేశారు. ఆ కోవలో ఆంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాల్లో ముస్లిం సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకు రావలసిన అవసరం వుంది.

- 1. ముస్లిం సబ్–ప్లాన్‌ను రూపొందించి రాష్ట్రంలోని ముస్లిం జనాభా ధామాషాకు అనుగుణంగా బడ్జెట్‌లో 10 నుంచి 13 శాతం కేటాయించాలి.
- 2. రాష్ట్ర మైనారిటీస్ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల వరకు ఇచ్చే రుణాలను బ్యాంకులతో కొల్లాటరల్ సెక్యూరిటీ(ఆస్తి జామీను) లింకు లేకుండా అందించాలి.
- 3. కొల్లాటరల్ సెక్యూరిటీ (ఆస్తి జామీను) లేకపోవడం వల్ల అనేక పథకాల్లో ముస్లింలు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు. ఇళ్ళ స్థలాలు, ఇళ్ళ నిర్మాణాల మంజూరు ద్వారా ముస్లింల సంపదను ప్రభుత్వం పెంచాలి. వాటితో ముస్లింలు కొల్లాటరల్ సెక్యూరిటీ సమర్పించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పలు పథకాల్లో బ్యాంకు రుణాలు పొందే వీలు ఉంటుంది. తద్వారా తమ ఆర్థిక స్థితిగతులను వాళ్ళు మరింతగా మెరుగు పరుచుకునే వీలుంటుంది.
- 4. కొల్లాటిరల్ సెక్యూరిటీ అవసరం లేని పథకాల్లోనూ ముస్లింలకు రుణాలు ఇవ్వడానికి కొన్ని బ్యాంకులు కొల్లాటి రల్ సెక్యూరిటీ అడుగుతున్నాయి. కొల్లాటిరల్ సెక్యూరిటీ చూపించలేని వారికి రుణాలు నిరాకరిస్తున్నాయి. ఇటువంటి బ్యాంకుల మీద చర్యలు తీసుకోవాలి.
- 5. పేద ముస్లిం పిల్లలకు రంజాన్ నెలలో ఉచితంగా రెండు జతల బట్టలు పంపిణీ చేయాలి.
- 6.ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వద్ద రుణాల కోసం పెండింగ్‌లో వున్న 30 వేలకు పైగా దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేయడానికి ప్రత్యేకంగా 100 కోట్ల రూపాయల కేటాయించాలి.
- 7. ముస్లిం కార్ డ్రైవర్లను యజమానులుగా మార్చడానికి 200 కార్లను పంపిణీ చేయాలి.
- 8.మెకానిక్‌లు, రిపేర్లు తమ వృత్తికి సంబంధించిన పని ముట్లను సమకూర్చుకోవడానికి ఒక్కొక్కరికి 20 వేల రూపాయల వరకు బ్యాంక్ లోన్లు ఇప్పించాలి. లేదా కంప్లీట్ టూల్ కిట్లను పంపిణీ చేయాలి.
- 9.బంగారం / సునార్ పని చేసే వారికి రుణసౌకర్యం కల్పించడానికి రూ.10 కోట్లు కేటాయించాలి.
- 10.నూర్ బాషాల కోసం ప్రత్యేకంగా ఒక ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి దాని కోసం సాలీనా రూ.40 కోట్లు కేటాయించాలి.
- 11. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీల వల్ల తీవ్రంగా నష్టపోయిన చిరు వ్యాపారుల సంక్షేమానికి కొత్త పథకాలను చేపట్టాలి.

### సి. ప్రాథమిక విద్య

పేదరికం ముస్లిం సమాజాన్ని మరింత పేదరికంలోకి నెట్టి వేస్తోంది. వాళ్ళను అకడమిక్ విద్యకు దూరం చేస్తోంది. విద్య లేని సమూహం ప్రజాస్వామ్య వ్యవస్థ ఫలాలను అందుకోజాలదు. దేశంలో ముస్లింల అభివృద్ధి విద్యారంగం నుండే ఆరంభం కావలసి వుంది.

- 1.స్థలాలు కేటాయించి మదరసాలు నిర్మించి ప్రతి మదరసా కు సర్వ శిక్ష అభియాన్ ద్వారా నిధులు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.
- 2.మదరసాలు అన్నింటిలోనూ జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి.
- 3. మదరసాల్లో ఆంగ్ల మాధ్యమం, రాష్ట్ర / కేంద్ర ప్రభుత్వాల సిలబస్ అమలు చేయాలి.
- 4.ముస్లిం డ్రాప్ అవుట్ బాల బాలికలకు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా వృత్తి శిక్షణ తరగతులు నిర్వహించి స్వయం ఉపాధి కల్పించాలి.
- 5.ప్రత్యేక పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి ఉర్దూ పాఠశాలల్లో చదువును మధ్యలో ఆపేసే వారి (స్కూల్ డ్రాపింగ్ ) సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయాలి.
- 6.మదరసాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

### డి.ఉన్నత విద్యా, కోచింగ్, ఉద్యోగ రంగాలు

ఉన్నత విద్య సమాజంలో వ్యక్తి వికాసానికి తోడ్పడుతుంది.

ప్రభుత్వ ఉద్యోగాన్ని కేవలం ఉపాధి, ఆర్థిక అంశాలుగా మాత్రమే చూడకూడదు. అన్ని సామాజిక సమూహాలకు కార్య నిర్వాహక వర్గంలో, తద్వారా ప్రజాపాలనలో భాగస్వామ్యం కల్పించే ప్రజాస్వామిక ప్రక్రియగా చూడాలి.

- 1. ప్రభుత్వ విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లింలకు ఇప్పుడున్న నాలుగు శాతం రిజర్వేషన్లను పరిరక్షించడమేగాక, మరో ఐదు శాతం పెంచుతూ శాసనసభలో ఒక తీర్మానం చేసి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్రానికి పంపించాలి.
- 2.ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు శాతం రిజర్వేషన్ కలిగి ఉన్న బీసీ(ఇ) జాబితాలోని ముస్లిం ఉప తరగతులను కేంద్ర ఒ.బి.సి. జాబితాలో పొందుపరిచి, విద్యా, ఉపాధి, ఉద్యోగా వకాశాలు కల్పించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మేరకు శాసన సభలో తీర్మానం చేసి, కేంద్రానికి నివేదించాలి.
- 3.కేంద్ర ప్రభుత్వ 15 సూత్రాల పథకం తదితర కార్యక్ర మాల ద్వారా రాష్ట్రానికి వచ్చే ఉద్యోగాల్లో ముస్లింలకు తొమ్మిది శాతం కేటాయించాలి.
- 4.రాష్ట్ర బి.సి.(ఇ) జాబితాలోని ముస్లిం ఉప సామాజిక వర్గాలను ఇప్పటి వరకు కేంద్రంలో ఓబీసీ జాబితాలో చేర్చని కారణంగా ముస్లిం విద్యార్థులు The National Eligibility cum Entrance Test (NEET) పరీక్షలో ఏటా 200 మెడికల్ సీట్లను కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఒ.బి.సి. రిజర్వేషన్ జాబితాలో ఏపీ బి.సి.(ఇ) సామాజికవర్గాలను చేర్చే వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీట్ కౌన్సిల్‌తో సంప్రదించి, రాష్ట్ర వైద్య కళాశాలల్లో సీట్లు రాష్ట్ర బి.సి.(ఇ) రిజర్వేషన్ ప్రకారం ముస్లింలకు ఇవ్వాలి.
- 5.ఎం.సెట్, పాలిటెక్నిక్, APPSC, UPSCలకు హాజరయ్యే ముస్లిం విద్యా, ఉద్యోగ ఆశావహులకు రాష్ట్ర ప్రభుత్వం అంచేస్తున్న కోచింగ్ క్లాసుల కాల పరిమితిని మూడు నెలలకు పెంచాలి.
- 6. సివిల్ సర్వీసు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడానికి ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేయాలి.
- 7.ప్రతి జిల్లాలో ముస్లింల కోసం ప్రత్యేకంగా టీచర్ ట్రైనిం గ్, బి.ఇ.డి., ఒకేషనల్ కోర్సుల శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి, దిగువ, మధ్య తరగతి ముస్లింలను ప్రోత్సహించాలి.
- 8.ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (RCEDM) ప్రాంతీయ కేంద్రాలను పునరుద్దరించాలి. ఉత్త రాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రీజియనల్ సెంటర్ ఫర్ ముస్లిం ఎడ్యుకేషన్ ఏర్పాటుచేయాలి. హైద రాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయం ద్వారా 1983లో రీజియనల్ సెంటర్స్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్‌ను ఆంధ్ర ప్రాంతంలో ఏర్పాటుచేశారు. అందు లో భాగంగా నాటి ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉప కులపతి ఎల్.వేణుగోపాల్‌రెడ్డి 2005లో ఏయూ ప్రాంగణంలో ఒక ప్రాంతీయకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా అనేకమంది ముస్లింలకు విద్యా శిక్షణతోపాటు ఉపాధి, ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఇప్పుడు ఆ కేంద్రం భవనమే లేకుండాపోయింది. తిరిగి ఆ కేంద్రాన్ని నిధులు, పోస్టులతో ప్రారంభించాలి.
- 9.విదేశాల్లో ఉన్నత విద్యను ఆశించేవారికి రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం /ఉపకారవేతనాలు అందించాలి.
- 10.పదో తరగతి ఉత్తర్ణులైన వారికి వృత్తి విద్యాకోర్సుల ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని పెంచడానికి రూ.5 కోట్లు కేటాయించాలి.
- 11. ముస్లిం పిల్లల కోసం అదనంగా 50 రెసిడెన్సీయల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి.

### ఇ. ప్రైవేటు ఉపాధి రంగం

అకడమిక్ విద్యను అందుకోలేకపోతున్న కారణంగా ముస్లిం యువకులు ప్రైవేటు రంగంలో ఉపాధినో, స్వయం ఉపాధినో ఆశిస్తున్నారు. వాణిజ్య, పారిశ్రామిక సంస్థల ప్రమోటర్లలో ముస్లింల సంఖ్య చాలా పరిమితం కనుక ప్రైవేటు రంగంలో ఉపాధిని పొందడం కూడా ముస్లిం యువకులకు కష్టసాధ్యంగా మారుతోంది. ఆర్థిక వనరుల కొరత కారణంగా స్వయం ఉపాధిని చేపట్టే అవకాశాలు అంతరించిపోతున్నాయి.

- 1.ముస్లిం చిరు వ్యాపారులు, తోపుడు బండ్లవాళ్ళు, హాకర్లు, మెకానిక్‌లు, రిపేరర్ల వృత్తి నైపుణ్యాభివృద్ధికీ, ఆర్థికాభివృద్ధికీ అవసరమైన కొత్త పథకాలను ప్రవేశపెట్టాలి.
- 2.ముస్లిం సమాజంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను (ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్) పెంచేందుకు స్టార్ట్-అప్స్‌ని ప్రోత్సహించాలి.
- 3.ముస్లిం ఔత్సాహికులకు చిన్న తరహా పరిశ్రమల్ని నెలకొల్పడానికి తగిన ఆర్థిక రుణాలు అందించాలి.
- 4.హిందూ వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం చేపట్టే పథకాలన్నింటినీ బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-ఈ జాబితాల్లోని ముస్లిం సామాజికవర్గాలు అన్నింటికీ వర్తింపచేయాలి.
- 5.పేదరిక నిర్మూలన పథకాలను ఏ కొందరికో కాకుండా ముస్లిం సమాజంలో సంతృప్తస్థాయి (సాచురేషన్)కి చేరే వరకు వాటిని కొనసాగించాలి.

### ఎఫ్. ముస్లిం మహిళా సాధికారత

ఏ సామాజికవర్గంలో అయినా సరే మహిళలే అభివృద్ధికి కొల

మానం. మహిళాభ్యున్నతిని సాధించని సమాజం అసలు అభివృద్ధిని సాధించినట్టే కాదు. భారత అభివృద్ధి నిచ్చెనమెట్లలో ముస్లిం సమాజం అందరికన్నా అట్టడుగున వుంటే, ముస్లిం మహిళలు వాళ్లకన్నా కింద వుంటున్నారు.

- 1.ముస్లింల కోసం చేపట్టే ప్రతి ఉద్దీపన చర్యల్లోనూ ముస్లిం మహిళలకు 33 శాతం ఉప రిజర్వేషన్ కల్పించాలి.
- 2.రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉపాధి రంగాలలో ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్లలోనూ ముస్లిం మహిళలకు 33 శాతం ఉప రిజర్వేషన్ కల్పించాలి.
- 3.ముస్లిం యువతుల వివాహం సందర్భంగా దుల్హన్ పథకం కింద ఇస్తున్న రూ.50 వేలకు బదులుగా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం 50 శాతం పెంచాలి.

### జి. ప్రాంతీయ సమానత్వం

రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతంలోనో, ఏదో ఒక సామాజిక వర్గానికో జరిగే అభివృద్ధి ఆదర్శవంతమైన అభివృద్ధికాదు. అభివృద్ధి ఫలాలు అన్ని సామాజికవర్గాలకూ, అన్ని ప్రాంతాలకు సమానంగా అందాలి. అప్పుడు మాత్రమే సామాజిక శాంతి నెలకొంటుంది.

- 1.ఉద్యోగ, ఉపాధి, ప్రభుత్వ పథకాలు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మంత్రులు, రాజ్యసభ సభ్యులు, నామినేటెడ్ పోస్టులు మొదలైన అన్నింటిలోనూ ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రా, రాయలసీమ ప్రాంతాల ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. తద్వారా ప్రాంతీయ సమానత్వాన్ని సాధించాలి.

### హెచ్. మౌలిక రంగ అభివృద్ధి

సమాజ అభివృద్ధికి మౌలిక రంగం పునాది వంటిది. మౌలిక రంగాన్ని అభివృద్ధి చేయకుండా ఈ సామాజికవర్గాన్ని అభివృద్ధి చేయలేము. మౌళికరంగ సదుపాయాలు సౌకర్యాల్లో ముస్లిం సమాజానికి చాలా అన్యాయం జరుగుతూ వస్తున్నది.

- 1.బలహీన వర్గాలకు గృహ వసతి పథకం(ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్) ద్వారా మంజూరు చేసే ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణ రుణాల్లో ముస్లింలకు 10శాతం విడిగా మంజూరు చేయాలి.
- 2. ముస్లింలు అధికంగా నివసించే బస్తీలు, పేటలు, మురికి వాడలను గుర్తించి వెంటనే పారిశుద్ధ్యం, మంచినీరు, డ్రైనేజి వ్యవస్థల్ని ఏర్పాటు చేయాలి.
- 3.ముస్లింల నివాసం కోసం కాలనీలు నిర్మించాలి.
- 4.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో వడ్డీ లేని రుణ సదుపాయం అందించే ఇస్లామిక్ బ్యాంకుల శాఖలను ఏర్పాటు చేయాలి.
- 5. గ్రామీణ పేద ముస్లింల కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలి.
- 6. ప్రతి జిల్లా కేంద్రంలో ముస్లింల కోసం ఒక ముసాఫిర్ ఖానా (సత్రం/సరాయ్)ను నిర్మించాలి. వైద్యం తదితర పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ముస్లింలు నామ మాత్రపు అద్దెతో ఆ ముసాఫిర్ ఖానాల్లో ఓ మూడు రోజుల వరకు వుండే సౌకర్యం కల్పించాలి.
- 7. ఆటోనగర్‌లలో ఉన్న ముస్లిం మెకానిక్కులకు షెడ్లు వంటి మౌలిక నిర్మాణాలను ప్రభుత్వమే తక్షణం చేపట్టాలి.

### ఐ. ఉర్దూ భాషాభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ ముస్లింలకు తెలుగు జీవనభృతి భాష అయితే, ఉర్దూ వాళ్ళకు మాతృభాష. తెలుగు భాషాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ముస్లిం రచయితలు, కవులు, చేసిన సేవలు ఎవరూ విస్మరించ లేనివి. ఉర్దూ అధికార భాషగా వున్న ఒక కాలంలో అక్షరాశ్యుల శాతం ముస్లిం సమాజంలో ఎక్కువగా వుండేది. ముస్లిం మహిళల అక్షరాశ్యత శాతం పురుషులకంటే ఎక్కువగా వుండేది. ఇప్పుడు ఉర్దూ భాష నిరాదరణకు గురికావడంతో అంతరించి పోయే ప్రమాదం సంభవిస్తోంది. అపార సాంస్కృతిక వారసత్వం కలిగిన ఉర్దూ భాష అంతరించిపోవడం అంటే ముస్లిం సమాజపు సాంస్కృతిక చరిత్ర అంతరించిపోతుంది.

- 1.రాయలసీమ ఉర్దూ విశ్వ విద్యాలయంలో మౌలిక వసతులు, బోధనా సిబ్బందిని పెంచడానికి అవసరమైన నిధులను కేటాయించి ఉర్దూ భాషాభివృద్ధికీ తద్వారా ముస్లిం సమాజపు సాంస్కృతికాభివృద్ధికీ ప్రభుత్వం కృషి చేయాలి.
- 2.ఉర్దూ-ముస్లిం పేద కవులు, రచయితలు ఓ రెండు వందల మందికి నెలకు రెండు వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలి.
- 3.రాయలసీమలోని నాలుగు జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరులో జిల్లాల్లో ఉర్దూను రెండవ భాషగా గుర్తింపు ఇవ్వాలి.
- 4.ఉర్దూ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలి.

### జే.న్యాయవ్యవస్థ, స్మృతి, శాంతి భద్రతలు

వర్తమాన సమాజంలో అవమానాలకు, అత్యాచారాలకు తరచూ గురవుతున్న సమూహం ముస్లింలు. ముస్లింల మీద నమోదవుతున్న బూటకపు కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నవి. ఈ పరిస్థితిని తక్షణం చక్కదిద్దాల్సిన అవసరం వుంది.

- 1.ముస్లింలపై తరచూ జరుగుతున్న మూకదాడుల్ని నిరోధించడానికి, మైనారిటీల ఆత్మ గౌరవాన్ని పరిరక్షించడానికి, సమాజంలో మైనారిటీల మీద కొనసాగుతున్న

వివక్షను నివారించడానికి అత్యాచార నిరోధక చట్టాన్ని రూపొందించి, కట్టుదిట్టంగా అమలుచేయాలి.

- 2.మూకోన్మాద దాడుల నుంచి ముస్లింల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలి.
- 3.ఒక్క గుక్కలో చెప్పే తక్షణ ట్రిపుల్ తలాక్‌ను ముస్లిం సమాజం వ్యతిరేకిస్తున్నది. అయితే, తక్షణ ట్రిపుల్ తలాక్ చెప్పారనే నెపంతో ముస్లిం పురుషులను వేధించడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నది. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను జైలు శిక్ష విధించదగ్గ నేరంగా పరిగణిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలలని కోరుతున్నాము.
- 4.ప్రభుత్వ ఎ.పి.పి.(అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్), ఎ.జి.పి.(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) నియామకాల్లో ముస్లిం న్యాయవాదులను ప్రోత్సహించి పోస్టులు ఇవ్వాలి.
- 5. ప్రత్యేకమైన, భిన్నమైన ముస్లిం పర్సనల్ లా (షరియత్) గురించి అనేక మంది పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు అవగాహన లేని కారణంగా ఫిర్యాదులు చేయడానికి వెళ్ళిన ముస్లింలకు అనేక అవమానాలు జరుగుతున్నాయి. ముస్లిం మహిళల స్థితి మరీ దారుణం. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఆఫీసుల్లో ముస్లిం ముఫ్తీతో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయాలి. ముస్లిం పర్సనల్ లా కేసుల వ్యవహారంలో పోలీసులకు ఈ ముఫ్తిలు సలహాదారులుగా వ్యవహరిస్తారు.
- 6. పట్టణానికి ఒక పోలీస్‌స్టేషన్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ కమిటీని ఏర్పాటు చేసి అందులో ఒక సభ్యునిగా ముస్లిం పెద్దను / మేధావిని నియమించాలి.

## కే. వక్ఫ్ భూములు - ఆస్తులు

ముస్లిం సమాజానికి ఆర్థిక ఆలంబన కోసం పూర్వీకులు దానం చేసిన వక్ఫ్ భూములు, ఆస్తులు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. అనేక విధాలుగా ఈ భూములు అస్తులు అంతరించి పోయి ముస్లిం సమాజానికి తీరని అన్యాయం జరుగుతోంది.

- 1.వక్ఫ్ బోర్డును కార్పొరేషన్ స్థాయికి పెంచి, ముస్లిం ధార్మిక ఆస్తుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.
- 2.వక్ఫ్ భూముల ఆక్రమణదారులు, కబ్జాదారుల మీద కఠినమైన చర్యలు తీసుకోవాలి.
- 3.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రెవెన్యూ మండలస్థాయిలో ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగిని నియమించాలి.
- 4.అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూములకు ఇతర రైతులకు ఇచ్చినట్లే వక్ఫ్‌కు కూడా రాయితీలు ఇవ్వాలి.
- 5.రాష్ట్రంలోని వక్ఫ్ భూములను పరిరక్షించడమేగాక, గతంలో అన్యాక్రాంతమైన భూములకు సమాన విలువగల భుములను వక్ఫ్ బోర్డుకు ఇవ్వాలి.

## ఎల్. మత స్వేచ్ఛ, మతప్రచార హక్కు

మత అల్ప సంఖ్యాకులకు తమ మతవిశ్వాసాలను కొనసాగించుకోవడం, ప్రచారం చేయడం ప్రాణప్రదమైన అంశాలు. దానికి అవసరమైన సంపూర్ణ పరిరక్షణను ప్రభుత్వం కల్పించాలి.

- 1.ముస్లింలకు హజ్ సబ్సిడీ అందించాలి.
- 2. హజ్ కాని వేళల్లో మక్కా దర్శనానికి వెళ్ళే ఉమ్రా యాత్రికులకు సబ్సిడీ అందించాలి.
- 3.హజ్‌హౌస్‌కు అవసరమైన భూమిని కేటాయించి, నిర్మాణాన్ని చేపట్టాలి.
- 4.హజ్ యాత్రికులు విజయవాడ, కడప, విశాఖపట్నం విమానాశ్రయాల నుండి నేరుగా జిద్దా వెళ్ళేలా అంతర్జాతీయ విమానాలు ఏర్పాట్లు చేయాలి.
- 5.రాష్ట్రంలోని దర్గాలు అన్నింటి అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించాలి.
- 6.ఇమాం, మౌజన్లకు ఇప్పుడు ఇస్తున్న భృతిని పెరిగిన ధరలకు అనువుగా 50 శాతం పెంచాలి.
- 7.మసీదులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేయాలి.
- 8.హఫీజ్, అలిం, ముఫ్తిలకు ఉచితంగా హజ్ యాత్ర ఏర్పాటు చేయాలి.
- 9.హఫీజ్, ఆలిం, ముఫ్తిలకు సాధికార ధృవపత్రాలు పంపిణీ చేయడానికి వీలుగా మదరసాల గుర్తింపు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలి.
- 10. ముస్లిం జనాభా 3 వేలకుపైన ఉన్న మండలాల్లో ఒక ప్రభుత్వ ఖాజిని నియమించాలి.

## ఎం. సార్వజనీన డిమాండ్లు

- 1. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రాజెక్టు నిర్వాశితులకు తక్షణ సహాయం, పునరావాస (ఆర్ ఆర్) ప్యాకేజిని సంపూర్ణంగా అమలు చేయాలి.
- 2.ఏపీకి ప్రత్యేక తరహా హెూదా సాధన కోసం ఉధృతంగా ఉద్యమించాలి.
- 3.దళితుల మీద దాడుల్ని నిరోధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- 4.మహిళల రక్షణ కోసం చట్టాలను పటిష్టం చేయాలి.
- 5.ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ ఓటింగ్ విధానాన్ని పునరుద్ధరించాలి. ❑

# మహిళల సాధికారతకు ఎజెండా

**- మహిళా సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి**

**'మహిళల దుస్థితి మారాలి.. సాధికారత రావాలి. మహిళా సమస్యలను ఆయా పార్టీలు తమ ప్రణాళికలో చేర్చాలి. వాటిపై ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలి అత్యాచారాలను.. హింసను అరికట్టాలి' అని మహిళా సంఘాల వేదిక స్పష్టం చేసింది. ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో రాజకీయ పార్టీలకు తమ మేనిఫెస్టోల్లో మహిళలకు సంబంధించిన అంశాలను ఏమేమి పొందుపరిచి, అమలు చేయాలో దిశా నిర్దేశం చేశాయి.**

- 1.అత్యాచార నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 90 రోజులలో విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలి. పెరిగిన కేసుల కనుగుణంగా కోర్టుల సంఖ్య పెంచాలి.
- 2.కుటుంబ హింసా నివారణ కేంద్రం, ఒన్ స్టాప్ సెంటర్ కలిపి సమగ్ర మహిళా సంరక్షక కేంద్రంగా పనిచేయాలి.
- 3.మహిళల భద్రత రక్షణ లక్ష్యంగా పోలీస్‌శాఖను పని చేయించాలి.
- 4.ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి. హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలన చిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలి.
- 5.సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లపై చర్యలు ఉండాలి. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచి మాట్లాడే వారిపై కఠిన శిక్షలుండాలి. వీరిని ఎన్నికల్లో పోటీ చేయనివ్వరాదు.
- 6.అనాథ బాలలు, ఆడపిల్లలున్న హాస్టల్స్, గెస్ట్‌హౌస్‌లలో పురుష సిబ్బంది లేకుండా చట్టాలను అమలుచేయాలి. హాస్టల్స్‌లలో సరైన వసతులు, ఆహారం, భద్రత ఉండే విధంగా చర్యలు చేపట్టాలి.
- 7.షార్ట్ స్టేహోమ్స్ సంఖ్య పెంచాలి. వివిధ పనుల కోసం పట్టణాలకు వచ్చే ఉద్యోగ, కార్మిక మహిళల కోసం తాత్కాలిక బస ఏర్పాటు ఉండాలి.
- 8.బాధితుల పునరావాసం కోసం నష్టపరిహారంగా ఇవ్వవలసిన నిధులను వెంటనే అందించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.
- 9.ప్రతి వారం ఒక ప్రాంతంలో మండల అధికారులు మహిళల హక్కులను వివరిస్తూ అమలుకు పూనుకునే విధంగా ప్రచారం, కార్యాచరణకు ప్రభుత్వం పూనుకోవాలి. జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
- 10.స్థానిక సంస్థలలో మహిళా రిజర్వుడు స్థానాల్లో, సమావేశాలలో పురుషులను అనుమతించకూడదు. మహిళా ప్రజా ప్రతినిధులకు శిక్షణలు నిరంతరం నిర్వహించాలి.
- 11.ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు పథకాలు ఉండాలి.

### ఒంటరి మహిళలు

- 1.ఒంటరి మహిళలను గుర్తించాలి. వారికి గుర్తింపు కార్డులివ్వాలి. భర్త మరణ ధ్రువీకరణ పత్రాలు అందించాలి. ఇంటి సదుపాయం, పని గ్యారెంటీ కల్పించాలి. వారి పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వాలి. అర్హత వయస్సు 20 సంవత్సరాలకు తగ్గించాలి.
- 2.ఒంటరి మహిళలకు, వారి కుటుంబాల్లోని పిల్లలకు అదనపు రక్షణ, సంక్షేమం, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలి.
- 3.ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలి.

### మద్యం మత్తు పదార్థాలు

- 1.మద్యం నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి. మండలానికి ఒక్కషాప్ మాత్రమే అనుమతించాలి. మద్య వ్యసనాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి.
- 2.గంజాయి తదితర మత్తు పదార్థాల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి.
- 3.వారంలో ఒక రోజు డ్రైడేగా నిర్ణయించి అమలు చేయాలి. షాపులు తెరిచి ఉంచే సమయాన్ని తగ్గించాలి.
- 4. మద్యం మత్తు మందులకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం ప్రభుత్వం చేయాలి. మద్యం మీద వస్తున్న ఆదాయంలో కనీసం ఒక్క శాతమైన మద్యంపై ప్రచారానికి కేటాయించాలి. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
- 5.డి-అడిక్షన్ కేంద్రాలు ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేయాలి.
- 6.తాగుడు వ్యసనానికి గురై అర్ధంతరంగా మరణించే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి.

## ఉపాధి

- 1.పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీని అమలుచేయాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 200 రోజులు పని గ్యారెంటీ కల్పించాలి.
- 2.ప్రతీ మండలంలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేసి అందులో రిజిస్టర్ చేసుకున్న వారికి ఉపాధి కల్పించాలి.
- 3.పెద్ద సంఖ్యలో ఉన్న అసంఘటిత మహిళా కార్మికులకు, స్కీము వర్కర్లకు కార్మిక చట్టాలు అమలుపరచాలి. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- 4.మహిళా కార్మికులకు, స్కీము వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి. ఉద్యోగ భద్రత ఉండాలి. గ్రాట్యుటీ, పెన్షన్, సంక్షేమ పథకాలు అమలుచేయాలి. ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేయాలి.
- 5.పని ప్రదేశాల్లో పిల్లల సంరక్షణా కేంద్రాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలి.
- 6.అన్ని రంగాల్లో ఆరు నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- 7.ఉపాధి హక్కు కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. పురుషులతో సమానంగా వేతనాలు నిర్ణయించి అమలు చేయాలి.
- 8.అటవీ ప్రాంతాల్లో నివసించే మహిళలకు అటవీ ఉత్పత్తుల సేకరణ హక్కును రక్షించాలి.

## ధరలు - ప్రజా పంపిణీ

- 1.14 రకాల నిత్యావసర సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌక ధరలకు అందించాలి. ఆహార వస్తువులలో ఫ్యూచర్ ట్రేడింగ్‌ను నిషేధించాలి. విద్యుత్, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలి. గ్యాస్ పైప్ ద్వారా సరఫరా చేయాలి. రూ.400కు గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలి.
- 2.ధరల స్థిరీకరణ నిధికి బడ్జెట్ పెంచాలి. ఆహార వస్తువులు, స్కూల్ విద్యకి అవసరమైన వస్తువులపై జీఎస్టీని తగ్గించాలి.

## స్వయం సహాయక గ్రూపులు

- 1.పొదుపు డబ్బుపై వడ్డీ చెల్లించాలి. పొదుపు డబ్బు వినియోగంపై ఆంక్షలు ఉండకూడదు. రూ.20 లక్షల వరకు రుణాలకు సున్నా వడ్డీ అమలుచేయాలి. అవినీతిని అరికట్టాలి.
- 2.పొదుపు గ్రూపుల రుణం మంజూరుపై అధికారుల పెత్తనం ఉండకూడదు. బలవంతంగా డిపాజిట్లు, ఇన్స్యూరెన్స్ కట్టించకూడదు. డ్వాక్రా గ్రూపు మహిళలకు ఉపాధి నైపుణ్యాల శిక్షణ, మార్కెటింగ్కు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. బడ్జెట్ కేటాయించాలి.
- 3.కేరళ కుటుంబశ్రీ తరహాలో మహిళా కో-ఆపరేటివ్‌లను ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందించాలి.
- 4.అభయ హస్తం కొనసాగించాలి. కట్టిన డబ్బు తిరిగి ఇవ్వమని కోరేవారికి తిరిగి ఇవ్వాలి.

## బాలల సంక్షేమం

- 1.ఇంటా, బయటా బాలల సంరక్షణకు అన్ని చర్యలూ చేపట్టాలి.
- 2.బాల్య వివాహాల నిరోధానికి బాలికలకు నిర్బంధ విద్య 19 సంవత్సరాల వరకు పెంచాలి. బాలికలలో స్కూల్ మాని వేయకుండా చూసేందుకు ట్రాకింగ్ అమలు చేయాలి.
- 3.బాలలు ఆరోగ్యంగానూ మరియు అందరికీ సమాన అవకాశాలు కలిగించేందుకు ఎదిగేందుకు వీలుగా కామన్ పాఠశాల విద్య ఉండాలి. పిల్లలు ఆడుకోవడానికి వీలైనంత ఆట స్థలాలు, శిక్షకులు ఏర్పాటు జరగాలి.
- 4.వసతి గృహాలలో సరియైన ఆహారం, విశ్రాంతికి తగిన ఏర్పాటు కల్పించేందుకు ప్రాధాన్యత నివ్వాలి.
- 5.మత్తు పదార్థాలు, మద్యం, పోర్న్‌వెబ్ సైట్ల ద్వారా బాల్యాన్ని ఛిద్రం చేసే అన్ని చర్యలను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలి. అందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

## విద్య, ఆరోగ్యం, ప్రాథమిక సదుపాయాలు

- 1.మహిళలకు విద్య, ఆరోగ్యం, రక్షణ, రవాణా, ఉపాధి భద్రత కల్పించేందుకు, అమలు చేసేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అమలు చేయాలి.
- 2.సమానత, శాస్త్రీయత పునాదిగా విద్యా విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.
- 3.ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించాలి.
- 4.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేసే విధంగా అన్ని వసతులూ ఏర్పాటు చేయాలి. వ్యాసెక్టమి ఆపరేషన్లను ప్రోత్సహించాలి. ఆడ పిల్లల తల్లులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. భ్రూణహత్యల నివారణకు, గర్భస్థ శిశువుల అబార్షన్‌లపై విస్తృత ప్రచారం నిర్వహించాలి.
- 5.రొమ్ము మరియు గర్భాశయ క్యాన్సర్ల నివారణకు ఉచితంగా మొబైల్ వాహనాల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు సదుపాయాలు కల్పించాలి.
- 6.గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి.
- 7.జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

మంజూరుచేయాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. డ్వాక్రా మహిళల దగ్గర వారి అనుమతి లేకుండా తీసుకున్న 35 వేల రూపాయలను ఇళ్లు నిర్మాణం చేసుకోలేని వారికి తిరిగి జమ చేయాలి. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ఇవ్వాలి. వారి పేరన తెచ్చిన రుణాలపై వడ్డీని మాఫీ చేసి ప్రభుత్వమే చెల్లించాలి. 30 సంవత్సరాలు పూర్తయిన ప్రభుత్వ గృహాల పునర్నిర్మాణానికి ఆర్థిక సదుపాయం అందించాలి.

- 8.చెత్త పన్ను రద్దు చేయాలి. మురుగు నివారణ సదుపాయాలు మెరుగు పరచాలి. మంచినీరు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలి. దోమల నివారణ చర్యలు చేపట్టాలి.
- 9.భార్యా భర్తలిద్దరికీ వృద్ధాప్య పెన్షన్ మంజూరుచేయాలి. ఒంటరి మహిళల పెన్షన్‌లను 6 వేలకు పెంచాలి.
- 10.మహిళా సంక్షేమానికి, ఉపాధి కల్పనకు బడ్జెట్లో 3వ వంతు కేటాయించాలి. పై సమస్యలపై ఆయా రాజకీయ పక్షాలు తమ మానిఫెస్టోలో స్పష్టంగా పేర్కొనాలి. ❑

**పి.దుర్గాభవాని(ఎన్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి), డి.రమాదేవి (ఐద్వా రాష్ట్ర కార్యదర్శి), సుంకర పద్మశ్రీ (మహిళా కాంగ్రెస్ నాయకురాలు), పి.పద్మ (పీవోడబ్ల్యు రాష్ట్ర నాయకులు), ఆర్.నాగమణి (ఐఫ్వా రాష్ట్ర కార్యదర్శి), బి.కీర్తి (వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు), జి.రశ్మి (వాసవ్య మహిళా మండలి కార్యదర్శి), ధనలక్ష్మి (మహిళా సమాఖ్య లీడర్), సీహెచ్ హేమలత (ప్రగతి నారీ శక్తి నేషనల్ వర్కింగ్ అధ్యక్షురాలు), ఖైతాన్ సల్మా (జమత్ ఈ ఇస్లామి హింద్), పి.రమ (డీబీఆర్సీ).**

## ఆం. ప్ర కౌలు రైతుల సంఘం మేనిఫెస్టో

**(19వ పేజీ తరువాయి)**

చేసుకుంటూ పేద రైతులు జీవిస్తున్నారు. వీరికి గుర్తింపు కార్డులు, రైతు భరోసా, పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, పంటల భీమా పరిహారాలు నామమాత్రంగానే వస్తున్నాయి. కొన్ని దేవాలయాలు సంస్థలు కౌలు రైతులను గుర్తించటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రిగా బీజేపీకి చెందిన మాణిక్యాలరావు ధూప, దీప, నైవేద్యం పేరుతో దేవాలయాలకు ఆదాయం పెంచుకోవడానికి 425 జీవో తీసుకొచ్చి దేవదాయ, ధర్మదాయ భూములను బహిరంగ వేలం వేయించారు. అప్పటికే ల్యాండ్ లెస్ పూర్ సర్టిఫికెట్లు పొంది తరతరాలుగా భూములను సాగు చేస్తున్న పేద కౌలురైతులను వెళ్ళగొట్టి అన్యాయం చేశారు. ల్యాండ్ లెస్ పూర్ సర్టిఫికెట్లు పొందిన వారికి దేవదాయ, ధర్మదాయ సాగు భూములను నామ మాత్రపు కౌలుకు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించి వాటిని రద్దు చేసిన ఘనత బీజేపీ, తెలుగుదేశం ప్రభుత్వాలదే. 425 జిఓ ప్రకారం నిర్వహించే బహిరంగ వేలంలో ధనికులు ఎక్కువ మొత్తంలో చెల్లించి భూములను చేజిక్కించుకుని తిరిగి పేదరైతులకు ఎక్కువ కౌలుకు సబ్ లీజుకు ఇస్తుండడంతో కౌలు రైతుల జీవనాధారం పోతోంది.

### డిమాండ్స్

- తరతరాలుగా దేవదాయ, ధర్మదాయ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న భూమి లేని నిరుపేదలకు, రెండున్నర ఎకరాలు మాగాణి, 5 ఎకరాలలోపు మెట్ట భూమి కలిగిన పేద రైతులకు ల్యాండ్ లెస్ పూర్ సర్టిఫికెట్స్‌ను తిరిగి ఇచ్చి, బహిరంగ వేలంతో సంబంధం లేకుండా వారికి లీజుకి ఇవ్వాలి.
- ప్రతి దేవస్థానం పరిధిలోని సాగు భూములను కనీసం 50% భూములను దళిత, గిరిజన వెనకబడిన తరగతులు, మైనార్టీ పేద రైతులకు కేటాయించాలి.
- దేవదాయ, ధర్మదాయ భూములను సాగు చేసే కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీచేయాలి.
- పంట రుణాలు, రైతు భరోసా, పంటల బీమా సౌకర్యం, పూర్తి సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, టార్పాలిన్ పట్టాలు తదితర సౌకర్యాలు కల్పించాలి.
- 425 జీవోలు రద్దు చేసి బహిరంగ వేలం వేయకుండా నామ మాత్రపు లీజుకు పేద రైతులకు కౌలుకు ఇవ్వాలి. ముందస్తు కౌలు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలి.
- కరువు, తుఫాన్లు, వరదలు తదితర ప్రకృతి విపత్తుల వల్ల పంటలు దెబ్బ తిన్నప్పుడు కౌలు రద్దుతోపాటు ఇన్ పుట్ సబ్సిడీ, బీమా పరిహారం చెల్లించాలి.
- కరువు సంభవించినప్పుడు పంటలు వేయకపోయినా, తుఫాన్లు వరదలు ముంపుకు గురై ఊడ్చకపోయిన కౌలు కట్టించుకుంటున్నారు. కాబట్టి పంటల వేయనపుడు, ఊడ్చని సందర్భాల్లోనూ, 2006 సంవత్సరంలో ఓగినీ తుఫాను సందర్భంలో తెచ్చిన జీవో నెంబర్ 2711 ప్రకారం కౌలును రద్దు చేయాలి.
- తరతరాలుగా దేవదాయ, ధర్మదాయ భూములను సాగు చేస్తున్న భూమి లేని కౌలు రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలి. ❑

# కులం మూలాలను గుర్తించడం ద్వారానే ఆ మహమ్మారిని తుదముట్టించగలం!!



- పేరూరి మురళీకుమార్

ఈ దేశాన్ని ఒక కోణం నుండి మాత్రమే చూసి ప్రేమించేవారు చెప్పేదేమంటే ఈ దేశం ఓ గొప్ప మహత్తర దేశమని, దీని సాంస్కృతిక వారసత్వ సంపద మరే దేశానికి లేదని ! కానీ ఈ దేశంలో నివశించే కోట్లాది మంది అదే సాంస్కృతిక వారసత్వంలో ఒకే రకమైన కేన్సర్‌తో బాధపడుతున్నారు. దాని పేరే కులం. ఈ కులం వ్యక్తులకు పుట్టుకతో సంక్రమిస్తది. ప్రతి వ్యక్తీ తన జీవన గమనంలో అణువణువునా తప్పించుకోలేని నిర్బంధ ధమూ, సంకెళ్ళును. కుల వృత్తుల నుండి బయటపడి చదువుకుందామన్నా.. ప్రాథమిక విద్యాస్థాయి నుండి ఐఐటి, జెఎన్‌యు, డియు, హెచ్‌సియు, ఎఐఐఎంఎస్ వంటి ఉన్నత విద్యాలయాల్లో, ఉద్యోగాల్లో, ఇతర సామాజిక వ్యవహారాల్లో వ్యక్తులను వెంటాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బ తీస్తుంటుంది. ఇక్కడ పురుషులు కులం వల్ల, వర్గం వల్ల బాధించబడుతుంటే స్త్రీలు ఈ రెంటితోపాటు లింగ వివక్షతో కూడా బాధింపబడు తుంటారు. ఈ కులం ఒక్క ఇండియాకే పరిమితం కాలేదు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్‌లతో సహా దక్షిణాసియా అంతటా విస్తరించింది. ఇందుకు కారణం.. సామాజిక, మతైక అసమానతలు నిండిన సమాజ నిర్మాణం ఉండటమే.

**ఈ కులం అనే కేన్సర్‌కు తగిన పరిష్కార మార్గం కనిపెట్టాలని వేల సంవత్సరాల నుండి అనేక మంది ప్రయత్నిస్తూనే ఉన్నారు. దీని గమనాన్ని, పరిణామాన్ని అధ్యయనం చేసిన వారిలో ఈ దేశంలో పుట్టిన వారే కాకుండా కారల్ మార్క్స్ వంటి విదేశీ తత్వవేత్తలు ఉన్నారు. తనకన్నా ముందున్న వారి ప్రయత్నాలను ఆసాంతం అధ్యయనం చేసిన బాబాసాహెబ్ అంబేడ్కర్ ఒక మాట అంటారు - 'ఈ దేశంలో అనేక మంది రుషులు, మహా పురుషులు, సంస్కర్తలు ఉద్భవించారు, అస్తమించారు. కానీ కులాన్ని, కుల వివక్షని, అంటరానితనాన్ని తొలగించలేక పోయారు' అని.**

ఈ దేశం విదేశీయుల దండయాత్రల్లో చిక్కుకుపోయి తన అస్థిత్వాన్ని కోల్పోయే క్రమంలో కూడా కులం రక్షించబడ్డది. అంటే విదేశీ పాలకులు జాగ్రత్త పడిందేమంటే ఈ కులాన్ని స్పృశించకుండా తమ పని తాము చేసుకుంటూ పోయారు. మరొక మాటలో చెప్పాలంటే వారు కూడా ఈ కులాన్ని కాపాడుతూ వచ్చారు. దేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి కొరకు చేపట్టిన స్వాతంత్ర పోరాటంలో కూడా ఈ కులం పెద్ద అడ్డంకిగా మారింది. ఆ క్రమంలోనే స్వాతంత్ర పోరాటాన్ని తన భుజానికెత్తుకున్నానని చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీలో దాదాబాయి నౌరోజి, సురేంద్రనాథ్ బెనర్జీ, బద్రుద్దీత్యాబ్జీ వంటి ఒక ఉదార వర్గం సాంఘిక సంస్కరణలు చేపట్టకుండా ఈ దేశ భవిష్యత్‌ని రూపొందించలేమని 1895లోనే పిలుపునిచ్చారు. అయితే బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలోని మరో వర్గం వీరి ప్రతిపాదనని తీవ్రంగా వ్యతిరేకించింది.

స్వాతంత్రానంతర ఇండియాలో ఈ కుల కేన్సర్‌ను తుద ముట్టించడానికి రాజ్యాంగం కొన్ని సూచనలు చేసి క్రమ క్రమంగా ఈ కులాన్ని దుంపనాశనం చేయాలని పాలకులకు దిశా నిర్దేశం చేసింది. అయితే రాజ్యాంగానికి, పాలకులకు ఏర్పడిన వైరుధ్యం వల్ల భూస్వామ్య, పెట్టుబడిదారీ రక్షకులుగా పాలకవర్గాలు మారిపోవడంతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక లక్ష్యాలతో పనిచేసే కమ్యూనిస్టు ఉద్యమాలు, విప్లవోద్యమాలు, హేతువాద, నాస్తిక, శాస్త్రీయ ఆలోచనా ఉద్యమాలు, విద్యార్థి ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, బహుజన ఉద్యమాలు, స్త్రీవాద, వివిధ అస్థిత్వ ఉద్యమాలు, సాంఘిక సంస్కరణ లక్ష్యంగా సాగిన భక్తి ఉద్యమాలు ఈ కులంపై రణం చేశాయి. చేస్తూనే ఉన్నాయి. ఇంతగా పోరాడుతున్నప్పటికీ కులం నేటికీ వికృత విలయతాండవం చేస్తూనే ఉన్నది.

కులం వల్ల ఎటువంటి దుష్ఫలితాలు సంభవిస్తున్నాయో చూస్తే.. అది దేశంలోని మానవుల మధ్య వైషమ్యాలు, వివక్ష, అంటరానితనం, సామాజిక వెనకబాటుతనం, పేదరికం, మానవ హక్కుల హననం వంటి అనేక అవలక్షణాలను సృష్టిస్తున్నది. కుల మహమ్మారిపై పోరాడదలచుకున్న వారు ముఖ్యంగా రెండు శిబిరాలుగా ఉన్నారు. ఒకటి, కులాన్ని నిర్మూలించకుండా కుల వివక్ష పోదని, అంటరానితనం పోదని. ఇక రెండోది, కులం ఇప్పటికిప్పుడు నిర్మూలన కాదు. కాబట్టి కులాల మధ్య సామరస్య వాతావరణాన్ని కల్పించి ఒక కులం ఇంకో కులం పట్ల వివక్ష, అంటరానితనం పాటించకుండా

చూడటం. మొదటిది రాడికల్ థింకింగ్ అయితే రెండోది సంస్కరణవాదం. ఈ నేపథ్యంలో అసలు కులాన్ని తుదముట్టిం చాలన్నా లేదా కులాల మధ్య వివక్షను రూపుమాపాలన్నా ముందుగా దీని పునాది ఎక్కడ ఉన్నదో గమనించాలి. కులం ప్రధానంగా సాంస్కృతిక సమస్య. అది ఈ దేశ ప్రజల భావనలో, వారి మనసుల్లో, వారి ఆలోచనల్లో చొప్పించబడ్డది. వారిలో కుల భావజాలం ఇంతగా నాటుకోవడానికి మూలం బ్రాహ్మణీయ సాహిత్యమైన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, వివిధ స్మృతులు, ఇతిహాసాలు వంటి ఇతర మతైక సాహిత్యం కారణం. అందుకే డా.అంబేద్కర్ **'ఈ దేశపు సమాజంలో అంటరాని తనానికి, వివక్షకి మూలం కులం, ఈ కులానికి మూలం హిందూ ధర్మం. అందువల్ల ఈ దేశంలోని ప్రతి యువతినీ, యువకుణ్ణీ హిందూ ధర్మశాస్త్రాల సంకెళ్ళ నుండి విముక్తి చేయాలి'** అని అన్నారు. కుల వివక్షనిగానీ, అంటరానితనాన్ని గానీ నిర్మూలించడానికి ఏదైనా ప్రయత్నం మొదలు పెట్టదలచితే ఇక్కడి నుండే ప్రారంభించాలి.

కుల సమస్యను చర్చించడానికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా వేదికలు సిద్ధమయ్యాయి. 2001లో దక్షిణాఫ్రికాలోని దర్బన్ వేదికగా జరిగిన రేసిజం సదస్సులో కుల సమస్యను చర్చించారు. ఆ సదస్సులో చేసిన తీర్మానాల కొనసాగింపుగా గ్రామస్థాయిలో ఈ కుల వివక్షను ఎదుర్కోవడానికి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫార్మ్స్ ఆఫ్ రూరల్ డిస్క్రిమినేషన్ (ICERD) మరియు 2009 ఏప్రిల్ 24న జెనీవాలో సమావేశమై దర్బన్ డిక్లరేషన్ అండ్ ప్రోగ్రాం ఆఫ్ యాక్షన్ (DDPA)ను రూపొందించారు. ఈ మహమ్మారిని కట్టడి చేయడానికి లేదా నిర్మూలించడానికి రాజ్యం లేదా ప్రభుత్వంపైనే ప్రధానంగా బాధ్యత ఉన్నది. కుల బాధిత పురుషులకు, మహిళలకు రక్షణగా రాజ్యాంగం లేదా అంతర్జాతీయ వేదికలు నిర్దేశించిన కొన్ని సూచనలు, తప్పనిసరిగా చేయాల్సిన కార్యక్రమాలను మనం ఈ విధంగా అనుకోవచ్చు.

- దేశంలో అంటరానితనాన్ని , ఇతర వివక్షలను నిర్మూలించే కార్యక్రమాలకు రూపకల్పన చేయడం.
- కులాన్ని తుదముట్టించాలన్న లక్ష్యాన్ని నిరంతరం ప్రజల మనస్సులో నాటుకునేలా చైతన్య కార్యక్రమాలను రూపొం దించడం, ప్రచారం చేయడం. ఇందుకు తగిన నిధులను కేటాయించడం.
- ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడం, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకుపోవడం.
- ఇప్పటికే ఉన్న కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించే చట్టాలను సరైన తీరుగా, రీతిగా అమలు జరిగేట్లు చూడటం.
- కుల వివక్షతో దాడులకు తెగబడుతున్న వారిని కఠినంగా , సత్వరమే శిక్షించే ఏర్పాట్లను చేయడం.
- కులం బారినపడి నలిగిపోతున్న బాల కార్మికులు, వెట్టి చాకిరీ, మానవ మలాన్ని ఎత్తిపోయడం, బలవంతంగా వ్యభిచారం చేయించే పరిస్థితులను నిర్మూలించడం.
- భూ సంస్కరణలు పగడ్బందీగా అమలు జరపడం, పీడిత కులాలకు ఆ భూమిపై యాజమాన్యపు హక్కుని సంక్ర మించేట్లు చేయడం.
- పరిశ్రమల స్థాపన విషయంలో పీడిత కులాలను ప్రోత్సహిం చడం వారికి కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం.
- సాంఘిక, ఆర్థిక, విద్యాపరంగా కుల వివక్ష ఎదుర్కొంటున్న సామాజిక వర్గాలకు బలం చేకూరేటట్లు తగిన నిధులు కేటాయించడం.
- కులాంతర వివాహాలు జరపడం ప్రభుత్వ విధానంగా ఉండాలి. అట్లా వివాహాలు చేసుకున్న యువతీయువకులకు అన్నిరకాల అండదండలు అందించాలి. ఇపుడున్న తూతూ మంత్రపు మద్దతు కాకుండా పరువు హత్యలన్నీ కుల దురహంకారపు హత్యలుగా పరిగణించి దోషులకు కఠిన శిక్షలు పడేట్లు చేయాలి.
- విద్యారంగంలో మార్పులు చేపట్టి పీడిత కులాలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం. విద్యాసంస్థల్లో కుల, లింగ వేధింపులను అరికట్టడం. విద్యా సంస్థల్లో విద్యార్థుల పట్ల కుల వివక్షను ప్రదర్శించే అధ్యాపకులకు కఠిన శిక్షలు పడేట్లు చట్టాలను రూపొందించడం.
- ఉద్యోగాల కల్పనలో కుల బాధితులకు ప్రాధాన్యత నివ్వడం.
- కుల వివక్షను ఎదుర్కొనే సామాజిక వర్గాలను పోలీస్, ప్రభుత్వ, న్యాయాధికారులుగా నియమించి రాజ్యం నిర్వహణలో వారికి భాగస్వామ్యం కల్పించడం.
- కుల వివక్షను ఎదుర్కొనే సామాజికవర్గాలను రాజకీయంగా ప్రాధాన్యతనిచ్చి అధికారంలో వారిని భాగస్వాముల్ని చేయ డం. విధాన నిర్ణయాల రూపకల్పనలో వారికి సమభాగం ఇవ్వడం.
- అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్య సమితి వంటి ఇతర అనేక సంస్థలకు రాజకీయ, ఆర్థిక దన్నుగా నిలబడటం.
- మానవహక్కులకు ఏ రూపంలో విఘాతం ఏర్పడినా వెంటనే స్పందించే యంత్రాంగాన్ని ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచడం.

**(మిగతా 34వ పేజీలో)**

# ప్రజల ఎజెండా రూపకల్పనకు కొత్త చూపు - కొత్త దారి

**మన దేశంలో వున్న పెట్టుబడిదారీ వ్యవస్థపై అనేక విశ్లేషణలు వచ్చాయి. నిరంతరం వస్తూనే వున్నాయి. అందులో మనకు కొరత అంతగా కనిపించదు. అయితే ఈ వ్యవస్థ మీద పోరాడడం ఎలా ? దానిని మార్చడం ఎలా అన్నది అసలు సమస్య. దీనికి అవసరమైన కొన్ని కీలక అంశాలకే మనం పరిమితం అవుదాం.**

దేశంలో అన్ని రంగాలను దేశ విదేశీ కార్పొరేట్ సంస్థలు ఆక్రమించుకున్నాయి. గత సంవత్సరం పెరిగిన దేశ సంపదలో 73 శాతాన్ని కేవలం ఒక శాతం మంది దక్కించుకున్నారు. సంపద కేంద్రీకరణ ఎంత జోరుగా సాగుతున్నదో ఇది అద్దంలో చూపిస్తోంది. సంపద అంతరాలలో, ఆదాయ వ్యత్యాసాలలో అత్యంత హెచ్చుగా వున్న దేశాలలో మనది కూడా ముందున్నది. ఈ కార్పొరేట్ శక్తులు ఉపాధిరహిత అభివృద్ధి నమూనాను ఎంచుకున్నాయి. వచ్చే ఉద్యోగాలకంటే పోయే ఉద్యోగాలు హెచ్చు కావడం చూస్తున్నాం. కార్పొరేట్ శక్తులు వ్యవసాయ రంగంలో యంత్రాలు, పురుగు మందులు, ఎరువులు, విత్తనాల తయారీని తమ గుప్పెట్లో పెట్టుకున్నాయి. వాణిజ్య పంటల వ్యాపారం వారి పరమైంది. ఇప్పుడు ఆహార పంటల వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నారు. వ్యవసాయం లాభసాటి కాకుండా ఈ శక్తులే దోచుకుంటున్నాయి. విద్య కార్పొరేట్ శక్తుల వ్యాపార రంగమైంది. వైద్య సేవలు అదే దారి పట్టాయి. ఎన్నికలను కుబేరుల ఆటగా మార్చారు. కార్పొరేట్ శక్తులు వాటిని తమ ప్రత్యక్ష, పరోక్ష పాత్రల చుట్టూ తిప్పుకున్నారు.

## ఇప్పుడేం జరగాలి ?

పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం ముందుగా కార్పొరేట్ వ్యవస్థను బద్దలు కొట్టడంతో ప్రారంభం కావాలి. ఈ వ్యవస్థ బద్దలైతేనే సంపద పునఃపంపిణీతో సామాజిక న్యాయానికి ద్వారాలు తెరుచుకుంటాయి. ఉపాధినిచ్చే కొత్త పారిశ్రామిక విధానానికి వీలు పడుతుంది. కార్పొరేట్ శక్తుల నుండి వ్యవసాయ మార్కెట్లను వేరు చేసి రైతులే ధరలు నిర్ణయించుకో గల కొత్త వ్యవస్థకు దారి ఏర్పడుతుంది. కార్పొరేట్ విద్య, వైద్య సంస్థల జాతీయంతో అందరికీ సమానమైన, మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చే పరిస్థితి వస్తుంది. అందుచేత కార్పొరేట్ వ్యవస్థను బద్దలు కొట్టడం ఈ పోరాటానికి ముఖ్యమైన లక్ష్యం అవుతుంది. ఈ వ్యవస్థ వల్ల పేదరికానికి, నిరుద్యోగానికి లాభసాటి గాని వ్యవసాయానికి గురవుతున్న వారు వివిధ వర్గాలకు, వివిధ సమూహాలకు చెందినవారు. ఏ సమూహం ఆకాంక్షలు దానికి వుంటాయి. అందువల్ల భిన్నమైన ఆకాంక్షలను ఒక లక్ష్యం మీద దాడికి సన్నద్ధం చెయ్యడం దాని ఫలితంగా వచ్చే ప్రయోజనాలు ఆయా సమూహాల జీవితాలను ఎలా మారుస్తాయో, వారికి గల భిన్నమైన ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తాయో స్పష్టం చేసే కార్యక్రమాలను రూపొందించడం జరగాలి. ఇది కొంత సంక్లిష్టమైనదే అయినా ఒకే లక్ష్యంలో వివిధ సమూహాలను ఒకే గొడుగు కిందకు తెచ్చినప్పుడే విజయాలు సాధ్యమవుతాయి.

ఒక ఆకాంక్ష ప్రజలను ఆకట్టుకుని భౌతిక శక్తిగా విజయాలు సాధించే సాధనంగా మారే ప్రక్రియను ఇంతకుముందే చూశాం. ఇందులో జత కూడాల్సిన మూడు అంశాలున్నాయి.

- **మొదటిది** ఆకాంక్ష ప్రజల జీవిత స్థితిగతుల నుండి రావాలి.
- **రెండవది** అది సాధ్యమేనన్న నమ్మకం కలిగించే ఒక చర్య దానికి జత కలవాలి.
- **మూడవది** అది జరిగితే వారి జీవితాలు ఎలా మారతాయో స్పష్టం చేసే కార్యక్రమం వుండాలి. ఈ ప్రక్రియను పెట్టుబడి దారీ వ్యవస్థపై జరిగే పోరాటానికి ఎలా అన్వయించుకోవచ్చునో కొన్ని ఉదాహరణలు చూద్దాం.

## పేదల ఉమ్మడి ఆకాంక్షలు - నినాదాలు

సామాజిక న్యాయం అవసరం అయిన పేదలు, సామాన్యుల సమూహాలను తీసుకుందాం. ఇందులో కొన్ని చిన్న చిన్న అంతరాలు ఉంటాయి. కుల, మత, తేడాలు ఉంటాయి.

- **మొదటిది** : ఈ బృందాన్ని ఆవరించిన ఉమ్మడి అంశం "పేదరికం, ఆదాయ భద్రత" దాని నుండి బయటపడాలన్న ఆకాంక్ష వుండడం సహజం. పేదరికాన్ని జయిద్దాం అన్నది వారి ఆకాంక్షలను ప్రతిబింబించే నినాదం కావడానికి వీలుంది. ఇది ఉమ్మడి ఆకాంక్ష. ఇతర భేదాలు ఎన్ని వున్నా ఈ సమూహాలన్నింటిని ఏకం చెయ్యగల ఆకాంక్ష అవుతుంది.
- **రెండవది** : ఈ ఆకాంక్ష నెరవేరడం సాధ్యమేనన్న నమ్మకం

కలిగించే మరోచర్య దానికి జతచేయాలి. ఈ నినాదం కార్పొరేట్ శక్తుల దగ్గర కేంద్రీకరణ జరిగిన, జరుగుతున్న సంపద మీద దాడి చేసే రూపంలో వుండాలి. ప్రతి ఏటా ఒక శాతం మంది జాతీయ ఆదాయంలో 73 శాతాన్ని కొల్ల గొడుతున్న దాని మీద కేంద్రీకరించాలి. బోనస్ చట్టంలా ఈ కార్పొరేట్ శక్తుల ఆదాయంలో ఒక వాటాను పోగైన సంపద మీద పన్నులు తమ సంపదను అంతా వారసులకే కట్టబెట్ట కుండా వారసత్వ పరిమితిని విధించే విధంగా సంపద పునః పంపిణీ చట్టాన్ని నినాదంగా చెయ్యాలి. ఈ నినాదం పోగు పడ్డ సంపదను బద్దలు కొట్టే సాధనం అవుతుంది. దేశ ప్రజ లకు సంపద పునఃపంపిణీ ద్వారా వాటాను పొందే హక్కును కలిగిస్తుంది. లక్షల కోట్లు పునఃపంపిణీ చెయ్యడానికి మార్గం సుగమం చేస్తుంది. ఆదాయ భద్రత కల్పించాలన్న నినాదా నికి నమ్మకం కలిగించే చర్య అవుతుంది.

- **మూడవది:** సంపద పునఃపంపిణీ ఎలా జరుగుతుందో, ప్రజ ల జీవితాలు ఎలా మారతాయో స్పష్టం చేసే కార్య క్రమంపై రెండింటికి జతపరచాలి. ప్రతి ఒకరికీ మౌలిక ఆదాయం హక్కుగా, గృహ వసతి, అంత వరకూ ఇంటి అద్దె హక్కుగా, అర్హతలను బట్టి ఏ చదువైనా పిల్లలకు ఉచితం హక్కుగా, అందరికీ అన్ని వైద్య సేవలు ఉచిత హక్కులు అమలు చెయ్యటానికి ప్రత్యేక కోర్టు ఈ తరహా కార్యక్రమం పేద ప్రజలను లబ్ధిదారుల నుండి హక్కుదారులుగా మారుస్తుం ది. ఈ హక్కులకు భంగం జరిగితే అమలు చేయించు కోడా నికి వీలుగా ప్రత్యేక కోర్టుల ఏర్పాటును ప్రకటించాలి. ఈ ఉదాహరణ ఒక ఆకాంక్షను భౌతికశక్తిగా మార్చడానికి అను సరించాల్సిన ప్రక్రియకు ఒక రేఖా మాత్రమైన చిత్రం మాత్రమే. ఇలాంటి మరికొన్ని ఉదాహరణలను రూపొం దించుకుందాం.

## రైతుల ఆకాంక్షలు-పంటలకు ధర నిర్ణయించుకునే హక్కు

రైతులలో ఎన్ని అంతరాలున్నా వారికి ఒక ఉమ్మడి సమస్య వుంది. వారి పంటలకు లాభసాటి ధరలు రావడం లేదు. అయి నకాడికి అమ్ముకోవడం, అప్పుల భారం తప్పడం లేదు. పంటల కు లాభసాటి ధరలు రావాలన్నది రైతుల ఉమ్మడి ఆకాంక్ష. వ్యవస్థ లోపల లాభసాటి ధర కోసం ప్రభుత్వ మద్దతు ధర అన్నది నినాదమైంది. ఏటా ప్రభుత్వాలు మద్దతు ధరలను ప్రకటిస్తున్నాయి. దానిని పెంచాలన్న రైతులు ఆవేదన అరణ్య రోదన అవుతున్నది. ఆ ధరలకు మొత్తం పంటను కొనుగోలు చేసే స్థితి లేదు. దీంతో వ్యవసాయం పంటల మార్కెట్లు దళారుల చేతుల్లో, అంతిమంగా కార్పొరేట్ల కబంధహస్తాలలో చిక్కుకుంటు న్నది. పంట కాలంలో ధరలను పడగొట్టడం, మూడు, నాలుగు నెలల కాలంలో ధరలు పెంచి విపరీతమైన లాభాలు గుంజు కుంటున్నారు. రైతు సంఘాలు, పార్టీలు, సంస్థలు ప్రతి సంవ త్సరం ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తున్నాయి. అవే నినాదాలు, అదే తరహా పోరాటాలు అరకొర పెంపుదలలూ, చిల్లర రుణమాఫీలు తప్ప లాభసాటి ధర మాత్రం దక్కడం లేదు. ప్రస్తుత వ్యవస్థ పరిధిలో తిరిగినంత కాలం తాత్కాలిక ఉపశమ నాలతో సరిపెట్టుకోవడం తప్ప లాభసాటి ధర వచ్చే అవకాశాలు వుండవు. కొత్త వ్యవస్థ తప్ప మార్గం లేదు. పండించేది రైతులు – ధర నిర్ణయించేది దళారులు, కార్పొరేట్లు అన్న వ్యవస్థను బద్దలు కొట్టాలి. వ్యవసాయ పంటల మార్కెట్లను దళారుల కార్పొ రేట్ శక్తుల చేతుల నుండి వేరు చెయ్యాలి. పండించే వారికే ధర నిర్ణయించుకునే హక్కు సాధించాలి. విడివిడిగా రైతులు ఈ పని చెయ్యలేరు. కాని పంటల వారీగా ఏర్పడే సహకార సంఘాల ద్వారా దీనిని సాధించుకోవచ్చు. ఉదాహరణకు పాల సహకార సంఘాలను చూడండి. పాలు అమ్మే రైతులంతా అందులో సభ్యు లుగా వుంటారు. పాల కొనుగోలు ధరను, తిరిగి అమ్మకం ధరను ఈ రైతు సంఘాలే నిర్ణయించుకుంటాయి. ఎవరు ఎన్ని పాలు పోసినా ప్రకటించిన ధరకు కొనుగోలు చేస్తారు. తిరిగి పాలను, ఉప ఉత్పత్తులనూ వినియోగదారులకు అమ్మకం చేస్తారు. లాభాలు వస్తే పోసిన పాలను బట్టి రైతులకు డివిడెండ్లు ఇస్తారు. ఈ పద్ధతి వ్యవసాయ పంటలకు అన్వయించుకోవచ్చు.

- **మొదటిది** : పంటల వారీగా రైతు సహకార సంఘాల ఏర్పాటు వారి చేతుల్లోనే వ్యవసాయ మార్కెట్ యార్డులు వుండాలి.
- **రెండవది** : కొనుగోలు అమ్మకం ధరల నిర్ణయం పూర్తిగా ఈ రైతు సహకార సంఘాల చేతుల్లోనే వుండాలి. అంటే ప్రభుత్వం నిర్ణయించే మద్దతు ధర వుండదు. దళారులు కార్పొరేట్లు చేతుల్లోనూ ధర నిర్ణయం వుండదు.
- **మూడవది** : ప్రభుత్వ సీడ్ మనీ, కార్పొరేటు సంస్థల నుండి రాబట్టే సంపద పునఃపంపిణీలో కొంత వాటా సొమ్ము దీనికి కొనుగోలు నిధిగా వుంటుంది.
- **నాలుగవది** : కొనుగోలు రేటు హెచ్చుగా నిర్ణయించినా అమ్మకం రేటు, దానిపైన కొద్దిగా మాత్రమే వుండడంతో వినియోగదారుల మీద భారం పడదు. రైతులకు అదనంగా వచ్చే లాభసాటి ధర ప్రధానంగా దళారులు, కార్పొరేట్లు దోచుకుంటున్న దాని నుండే లభిస్తుంది.
- **ఐదవది** : మనం ప్రారంభంలో చెప్పుకునే సంపద పునః పంపిణీలో వ్యవసాయ కూలీలు, రైతులు అందరికీ కనీస ఆదాయభద్రత అదనంగా లభిస్తుంది. ఇది జరిగితే రైతు తన పంట ధరకు హక్కుదారుడవుతాడు. సంపద పునః పంపిణీ లో హక్కుదారుడవుతాడు. అప్పులపాలు కావడానికి, ఆత్మ

హత్యలకు దూరం అవుతాడు. ఇలా రైతుల జీవనస్థితి నుండి పంటలకు లాభసాటి ధర నిర్ణయించుకునే ఆకాంక్ష కొత్త నినాదం అవుతుంది. దానిని సాధ్యం చెయ్యడానికి దళారీల వ్యవస్థని, కార్పొరేట్ల దోపిడీ నుండి వ్యవసాయం పంటల మార్కెట్లను వేరు చెయ్యడం సాధ్యం చేస్తుంది. పర్యవసానంగా లాభసాటి ధర, సంపద పునఃపంపిణీ ద్వారా ఆదాయభద్రత సాధ్యం అవుతుంది. ఈ మూడు ఒకదానికొకటి జతపర్చడం ద్వారా కొత్త వ్యవస్థను సాధించే భౌతిక శక్తిగా రైతుల ఉద్యమం రూపొందుతుంది.

## చోదకశక్తిగా కార్మికవర్గం - కొత్త నినాదాలు

ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వరూపం ధరిస్తున్న తొలినాళ్లలోనే కార్ల్ మార్క్స్ ఈ దోపిడీ వ్యవస్థను మార్చడానికి 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అన్న నినాదాన్ని ఇచ్చారు. తర్వాత మే డే పని గంటల ఉద్యమంగా ప్రారంభమైంది. అది ఇప్పుడు కార్మికుల హక్కుల కోసం సంఘటితమయ్యే అంతర్జాతీయ ఉద్యమమైంది. ప్రస్తుతం ప్రపంచం చాలా మారిపోయింది. ఒక శాతం మంది దగ్గర మొత్తం ప్రపంచ సంపదలో 80 శాతం పోగుపడ్డాయన్న లెక్కలు బైటకొచ్చాయి. పోగుపడ్డ సంపద అంటే అది పోగుపడ్డ శ్రమ మాత్రమే. సంపద అనేది పెట్టుబడి రూపంలో వున్నా, వస్తువుల రూపంలో వున్నా అంతా శ్రమ ఫలితమే. నిత్యం సాగిపోతున్న దోపిడీకి అడ్డుకట్ట వెయ్యాలి. ఒక శాతం దగ్గర మూలుగుతున్న సంపదను బద్దలు కొట్టాలి. తొలిమెట్టుగా దానిలో ఒక వాటా సంపద అందరికీ పునఃపంపిణీ జరగాలి. కార్మికోద్యమం నినాదాలు మారాలి. కొత్త నినాదాలు పుట్టుకురావాలి.

- పోగుపడ్డ సంపదలో వాటా అందరికీ మౌలిక ఆదాయంగా పంపిణీ.
- కనీస వేతనం కాదు. జీవనస్థాయి వేతనం..
- వారానికి 5 రోజులు 40 గంటల పని

సంపద పునఃపంపిణీ ఉద్యమానికి సంఘటిత కార్మికవర్గం చొరవ తీసుకోవాలి. అప్పుడే అసంఘటిత రంగ కార్మికులకు ఇతర పేద వర్గాలకు ఈ నినాదం త్వరగా వ్యాపిస్తుంది. ఇది వ్యవస్థను తక్షణమే మార్చదు. పోగు పడ్డ సంపదలో హక్కుగా వాటా పొందడం సంపద మీద ఆధిపత్యం వైపు వారికి దారి చూపిస్తుంది. అందరికీ కనీసం ఆదాయం హక్కుగా రావడం పెనుమార్పులకు దారులు వేస్తుంది. పని దొరకకపోతే బతుకు లేనప్పుడు షరతులు పెట్టేది పెట్టుబడిదారుడవుతాడు. బతుకు భరోసా వున్నప్పుడు ఇష్టమైన పనిని ఎంచుకోడానికి, శ్రమశక్తిని అమ్ముకునే బేరసారాలు సాగించే శక్తి వస్తుంది. 5 రోజుల పని, పనిగంటల తగ్గింపు, కార్మికుల ఆరోగ్యస్థితిని మెరుగు పరుస్తుంది. కుటుంబం, సమాజంలో భాగస్వామ్యం పెరుగుతుంది. వారి అభిరుచులను సంతృప్తిపరిచే వివిధ అంశాలను అనుభవంలోకి తెచ్చుకోగలుగుతారు. అంతిమంగా వారి జీవన నాణ్యత, ప్రమాణాలు పెరుగుతాయి.

## ప్రపంచ వ్యాపిత ప్రచారం, ఆందోళనలు

కార్మిక సంఘాలు దేశస్థాయిలో, ప్రపంచస్థాయిలో పనిచేస్తున్నాయి. సంపద పునఃపంపిణీ మీద అంతర్జాతీయ స్థాయిలో ప్రచారాన్ని పెంచడంతోపాటు ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా ఒకేసారి జరిగే ప్రచార కార్యక్రమాలు, సామూహిక ప్రదర్శనలు సమ్మెతో సహా వివిధ కార్యాచరణలు సాగించాలి.

## సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం ఇవ్వాలి

వివక్ష తరగతుల ఉద్యమాలకు గల ప్రత్యేకతను, ప్రాధ్యానతను గుర్తించాలి. మన సమాజంలో పుట్టుకతో వివక్ష వుంది. కుల వివక్ష, లింగ వివక్ష, మత వివక్ష, పేదరిక వివక్ష పుట్టుకతోనే సంక్రమిస్తున్నాయి. కుల, మత, లింగపరమైన సంస్థలు పుట్టుకొస్తున్నాయి. వివక్ష తొలగాలంటూ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వివక్ష తరగతులు ఉమ్మడి ప్రయోజనాలకంటే ఎవరి ప్రయోజనాలకు వారే ఒంటరి పోరాటాలు చేస్తున్నారు. వ్యవస్థ లోపల పాలకపక్షాలు ఈ సామాజిక చైతన్యాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు ఓటు బాంకులుగా మార్చుకుంటున్నాయి. సామాజిక న్యాయం అంటే కులాల వారీగా కార్పొరేషన్లు, పథకాలు, రాయితీలు, సబ్సీడీలు, ఉపప్రణాళికలు, ఆదరణలు, చేయూతలు అన్న భావం కల్పించబడింది. వివక్ష తరగతుల నాయకులకు చిల్లర మల్లర పదవుల పంపిణీలు, ప్రలోభాలతో ఆకట్టుకుంటున్నాయి. ఇన్ని చేస్తున్నా ఇప్పటికీ పేదరికం అక్కడే గూడుకట్టుకుని వుంది. ప్రధానంగా ఈ తరగతులకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు, ఇతర పేదలకు రాయితీల బతుకుతో వారిని శాశ్వతంగా లబ్ధిదారులు గానే వుంచుతున్నది.

ఈ వ్యవస్థ లోపల వివక్ష తరగతులకు విముక్తి దొరకదు. వ్యవస్థను బద్దలుకొట్టే దారిలోనే పరిష్కారాలు దక్కుతాయి. పుట్టుకతో వివక్ష తొలగించడానికి ఇలాంటి ఉమ్మడి ఆకాంక్షను కలిగించాలి. సంపద పునఃపంపిణీతోనే అందరికీ మౌలిక ఆదాయభద్రత కలుగుతుంది. తలెత్తుకు తిరిగే స్వతంత్ర జీవనానికి అది తొలిమెట్టు అవుతుంది. మంచి ప్రమాణాల చదువు, ఏ స్థాయికైనా ఉచితంగా అందించడం ద్వారా ఎదిగే అవకాశం కల్పించడం రెండవమెట్టు. ఇవి వారి సామాజిక హెూదాను మార్చివేస్తాయి. వివక్ష తరగతుల ఉద్యమాన్ని ప్రత్యేక దృష్టితో పేదల ఉద్యమంలో భాగంగా సాగించాలి.

## కొన్ని వాదనలు - కొన్ని వివాదాలు

ఈ నినాదాలన్నీ ఊహాజనితాలని కొట్టిపారేసేవారుంటారు. ఆచరణ సాధ్యం కావని అపహాస్యం చేసేవారుంటారు. ఒకసారి

ఇంటర్నెట్ను తెరిచి చూడండి. ప్రపంచం అంతటా ఇలాంటి చర్చ జరగడం గమనిస్తారు. సంపద కేంద్రీకరణ అనర్థాలు, పునః పంపిణీ ఆవశ్యకత మీద అర్థవంతమైన చర్చ కనిపిస్తుంది. అలాగే భిన్నాభిప్రాయాలు కూడా కనిపిస్తాయి. నిన్నటిదాకా పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్థకులుగా వున్న ప్రముఖ ఆర్థిక వేత్తలు, విశ్లేషకులు ఈ అంతరాల అగాధంమీద విరుచుకుపడ డం కనిపిస్తుంది. కొన్ని దేశాలలో ఈ పంపిణీకి చేస్తున్న ప్రయో గాలు మరి కొన్ని దేశాలలో దీనికోసం సాగుతున్న ఉద్యమాలు కనిపిస్తాయి. ఇక్కడ కనిపించే భిన్న మార్గాలలో మనం ఏ మార్గాన్ని ఎంచుకోవాలి అన్నది మనం తేల్చుకోవాల్సిన సమస్య అవుతుంది.

### వ్యవస్థ లోపల క్యాష్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి

అంతరాలకు మూలమైన కార్పొరేట్ల దోపిడీ మీద దాడి చెయ్యి కుండా దానిని అలాగే వుంచి ప్రభుత్వాలకు ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ము నుండి కొంత భాగాన్ని "మౌలిక ఆదాయం" పేరుతో నగదు బదిలీ చెయ్యడం ప్రధాన ధోరణిగా కనిపి స్తున్నది. మనదేశంలో కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఇలాంటి నగదు బదిలీలను మనం చూస్తున్నాం. ఇది అంతరాలను తగ్గించదు. అంతరాలకు గురవుతున్న వారిలో కొంత మందికి తాత్కాలిక ఉపశమనంగానే వుంటుంది. మరో పక్క వ్యవస్థ దోపిడీ యధావిధిగా కొనసాగుతూ అంతరాలను మరింత పెంచుకుంటూ పోతూనే వుంటుంది. మనలాంటి దేశాలలో పాలకపక్షాల ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయో గపడే పథకాలకు మాత్రమే ఈ క్యాష్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి సాధనం గా వున్నది. పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టడం వ్యవస్థను మార్చాలనుకునేవారు పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టే మార్గాన్ని అనుసరించాలి. అంతరాల సృష్టికి మూలమైన వ్యవస్థ మీద దాడి చేయాలి. అలాంటి ఆకాంక్షకు నినాదరూపం ఇవ్వాలి.

> **కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ లక్షల కోట్ల సంపద నుండి, ఆదాయం నుండి సంపద పునఃపంపిణీ నిధిని ప్రత్యేకంగా సమకూర్చాలి. వారసత్వానికి దక్కకుండా దానిలో వాటాను విడదీయాలి. అలాగే ప్రకృతి సంపదను ప్రైవేటుపరం నుండి తొలగించాలి. వీటన్నింటి ద్వారా సమకూరిన పునఃపంపిణీ నిధితో ప్రజలకు హక్కుగా మౌలిక ఆదాయాన్ని కల్పించాలి. ఇది పోగుబడ్డ సంపదను బద్దలుకొట్టి దోపిడీకి గురైన తరగతులకు పంపకం చేసేది అవుతుంది. అంతరాలు తగ్గడానికి తొలి మెట్టు అవుతుంది. పెట్టుబడిదారీ దోపిడీ మీద చేసే దాడికి తొలి అడుగు అవుతుంది.**

### పారిశ్రామికాభివృద్ధి దెబ్బ తింటుందా?

పారిశ్రామికరంగంలో గుత్తాధిపత్యం మీద చేసే దాడి చిన్న, మధ్య తరహా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తుంది. ఉపాధినిచ్చే పరిశ్రమలు, వ్యవసాయాధారిత పరిశ్రమలకు అదనపు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ప్రజల చేతుల్లోకి – కనీస ఆదాయ భద్రత పద్ధతి ద్వారా చేరే లక్షల కోట్ల రూపాయలు దేశీయ మార్కెట్లకు కొత్త ఊపునిస్తాయి. ఇది పారిశ్రామికాభివృద్ధి కుంటుపరచకపోగా విస్తృతం చేస్తుంది. ఉపాధి అవకాశాలను పెంచుతుంది.

### ప్రజలు సోమరిపోతులు కారా ?

పనిచేసినా చెయ్యకపోయినా కనీస ఆదాయం కల్పిస్తే అంతా సోమరిపోతులు, తాగుబోతులు అవుతారన్న ప్రచారం సాగించే వారుంటారు. అంటే బతకడానికి డబ్బున్న వాళ్లంతా సోమరి పోతులు, తాగుబోతులు అయిపోవాలి. అలాకాక పోగా మంచి జీవితానికి రుచి మరిగిన కొద్దీ మరింతగా పనిచేసే వారే ఎక్కువ అవుతున్నారు. పేదరికమే అసలు సమస్య. అవిద్యకీ, అనారోగ్యానికీ, అధిక సంతానానికి, వ్యసనాలకీ అదే పుట్టిల్లు. దాని తొలగింపులోనే జీవన వికాసం కనిపిస్తుంది. తప్పు కళ్లది కాదు పెట్టుకున్న కళ్ళజోళ్లది. పేదలు, శ్రామికులు మనుషు లేనని, వాళ్ళతోనే సమాజానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, సేవలు జరుగుతున్నాయని గుర్తించే సంస్కారం వుంటే ఇలాంటి వాదనలు రావు. **(కొత్తచూపు–కొత్తదారి పుస్తకం నుంచి)** ❑

---

# కులం మూలాలను గుర్తించడం ద్వారానే ..

**(30వ పేజీ తరువాయి)**

ప్రభుత్వాలు అంత తేలికగా ఈ పనులన్నిటినీ చేయవు. అందుకు కావాల్సిన చిత్తశుద్ధి ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఆయా రాజకీయపార్టీలకు ఉండదు. అందువల్ల ప్రభుత్వం నిర్వర్తించాల్సిన బాధ్యతను నిరంతరం ఎరుకలో ఉంచడానికి సామాజిక ఉద్యమాలు, కమ్యూనిస్టు, విప్లవ, వివిధ అస్థిత్వ ఉద్యమాలు చాలా కీలకమైన పాత్ర నిర్వహించాలి. అవి నిరంతర ఉద్యమ కార్యాచరణలో నిమగ్నమై ఉండాలి. అమానవీయమైన ఈ కుల వివక్షను ఎదుర్కొంటున్న సామాజిక వర్గాలు తమ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందిం చుకుని అంతిమంగా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం ద్వారా సామాజిక మార్పు, రాజకీయ మార్పును సాధించుకోవడమే ఈ కుల వివక్ష నిర్మూలనకు శాశ్వతమైన పరిష్కారం. ❑

# ‘వికల్ప’ ప్రజా సంఘాల వేదిక మేనిఫెస్టో

**‘వికల్ప’ సంఘటనలో దేశవ్యాపితంగా వివిధ ఉద్యమాలను నిర్వహిస్తున్న 85 పౌర సంస్థలు భాగస్వాములుగా వున్నాయి**

**భారతదేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ రంగాల వ్యవస్థలు, విధి విధానాలు, కార్యక్రమాలకు మౌలికంగా కొత్త రూపం ఇవ్వటానికి కింద పేర్కొన్న చర్యలు అవసరం.**

- ప్రభుత్వ అన్ని ప్రణాళికలు, బడ్జెట్లు, విధి విధానాలు, కార్యక్రమాలలో కుల, లింగ, లైంగిక దృక్పథం, వర్గ, జాతి మూలాలు, మతం, విశ్వాసం, ‘జాతి’, వైకల్యం/ దివ్యాంగులు, అక్షరాస్యత, భౌగోళిక ప్రదేశం, ఇంకా ఇటువంటి ఇతర అంశాల కారణంగా వివక్షతకు గురయ్యే వాళ్లతో సహా సమాజంలోని అత్యంత బడుగువర్గాల కోసం అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. కార్పొరేట్ రంగంలోను ఇటువంటి ప్రాధాన్యత ఉండేలా ప్రభుత్వం చూడాలి.

  **ప్రతి ప్రభుత్వ చర్యకు పరీక్ష : దుర్బలులకు అది మేలు చేస్తుందా, వివక్షతను అది తగ్గిస్తుందా ?**

- భారతీయ సమాజం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక అసమానతలను పరిష్కరించటానికి కఠినచర్యలు తీసుకోవాలి. ఇందులో జీతాల స్థాయికి పరిమితులు, అతి తక్కువ, అతి ఎక్కువ జీతాల మధ్య తేడాలను గణనీయంగా తగ్గించాలి. ధనికుల ఆదాయం, సంపద, వారసత్వంపై అత్యధిక పన్ను, దుర్బలులకు కనీస మౌలిక ఆదాయం, ఉపాధి హామీ, ఉత్పత్తి (ప్రాథమిక) రంగంలోని కార్మికులు అందరికీ పెన్షన్, నిధులు అవసరం అయిన చోట అవి అందకుండా చేసే విపరీతమైన ‘నల్ల డబ్బు’ను కట్టడి చేసే చర్యలు ఉండాలి.

  **ప్రతి ప్రభుత్వ చర్యకు పరీక్ష : ఆర్థిక అసమానతల ను తగ్గిస్తుందా ప్రస్తుతం అంచులకు నెట్టివేయబ డిన వాళ్ల ఆర్థిక సాధికారీకరణకు దారి తీస్తుందా ?**

- వివిధ మతాలు, జాతి మూలాలు, భాషలు, సంస్కృతుల భిన్నత్వాన్ని కాపాడటానికి, వాటి మధ్య సామరస్యతను తిరిగి సాధించటానికి పాఠశాలస్థాయి నుంచి విస్తృత కార్యక్రమాలు చేపట్టాలి. వివిధ సముదాయాల మధ్య తప్పుడు సమాచారం, విద్వేషం, శత్రుత్వాలను పెంచే వాళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

  **ప్రతి ప్రభుత్వ చర్యకు పరీక్ష : అది సామరస్యతను పెంచుతుందా ? సామాజిక ఘర్షణలు, పొరపొచ్చాలను, ఉద్రిక్తతలనూ తగ్గిస్తుందా ?**

- నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను మరింత ప్రజాస్వామికంగా చేయటం, రాజ్యాంగంలోనూ, సంబంధిత చట్టాలలోనూ ఈపాటికే ఇచ్చిన అధికారాలు కాకుండా గ్రామసభలకు, పట్టణ ప్రాంత వార్డు లేదా మొహల్లా సభలకు ఆర్థిక, చట్టపర అధికారాలతో సాధికారతను ఇచ్చి వాళ్ల పరిధిలో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ముందుగా అన్నీ తెలిసి, ఆమోదం తెలిపే ప్రక్రియలు అమలులో ఉండేలా చూడటం. నదీ పరీవాహక, ఉప–పరీవాహక ప్రాంతాల వంటి స్థాయిలలో నిర్ణయాలు తీసుకునే వేదికలను ప్రారంభించటం. ఇందులో యువత, మహిళలు, లైంగిక అల్ప సంఖ్యాకులు, దివ్యాంగులు, ఇతర బడుగు, బలహీనులకు ఇతర వర్గాల వాళ్లు ‘ప్రాతినిధ్యం’ వహించటం కాకుండా వాళ్లే అవసరమైన మద్దతుతో అన్ని విషయాలు తెలుసుకుని, భాగస్వాములు కావాలి.

  **ప్రతి ప్రభుత్వ చర్యకు పరీక్ష : ప్రజలందరి, ప్రత్యేకించి, ప్రస్తుతం అంచులకు నెట్టివేయబడిన వాళ్ల అర్థవంతమైన భాగస్వామ్యాన్ని అది పెంచుతుందా ?**

- ప్రభుత్వ అన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు, ఆర్థిక సంస్థలు, ప్రసార సంస్థల పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఒక సమగ్ర విధి విధానాన్ని, చట్టాన్ని చేయాలి. ప్రజాస్వామిక నిరసనని అణిచివేసే హక్కులను ప్రభుత్వానికి ఇచ్చే, పోలీసులు, సాయుధ పోలీసులకు నిరంకుశ అధికారాలను ఇచ్చే చట్టాలలోని అంశాలను తొలగించాలి.

  **ప్రతి ప్రభుత్వ చర్యకు పరీక్ష : ప్రజలకు అది పూర్తి పారదర్శకంగా ఉందా, జవాబుదారీతనాన్ని పెంచుతుందా, జవాబుదారీతనం లేకుండా ప్రభుత్వం ప్రవర్తించే అధికారాన్ని తగ్గిస్తుందా ?**

- సాంప్రదాయ, ఆధునిక నైపుణ్యాలు, జ్ఞానాన్ని కలుపుతూ పెద్ద ఎత్తున జీవనోపాధుల కార్యక్రమాన్ని చేపట్టాలి. అత్యధిక జీవనోపాధిని కల్పించే వ్యవసాయ (వ్యవసాయం,

పశు పోషణ, చేపల పెంపకం, అటవీ ఉత్పత్తులతో సహా), చేతి వృత్తులు/చిన్న తరహా ఉత్పత్తి రంగాలకు అన్ని ప్రణాళి కలు, బడ్జెట్లలో అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలి. చిన్న లేదా మధ్య తరహా స్థాయిలో ఉత్పత్తి లేదా తయారు చేయగల అన్ని ఉత్పత్తులు, సేవలను సముదాయ ఆధారిత వికేంద్రీ కృత ఉత్పత్తికి రిజర్వు చేయాలి, ఇందుకోసం ప్రజాస్వా మికంగా నడిచే ఉత్పత్తిదారుల సంఘాలకు (సహకార సంఘాలు, కంపెనీలు, కార్మిక సంఘాలు) సహాయపడే చర్యలను చేపట్టాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : **బలహీన, దుర్బల వర్గాల జీవనోపాధులను పెంపొందించి, వాటికి హామీని ఇస్తుందా, అన్ని జీవనోపాధులకు గౌరవప్రదమైన స్థానాన్ని ఇస్తుందా ?**

- దేశ సామాజిక–సాంస్కృతిక, వ్యవసాయ–జీవావరణ వైవిధ్య త ఆధారంగా భూమి/ నీరు వినియోగానికి ఒక జాతీయ ప్రణాళిక ఉండాలి. అందరి జీవితాలు (మానవులే కాకుండా ఇతర జీవులు) ఆధారపడి ఉన్న జీవావరణ వ్యవస్థలు, జీవావరణ విధులను, వాటిల్లో ఉండే ఉమ్మడి వనరులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యతను కాపాడటానికి అందులో భాగంగా చర్యలు తీసుకోవాలి. స్థానిక ఆర్థిక వ్యవస్థల కోసం సుస్థిర, సహజ వనరుల సంపదను సృష్టించే లక్ష్యంతో భూమి/ నేల, నీటి పునరుద్ధరణకు దేశ వ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టాలి. అటవీ హక్కుల చట్టంలో మాదిరి సహజ జీవావ రణ వ్యవస్థలు, జీవజాతుల హక్కులను గుర్తించిన రాజ్యాంగ రీతిలో స్థానిక సముదాయాల హక్కులను గుర్తించి, వాటిని సశక్తీకరణ చేసే న్యాయ చర్యల ఆధారంగా ఇదంతా జరగాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : **సహజ జీవావరణ వ్యవస్థ లను, జీవావరణ విధులను అది కాపాడుతుందా ?**

- స్థానిక నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని స్థాయిలలో జీవావరణ పరిమితులను ఆర్థిక ప్రణాళికలు గౌరవించే సమగ్ర విధాన, చట్టపర పాలనను తీసుకురావాలి. వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాల, పథకాల పర్యావరణ ప్రభావంపై ప్రజల భాగస్వామ్యంతో స్వతంత్ర సంస్థల ద్వారా సమగ్ర అంచనా జరిగేలా చూడటం ఇందులో భాగం కావాలి. మానవ లేదా జీవావరణ/జంతువుల ఆరోగ్యానికి హానికరమైన అన్ని రసాయనికాలు, పదార్థాలకు బదులుగా పర్యావరణ హిత పదార్థాలను వాడాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : **ప్రజలకి, వన్యప్రాణులకి కీలకమైన సహజ పర్యావరణాన్ని, జీవావరణ ఆరోగ్యాన్ని కాపాడుతుందా ? పీల్చటానికి శుభ్రమైన గాలి, తాగటానికి రక్షిత తాగునీరు, మానసిక ఆరోగ్యానికి సురక్షిత ప్రదేశం అందరికీ అందుబాటులో ఉన్నాయా?**

- ఆరోగ్యం, పారిశుధ్యం, గృహ వసతి, విద్య, నీరు, ఆహారం, ఇంధనం, జీవనోపాధులు వంటి వాటితో సహా అన్ని మౌలిక వసతులకు ఇప్పటికంటే గణనీయంగా ఎక్కువ బడ్జెటు కేటాయించి వీటి కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతులో ప్రాధాన్యతను ఇవ్వాలి. అన్ని ఆహారాల ఉత్పత్తిని వ్యవసాయి క–జీవావరణ, భద్రమైన ప్రక్రియలుగా మార్చాలి. ఇందులో చిన్న రైతులకు, పశు పోషకులకు, చేపలు పట్టేవాళ్లకు నేల, విత్తనాలు, నీళ్లు, జ్ఞానం, ఇతర ఉమ్మడి వనరులపై వాళ్ల హక్కులకు పూర్తి మద్దతును ఇవ్వాలి. డిమాండును జీవావరణ పరిమితులకు, తప్పని సరైన వాటికి పరిమితం చేస్తూ 2030 నాటికి ఇంధన అవసరాలలో అత్యధిక శాతం వికేంద్రీకృత, పునరుద్ధరిం పబడే వనరుల ద్వారా అందుబాటులోకి రావాలి. కీలక జీవన చర్యలకు ప్రాధాన్యతను ఇచ్చే నీటి వనరుల సంరక్షణ, పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : **అందరి, ప్రత్యేకించి ప్రస్తుతం అందుబాటులో లేని వాళ్లందరి మౌలిక అవసరాలు జీవావరణపరంగా సుస్థిరమైన పద్ధతుల లో, ప్రజాస్వామిక, సముదాయ నియంత్రణ విధానాల లో అందుబాటుని పెంచి, హక్కుగా చేసి, ఆర్థికంగా భారంగా కాకుండా ఉంటుందా ?**

- పట్టణ, గ్రామీణ ఆవాస ప్రాంతాలను గౌరవమైనవిగా, నివా స యోగ్యమైనవిగా, సుస్థిరమైనవిగా, మౌలిక అవసరాలకు సాధ్యమైనంతగా స్వయం సమృద్ధిగా చేసే చర్యలు చేపట్టాలి. సమాజంలోని దుర్బల వర్గాలకు భూమి, గృహ వసతి, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలి. సరుకు రవాణా / ప్రయాణాలలో మోటారు లేని వాహనాల ద్వారా ప్రజా రవాణాకి అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలి.

ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : **అందరికి, ప్రత్యేకించి ప్రస్తుతం అందని వాళ్లకి నివాస యోగ్యమైన, సుస్థిర జీవన పరిస్థితులకు దారితీస్తుందా ?**

- విద్య, నేర్చుకోవడం అన్నవి కృత్యాధార పద్ధతులలో ఉండి సంతోషకరంగా ఉండాలి. వాళ్ల వాళ్ల సంస్కృతి, జీవావరణా లలో వేళ్లూనుకుని ఉండాలి(మాతృ భాషలో నేర్చుకోడానికి ప్రాధాన్యతని ఇవ్వాలి). స్వయం నిర్ధారిత నేర్చుకునే

ప్రక్రియలు, విమర్శనాత్మక ఆలోచన, ప్రశ్నించేతత్వం, ఆత్మావగాహన ద్వారా న్యాయం, బాధ్యత విలువలను విద్యార్థులు అంతర్గతం చేసుకునేలా ఉండాలి. అంతేకాకుండా సాంస్కృతిక వైవిధ్యత, జీవావరణ సుస్థిరత పట్ల గౌరవాన్ని పెంపొందించేలా ఉండాలి. ఇందుకు అవసరమైతే విద్యాహక్కు చట్టానికి సవరణలు చెయ్యాలి, పెద్ద వాళ్లకి, పిల్లలకి సముదాయ ఆధారిత ప్రక్రియలను చేపట్టాలి. అంచులకు నెట్టివేయబడిన బృందాలకు సంబంధించిన ప్రత్యేక పాఠ్య ప్రణాళికను అన్ని స్థాయిలలో జోడించాలి. ప్రత్యేక అవసరాలు ఉన్న వాళ్లతో సహా అందరికీ విద్య పూర్తిగా అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ప్రసార విధానాలను అన్వేషించి, అమలు చేసి, ప్రోత్సహించాలి. జీడీపీలో కనీసం ఆరు శాతం ఈ రంగానికి కేటాయించాలి.

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి, ప్రత్యేకించి ప్రస్తుతం అంచులకు నెట్టివేయబడిన వాళ్లకు సమగ్ర, పరిపూర్ణంగా నేర్చుకునే అవకాశాలకు అది దారి తీస్తుందా ?**

- ఆవిష్కరణలు, సాంకేతిక విజ్ఞానం, జ్ఞానాలలో మరింత సమగ్ర విధివిధానం, కార్యక్రమాలు ఉండాలి. ఆవిష్కరణలలో ప్రజల, సాంప్రదాయం కాని పద్ధతులను ఇవి ప్రోత్సహించి, మద్దతు ఇవ్వాలి. స్వతంత్ర ప్రసార సాధనాల ద్వారా, ఇతరత్రా పద్ధతుల ద్వారా జ్ఞానం, సమాచారాలలో అత్యధిక భాగం అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. జానపద ప్రజల జ్ఞానంతో సహా జ్ఞానానికి సంబంధించిన వైవిధ్యతను గుర్తించి, గౌరవించాలి. సాంకేతిక విజ్ఞానాన్ని ప్రజల సమీక్షకు పెట్టి అది న్యాయం, అందుబాటు, సుస్థిరత అన్న లక్ష్యాలకు ఎంతవరకు సహకరిస్తున్నాయో పరీక్షించాలి.

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష మరింత ప్రజాస్వామికీకరణకు, జ్ఞానం, సాంకేతిక విజ్ఞానం ప్రజలకు మరింత అందుబాటులోకి రావటానికి దోహదం చేస్తుందా ?**

- అందరికీ, ప్రత్యేకించి బలహీన వర్గాలకు ఆరోగ్యకరమైన జీవనం, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన కార్యక్రమాలు, సమగ్ర విధి విధానాన్ని రూపొందించాలి. ఇందులో పలు వైద్య విధానాల మధ్య సమన్వయం, ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే (ఆహార, సామాజిక, మానసిక, భౌతిక పర్యావరణం, విద్య వంటి) అన్ని అంశాలతో సంబంధాలు, సముదాయల పర్యవేక్షణ, పాలన ఉండాలి. ప్రభుత్వ రంగం అందరికీ అందుబాటులోకి రావటానికి ఈ రంగానికి జీడీపీలో కనీసం మూడు శాతం కేటాయించాలి.

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : అందరికీ ఆరోగ్యం, ప్రత్యేకించి ప్రస్తుతం ఆరోగ్యకర పరిస్థితులు, ఆరోగ్య సేవలు అందని వాళ్లకి అందించేలా అది దోహదం చేస్తుందా ?**

- కళలు(దృశ్య, ప్రదర్శన కళలు) ప్రజాస్వామికంగా విలసిల్లేలా ప్రోత్సాహక చర్యలు చేపట్టాలి. వాటిల్లో కొన్నింటిలో ఉన్న కుల, వర్గ, లింగ వివక్షతలను తొలగించాలి. అవి అందరికి అందుబాటులో ఉండేలా చెయ్యాలి. వాటిని ప్రోత్సహించటానికి ఉన్న ప్రభుత్వ సంస్థలను స్వతంత్ర సంస్థలుగా మార్చాలి.

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : అందరికీ అందుబాటులో ఉండే విధంగా కళలు విలసిల్లటానికి దోహదం చేస్తుందా?**

- మానవ హక్కులు, శాంతి, నిస్సైనికీకరణలతోపాటు జీవావరణ విజ్ఞతల ఛాంపియన్ ప్రపంచస్థాయిలో భారతదేశ స్థానాన్ని తిరిగి స్థాపించే చర్యలు చేపట్టాలి. ఐక్యరాజ్య సమితిని తిరిగి బలోపేతం చేయాలి. ప్రపంచస్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ప్రజలకు ప్రజాస్వామికంగా అందుబాటులో ఉండటానికి మద్దతు ఇవ్వాలి. వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలు మానవ హక్కులకు, పర్యావరణ ఒడంబడికలకు లోబడి ఉండేలా చూడాలి.

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష : ప్రపంచ శాంతిని, సహజీవనాన్ని, న్యాయాన్ని అది పెంపొందించుతుందా ? ప్రపంచస్థాయి నిర్ణయాలలో ప్రజల, సముదాయాల గొంతుకలు వినపడేలా అది దోహదంచేస్తుందా ?**

- పైన పేర్కొన్న వాటన్నిటిలో భారతదేశ యువత, దివ్యాంగులు, సీనియర్ పౌరులు, మహిళలు, లైంగిక అల్పసంఖ్యాక వర్గాలు, దళితులు, ఆదివాసీలు, ఇతరత్రా అంచుకి నెట్టివేయబడిన, దుర్బల వర్గాల సశక్తీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వర్తమానాన్ని, భవిష్యత్తుని నిర్ణయించుకోవటంలో వాళ్ల గొంతుకులకు ప్రాధాన్యతని ఇవ్వాలి. (యువతపై మూడవ భాగం చూడండి..)

**ప్రతి ప్రభుత్వ పనికి పరీక్ష: యువత, మహిళలు, అంచులకు నెట్టివేయబడిన ఇతర జెండర్లను, ఇతర దుర్బల ప్రజలను మరింత న్యాయం, స్వయం నిర్ణయ దిశగా సశక్తీకరణకు దోహదం చేస్తుందా?** ❑

# లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలి ? ప్రజా ప్రత్యామ్నాయ విధానం ఏమిటి ?



- డాక్టర్ కొల్లా రాజమోహన్

ప్రత్యామ్నాయ విధానంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని ఎక్కువ మంది ప్రబోధిస్తున్నారు. కనీస మద్దతు ధర ద్వారా రైతుకు లాభసాటి ధర లభించి వ్యవసాయం గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. సమగ్ర వ్యవసాయ ఖర్చులకు 50% శాతం కలిపి (C2+50) కనీస మద్దతు ధరను నిర్ణయించి, చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వంతో అమలు జరిపించుటకు మహోద్యమం నడిచింది. రైతు ఉద్యమ చరిత్రలో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. రైతులను ఐక్యం చేశారు. రాజకీయ పార్టీల ఐక్య సంఘటనకు ప్రత్యామ్నాయంగా రైతు సంఘాల ఐక్యతను సాధించారు. దేశ విదేశాల్లో వున్న రైతుల్లో ఒక నూతన ఉత్తేజాన్ని కలిగించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సాధించలేకపోయినా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయించుకోవటంలో విజయం సాధించారు.

స్వామినాధన్ కమిటీ రిపోర్టు 2006లో సమర్పించి 12 ఏళ్లు అయినా సిఫార్సులు అమలు కాలేదు. రకరకాల ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిపోతున్నాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తామని, ఆదాయాన్ని రెండింతలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వారు కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేస్తున్నారు. పాలకుల మాటలు ఆచరణకు నోచుకోనందున రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. గిట్టుబాటు ధర లేనందున సంవత్సరానికి రు.4 లక్షల కోట్లను రైతులు నష్టపోతున్నారు. రైతుల సమస్యలను చర్చించడానికి ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలని 207 రైతు సంఘాలు ఐక్యంగా డిమాండ్ చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి బదులుగా వాయువేగంతో మూడు రైతు వ్యతిరేక, కార్పోరేట్ అనుకూల బిల్లులను పది రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ముద్ర పూర్తి చేసి చట్టాలుగా చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయించుకోవటానికి రైతులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం దిగి వచ్చి, క్షమాపణలు చెప్పి నల్ల చట్టాలను వెనక్కు తీసుకోకతప్పలేదు. 750 మంది రైతులు ప్రాణ త్యాగం చేశారు. కానీ, కీలక సమస్యలైన కనీస మద్దతు ధర, భూమి, కౌలు, వడ్డీ, శ్రమ శక్తిని కొల్లగొట్టేయటం, నీటిపారుదల, మార్కెట్‌ల ద్వారా ఫైనాన్సు పెట్టుబడికి ఊడిగం చేయటం, అగ్రి బిజినెస్, కార్పోరేట్ కంపెనీల ప్రవేశం వంటి సమస్యలు పరిష్కారం కాలేదని మరవరాదు.

### వ్యవసాయంలో మార్పులు

పాత కాలంలో పెట్టుబడి తక్కువతో వ్యవసాయం సాగినందున దిగుబడులు తక్కువ అయినా తినడానికి, పన్నులు కట్టడానికి మిగిలితే సంతోషించేవారు. పంట మిగులు ఉండేది కాదు. తన పొలం పంటలోని మంచి విత్తనాలను తీసి భద్రపరచి తిరిగి నాటడం వల్ల విత్తనాల ఖర్చు ఉండేది కాదు. బేయర్స్ కంపెనీల పేటెంట్ విత్తనాల ఖర్చు లేదు. ఎరువుల ఖర్చులేదు. నయ్యిమట్టి ఎరువులు, పంట కలియ దున్నటంతో భూసారం క్షీణించకుండా ఉండేది. ఎరువుల, పురుగు మందుల ఖర్చు అనూహ్యంగా పెరిగింది. ఎరువులు వాడకపోతే పంట పెరగదు. పురుగు మందులు వాడకపోతే గింజ చేతికి రాదు. పురుగు మందులను తట్టుకుని కొత్త పురుగులు, కొత్త జబ్బులను తట్టుకుని పంటలను రక్షించుకోవటానికి ఇంకా పవర్ కలిగిన ఖరీదైన మందులు వాడవలసి వస్తున్నది. ఎద్దుల వ్యవసాయం పోయి ట్రాక్టర్ వ్యవసాయం వచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు-అన్నీ జాతీయ, అంతర్జాతీయ కంపెనీల చేతులలో వున్నాయి. లెక్క లేకుండా ఖర్చులు పెరిగిపోయాయి. వ్యవసాయం మధ్యలో ఆపలేక అందినకాడ అందినట్లు అప్పులు చేస్తున్నారు. మెడలో మంగళసూత్రం బంగారం కుదవపెట్టి, ఎరువులు కొట్లో కూడా అప్పు పెట్టి, వడ్డీ రేటు ఎంతయినా వెనుకాడకుండా అప్పు తెచ్చి అనుకున్నకాడకు ఆ సంవత్సరం వ్యవసాయం పూర్తి చేస్తున్నారు. బహుళజాతి కంపెనీల అగ్రి బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. లాభాల వేటలో సామాన్య రైతు బలయిపోతున్నాడు.

### సాయం లేని వ్యవసాయం

అప్పులలో పుట్టి అప్పుల్లో పెరిగి అప్పులలో ప్రాణాన్ని వదిలే మన రైతు సాయం లేని వ్యవసాయం చేస్తున్నాడు. నయా ఉదార వాద విధానాల ప్రవేశపెట్టిన తర్వాత వ్యవసాయం తీరే మారింది. వ్యవసాయాన్ని కంట్రోల్ చేసే పెత్తందార్లు మారి పోయారు. వ్యవసాయ ఖర్చులు దారుణంగా పెరిగాయి. వాన వచ్చినా వాన పడకపోయినా, వరద వచ్చినా, ప్రకృతి వైపరీత్యాల వలన చేతికి వచ్చిన పంట చేజారిపోయినా, మార్కెట్ మాయా జాలం వలన ధరలు పడిపోయినా రైతు తట్టుకోలేకపోతున్నాడు. ప్రభుత్వం సహాయం లేదు. పంటల బీమా ఇవ్వరు.

నామమాత్రపు ప్రభుత్వ సహాయం చేసినా ఆదుకునేవారు లేక తీవ్రమైన మానసిక వ్యధ అనుభవించి, ఎదిరించలేక తన ప్రాణాన్నే బలి తీసుకుంటున్నాడు. మౌలిక సదుపాయాలకు ప్రభుత్వ పెట్టుబడిని పెంచకుండా MSPని ప్రకటించటం అనేది కేవలం స్వల్పకాలిక నాటకం.

## ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం

1. భారతదేశంలో వ్యవసాయం చేస్తున్న ప్రజల చేతిలో ఉత్పత్తి సాధనమైన భూమి లేనందువలన వ్యవసాయ సంక్షోభం సంభవిస్తున్నది. ఉత్పత్తి సాధనాలు ప్రజల పరమైనపుడే సమాజాభివృధి సాధ్యం. గ్రామీణ ప్రాంతంలో భూమి వ్యవసాయం చేసే వారి చేతిలో లేదు. సగం మందికి సెంటు భూమి కూడా లేదు. గ్రామీణ రైతులు తప్ప అందరూ గ్రామాలలో భూములు కొంటున్నారు. విదేశాలలో వున్నవారు, పట్టణాలలో డబ్బున్న వారు, కంట్రాక్టర్లు, ఉద్యోగసులు, వ్యవసాయం వృత్తిగా లేనివారు, భూమి రేటుపైన తప్పితే మరెటువంటి ఆసక్తి లేని వారి చేతిలోకి భూమి తరలిపోతున్నది. ప్రజల చేతిలో ఉత్పత్తి వనరుగా వుండాల్సిన భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సరుకుగా మారిపోయింది. కీలకమైన భూమి సమస్యను పరిష్కరించినపుడే లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుంది. వ్యవసాయ కమిషన్ సిఫార్సులలో కూడా భూమి సమస్యకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులలో మొట్టమొదటి రికమండేషన్ భూమి గురించే చేశారు. “సీలింగు భూములను, బంజరు భూములను పంపిణీ చేయాలని, వ్యవసాయ సంస్కరణలలో భూసంస్కరణలు కీలకమైనవని, అట్టడుగున వున్న 50 శాతం గ్రామీణ కుటుంబాలకు 3 శాతం భూమి మాత్రమే వుందని (The share of the bottom 50% of the Rural households in the countrys land ownership was only 3%)” అని కమిషన్ స్పష్టంగా చెప్పింది. వ్యవసాయేతర అవసరాల కోసం కార్పోరేటు కంపెనీలకు, వ్యవసాయంలో లేని వారికి ప్రధాన వ్యవసాయ భూమిని, అటవీ భూమిని ఇవ్వవద్దన్నారు. అయితే ప్రభుత్వం భూమి సమస్యకు ప్రాధాన్యతనివ్వకుండా కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడానికి పూనుకుంది. ప్రజలు గుర్తించినా ప్రభుత్వ విధానాలను మార్చేందుకు బలం చాలడం లేదు. భూసంస్కరణల కోసం, బంజరు భూములు పేదలకు పంచాలనీ పేద ప్రజలు పోరాడుతూనే వున్నారు. భూమి కోసం, భుక్తి కోసం జరిగిన సంఘర్షణలు, బలిదానాలూ చరిత్రనిండా వున్నాయి. భూమి కోసం పోరాడిన నేలలో, పేదల చేతిలో వున్న కొద్దిపాటి భూమిని కాపాడుకోవటం కష్టంగా వుంది. కార్పోరేటు కంపెనీలు, ప్రభుత్వాలూ పేదప్రజల భూమిని లాక్కుంటున్నారు. కార్పోరేట్ల కోసం సెజ్‌లు, ఎక్స్‌ప్రెస్ హైవేల పేరున అనవసరపు భూసేకరణను ప్రజలు ఎదుర్కొంటూనే వున్నారు. భూమి కార్పోరేటు కంపెనీల చేతుల్లోకి మారుతూవున్న సమయంలో స్వామినాధన్ కమిషన్ సిఫారసులన్నిటిలోనూ మొట్టమొదటి రికమండేషన్ భూమి గురించేనన్న సంగతిని రైతుల బాగు కోసం కృషి చేస్తున్న రైతు సంఘాలు కూడా గమనించకపోతే మరెవరు గమనిస్తారు. స్వామినాధన్ కమిషన్ సిఫారసులలో ఒకటైన గిట్టుబాటు ధర గురించి బాగా ప్రచారం వచ్చింది. మంచిదే. గిట్టుబాటు ధరల గురించే ప్రధానంగా చెప్పారని కూడా ప్రచారం జరుగుతున్నది. కానీ గిట్టుబాటు ధరల గురించి మాత్రమే కమీషన్ చెప్పినట్లుగా మనం అర్థంచేసుకోవటంవలన పేద ప్రజలకు అన్యాయం జరుగుతుంది. మిగులు భూమిని పంచాలని స్వామినాధన్ కమిషన్ సిఫారసు చేయటం వలన భూమికోసం జరిగే పోరాటాల న్యాయబధత పెరుగుతుంది. భూమి కోసం పోరాడే ఉద్యమకారులకు మరొక ఆయుధం దొరుకుతుంది. ఇంకా భూమి సమస్య ఏమిటయ్యా అనేవారే వందల వేల ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నారు. ఇంకా భూమి సమస్య ఎక్కడుందయ్యా అనే వారికి స్వామినాధన్ కమిషన్ లో సూచించిన మొదటి రికమండేషన్ సమాధానమవుతుంది. బంజరుభూమిని పేదప్రజలకు పంచమన్న స్వామినాధన్ కమిషన్ సిఫారసు అమలు కోసం జరిగే ప్రయత్నం మరింత బలం పుంజుకుంటుంది. వ్యవసాయంలో లేనివారికి, కార్పోరేటు కంపెనీలకు ప్రధాన వ్యవసాయ భూములను కట్టబెట్ట వద్దన్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకురావాలి. పంటలకు గిట్టుబాటు ధర చాలా ముఖ్యమైనదే. కానీ కమిషన్ చేసిన సిఫారసులన్నిటిలోకీ ముఖ్యమైన భూమి సమస్యను వదలరాదు. భూమి సమస్యతోపాటు ఇరిగేషన్, గిట్టుబాటు ధర, మిగతా సమస్యలనన్నిటినీ వారి సిఫారసులకు అనుగుణంగా పరిష్కరించమనాలి. స్వామినాధన్ కమిషన్ సిఫారసులనన్నిటినీ అమలు చేయమని పోరాడినందు వలన లాభసాటి వ్యవసాయం సాధ్యం కావచ్చు. ప్రభుత్వంచే నియమించబడ్డ కమీషన్ నివేదికలో ముఖ్య సూచనలైన సీలింగ్–మిగులు భూములు, బంజరు భూములను పంపిణీ చేయడం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు కార్పొరేట్ రంగానికి ఇవ్వకుండా నిరోధించడం, గిరిజన హక్కులను మరియు గిరిజనులకు అడవులకు యాక్సెస్ ఇవ్వడం నేషనల్ ల్యాండ్ యూజ్ అడ్వైజరీ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలన్న సిఫార్సుల అమలుకు పోరాడాలి.

2. వ్యవసాయాన్ని కాపాడాలంటే కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ సహాయాలన్నీ అందేటట్లు చూడాలి. భూమి లేని కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయానికి కేటాయించే నిధులు భూమి యజమానులకే అందుతున్నాయి. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు లేనందున బ్యాంకు ఋణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారాలు అందటం లేదు. ప్రైవేటు ఋణాల ఊబిలో నుండి బయటకు

రాలేని కౌలు రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటున్న రైతులలో 80 శాతం మంది కౌలు రైతులే. 38.7 శాతం ఆత్మహత్యలకు అప్పులే కారణం. పంట వైఫల్యాలు, ఉత్పత్తులను అమ్ముకోలేకపోవడం మరో 19.5 శాతం ఆత్మహత్యలకు దారి తీసింది.

3. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర రైతుల హక్కు, 2018, ప్రైవేటు బిల్లును రైతు సంఘాల తరపున ప్రవేశపెట్టారు. 2017, నవంబర్ 20న ఢిల్లీలో జరిగిన కిసాన్ సంసద్‌లో, రైతులు పండించిన పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలు హక్కుగా లభించేలా చట్టాన్ని రూపొందించేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రైవేట్ బిల్లుగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదించి కనీస మద్దతు ధరను హక్కుగా చేయాలని భారత రైతాంగం డిమాండ్ చేస్తూ వున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ కనీస మద్దతు ధరకంటే తక్కువకు కొనకూడదని, అలా కొన్నవారు శిక్షార్హులనీ బిల్లు ప్రవేశపెట్టారు. పార్లమెంటులో ఆ బిల్లు చర్చకే రానివ్వలేదు. రైతు హక్కు బిల్లును ఆమోదించి, స్వామినాథన్ కమిటీ సిఫారసులన్నిటినీ తక్షణం అమలు పరచటమే పలు సమస్యలకు పరిష్కారం.

4. రాజ్యాంగం 7వ షెడ్యూల్ ప్రకారం స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ధరలు నిర్ణయం చేయాలి. నీటిపారుదల, నేల తీరు, వాతావరణం, రైతుల జీవన విధానం ప్రతి రాష్ట్రానికి వేరుగా ఉంటుంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక రకంగా వ్యవసాయ ఖర్చులు వుంటాయి. బోర్లు వేసి భూగర్భ జలాల ఆధారంగా వ్యవసాయం చేసిన వారికి ఖర్చులు ఎక్కువ అవుతాయి. నదీ జలాల కాల్వల ద్వారా వ్యవసాయానికి ఖర్చు తక్కువ అవుతుంది. రాష్ట్రాల వారీగా కనీస మద్దతు ధరను నిర్ణయించాలి. రాష్ట్రస్థాయిలో కూడా వ్యవసాయ ఖర్చుల, ధరల కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా దేశం మొత్తం ఒకే మద్దతు ధరను నిర్ణయించడం రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కోవడం తప్ప వేరుకాదు. CACP ధరలను నిర్ణయించేటపుడు వాస్తవ రేట్లను గణనంలోకి తీసుకోవడం లేదు. ఎరువులు, పురుగు మందులు, రవాణా చార్జీలు, కూలీ రేట్లు, పెట్టుబడుల కోసం అప్పులు, వాటి వడ్డీలు, పెరుగుతున్న ధరలు అన్నీ లెక్కలోకి తీసుకుని వాస్తవ ఖర్చుని నిర్ణయించి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలి.

5.కనీస మద్దతు ధర నిర్ణయించే కమిటీలో రైతుల సమస్యలపై అవగాహన వున్న రైతు సంఘాల ప్రతినిధులు ఐదుగురు, అనుభవం ఉన్న ఒక వ్యవసాయ నిపుణుడు, వ్యవసాయం/ఉద్యానవనం/పశుసంవర్ధక/మత్స్య శాఖ నుండి నలుగురు అధికారులు, ప్రతిపక్ష నాయకుడు, వ్యవసాయ మంత్రి, ప్రధానమంత్రి కమిటీకి చైర్‌పర్సన్‌గా వుండాలి. రాష్ట్రంలోను అదేవిధంగా రాష్ట్ర సీఎం చైర్‌పర్సన్‌గా ధరల నిర్ణాయక కమిటీ వుండాలని రైతు సంఘాల బిల్లు కోరింది.

6.అసలుకన్నా వడ్డీ ఎట్టి పరిస్థితులలోనూ మించకూడదు. లాభసాటి వ్యవసాయం చేసి రైతు బాగుపడాలంటే వ్యవసాయానికి పెట్టుబడులు కావాలి. అందుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాన్ని అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఋణంపై ఆధారపడినందువల్ల వచ్చిన ఆదాయం వడ్డీలు, చక్రవడ్డీ, అపరాధ రుసుం కట్టటానికే సరిపోతుంది. 1937లో రైతుయాత్ర తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఋణ విమోచన చట్టాన్ని తీసుకురావలసి వచ్చింది Madras agriculturists debt relief act ఈ చట్టం ప్రకారం అసలుకన్నా వడ్డీ ఎట్టి పరిస్థితులలోనూ మించకూడదు. అదానీ సగటున రోజుకి ఆదాయం రూ.1600 కోట్లు, మన దేశంలో 22 కోట్ల కష్టజీవుల రోజువారీ ఆదాయం కేవలం రూ.375 మాత్రమే. 38.7 శాతం ఆత్మహత్యలకు అప్పులే కారణమని, తెలిసినా ప్రభుత్వం కరుణించటం లేదు. స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా వంటి ప్రభుత్వ బ్యాంకులు మోసగాళ్ళైన పెట్టుబడిదారులకు అప్పులు ఇచ్చి రద్దు చేస్తున్నాయి. గత ఐదేళ్లలో 10.57 లక్షల కోట్ల రూపాయల అప్పులను బ్యాంకులు రద్దు చేశాయి. ఒక్క 2023 సంవత్సరంలోనే 2.09 లక్షల కోట్ల అప్పులను రద్దు చేసినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తెలిపింది.

7. వ్యవసాయంలో రైతుకు లాభం రావాలంటే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించాలి. నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగు మందులు లేకుండా వ్యవసాయం నడవదు. రైతు బాగుపడదు. విత్తనాల పురుగుమందుల ఎరువుల తయారీని, ఉత్పత్తిని, పరిశోధనలను కార్పోరేట్ సంస్థలకు అప్పచెప్పరాదు. ప్రభుత్వరంగంలో వున్న ఇస్రో అంతరిక్ష పరిశోధనలలో అద్భుతాలను సాధించింది. తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు అన్నట్లు ఓఎన్‌జీఎస్ ప్రభుత్వ సంస్థ కాకినాడ దగ్గర సముద్ర గర్భంనుండి చమురును వెలికి తీసి ఉత్పత్తి ప్రారంభించింది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ సంస్థల పరిశోధనలను ప్రోత్సహించాలి. డబ్బుల కోసం గడ్డి తిని, ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న మోన్సాంటో, బేయర్స్, సింజెంటా వంటి కార్పోరేట్ కంపెనీలకు ప్రత్యామ్నాయంగా పరిశోధనలను ప్రోత్సహించాలి.

8. పప్పు ధాన్యాలు, వంట నూనెలు వంటి కీలకమైన పంటలకు కనీస మద్దతు ధర మాత్రమే కాకుండా ప్రోత్సాహక ధరను ఇవ్వాలి. విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ప్రపంచంలో వంట నూనెల దిగుమతులలో మన దేశం ముందుంది. 164.66 లక్షల టన్నుల వంట నూనెలను 2023 సంవత్సరంలో దిగుమతి చేసుకున్నాం. దేశీయ పంటలను

**(మిగతా 45వ పేజీలో)**

# రైతుల సంక్షేమానికి ప్రత్యామ్నాయ విధానాలు



- డాక్టర్ కిలారు పూర్ణచంద్రరావు

2015-16లో జరిగిన చివరి వ్యవసాయ కమతాలగణన ప్రకారం ఇండియాలో 14 కోట్ల 64 లక్షల 50 వేల 'నిర్వహణ కమతాలు' వున్నట్లు తేలింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి 11 కోట్ల 9 లక్షల 40 వేల మంది సాయం పొందినట్లు 2021 నివేదిక తెలుపుతున్నది. వీరే కాకుండా స్థానికంగా నివసించని వారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు భూహక్కు దారులుగా ఉన్నారు. దేశంలో 20 శాతం సాగు భూమి కౌలు దారుల చేతిలో ఉన్నట్లు పాత అంచనాలు తెలుపుతున్నాయి. జాతీయ నమూనా సర్వే సంస్థ 2021-22లో జరిపిన అధ్య యనం ప్రకారం 45.5 శాతం శ్రామికులు వ్యవసాయ రంగం లో పనిచేస్తున్నారు. కాని, దేశపు స్థూల జాతీయాదాయంలో వ్యవసాయ రంగపు వాటా 17 శాతంగానే ఉన్నది.

**దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన కొన్నాళ్ల తర్వాత 1950-51లో అప్పటి జాతీయ స్థూల ఆదాయంలో వ్యవసాయ రంగపు వాటా 54 శాతంగా ఉంది. అప్పుడు శ్రామికుల్లో 70 శాతం మంది వ్యవ సాయంపై ఆధారపడి జీవించేవారు. 1950-51లో వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ శ్రామికుల సగటు ఆదాయంతో పోలిస్తే ఇతర రంగాలపై ఆధారపడ్డ శ్రామికుల సగటు ఆదాయం 1.73 రెట్లుగా ఉండేది. తాజా అంచనాల ప్రకారం వ్యవసాయరంగపు సగటు శ్రామికుడి ఆదాయంతో పోలిస్తే ఇతర రంగాలపై ఆధార పడ్డ శ్రామికుల సగటు ఆదాయం 4.06 రెట్లుగా ఉంది. స్థూలం గా ఈ గణాంకాలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారు సాపేక్షికంగా మరెంతో పేదలైనట్లు అర్థమవుతున్నది.**

## ప్రపంచవ్యాప్తంగా తీరు తెన్నులు

ఏ దేశపు ఆర్థిక పురోగతిని పరిశీలించినా పారిశ్రామిక విప్ల వాల తర్వాత దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగపు వాటా క్రమేపీ తగ్గుతూ వస్తున్నది. అయితే వ్యవసాయ రంగం నుండి శ్రామికుల బదిలీ కూడా ఇతర రంగాలకు వేగంగా జరిగింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తిలో పాల్గొంటున్న శ్రామికులు ఆ దేశపు శ్రామికుల్లో 1.2 శాతం



మాత్రమే. వ్యవసాయ కమతాల నుండి ఉత్పత్తవుతున్న వస్తువుల విలువ ఆ దేశపు స్థూలజాతీయ ఉత్పత్తిలో 0.7 శాతమే. 2022 లో యూరోపియన్ యూనియన్ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 1.4 శాతం మాత్రమే. యూరోపియన్ యూనియన్‌లోని మొత్తం శ్రామికుల్లో 4.2 శాతం వ్యవసాయం లో పనిచేశారు. ఆస్ట్రేలియాలో చూసే దేశ జాతీయోత్పత్తిలో 2.4 శాతం వ్యవసాయం నుండి లభిస్తున్నది. అలాగే దేశంలోని శ్రామికుల్లో 2.5 శాతం మంది వ్యవసాయం నుండి ఉపాధిని పొందారు. ఇలా అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయ రంగం నుండి శ్రామికులు నిష్క్రమించారు. దాదాపు అంతే వేగంగా జాతీయాదాయంలో వ్యవసాయరంగపు వాటా తగ్గింది. ఆసియా లోని జపాన్‌లో జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగపు వాటా ఇప్పుడు ఒక శాతానికి తగ్గింది. మొత్తం శ్రామికుల్లో మూడు శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దక్షిణ కొరియాలో జాతీయాదాయంలో రెండు శాతం వ్యవసాయం నుండి లభిస్తున్నది. దేశపు శ్రామికుల్లో ఐదు శాతం వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు.

మలేసియాలో జాతీయోత్పత్తిలో 6.3 శాతం వ్యవసాయం నుండి లభిస్తుండగా, దేశపు శ్రామికుల్లో 9.6 శాతం వ్యవసాయం నుండి ఉపాధిని పొందుతున్నారు. ఐతే ఇండోనే సియాలో మాత్రం ఇప్పటికీ 40 శాతం మంది శ్రామికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తు న్నారు. వ్యవసాయ రంగం నుండి లభించే ఆదాయం జాతీయా దాయంలో 15 శాతం మాత్రమే. జనాభాలో మనదేశంతో సమానంగా ఉన్న చైనాలో ఇప్పటికీ 24 శాతం శ్రామికులు వ్యవసాయ రంగంలో ఉపాధిని పొందుతున్నారు. కాని దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగపు వాటా 7.2 శాతం మాత్రమే. 1947లో మన దేశం నుండి విడిపోయిన పాకిస్తాన్ జాతీయోత్పత్తిలో 23 శాతం వ్యవసాయ

రంగం నుండి లభిస్తున్నది. ఆ దేశంలోని శ్రామికుల్లో 37.4 శాతం మంది వ్యవసాయలో నిమగ్నమై ఉన్నారు. ఆ దేశం నుండి 1971లో వేరుపడ్డ బంగ్లాదేశ్‌లో 43 శాతం మంది శ్రామికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కాని, వారివల్ల జాతీయాదాయంలో 13.3 శాతం మాత్రమే లభిస్తున్నది. ఈ గణాంకాలు తెలుపుతున్నదేమిటంటే అన్ని దేశాల్లోనూ జాతీయా దాయాల్లో వ్యవసాయ రంగపు వాటా తగ్గుతున్నది.

ఏయే దేశాల్లో పారిశ్రామికీకరణ వేగంగా జరిగి, వ్యవసాయ రంగం నుండి శ్రామికులు బదిలీ త్వరితంగా జరిగిందో ఆ దేశాల్లో రైతులు నిలదొక్కుకోగలిగారు. కాని ఆదాయంలో వాటా తగ్గినంతగా శ్రామికుల బదిలీ జరగని దేశాల్లో రైతుల పరిస్థితి దిగజారింది. ఇండోనేసియా, ఇండియా, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు సాపేక్షికంగా పేదలయ్యారు. భారతదేశంలో అత్యంత ధనిక రైతుల్ని మినహాయిస్తే, మిగిలిన 85 శాతం మంది రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలుదార్లు పేదరికంలో మగ్గుతున్నారు. వారి రుణభారం పెరుగుతున్నది. వారి బొటాబొటీ ఆదాయాలు ఇంటి ఖర్చులకూ, పిల్లల చదువులకూ, ఆరోగ్య అవసరాలకూ చాలక పేదరికం, అనారోగ్యం, అవిద్య అనే విషవలయాల్లో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని అవరోధాలను అధిగమించి కొన్ని కుటుంబాల నుండి పిల్లలు చదువుకొని ఉద్యోగ, వ్యాపారాల్లో పైకొచ్చి దేశ విదేశాల్లో స్థిరపడుతున్నారు. కాని చాలా కుటుంబాల్లో పిల్లలు చదువుకోలేక, చదువుకున్న ఉద్యోగాలు పొందలేక, శారీరక కష్టం చేయలేక, మనుగడ కోసం వ్యవసాయదాయంపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. వ్యవసాయాదాయాలు నామ మాత్రంగా వున్నా భూముల ధరలు మాత్రం నిరంతరం పెరుగుతున్నాయి. వేరే రంగాలలో స్థిర పడాలనుకోనేవారు పొలాన్ని అమ్ముకొని, ఆ పెట్టుబడితో వ్యాపార, పారిశ్రామిక రంగాలకు మళ్ళుతున్నారు. చాలామంది గ్రామాలను అంటి పెట్టుకొని, పాక్షిక ఉపాధితో పరిమితమైన ఆదాయాలతో గ్రామీణ పేదలుగా మిగులుతున్నారు. విద్య కోసం, ఉపాధి కోసం నగరాలకు వెళ్ళిన వారిలో చాలా మంది పట్టణ పేదలుగా జీవిస్తున్నారు.

### తగ్గుతున్న లాభదాయకత

వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వల్ల ఆరు దశాబ్దాలుగా హెక్టారు సగటు దిగుబడి పెరుగుతూనే ఉన్నది. 1960 నుండి 1990 వరకు దిగుబడులు పెరగటానికి ఉత్పత్తి సాధకాలను ఎక్కువగా వాడటమే ప్రధాన కారణంకాగా, 1990 నుండి ఇప్పటి వరకు ఉత్పత్తి సాధకాల సామర్థ్యం పెరగటమే ముఖ్య కారణంగా ఉంది. ఒకవైపు ఉత్పాదకత పెరుగుతున్నా వ్యవసాయ ఉత్పత్తుల వాస్తవ ధరలు మాత్రం తగ్గుముఖం పడుతున్నాయి. ఫలితంగా ఒక హెక్టారు నుండి లభించే నికరాదాయం క్రమంగా తగ్గుతున్నది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడా, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా వంటి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో భూకమతాల సగటు విస్తీర్ణం పెరుగుతున్నది. భారీ యంత్రాల వినియోగం వల్ల శ్రామికుల అవసరం తగ్గి, ఖర్చులు అదుపులో ఉండి వాణిజ్యస్థాయిలో పెద్ద పెద్ద కమతాల్లో వ్యవసాయం గిట్టుబాటు అవుతున్నది. కాని భారత్ వంటి జనసాంద్రత అధికంగా కలిగిన దేశాల్లో భూకమతాల సగటు విస్తీర్ణం తగ్గుతున్నది. ప్రపంచ మార్కెట్ల ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల వాస్తవ ధరలు తగ్గి, జనాభా వత్తిడి వల్ల కమతాల సగటు విస్తీర్ణం తగ్గి, రైతుల వాస్తవాదాయాలు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తగ్గిపోతున్నాయి. తగ్గుతున్న వాస్తవాదాయాలను రైతులు, కౌలుదార్లు, వ్యవసాయ కార్మికులు పంచుకోవాల్సి రావడం వల్ల వ్యవసాయంపై ఆధారపడ్డ కుటుంబాల సగటు వాస్తవాదాయాలు తగ్గిపోతున్నాయి. హరిత, శ్వేత, నీలి విప్లవాల కారణంగా ఉత్పాదకత, ఉత్పత్తి పెరిగాయి. కాని వాటి కోసం మేలు జాతి, సంకర విత్తనాలు, రసాయనక ఎరువులు, పురుగు మందులు, శిలీంధ్ర నాశకాలు, కలుపు నివారణ మందులు, డీజిల్, పెట్రోలుని వాడే ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, బిందు, తుంపరసేద్య పరికరాలు, డీజిల్ పంపుసెట్లు, ఎలక్ట్రిక్ మోటార్లు, పశువుల దాణా, చేపలు, రొయ్యల పెంపకానికి చెరువులు వగైరా అనేక ఖర్చుతో కూడిన కొత్త ఉత్పత్తి సాధకాలను వాడాల్సి వస్తున్నది. వీటి ధరలు పెరిగినంతగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగటం లేదు. కూలీల ఖర్చు ఎక్కువ కావటం వల్ల వ్యవసాయం, పశుపోషణ, మత్స్య పాలనల్లో లాభశాతం తగ్గుతున్నది. సశాస్త్రీయమైన పంటల మార్పిడి జరగనందు వల్ల భూసారం తగ్గటం, ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు ఉండటం వల్ల ఆరోగ్యాలు దెబ్బతినడం జరుగుతున్నది. వీటికి ప్రత్యామ్నాయంగా సేంద్రీయ, సహజ వ్యవసాయాలను కొందరు అనుసరిస్తున్నారు. కాని వాటి వల్ల దిగుబడులు తగ్గుతున్నందున అవి కువ మంది రైతులను ఆకర్షించడం లేదు. దేశానికి కావాల్సిన ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధద్రవ్యాలు, పంచదార, పాలు, మత్స్య ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, పత్తి దేశంలో ఉత్పత్తవుతున్నాయి. కొంత మేరకు ఎగుమతులు జరుగుతున్నాయి. వంట నూనెలు, అపరాలు, ఎండుపళ్ళు వంటివి దిగుమతి అవుతున్నా, దిగుమతుల విలువకన్నా ఎగుమతుల విలువే ఎక్కువగా ఉంటున్నది. వినిమయదారుల అవసరాలు తీరుతున్నా రైతుల ఆదాయాలు మాత్రం తగ్గుతున్నాయి. ఇతర రంగాల్లో ఉపాధి పొందుతున్న వారితో పోలిస్తే రైతులు, కౌలుదార్లు, వ్యవసాయ కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తి సంక్షోభం లేకపోయినా వ్యవసాయం రంగంలో ఆదాయ

సంక్షోభం మాత్రం తీవ్రతరం అవుతున్నది. భారతదేశంలో ఒక వ్యవసాయ విధానాన్ని రూపొందించినా, రైతుల ఆధాయాలను రెట్టింపు చేస్తామనే ప్రగల్భాలు పలికినా, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు వచ్చినా అవి ఏమీ అమలుకు నోచుకోలేదు. మార్కెట్ శక్తుల దోపిడీకి గురవతున్న రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నది. ప్రతి ఏటా వేలాది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉపశమన చర్యలుగా రుణమాఫీ, పెట్టుబడి సాయం, సబ్సిడీలు, ఉచిత విద్యుత్, వడ్డీ రాయితీ, కరువు సాయం, వరద పీడితులకు నష్టపరిహారం వంటి అనేక పథకాలను తెస్తున్నా దీర్ఘకాలిక సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయి.

## భిన్నమైన అభివృద్ధి వ్యూహం సాధ్యమేనా?

ప్రపంచదేశాల అభివృద్ధి గమనం దాదాపు ఒకేలా సాగింది. వ్యవసాయ రంగం నుండి పెట్టుబడులు, శ్రామికులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్న పారిశ్రామిక, సేవారంగాల వైపు మళ్ళారు. పెట్టుబడిపై అధిక లాభాలనందించిన ఆ రంగాలు వేగంగా పెరిగి, ఉపాధి అవకాశాలను కల్పించాయి. తొలుత పారిశ్రామిక రంగం, ఆ తర్వాత సేవారంగం వినిమయదారులకు కొత్త వస్తువులు, సేవలనందించాయి. పట్టణీకరణకు ఊపిరులూదాయి. 2021లో ప్రపంచ స్థూల ఉత్పత్తిలో సేవారంగపు వాటా 64.43 శాతం, పారిశ్రామిక రంగపు వాటా 27.59 శాతం, వ్యవసాయ రంగపు వాటా 4.3 శాతంగా నమోదయ్యాయి. కాని ఉపాధిలో మాత్రం సేవా రంగపు వాటా 26.8 శాతమే. పారిశ్రామిక రంగం 24.3 శాతం మందికి ఉపాధిని కల్పిస్తుండగా, వ్యవసాయం, అడవీ రంగం, ఖనిజాల వెలికితీత, జలాశయాల నిర్వహణ వంటి ప్రాథమిక రంగాలపై 48.9 శాతం శ్రామికులు ఉపాధి కోసం ఆధారపడుతున్నారు. అధిక జనాభా, జనసాంద్రత కల్గిన ఇండియా, చైనా, ఇండోనేసియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో గ్రామీణ ప్రాంతాలు, ప్రాథమిక రంగాలు ఇప్పటికీ ఉపాధికి ముఖ్య కేంద్రాలుగా నిలిచాయి. ఈ దేశాల్లోనే వ్యవసాయంపై ఆధారపడ్డ వారి సాపేక్షిక పేదరికం దుర్భరస్థాయిలో ఉన్నది. ఈ దేశాల్లో దేశీయాదాయాల్లో వ్యవసాయపు వాటా పెంచడం సాధ్యమా? భారీ యంత్రాల వినియోగంతో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటున్న అభివృద్ధి చెందిన దేశాల్లోని రైతులతో చిన్న కమతాలు, ఎక్కువ శ్రామికుల వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతున్న పేద దేశాల రైతులు పోటీ పడగలరా ? అన్ని దేశాల్లాగానే వ్యవసాయం నుండి శ్రామికుల బదిలీ తప్పదా ? చైనా సాధించిన పారిశ్రామికీకరణను భారతదేశంలో అనుకరించడం సాధ్యమా ?

ప్రస్తుతం సాంకేతికంగా వస్తున్న మార్పుల వల్ల పెట్టుబడులు పెరిగినంతగా ఉపాధి అవకాశాలు పెరగటం లేదు. ఈ పరిస్థితుల్లో దేశంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించడం, శ్రామికుల్ని బదిలీ చేయటం వీలవుతుందా ? ఈ ప్రశ్నలే భారత అభివృద్ధి వ్యూహంపై రేకెత్తుతున్నాయి. దేశంలో ఒకప్పుడు భూమి ఉపాధి సాధనంగా ఉండేది. కాని ఇప్పుడు భూమి ఆస్తిగా, విలువ కలిగిన వనరుగా మారింది. ఏదైనా అద్భుతం జరిగి, మార్పులు సంభవిస్తే తప్ప వ్యవసాయంలో తరుగుతున్న ఆదాయాలపై పెరుగుతున్న శ్రామికులు ఆధారపడటం తప్పేటట్లు లేదు. గ్రామాలకు దూరంగా నివసించే భూస్వాములు, రైతులు, కౌలుదార్లు, వ్యవసాయ కూలీలు అరకొరగా లభిస్తున్న వ్యవసాయాదాయంలో వాటాల కోసం పోటీ పడుతున్నారు. గ్రామీణ పేదరికం తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించటం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు, గ్రామీణ పేదలకు ఉపశమనం కలిగించే విధానాలే శిరోధార్యం. భారతదేశంలో పేజీల కొద్దీ రూపొందించిన వ్యవసాయ విధానం ఉంది. కాని అది ఆచరణలో రైతుల్ని, గ్రామీణ పేదల్ని ఉద్ధరించింది లేదు. జపాన్ ప్రభుత్వం కొన్ని దశాబ్దాలపాటు ఏకవాక్య విధానాన్ని అమలు పరిచింది. 'రైతుల ఆదాయాలు నీలి చొక్కా కార్మికుల ఆదాయాలతో సమానం' అయ్యే వరకు వ్యవసాయ అనుకూల విధానాలను అమలు చేస్తామని ప్రకటించి, అమలు చేసింది. అందుకోసం ప్రపంచ మార్కెట్‌లోని బియ్యం ధరకు 8 నుండి 10 రెట్లు ధరలనిచ్చి వినిమయదారులపై భారం వేసి, రైతుల్ని ఆదుకుంది. ఆ స్థాయిలో కాకున్నా కొంత వినిమయదారులపై భారం వేసి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన అవసరం భారతదేశంలో కూడా ఉంది.

## ఎగుమతి-దిగుమతి విధానాలు

ప్రస్తుతం దేశంలో గోధుమలు, గోధుమ పిండి, నాన్-బాస్మతీ బియ్యం, ఉల్లిపాయలు, పంచదారల ఎగుమతిపై నిషేధం కానీ, ఆంక్షలు గానీ ఉన్నాయి. ఇవి వినిమయదారుల రక్షణ కోసం, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయటానికీ ఉద్దేశింపబడినవి. అలాగే దిగుమతి అవుతున్న వంట నూనెలు, పప్పులు, ఎండుపళ్ళు వంటి వాటిపై దిగుమతి సుంకాలను కనీస స్థాయికి తెచ్చారు. ఇందుకోసం, గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు 'ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలను' 'బూచి'గా చూపిస్తున్నాయి. కాని మనం ప్రపంచ వాణిజ్య సంస్థకు తెలియపరిచిన సుంకాలకన్నా చాలా తక్కువ స్థాయిలోనే వాస్తవ సుంకాలుంటున్నాయి. ఎగుమతయ్యే వస్తువుల ధరలను ప్రపంచ మార్కెట్ ధరల కన్నా తక్కువగా ఉంచటం, దిగుమతయ్యే వస్తువుల ధరలను ప్రపంచ మార్కెట్ ధరలను స్థాయిలోనే ఉంచడం ద్వారా వినిమయదారుల ప్రయోజనాలకే ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను తొక్కి పెట్టి ఉంచి, రైతుల ఆదాయాలను దెబ్బ తీస్తున్నాయి. ప్రభుత్వ ఎగుమతి-దిగుమతి విధానాల వల్ల దేశంలోని రైతులు ప్రతి సంవత్సరం కొన్ని లక్షల కోట్ల రూపాయలను నష్టపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల

ఉత్పత్తి వ్యయాన్ని తక్కువగా అంచనా వేసి మద్దతు ధరలను తక్కువగా ప్రకటించడం, అవసరమైనప్పుడు సేకరణ మద్దతుని అందించకుండా కనీస మద్దతు ధరలకన్నా తక్కువ ధరకలే రైతులు మార్కెట్‌లో అమ్ముకోవలసి రావడం, మద్దతు ధరలకు చట్టబద్ధ రక్షణను కల్పించకపోవడం అన్నీ ప్రభుత్వ వ్యూహంలో భాగాలే. ద్రవ్యోల్బణ నియంత్రణే తమ ప్రధాన లక్ష్యంగా, అందుకు రైతుల్ని బలి పశువులుగా చేయడం తమ ఎత్తుగడగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని ఉత్తర భారతంలోని రైతులు ఒక సంవత్సరంపాటు చేసిన ఆందోళనకు తలొగ్గినట్టుగా నటించి, ఆ తర్వాత వాగ్దానాలను ప్రభుత్వం నీరుగార్చింది. పోరాటంలో చూపిన ఐక్యతను రాజకీయ శక్తిగా మలచుకోలేక రైతు సంఘాలు విఫలమయ్యాయి. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల పాత్రను పెంచి, మార్కెట్ కమిటీల నియంత్రణను తగ్గించి, మూడు వ్యవసాయ బిల్లులను ఉప సంహరించుకున్నా మరో రూపంలో అదే విధానాలను రాబోయే ఎన్నికల తర్వాత తీసుకురావచ్చు.

### ఉపశమన చర్యల కొనసాగింపు

రైతులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితుల్లో వారి అప్పులు పెరిగిపోతున్నాయి. కొందరు సున్నిత మనస్కుల్కె వైఫల్యాలను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నిసార్లు రుణమాఫీని అమలు చేసాయి. ఐతే ఇందువల్ల రైతులు ఐచ్ఛికంగా రుణాలను చెల్లించటం లేదని గ్రహించి, రాజకీయ పార్టీలు ఈ హామీలను తక్కువగా ఇస్తున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా పెట్టుబడి సాయాన్ని ముందుకు తెచ్చారు. తెలంగాణాలో రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు సంవత్సరానికి పదివేల రూపాయలిచ్చారు. దానిని 15 వేల రూపాయలకు పెంచుతామనే హామీతో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చింది. దానితో పాటు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని చేస్తామన్నారు. ఈ రెండు హామీలను నెరవేర్చటానికి నిధులు సమకూర్చుకోవటానికి ప్రయత్నిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి ఆరు వేల రూపాయల సాయాన్ని అందిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానితో కలిపి రైతుకు రూ.13,500 చొప్పున సాయాన్ని అందిస్తున్నది. ప్రతిపక్ష పార్టీలు దానిని ఇంకా పెంచుతామని, కౌలుదార్లకు, వ్యవసాయ కూలీలకు కూడా కొంత సాయం చేస్తామని ప్రకటిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో వున్న ఆదాయ సంక్షోభానికి ఇలాంటి పరిష్కారాలను అందించడం ద్వారా రైతుల ఓట్లను సంపాదించవచ్చనే ఆశతో ఇలాంటి హామీలతో పోటీ పడుతున్నాయి. రాబోయే మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని కొంత మేరకు పెంచే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. సంవత్సరానికి రూ.70 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. దీనితో పోలిస్తే ఎరువుల సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం మరెంతో ఎక్కువ ఖర్చు చేస్తున్నది. 2022-23లో 2.55 లక్షల కోట్లు ఖర్చయినట్లు ప్రకటించింది. 2023-24 బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి రూ.1.75 లక్షల కోట్లు కేటాయించారు. వాస్తవ ఖర్చు ఏ స్థాయిలో ఉంటుందో కొన్ని నెలల తర్వాత గాని తెలియదు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం 60 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. 2022-23లో ఖర్చు చేసిన దానితో పోలిస్తే 33 శాతం తక్కువగా ఈ కేటాయింపు ఉంది. ఈ పథకానికి ఖర్చు చేస్తున్న మొత్తానికి తగ్గ పనులు గ్రామీణ ప్రాంతాల్లో జరగటం లేదని, వనరులు, సామాజిక ఆస్తులు ఏర్పడటం లేదనే భావన వల్లనే కేటాయింపులు తగ్గాయి. దాదాపు 20 లక్షల కోట్ల రూపాయలను బ్యాంకులు రుణాలుగా సమకూరుస్తున్నాయి. ఆ రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. వ్యవసాయం ప్రకృతి వైపరీత్యాలకూ, చీడపీడల తాకిడికి తరచు కష్టనష్టాలకు గురవుతోంది. 'ప్రధానమంత్రి కృషి బీమా యోజన' పథకం కొన్నేళ్ళుగా అమలవుతున్నా చాలా రాష్ట్రాలు అసంతృప్తితో బయటకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో స్వంతంగా ఒక పథకం అమలవుతున్నది. తెలంగాణలో ప్రస్తుతం ఏ పథకం అమల్లో లేదు. ఈ పథకాలేవీ రైతులకు కనీసం సగం వరకైనా నష్ట పరిహారం దక్కడం లేదు. బాగా నష్టం జరిగినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నష్ట పరిహారం ఇవ్వడం కాని, ఇన్‌పుట్ సబ్సిడీగాని అందిస్తున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నీటిపారుదల సౌకర్యాలకు, ఉచిత విద్యుత్ కోసం నిధులను ఖర్చు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వాటికి పరిమితమైన సాయాన్ని అందిస్తున్నది. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి దాదాపు ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తున్నాయి. ఐతే ఎగుమతి, దిగుమతి విధానాల వల్ల ఈ రంగానికి అదే మేరకు నష్టం వాటిల్లుతున్నది.

### వ్యవసాయ రంగం నిలదొక్కుకోవటానికి ఏం చేయాలి?

ప్రపంచమార్కెట్లపై పశ్చిమ దేశాల ఆధిపత్యం పెరుగుతున్నది. అన్ని దేశాల్లోనూ కార్పొరేట్ల గుత్తాధిపత్యం తీవ్రతరమౌతున్నది. దేశాల ఆదాయ పంపిణీలో శ్రామికుల వాటా తగ్గిపోతూ, పెట్టుబడి వాటా అధికమౌతున్నది. కొన్ని దేశాల్లో మాత్రమే ఆదాయ పంపిణీలో వివిధ వర్గాల మధ్య అంతరాలను తగ్గించాలని, అన్ని వర్గాల వారికి కనీస ఆదాయాన్ని అందేలా మానవీయ సమాజాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారతదేశంలో గుత్తాధిపత్యం పెరుగుతున్నది. ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మెరుగుపరచటానికి ప్రయత్నించకుండా

వాటిని ప్రైవేటుపరం చేయటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశపు వ్యవసాయరంగం పెట్టుబడి ఆధిపత్యం నుండి ఎంత వరకు తప్పించుకోగలుగుతుంది ? నగరాల చుట్టు మట్ల ప్రాంతాల్లో పారిశ్రామిక, వ్యాపార, సేవారంగాల్లో డబ్బు సంపాదించిన వారు రైతుల పొలాన్ని కొంటున్నారు. ప్రత్యక్ష పెట్టుబడులే కాకుండా పరోక్షంగా కార్పొరేట్ల ఉత్పత్తి సాధకాలను అధిక ధరలకు అమ్ముతూ, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరలకు కొంటూ లాభాలు గడిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఆ శక్తులకు కొమ్ము కాస్తున్నది. ఒకవేళ రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వచ్చినా, అభివృద్ధి వ్యూహం మారుతుందనే నమ్మకం లేదు. ఒకవేళ రైతు అనుకూల విధానాలను అవలంబించే ప్రభుత్వాలు ఏర్పడితే ద్విముఖ వ్యూహాన్ని అవలంబిస్తేనే వ్యవసాయ రంగం తాత్కాలికంగా నిలదొక్కుకోగలుగుతుంది. వ్యవసాయ రంగంలోని రైతులు, కౌలుదారులు లాభాల బాట పట్టాలంటే మూడే మార్గాలున్నాయి. మొదటిది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం. రెండవది మెరుగైన దిగుబడుల్ని సాధించడం. మూడవది రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం. ఉత్పత్తి వ్యయం తగ్గటానికి ఉత్పత్తి సాధకాలపై సబ్సిడీలను పెంచాలి. ప్రభుత్వ రంగంలో ఎరువులు, పురుగు మందులు, శిలీంధ్ర నాశకాలు, సేంద్రీయ ఎరువులు, కలుపు నివారణ మందులు, యంత్ర పరికరాలు, సూక్ష్మ సేద్యపు పరికరాలు తయారు చేసి అందించాలి. దిగుబడు లను పెంచాలంటే పరిశోధనలపై ఎక్కువ నిధులు ఖర్చు చేయాలి. వ్యవసాయపు ఉత్పత్తుల విలువలో 0.5 శాతాన్ని మాత్రమే దేశం పరిశోధనలపై ఖర్చు చేస్తున్నది. దానిని ఒక శాతానికి పెంచుతామని గత యూపీఏ ప్రభుత్వం చెప్పింది. కాని ఇప్పటికీ అది కార్యరూపం ధరించలేదు. ఇక గిట్టుబాటు ధరలు రావాలంటే ఎగుమతి, దిగుమతి విధానాలను సంస్కరించాలి. వినిమయదారులకు 20 శాతం ధరలు పెరిగినా, ద్రవ్యోల్బణం గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా రైతుల శ్రేయస్సు కోసం గిట్టుబాటు ధరలు కల్పించటానికి ఇది అవసరం. కనీస మద్దతు ధరల్ని స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం నిర్ణయించి, వాటికి చట్టబద్ధత కల్పించి, అవసరమైనప్పుడు సేకరణ మద్దతు నందించాలి. రాబోయే ఎన్నికల్లో రైతు అనుకూల ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయనీ, అవి రైతు సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాము. ❑

# లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలి ?

**(40వ పేజీ తరువాయి)**

రక్షించుకోవటానికి 300 శాతం వరకు దిగుమతి సుంకాలను విధించవచ్చని ప్రపంచ వాణిజ్య సంస్థ కూడా చెప్పింది. అయినా దిగుమతుల సుంకాన్ని 12.5 శాతానికి తగ్గించి విదేశీ రైతులను, అదానీ వంటి దళారీలను ప్రోత్సహిస్తున్నారు. రాయలసీమ జిల్లాలలో వేరుసెనగ గిట్టుబాటు కాక రైతులు ఆత్మ హత్య చేసుకున్నారు. ముందే ప్రోత్సాహకరంగా మంచి MSPని ప్రకటించి పామ్ ఆయిల్ రైతులకు, వేరుశనగ రైతులకు లాభసాటి ధరలు ఇవ్వవచ్చు కదా! వంట నూనెల దిగుమతుల కారణంగా ఖజానాకు అయ్యే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటే రైతులకు ఎన్నైనా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చు. భారత ప్రభుత్వం, జాతీయ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్ పామ్ (NMEO-OP)ని 2021లో ప్రారంభించినా ఫలితం రాలేదు. దీర్ఘకాలిక దృష్టితో దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల ను చురుకుగా ప్రోత్సహించి, మద్దతు ధరను ఆకర్షణీయంగా పెంచితే స్థానిక నూనె గింజల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. పరిశోధన, సాంకేతికత మరియు వ్యవసాయ పద్ధతులలో పెట్టుబడిని పెంచి దిగుబడులలో రికార్డు స్థాయికి చేరవచ్చు.

9. ఎరువులు పురుగు మందులు వాడకుండా చేసే ప్రకృతి లేక ఆర్గానిక్ వ్యవసాయం వలన భూసారం క్షీణించకుండా వుండటమే కాకుండా ఆహారం తీసుకున్న ప్రజల ఆరోగ్యం బాగా వుంటుంది. అయితే లాభమే ధ్యేయమైన పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రకృతి వ్యవసాయం అత్యాశే. పంట దిగుబడులు తగ్గుతున్నందు వలన ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగు చేయటం లేదు. పంటల రేటు ఎక్కువవటం వలన వినియోగదారులు కొనటం లేదు. రైతుకు లాభం రానందున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపటం లేదు. దేశం ఆహార భద్రతకు కావలసినంత ఆహారం ప్రకృతి వ్యవసాయం వలన లభ్యం కాదు. ప్రజల ఆరోగ్యం కాపాడుకోవడానికి, భూసారం కాపాడుకోవడానికి, ప్రకృతి వ్యవసాయం చేసే రైతు లాభపడేటట్లుగా సబ్సిడీ ద్వారా రైతును ప్రోత్సహించాలి. ప్రకృతి వ్యవసాయ సర్టిఫైడ్ ఉత్పత్తులకు ప్రత్యేక కనీస మద్దతు ధరను నిర్ణయించాలి.

10.వ్యవసాయాభివృద్ధిని కాంక్షించే రైతులు, మేధావులు, రైతు కార్యకర్తలు ఈ సమస్యల మూలాలను అధ్యయనం చేయాలి. ప్రజలు చైతన్యం పొందేటట్లు సహాయం చేయాలి. వ్యవసాయ రంగాన్ని కబళించి దేశ సార్వభౌమత్వాన్ని పాదాక్రాంతం చేసుకోవాలనుకుంటున్న కార్పొరేటు ద్రవ్య పెట్టుబడి సంస్థల కుట్రలను ఎదుర్కోవాలి. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ కొన్ని కీలకమైన మంచి సిఫార్సులు చేసింది. కనీసం ఆ సిఫార్సులనైనా పూర్తిగా అమలు చేయమని ప్రభుత్వాన్ని రైతు కూలీలు, ప్రజలు నిలదీయాలి. వ్యవసాయ సంక్షోభం సమాజ సంక్షోభంలో భాగమనే విషయాన్ని గమనంలో వుంచుకుని ప్రజలతో కలిసి లాభసాటి వ్యవసాయం కోసం పోరాడాలి – సాధించాలి. ❑

# నియోలిబరల్ ఉత్పత్తి విధానాలు - ప్రత్యామ్నాయాలు

- డాక్టర్ మర్ల సోము



రైతు కుటుంబ వినియోగానికి కాక, పూర్తిగా మార్కెట్‌లో విక్రయించటానికే పంటలు పండించి పెట్టుబడిదారీ ఆహారోత్పత్తి 70వ దశాబ్దంలో హరిత విప్లవంతో ప్రారంభమైంది. కాగా, గత మూడున్నర దశాబ్దాలుగా ప్రవేశపెట్టబడిన నియోలిబరల్ ఉత్పత్తి విధానం సాగులో ఇన్‌పుట్‌లు, ఉత్పత్తి రంగాల నుండి మార్కెటింగ్, సరఫరా గొలుసు (వేల్యూ చెయిన్స్) అంతర్జాతీయ విపణికి విస్తరించింది. ప్రపంచ వ్యాప్తంగా 2008లో నెలకొన్న ఆహార సంక్షోభం, ఇటీవల రైతాంగం సాగు చట్టాలకు వ్యతిరేకంగా సల్పిన సుదీర్ఘ పోరాటం, వ్యవసాయ రంగంలోకి విస్తరించిన కార్పొరేట్, విదేశీ బహుళ జాతి సంస్థల పాత్రకు నిదర్శనం.

**సేద్యంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రధానంగా నాలుగు అంశాలున్నాయి**

- 1.ఆహారోత్పత్తులను పూర్తిగా మార్కెట్ సరుకు (కమోడిటీస్)గా మార్చివేయటం.
- 2. రైతుల భూమి, ప్రభుత్వ మార్కెట్లు, సరఫరా, ప్రభుత్వ రంగంలోని వ్యవసాయ పరిశోధన సంస్థలను ఇతర వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే ఆదిమ సంచయనం(లేదా కూర్పు).
- 3. పంటను పండించిన రైతుకు పెరిగిన ఆహారోత్పత్తులు దక్కక గ్రామాల్లో ఆకలి పెరిగి ఆహార అభద్రత పెరగటం. సంపద విభాజనలో వ్యత్యాసాల కారణంగా విపరీతంగా పెరిగిన గ్రామీణ అసమానతలు.
- 4.అధికోత్పత్తికై ప్రవేశపెట్టిన హానికార రసాయనాల కారణంగా సారం తగ్గి నేలలు, భూగర్భ జలాలు, కాలువలు, నదులు, పర్యావరణం, ప్రజారోగ్యం కాలుష్యమై పర్యావరణ సంక్షోభం నెలకొనటం.

2015-22 సంవత్సరాల మధ్య విత్తనాలు, ఎరువులు (యూరియా మినహాయింపు), డీజిల్, పురుగు మందులు, ట్రాక్టర్ల ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. అదే సమయంలో వ్యవసాయోత్పత్తుల 'వాస్తవ' ధరలు 60 శాతం తగ్గాయి. దేశీ విత్తన మార్కెట్‌లో ప్రభుత్వ రంగ వాటా 40 శాతం కాగా, దానిలో 90 శాతం బేమరు, అజెంటా, కోర్నోవా (గతంలో మోన్‌సాంటా)ల వాటాగా ఏర్పడి, ప్రపంచ ఎరువుల మార్కెట్‌లో 70 శాతం నాలుగు ప్రధాన బహుళ జాతి కంపెనీలది కాగా, ట్రాక్టరు మార్కెట్‌లో 90 శాతం జాన్‌డీర్, కుబోటా, న్యూహా లాండ్ కంపెనీలది. ప్రపంచ ధాన్య వ్యాపారంలో 40 శాతం కార్గిల్, ఏడీబీ తదితర అగ్రి బిజినెస్ ప్రపంచ కంపెనీల ఆధీనంలో ఉన్నది. 2008లో బుర్కిని ఫాసో, ఈజిప్టు, ట్యూనీషియా తదితర దేశాల్లో నెలకొన్న తిండి గింజల కరువుకు ఈ బహుళ జాతి సంస్థలే కారణంగా భావిస్తారు. బ్రిటిషు వలస పాలనతో ఆహారధాన్యాల స్థానంలో ఎగుమతికై వ్యాపార పంటలైన ఇండిగో, ప్రత్తి, చెరకు పంటలు వేయడంతో ఐదు ప్రధానమైన కరువులకు కోట్ల మంది మరణించారు. 1965 వరకు 7 బిలియను డాలర్ల వ్యవసాయ మిగులు కల ఆఫ్రికా దేశాలు నేడు 1.15 ట్రిలియన్ డాలర్లు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. విశేషమేమంటే బేయరు, మెర్కు, డోన్ వంటి రసాయన కంపెనీలే విత్తనాలను (జన్యుమార్పిడితో సహా) పురుగు, కలుపు మందులను వ్యాధులకు ఔషధాలను తయారీ చేసే పరిశ్రమలుగా నుండటం. పెట్టుబడిదారుడికి స్వల్ప కాలంలో భారీ లాభాలను అర్జించటం తప్ప ప్రజారోగ్యం, ఉత్పత్తిదారుల ఆకలి, పర్యావరణ విధ్వంసం పట్టవు. పంటలను పండించిన రైతుకి కూడా ఆహారాన్ని దూరం చేసి ప్రకృతి నుండి విడదీస్తుంది. యాంత్రీకరణ నూతన సాంకేతికతతో దీనినే మార్క్స్ పరాయికరణగా పేర్కొంటాడు.

గ్రామాల్లో ఉత్పత్తయిన ఆహారోత్పత్తులు సుదూర నగరాలకు ఎగుమతై, అక్కడ వ్యర్థాలు వాతావరణాన్ని, నదులను కాలుష్యం చేస్తుండటాన్ని పేర్కొంటాడు. ఆహార, పశువుల వ్యర్థాలు తిరిగి మట్టిలోకి చేరకపోవటంతో పంట పొలాలు పోషకాలను కోల్పోయి నిస్సారమవుతున్నాయని, ప్రకృతిలోని ఆహార చక్రం దెబ్బ తినటాన్ని జీవ ప్రక్రియలోని తీవ్రమైన లోటుగా పేర్కొంటాడు (గ్రూంతి యాస్, 1973, పెంగ్విన్ ప్రచురణ). ప్రకృతిలో "జీవ ప్రక్రియ" దెబ్బ తినడాన్ని ఇటీవల ప్రఖ్యాత జీవ శాస్త్రవేత్త బెలోమి ఫాస్టర్ "మెటబాలిక్ రిఫ్ట్"గా పేర్కొంటాడు. మనిషి, మొక్కలు, అన్ని ఇతర జీవ రాశులు ప్రకృతిలో భాగమే. మానవ శ్రమతో తయారయ్యే ఉత్పత్తులన్నిటికీ సహజమైన ప్రకృతితో సంబంధం ఉంటుంది. ఆహారోత్పత్తి మూలమైన వ్యవసా యాన్ని తిరిగి ప్రకృతితో ముడి పెట్టినప్పుడే, ప్రకృతి మన

భవిష్యతరాలకు భద్రపర్చబడుతుంది. మానవ మనుగడకు రక్షణ ఉంటుంది. పెట్టుబడిదారీ, మితిమీరిన యాంత్రిక వ్యవసాయానికి భిన్నంగా రైతులను సహజమైన భాగస్వాములుగా చేసే సమిష్టి సహకార వ్యవసాయ ఉత్పత్తి విదానాన్ని ప్రత్యామ్నాయంగా గ్రామీణ పేదలు సాధించుకోవాలని మార్క్స్ పేర్కొంటాడు. ఈ సహకార సేద్య ఆహారోత్పత్తిని గ్రామాల్లో ప్రవేశ పెట్టి గత సోవియట్ యూనియను, చైనా, వియాత్నం తదితర దేశాల్లో ఆకలిని పారద్రోలి, గ్రామీణ పేదరికాన్ని దూరం చేయగలరు. కాగా కొన్ని వేల సంవత్సరాల నుండి కొనసాగు తున్న ప్రైవేటు వ్యవసాయ ఉత్పత్తి విధానాన్ని క్రమంగా, వివిధ దశల్లో మార్చటానికి బదులు సోషలిస్టు దేశాలు తొందరపాటుతో చేసిన కొన్ని అనవసర ప్రయోగాల వలన కొంత అపశ్రుతులు ఉండటం అంగీకరించాల్సిందే. దీర్ఘకాలిక పరిష్కారమైన సోషలిస్టు సహకార వ్యవసాయ ఉత్పత్తి విధానం తప్పనిసరి. అదే సమయంలో ఆహారాన్ని వ్యాపార సరుకుగా మార్చిన పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానానికి ప్రత్యామ్నాయంగా ప్రకృతితో దగ్గరైన ఆహారోత్పత్తి విధానాలను, ఆవశ్యకమైన సంస్కరణలను పరిశీలిద్దాం.

## భూ సంస్కరణలు

భూ సంస్కరణలకు కాలం చెల్లిందని, పంచటానికి ఒక ఎకరం భూమి కూడా మిగల లేదనే ధనిక రైతులు, పత్రికలు, కొందరు ఆర్థికవేత్తలను పక్కన పెడితే గ్రామాల్లో నాలుగు శాతం పేదలు భూమిలేని వారే. దాదాపు సగం వ్యవసాయ భూమి కేవలం ఎనిమిది శాతం ధనిక రైతు కుటుంబాల వద్ద, అధిక సంఖ్యలో (86 శాతం) చిన్న రైతుల వద్ద 43 శాతం సాగుభూమి ఉన్నది. చిన్న రైతుకు పంటల సాగు నుండి లభించే ఆదాయం 36 శాతానికి పడిపోయింది. దేశ సంపద సృష్టి (జి.డి.పి.)లో వ్యవసాయ భాగం కేవలం 15 శాతం మాత్రమే. ప్రభుత్వ బడ్జెట్ లో సైతం 70 కోట్ల జనాభా ఆధారపడే వ్యవసాయ రంగంపై ఖర్చు కేవలం 3.6 శాతానికి మించటం లేదు. గ్రామీణ పేదరికాన్ని పారద్రోలకుండా మన దేశం ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఎదగలేదు. దీనికి పరిష్కారంగా ఉత్పత్తిని, ఉత్పాదకతను అభివృద్ధి చేసి రైతు కుటుంబాల ఆదాయాన్ని ఇతోధికంగా పెంచటానికి భూమి లేని పేదలను, కౌలు రైతులకు భూమి పంచి వారిని సమాన ఉత్పత్తిదారులుగా చెయ్యాలి. కాశ్మీరు, బెంగాల్, కేరళలో భూసంస్కరణలు అమలు జరిగినా, తదుపరి కేరళలో తప్ప చిన్న రైతుకు ఆదాయభద్రత కల్పించటంలో మిగిలిన రెండు రాష్ట్రాలు విఫలమయ్యాయి.

## ప్రకృతి సేద్యం

హరిత విప్లవ సాగులో ఇన్‌ఫుట్‌లైన విత్తనాలు, డీజిల్, ఎరువులు వగైరాలపై వ్యయం చిన్న రైతు భరింపరానిదిగా నున్నది. మితిమీరిన రసాయనాల వినియోగంతో నేల సారాన్ని కోల్పోవటమే కాక, పర్యావరణం, మానవ ఆరోగ్యం దెబ్బ తిని మనిషి మనుగడ ప్రశ్నార్ధకమవుతున్నది. దీనికి భిన్నంగా రసాయనిక ఎరువులను, పురుగు, కలుపు మందులను క్రమంగా తగ్గిస్తూ, ఆహార, పంట వ్యర్థాలను, పాడి, కోళ్ళ పరిశ్రమ వ్యర్థాలను తప్పనిసరిగా పంట పొలాలకు మళ్ళించాలి. వీటికి తోడుగా కంపోస్టు వానపాముల వర్మీ కంపోస్టు వగైరా సేంద్రీయ ఎరువులను క్రమంగా వినియోగించటం వలన, నేలలో పి.హెచ్ (ఆమ్ల, క్షార గుణాలు) తగ్గి, ఉపయోగకర ఫంజై, సూక్ష్మజీవులు, వానపాములు, పేడ పురుగులు తదితరాలు వృద్ధి అవుతాయి. వీటి వలన నేల లోపలి పొరల్లోని భాస్వరం, మాంగనీసు, ఇనుము తదితర లఘు లవణాలకు మొక్కల వేళ్ళకు అందుబాటులోకి వస్తాయి. మట్టిలో సేంద్రీయ కర్బనం (హ్యూమస్) పెరగటం వలన రసాయన ఎరువుల వినియోగం 60 శాతం వరకు తగ్గుతుంది. వీటి వినియోగం హెచ్చి, మొక్కలకు చీడ పెడలను తట్టుకొనే శక్తి పెరుగుతుంది. తరచుగా వరి, ప్రత్తి, మొక్కజొన్న తదితర పంటలు దోమపోటు, కాండం తొలిచే పురుగు, తెల్ల దోమ, అగ్గి తెగుళ్ళకు గురవుతాయి. రక్షణగా పొలం చుట్టూ గట్లపై బంతి, జొన్న, ధనియా పంటలను, వీలయితే చెట్లను పెంచి పక్షులకు, పిచ్చుకులను ఆకర్షించాలి. ఆరు తడి పంటల్లో పంటల మధ్యలో వరుసల మధ్య బంతి, కాయగూరలు వేయటం ద్వారా కూడా కీటకాల, తెగుళ్ళ తాకిడి తగ్గుతుంది. సమీకృత సస్యరక్షణ చర్యలైన వేప, పొగాకు, బెల్లం కషాయాలను, బైకోడెర్మామిత్ర పంజై ద్రావణాన్ని, పంటలపై పిచికారి చేసుకోవటం ద్వారా అనేక తెగుళ్ళు నుండి రక్షణ లభిస్తుంది. కీటకాలు వృద్ధి చెందకుండా పొలం మధ్యలో ఫెర్మోనులింగాకర్షణ బుట్టలను పెట్టుకోవాలి. రసాయనాలు వినియోగించకుండా ప్రకృతి పరంగా పండించిన ఆహారానికి, ప్రత్తి దుస్తులకు నగరాల్లో, ఐరోపా, అరబ్ దేశాల్లో మంచి గిరాకీ కలదు. ఉన్నట్లుండి ఒక ఉదుటన రసాయనిక ఎరువుల స్థానంగా మొత్తంగా సేంద్రీయ ఎరువులను వాడటం శ్రేయస్కరం కాదు. పంటలు సైతం అధిక మోతాదుల్లో వినియోగించే రసాయనాలకు అలవాటుపడ్డాయి. ఇటీవల శ్రీలంకలో వలె తీవ్రమైన ఆహార కొరత ఏర్పడే ప్రమాదం కలదు. కనుక క్రమంగా రసాయన ఎరువుల మోతాదు తగ్గిస్తూ, సేంద్రీయ ఎరువులను పెంచుకొంటూపోతే మూడు, నాలుగేళ్లలో నేల సారవంతమై, దిగుబడులు గతంతో సమానంగా వస్తాయి.

## ఇన్‌పుటు ధరల నియంత్రణ

ప్రతి సంవత్సరం ఎరువులు, డీజిల్, విత్తనాలు, పురుగు మందుల ధరలు సగటున పధ్నాలుగు నుండి ఇరవై శాతం పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు, భాస్వరం ధరలు తగ్గిన సందర్భాల్లో కూడా వీటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇనుపుట్ ధరలపై కఠినమైన నియంత్రణ విధానాన్ని (ఔషధ ధరల నియంత్రణ వలె) చట్టపరంగా అమలు

చేయాలి. మార్కెట్‌లోకి విడుదలయ్యే కొత్త పురుగు మందులను, హానికర రసాయనాలు పర్యావరణంలోకి ప్రవేశించకుండా నిరోధించేటందుకు ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనశాలల్లో పరీక్షల అనంతరమే అనుమతించాలి. అన్ని ఇన్‌పుట్లు, డీజిల్, ట్రాక్టరు ధరలపై చిన్న రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి. పాడి పెంట, వేప పొడి, కంపోస్టు వంటి సేంద్రీయ ఎరువులకు ప్రోత్సాహకంగా సబ్సిడీలనిచ్చి విధిగా రసాయన ఎరువులతోపాటు జతగా విక్రయించేలా ఏర్పాట్లు చేయ్యాలి.

### ఏక పంట స్థానంలో బహుళ పంటల సాగు

ప్రతీ సీజన్‌లోను తప్పనిసరిగా వరి లేదా గోధుమ పండించటం వలన నేలలోని పోషకాలు, భూగర్భ జలాలు తరలిపోయి నిస్సారమవుతున్నాయి. దీనితో ఢిల్లీలో పర్యావరణ కాలుష్యం తదితర సమస్యలే కాక, నేలలో సహజంగా నుండే ఉపయోగకర ఫంజై, వానపాములు తదితరాలు నశిస్తున్నాయి అధిక రసాయనాల వినియోగంతో. ఏక పంటైన వరి స్థానంలో మినుము, కంది, నువ్వులు తదితర పంటలను పండించటం వలన భూసారం అభివృద్ధి చెందుతుంది. ఈ పంటలు గాలిలోని నత్రజని పీల్చుకొని, తమ వేళ్ళలోనే, నేలలో భద్రపరుస్తాయి. నేలలో పోషకాలు పెరగటం వలన తదుపరి సాగు చేసే వరి, ప్రత్తి, చెఱకు వంటి పంటల్లో ఎరువుల వినియోగం 40 శాతం వరకు తగ్గి, ఖర్చు తగ్గుతుంది. పంట విరామ సమయాల్లో త్వరగా (30 లేక 40 రోజుల్లో) కోతకు వచ్చే పిల్లి పెసర, ఆకు కూరల పంటలను వేసుకోవాలి. బహుళ (ఇతర) పంటల ఆరుతడి సేద్యం వలన జీవ వైవిధ్యం వృద్ధయి, రైతు మిత్ర కీటకాలు, పిచ్చుకలు వంటి పక్షుల వృద్ధి కలుగుతుంది.

### వ్యవసాయ ఋణాలు

చిన్న రైతు సేద్యానికి ఋణం వెన్నెముక. సాలీనా కేంద్ర బడ్జెట్‌లో దాదాపు 20 లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా, బ్యాంకుల నుండి చిన్న రైతులకు లభించేది 26 నుండి 28 శాతానికి మించటం లేదు. మిగిలిన సింహభాగం ఋణాలు ధనిక రైతులు, ముఖ్యంగా బొంబాయి, చెన్నై నగరాల్లోని వ్యాపారవేత్తలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదార్లకు బ్యాంకులు వితరణ చేస్తున్నాయి. వ్యవసాయాన్ని "ప్రయారిటీ" (ప్రాముఖ్యత) రంగంగా గుర్తించి 85 శాతం ఋణాలు తప్పని సరిగా చిన్న, కౌలు రైతులకు 2 శాతం వడ్డీపై బ్యాంకులు వితరణ చేసే విధంగా ప్రభుత్వం చట్టం చెయ్యాలి.

### మార్కెట్ సంస్కరణలు

ప్రభుత్వం పంటలకు ప్రకటించే మద్దతు ధరలు, ప్రభుత్వ మార్కెటు యార్డు వేలం పాట సమయంలో "సీలింగు ధర"గా నుండి కొంత న్యాయం కలుగుతున్నది. సాగు చట్టాల్లో భాగంగా "స్వేచ్ఛ విపణి" పేరుతో ప్రభుత్వ మార్కెట్ యార్డుల స్థానంలో కార్పొరేటు అగ్రి బిజినెస్ కంపెనీల కొనుగోళ్ళను ప్రవేశ పెట్టడం హానికరం. ఇది రైతుకు కొంత వరకైన ఊరటనిచ్చే మద్దతు ధరలను నిరాకరించే కార్పొరేటు కంపెనీల, సూపర్ మార్కెట్ల ఇష్టానుసార ధరలకు రైతులను గురి చెయ్యటమే ఏకీకృత "ఇ-నామ్" కంప్యూటరు మార్కెట్ కూడా ఈ కోవకే చెందుతుంది. మార్కెట్ కమిటీల అక్రమాలను సవరించి, రైతు సంఘాల ప్రాతినిధ్యాన్ని పెంచి ప్రభుత్వ మార్కెట్ యార్డులను సంస్కరించాలి. యార్డుల్లో పంటల ఆరవేతకు, నిల్వకు, క్యాంటీను, వసతి సౌకర్యాలు పెంచి చిన్న రైతులకు తోడ్పడాలి.

### సహకార రంగంలో చిన్న ఆహార శుద్ధి పరిశ్రమలు

రైతు పండించిన ఉత్పత్తులను శుద్ధి చేసి వివిధ సరుకులుగా సూపర్‌మార్కెట్లలో విక్రయించే, ఎగుమతి అయ్యే ఉత్పత్తుల ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది. పసుపు నుండి "కురుకుమిన్", టమాట నుండి "లైకోపిన్" వంటివి వేరు చేసిన రసాయనాలకు ఔషధ పరిశ్రమలోను, ఎగుమతుల గిరాకీ ఉన్నది. అదే విధంగా కాయగూరలు, పండ్లు నుండి వివిధ జాములు, కేచప్‌లు, చిరుధాన్యాల నుండి "బ్రేక్‌ఫాస్ట్" ఫుడ్స్‌కి మంచి గిరాకీ కలదు పట్టణాల్లో. తక్కువ పెట్టుబడి (నాలుగైదు లక్షల రూపాయలతో) నెలకొల్పి గ్రామీణ ఆహార శుద్ధి టెక్నాలజీ ప్రభుత్వ రంగ పరిశోధనా స్థానాలు (మైసూరు, లూధియానా) వద్ద కలదు. పంటల సాగుతో వచ్చే ఆదాయం రైతు కుటుంబ పోషణకు సరిపోవటం లేదు. విలువ ఆధారిత, స్వల్ప పెట్టుబడితో ప్రారంభించే గ్రామీణ పరిశ్రమలతో రైతు మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్తాయి. కొన్ని ఆహార శుద్ధి రంగాలను విధిగా చిన్న రైతుల, సహకార సంస్థలు నిర్వహించటానికి రిజర్వు చెయ్యాలి.

### కార్పొరేటు వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులపై పన్నులు

రబ్బరు, కోకో, మామిడి తదితర ఉత్పత్తులను సేకరించి టైర్లు, చాకొలెట్లుగా తయారు చేసి, దేశీ, విదేశీ ఎగుమతుల ద్వారా గణనీయమైన లాభాలను ఆర్జిస్తున్న.. అగ్రి బిజినెస్ కంపెనీలపై పన్నులు వెయ్యాలి. లభించిన నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయలైన గొడౌన్లు, శీతల గిడ్డంగులు, చిన్న సహకార ఆహార శుద్ధి పరిశ్రమలకు పెట్టుబడిగా వినియోగించాలి. అధిక ఆహారోత్పత్తికి నూతన సాంకేతికత వినియోగం అత్యావశ్యకం. నూతన బయోటెక్నాలజీ, జీనోమిక్స్‌లను వినియోగించి (హానికర జన్యు మార్పిడి పంటలను మినహాయించి) స్థానిక నేల, వర్ష పాతానికి అలవాటుపడిన (కృసించిపోతున్న) జీడి పంటలను గుర్తించి, జన్యుపరంగా వృద్ధి చేయాలి. ప్రస్తుతం నేల సారాన్ని, పోషకాల పాళ్ళను గుర్తించటానికి, పంటపై తెగుళ్ళ తీవ్రతను, పంటల దిగుబళ్ళను **(మిగతా 52వ పేజీలో)**

# సహకార రంగం - నూతన దృక్పథం



- డాక్టర్ సి.కృష్ణమోహన్‌రావు

ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా సహకార రంగం మీద ఆసక్తి పెరిగింది. దీనికి ముఖ్య కారణం, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను పాటించే దేశాలలో వస్తున్న ఆర్థిక సంక్షోభాలు. ముఖ్యంగా ఆ దేశాలలో తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలు. ఆక్స్‌ఫామ్ 2024 అసమానతల నివేదిక ప్రకారం 2020 నుండి 2024 వరకు ప్రపంచంలోని ఐదుగురు ధనవంతుల సంపద 405 బిలియన్ డాలర్ల నుండి 869 బిలియన్ డాలర్లకు రెట్టింపైంది. ఇది గంటకు 14 మిలియన్ డాలర్లకు సమానం. ఇదే సమయంలో, దాదాపు 500 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడ్డారు. ఈ అసమానతల పట్ల ప్రజలలో తీవ్ర అసంతృప్తి, భవిష్యత్ పట్ల భయం నెలకొంది. ఈ సంక్షోభాలకు పరిష్కారాలను ఆలోచించే క్రమంలో సహకార రంగంపై ఆసక్తి పెరిగింది. అదే సమయంలో సోషలిస్టు ఆర్థిక విధానాలను పాటించే దేశాలలో సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోవడం లేదా ఆ ప్రభుత్వాలు, ప్రభుత్వ పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను పాటించడంతో అక్కడ కూడా తీవ్ర అసంతృప్తి నెలకొంది. అక్కడ కూడా ప్రత్యామ్నాయాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. వీరు కూడా సహకార రంగాన్ని ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నారు.

### వ్యక్తి - సమాజం - సహకారం

పెట్టుబడిదారీ లేదా సామ్యవాద ఆర్థిక వ్యవస్థల తాత్విక పునాదులను పరిశీలిస్తే అది వ్యక్తి ప్రధానమా లేక సమాజం ప్రధానమా అనే అంశంపై ప్రధాన వైరుధ్యం ఉంటుంది. కొందరు తాత్వికవేత్తలు వ్యక్తివాదాన్ని ప్రతిపాదిస్తుంటే, మరికొందరు సమాజానికి ప్రాధాన్యత ఇచ్చారు. జాన్ లాక్, జాన్ స్టువర్ట్ మిల్ వంటి తత్వవేత్తలు వ్యక్తి స్వేచ్ఛ అత్యంత ప్రధానమైన అంశమని, దాన్ని సమాజం కానీ ప్రభుత్వంగానే నియంత్రించరాదని వాదించారు. దీనికి భిన్నంగా రూసో వంటి తాత్వికవేత్తలు సమాజానికి ప్రాధాన్యం ఇచ్చారు. మనిషి సామాజిక జీవి అని, అతని జీవితం పూర్తిగా సమాజంతోనే ముడిపడి ఉంటుందని, సమాజం లేకుండా వ్యక్తి ఉండలేడని, సమాజ పురోగతి ద్వారానే మనిషి ప్రగతి ఆధారపడి ఉంటుందని వారు వాదించారు. దీనికి అనుగుణంగానే ఆర్థికరంగంలో కూడా ఈ భావజాలం కొనసాగింది. వ్యక్తి వాదాన్ని బలపరిచే వారు (Liberals) సరళీకృత ఆర్థిక విధానం అవసరమని భావిస్తారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రైవేటు ఆస్తి, స్వేచ్ఛాయుత వాణిజ్య సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. వీరు, ఆర్థిక వృద్ధికి బలమైన ప్రైవేటు ఆస్తి హక్కులు అవసరమని నమ్ముతారు. ఇవి వ్యక్తులు వ్యాపారాలకు పెట్టుబడి పెట్టడానికి, నూతన ఆలోచనలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తాయని వారు వాదిస్తారు. దీనిలో వ్యక్తుల, సంస్థల మధ్య పోటీతత్వం పెరిగి ఉత్పత్తి పెరుగుదలకు, ఆర్థిక పురోగతికి చేస్తుందని భావిస్తారు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం తగ్గించాలని, స్వేచ్ఛాయుత మార్కెట్లు ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి అత్యంత సమర్థవంతమైన మార్గమని నమ్ముతారు. తరువాతి కాలంలో వచ్చిన నూతన సరళీకృత (Neo-liberal) ఆర్థిక వేత్తలు దేశ ఆర్థిక రంగంలో ప్రభుత్వ పాత్రను మరింత పరిమితం చేయాలని, ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మార్కెట్ల ఆధీనంలో ఉండాలని వాదిస్తారు. పెట్టుబడిదారులు ఎక్కువ సంపాదించినప్పుడు క్రిటికల్ డౌన్ ఎఫెక్ట్ ద్వారా అభివృద్ధి క్రింది వర్గాలకి చేరుతుందని భావిస్తారు. ఈ సిద్ధాంత పరిధిలోనే వివిధ ధోరణలు ఉన్నాయి. ఈ ఆర్థిక విధానం సమాజంలోని అసమానతలకు, ఎక్కువ మంది ప్రజల దారిద్ర్యానికి, మార్కెట్ వైఫల్యాలకు దారి తీస్తుందనే విమర్శ వుంది. దీనికి భిన్నంగా సామ్యవాద (Socialist) ఆర్థిక విధానంలో వ్యక్తికి కాకుండా సమాజానికి ప్రాధాన్యత ఇస్తారు. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో ప్రకృతి వనరులు, ఉత్పత్తి సాధనాలు సమాజం/ప్రభుత్వ యాజమాన్యంలో ఉంటాయి. కేంద్రీకృత ప్రణాళిక, సామాజిక సంక్షేమంపై దృష్టి కేంద్రీకరింపబడుతుంది. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో ప్రజలందరికీ సమానమైన వనరులకు, అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలు సాధారణంగా సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, విద్య, అవసరమైన వస్తువులను, సేవలను రాయితీలు అందించే బలమైన సామాజిక భద్రతా నెట్‌వర్క్‌ను కలిగి ఉంటాయి. దీనిలో వ్యక్తి క్రియాశీలత, ఆర్థిక సామర్థ్యాలు తక్కువగా ఉంటాయనే విమర్శలు ఉన్నాయి. దీనిలో కూడా భిన్న ధోరణులు ఉన్నాయి. వాటిలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ప్రభుత్వం నిర్వహించే కమ్యూనిస్టు దేశాల నుండి కొన్ని రంగాలలో ప్రభుత్వం, కొన్ని రంగాలలో స్వేచ్ఛా మార్కెట్ ఉండే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి.

### మధ్య మార్గంగా సహకార వ్యవస్థ

ఈ రెండు ఆర్థిక వ్యవస్థలోనూ స్థూల స్థాయిలో (macro level) ఏ ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికి సూక్ష్మ స్థాయిలో (Micro level) సహకార వ్యవస్థ ద్వారా ఆర్థిక కార్యక్రమాలు

నిర్వహించుకోవడానికి అవకాశం ఉందని సహకారవేత్తలు భావిస్తారు. ఉమ్మడి ప్రయోజనం కోసం వ్యక్తులు సమిష్టిగా, పరస్పర సహకారంతో స్వచ్ఛందంగా నిర్వహించుకునే ఒక వేదిక/సంస్థ (cooperative enterprise). సహకార వ్యవస్థ ఈ రెండు వ్యవస్థలోని కొన్ని లక్షణాలను కలిగి ఉంటుంది. సరళీకృత ఆర్థిక విధానంలో ఉన్నట్లు వ్యక్తి స్వేచ్ఛకు క్రియాశీలతకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో సామ్యవాద వ్యవస్థలో ఉన్నట్టు సొంత ఆస్తి కాకుండా ఉమ్మడి ఆస్తిగా ఉంటుంది. ఇది వ్యక్తి ప్రయోజనాలను, సమాజ సమిష్టి ప్రయోజనాలను గుర్తిస్తుంది. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా సహకార రంగానికి అవకాశముంది. ప్రపంచ జనాభాలోని 12% మంది ప్రజలు 30 లక్షల సహకార సంస్థల్లో ఏదో ఒక దానిలో సభ్యులుగా ఉన్నారు. ప్రపంచంలోని ఉద్యోగావకాశాల్లో 10% ఉద్యోగాలు ఈ సహకార సంస్థల ద్వారా కల్పించబడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో సహకార సంఘాల ప్రాముఖ్యతను గుర్తించి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 2025 సంవత్సరాన్ని రెండవ అంతర్జాతీయ సహకార సంవత్సరంగా నిర్వహించాలని 2023 నవంబర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించడం జరిగింది.

### నూతన సహకార విధానం

భారతదేశంలో స్వాతంత్ర్యానంతర కాలంలో సహకారంగానికి విశేష ప్రాధాన్యత ఇచ్చారు. దేశ అభివృద్ధిలో, ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘం అత్యంత కీలకమని, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు సహకార రంగాలు వేదికగా పనిచేయాలని పంచవర్ష ప్రణాళికలో అనేక పథకాలు రూపొందించారు. వాటిలో గ్రామాల్లోని వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ముఖ్య భూమిక వహించాయి. ప్రపంచంలోని 30 లక్షల సహకార సంఘాలలో 8.55 లక్షలు భారతదేశంలో ఉన్నాయి. దాదాపు 13 కోట్ల మంది ప్రజలు వారితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నారు. భారతదేశంలోని 91 శాతం గ్రామాలలో రక రకాల సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ సహకార సంస్థలు వ్యవసాయ-ప్రాసెసింగ్, డైరీ, ఫిషరీస్, హౌసింగ్, నేత, క్రెడిట్, మార్కెటింగ్ వంటి విభిన్న కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయి. 1991 తరువాత ప్రభుత్వం నూతన సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న చేస్తున్నప్పటి నుండి సహకారంగ ప్రాముఖ్యత క్రమేపీ తగ్గుతూ వస్తుంది. 2019 తరువాత సహకారం ద్వారా శ్రేయస్సు నినాదంతో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సహకార రంగంలో మార్పులను తీసుకొని వస్తుంది. వాటిలో ముఖ్యమైనది సహకార రంగాన్ని వ్యవసాయ శాఖ నుండి విడదీసి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. రాష్ట్రాల పరిధిలోని సహకార రంగాన్ని కేంద్ర ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తోందని, ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాలకు వ్యతిరేకమనే విమర్శ ఉంది. అలాగే వారు చేస్తున్న ఇతర మార్పులు అనేక సందేహాలకు తావిస్తున్నాయి. వ్యవసాయ పరపతి సంఘాలను సహకార సంఘాలలా కాకుండా వ్యాపారసంస్థలా నిర్వహించాలని ప్రయత్నం జరుగుతోంది. అమూల్, ఇఫ్కో వంటి పెద్ద పెద్ద సహకార సంఘాలను ప్రోత్సహించడం, వాటిని కార్పొరేట్ కంపెనీల స్థాయిలో వ్యాపార ధోరణిలో నిర్వహించడానికి పథకాలు తయారు చేస్తున్నారు. చిన్న సహకార సంఘాలను పెద్ద సంఘాలలో మిళితం చేయాలని ప్రయత్నం జరుగుచున్నది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలో ఒకప్పుడు వ్యవసాయ రంగానికి రైతులకు ఎంతో ఆర్థిక సహాయ సహకారాలను అందించిన వ్యవసాయ పరపతి సంఘాలను ప్రాధాన్యత తగ్గించి వాటి స్థానంలో రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయటం, వాటిని కంపెనీ చట్టం కింద రిజిస్టర్ చేసుకోవడానికి అనుమతించడం వంటి అంశాలు ఈ సందేహాలకు మరింత ఊతమిస్తున్నాయి. 2002 నాటి జాతీయ సహకార విధానాన్ని సమీక్షించి, కొత్త జాతీయ సహకార విధాన పత్రాన్ని రూపొందించేందుకు జాతీయ స్థాయిలో కేంద్ర కేబినెట్ మాజీ మంత్రి సురేశ్‌ప్రభు నేతృత్వంలో 47 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. దేశంలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి దాని పరిధిని మరింతగా పెంచడానికి, సహకార సంస్థలు తమ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో సహాయపడటానికి తగిన విధానం ప్రతిపాదించడానికి ఈ కమిటీ పనిచేస్తుంది. ఇది నివేదిక ఇవ్వవలసి ఉంది.

### సహకార రంగ పురోభివృద్ధికి సూచనలు

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ విధాన ప్రకటనలను బట్టి, ప్రతిపాదించిన చట్టాలను బట్టి సహకార సంఘాలను ప్రజల ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడే సంస్థలుగా భావిస్తున్నట్లు అర్థమవుతోంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థను రాబోయే మూడు సంవత్సరాలలో ప్రపంచంలో మూడో అతిపెద్ద, ఐదు ట్రిలియన్ డాలర్ల, ఆర్థిక వ్యవస్థ రూపొందించడానికి ఈ సహకార సంఘాలు దోహదపడాలని, భారతదేశ జీడీపీ పెరుగుదలకు ఉపయోగపడాలని ప్రతిపాదిస్తున్నారు. సహకార సంఘాలను పూర్తిగా ఆర్థికకోణంలో చూడటం సరైన విధానం కాదు. సహకార సంఘాలు సామాజిక కోణంలో చూడాలి. సహకార సంఘాల సభ్యులు సామాజికంగాను, ఆర్థికంగాను జాతీయ సగటుకంటే అభివృద్ధి పొందుతారని కెన్యా, పెరూ, ఫిలిప్పీన్స్, పోలాండ్ దేశాలలో సహకార సంస్థల అధ్యయనాల ద్వారా తెలుస్తుంది. అలాగే సహకార సంస్థలలో సభ్యులుగా ఉన్న స్త్రీలు సామాజిక ఆర్థిక స్థితి గణనీయంగా మెరుగుపడ్డారు. మహిళలు వారి ఆర్థిక లాభాలతోపాటు, సామర్థ్యాలు, నైపుణ్యాలలోను పెరుగుదల కనిపించింది. ఈ సంస్థలలో భాగస్వామ్యులుగా ఉన్న వారిలో విద్య శిక్షణ, తద్వారా ఉద్యోగ అవకాశాలు

పెరిగాయి. అలాగే సహకార వ్యవస్థకు మానవ అభివృద్ధి సూచికలకు దగ్గర సంబంధం ఉంది. డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో సహకార వ్యవస్థ బలంగా ఉండడం, మానవ అభివృద్ధి సూచికలో ముందుండటం గమనించవచ్చు. అందువల్ల సహకార సంస్థలను కేవలం ఆర్థిక సంస్థలుగా కాకుండా సమగ్రాభివృద్ధికి, సుస్థిర అభివృద్ధికి దోహదం చేసే సంస్థలుగా చూడాలి. ఆ కోణం నుండే ప్రణాళికలు రూపొందించాలి. సహకార సంఘాలలో అన్ని వర్గాలను భాగస్వామ్యులను (social inclusion) చేయాలి. మన దేశంలో యువత, జనాభాలో ఎక్కువ భాగం ఉన్నప్పటికీ సహకార సంఘాల సభ్యత్వంలో తక్కువ శాతం ఉంది. వారిని సహకార రంగంలో చేర్చుకోవడానికి తగిన విధానాలను రూపొందించాలి. అలాగే ఇది అణగారిన వర్గాల ప్రజల హక్కులు కాపాడడంలోను, వారి పురోగతికి ఎంతో దోహదం చేసినట్లు అనేక లాటిన్ అమెరికన్ దేశాలలో రుజువైంది. ఆ విధానాలను మనం అమలుపరచాలి. సహకార కొలమానాలు(Cooperative Indicators) భారత దేశంలో సహకార సంఘాలను వాటి ఆర్థిక స్థితిని బట్టి విభజించడం, అంచనా వేయడం జరుగుతుంది. దీనివల్ల ఆర్థికంగా పెద్ద సంఘాలను, బహుళ రాష్ట్ర సంఘాలను విజయ వంతమైన సంఘాలుగా భావించడం, వాటికి ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం చూస్తున్నాం. ఇది సరైన విధానం కాదు. సహకార సంఘం పని తీరుకు ఆర్థిక లావాదేవీలు ఒక అంచనా మాత్రమే. వాటి అంతర్గత ప్రజాస్వామ్యం, సభ్యుల మధ్య సహకారం, కార్యకలాపాల నిర్వహణలో పారదర్శకత అతి ముఖ్యమైన అంశాలు. ఇవి కాకుండా వాటిలో సహకార సంస్కృతి ఏ విధంగా ఉంది. సమాజ అభివృద్ధికి ఏ విధంగా దోహదం చేస్తున్నాయి. సుస్థిర అభివృద్ధిలోనూ, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర మొదలైన అంశాలను సంఘాల పనితీరు అంచనా వేయడంలో పరిగణనలోకి తీసుకోవాలి. ఈ విధంగా అంచనా వేయడానికి అంతర్జాతీయంగా అనేక సూచికలను అభివృద్ధి చేశారు. వాటిని భారతదేశంలో సూచికలుగా ఉపయోగించుకుంటే అవి మరింత స్పష్టమైన కొలమానాలుగా ఉపయోగపడతాయి.

## సహకార విధానాలు, చట్టాలు

సహకార సంఘాల అభివృద్ధికి ఆయా దేశాల సహకార చట్టాలకు సానుకూల సంబంధం ఉంది. ఏ దేశాల్లో అయితే సహకార సంఘాల ఏర్పాటుకు అనుకూల చట్టాలను తీసుకొచ్చారో, ఆ దేశాల్లో సహకార సంఘాలు విస్తరించాయి. సహకార సంఘాలు రెండు రకాల చట్టాలను, నియమ నిబంధనలను పాటించాలి.

**ఒకటి :** ఆ దేశంలోని లేదా రాష్ట్రంలోని సహకార చట్టం.

**రెండు :** అవి ఏ రంగంలో అయితే పనిచేస్తున్నాయో ఆ రంగానికి సంబంధించిన నియంత్రణ చట్టం. వీటి మధ్య చాలాసార్లు వైరుధ్యం ఉంటుంది. అటువంటి సమ యాల్లో ఏ చట్టాలను/నిబంధనలను పాటించాలి అనే అంశంపై స్పష్టత లేదు. ఉదాహరణకు మన దేశంలో బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టానికి, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టానికి నిబంధనలపై వైరుధ్యం ఉన్నప్పుడు దేనిని పాటించాలనే అంశంపై వివరణ లేదు. దక్షిణ కొరియాలో 2012 చట్టం ప్రకారం సహకార సంఘాల చట్టాలకు అవి పనిచేసే రంగాల్లో చట్టాలకు వైరుధ్యం ఉంటే సహకార చట్టాలు ముందుగా వర్తిస్తాయి. ఈ మధ్య కాలంలో ఫ్రాన్స్, యూకే, చిలి, ఫిజి వంటి దేశాల్లో సహకార చట్టాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారు.

ఫ్రాన్స్‌లో ఏదైనా కంపెనీ మూతపడి కానీ ఆ కంపెనీ యాజమాన్యం నిర్వహించలేని స్థితిలో అమ్మే స్థితిలో ఉంటే, ఆ కంపెనీలో పనిచేసే కార్మికుల సహకార సంఘానికి కొనుగోలు చేసుకునే మొదటి హక్కు ఉంటుంది. దానికి అవసరమైన నిధులను తక్కువ వడ్డీతో ప్రభుత్వం అందజేస్తుంది. ఇవికాక ప్రపంచంలోని అనేక దేశాల్లో సహకార సంఘాలకు పన్ను రాయితీలు ఇవ్వడం, అవి తయారు చేసే వస్తువులు కొనుగోలులో ప్రాధాన్యత ఇవ్వడం వంటి సహకార అనుకూల చట్టాలున్నాయి. అటువంటి చట్టాలు మన దేశంలో తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సహకార పాలన

సహకార సంఘాలలో కార్పొరేట్ పాలనా విధానాలను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం విధాన పత్రాలు సూచిస్తున్నాయి. సహకార సంస్థలలో కార్పొరేట్ పాలన బదులు సహకార పాలన విధానాన్ని ప్రవేశపెట్టాలి. కార్పొరేట్ రంగానికి భిన్నంగా, సహకార పాలనలో సభ్యుల భాగస్వామ్యం, పాల్గొనడం అవసరం. ఇవి నైతిక విలువలు, నీతి నియమాలపై ఆధారపడి ఉంటుంది. సహకార పాలనకు, కార్పొరేట్ పాలనకు గల సారూప్యతలను వైరుధ్యాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కార్పొరేట్ పాలన ప్రధాన లక్ష్యం సంస్థ లాభాలను పెంచడం. సహకార పాలన ప్రధాన లక్ష్యం సభ్యుల సంక్షేమం, సంస్థ సుస్థిరత. వాటి సాధన కోసం వ్యాపార నిర్వహణ. అందువల్ల కార్పొరేట్ పాలనా విధానాలన్నీ సహకార సంస్థలకు వర్తించవు. అంతే కాకుండా సహకార సంఘాలు భిన్న సంస్థల పర్యవేక్షణలో పనిచేయవలసి ఉంటుంది. సహకార సంఘాల నిర్వహణతో పాటు ఆయా రంగాల్లో పర్యవేక్షణ సంస్థల నియమ నిబంధనలను పాటించాలి. అందువల్ల సహకార పాలన కార్పొరేట్ పాలనకు భిన్నంగా స్పష్టంగా రూపొందించాల్సిన అవసరం ఉంది. దానిలో వివిధ సంస్థల పాత్రలను వివరించాల్సి ఉంది.

## సహకార సంఘాలకు ఆర్థిక వనరులు

సహకార సంఘాలకు పెట్టుబడి ఆర్థిక వనరుల సమీకరణ

అత్యంత కీలకమైన అంశం. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం చేస్తున్నప్పటికీ దానిపై ఒక స్పష్టమైన విధానం లేదు. సహకార ఆర్థిక సంస్థలు, ఇతర రకాల సహకార సంఘాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, నిధుల సమీకరణకు ప్రాధాన్యతలను నిర్ధారించడం సహకార సంఘాల అభివృద్ధికి కీలకం. ఈ విధమైన విధానాలను చాలా దేశాలు ఆచరిస్తున్నాయి. ఉదాహరణకు పోర్చుగల్, మెక్సికో వంటి దేశాల్లో సహకార సంఘాలకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. అదే విధంగా ఈక్వెడార్ ప్రత్యేక ఫైనాన్సింగ్ పథకాన్ని అభివృద్ధి చేసింది. సహకార సంఘాలకు జాతీయ హామీ నిధికి అను సంధానించడం ద్వారా సహాయం అందిస్తుంది. మన దేశంలో కూడా మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఇటువంటి ప్రోత్సాహకాలను అందిస్తుంది. అయితే వీటిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకుండా సహకార సంఘ అభివృద్ధి లక్ష్యంతో చేసినప్పుడు ప్రయోజనం అందరికీ చేరుతుంది. వీటిని సక్రమంగా పనిచేస్తున్న, సామాజిక బాధ్యతలు నిర్వహిస్తున్న అన్ని సహకార సంఘాలకు అందించాలి.

### సహకార అక్షరాస్యత

సహకార విద్య దేశంలోని వివిధ సహకార సంఘాలలో చేరిన సభ్యులకు పరిమితం చేయబడింది. ప్రపంచంలో సహకార రంగం పురోగతిని పరిగణనలోకి తీసుకుంటే, సహకార సంస్థలు ప్రతి ఒక్కరి జీవితానికి అందించే పాత్ర, విధులు, ప్రయోజనాల గురించి అవగాహన కల్పించగలిగి చోట సహకార సంస్థలు పెరిగాయి. అందువల్ల సభ్యుల విద్యతోపాటు సహకార అక్షరాస్యతపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. మొదట, సహకార సంస్థల గురించి మరియు అవి ప్రజల వివిధ వర్గాలకు ఎలా సేవ చేయగలవో అనే దాని గురించి అవగాహన కల్పించడం సహకార అక్షరాస్యత లక్ష్యం. అలాగే, పాఠశాలలు మరియు కళా శాలల పాఠ్య ప్రణాళికలో సాధ్యమైనంత వరకు సహకార అక్షరా స్యతను చేర్చడానికి ప్రయత్నం జరగాలి. దీనికి అవసరమైన బడ్జెట్‌లో ప్రభుత్వం అందించాలి. దీని కోసం ప్రస్తుతం దేశంలో ఉన్న జాతీయ సహకార యూనియన్ వంటి జాతీయ సంస్థలను పునర్వ్యవస్థీకరించాలి, వాటి పనితీరును మెరుగుపరచాలి. స్థూలంగా చెప్పాలంటే సహకార రంగంలో ప్రభుత్వ విధానాలు క్రింది విధంగా ఉండాలి.

- 1.దేశ సామాజిక, ఆర్థిక ప్రగతిలో సహకార సంఘాలు కీలకపాత్ర వహిస్తాయి. వాటిని వ్యాపార సంస్థలుగా కాకుండా సమాజ సమగ్రాభివృద్ధికి, సుస్థిర అభివృద్ధికి దోహదం చేసే స్వయంప్రతిపత్తి గల సంస్థలుగా చూడాలి.
- 2.ఆ విధంగా సామాజిక అభివృద్ధికి కృషి చేసే, ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేసే సహకార సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు కల్పించాలి. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలు వాటి నియంత్రణకు ఉపయోగిం చకూడదు.
- 3.సహకార విధానాలు, చట్టాలు వాటి స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసుకోవడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలి. కానీ వాటిపై అజమాయిషీ కోసం కాకూడదు.
- 4.ఇవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో కాకుండా స్థానిక సంస్థలతో సమన్వయంతో పనిచేయడానికి అవకాశం కల్పించాలి. వాటి పనితీరు మెరుగు పరచడానికి సహకార పాలనా విధానాలను రూపొందించాలి.
- 5.సహకార చట్టాలకు, సహకార సంఘాలు పని చేసే రంగాలలోని నియంత్రణ సంస్థలకు మధ్య విధానపరమైన, చట్టపరమైన వైరుధ్యాలు ఉన్నప్పుడు ముందుగా సహకార చట్టాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- 6.ఏదైనా వ్యాపార సంస్థ మూతపడినప్పుడు, దానిని పునరు ద్ధరించుకుని, నిర్వహించుకునే హక్కు వాటిలో పనిచేసే సహకార సంఘాలకు కల్పించాలి. వాటికి అవసరమైన నిధులను, రుణాలను ప్రభుత్వ సంస్థల ద్వారా అందించాలి.
- 7.సమాజంలో సహకార స్ఫూర్తి పెంపొందించడానికి సహకార అక్షరాస్యత, సహకార విద్యను విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలి. పాఠశాల, కళాశాల పాఠ్యాంశాల్లో ఇది భాగం చేయాలి. ❑

# నియోలిబరల్ ఉత్పత్తి విధానాలు - ప్రత్యామ్నాలు

(48వ పేజీ తరువాయి)

గుర్తించటానికి, బయోసెన్సర్లు, డ్రోన్లు, రిమోట్ చాయాచిత్రా లు ప్రెసిషెల్ సాంకేతికత విరివిగా వ్యాప్తిలోకి వస్తున్నది. ఈ సాంకేతికతను స్మార్ట్ ఫోన్ల ద్వారా సమాచారాన్ని చిన్న రైతులకు అందుబాటులోకి తేవాలి. బిగ్‌డేటాగా పిలవబడే సేకరించిన సమాచారం ప్రస్తుతం గూగుల్, అదానీ, మైక్రోసాఫ్ట్ తదితర డేటా కేంద్రాల వద్ద ఉన్నది. ఈ సమాచారాన్ని ఎరువులు, పురు గుమందుల కంపెనీలకు, ఎగుమతిదార్లకు విక్రయించబడుతు న్నది. రైతు ప్రమేయం లేకుండా ఈ డేటాను కార్పొరేటు కంపె నీల వశం కాకుండా, రైతుల సేద్యానికి ఉపయోగకరించేలా ప్రభుత్వం డేటా విధానాలను రూపొందించాలి. చిన్న రైతులు ముఖ్యంగా మిర్చి కార్మికులు, ఇతర శ్రమజీవుల సహకారంతో పోరాడితే పెట్టుబడిదారీ నియోలిబరల్ ఆహారోత్పత్తి విధానాన్ని నిలువరించవచ్చును. ప్రత్యామ్నాలతో ప్రకృతిని కాపాడుకుంటూ గ్రామాభివృద్ధిని సాధించటం సాధ్యమే. ❑

# ప్రాథమిక విద్యారంగం : ప్రస్తుతం - ప్రత్యామ్నాయాలు



- విఠపు బాలసుబ్రహ్మణ్యం

**ఇండియన్ కౌన్సిల్ ఆక్ట్ 1909ని బ్రిటిష్ వారు ముందుకు తెచ్చి లెజిస్లేటివ్ సంస్కరణలను ప్రతిపాదించమని కోరినప్పుడు గోఖలే ఎంతో విలువైన ప్రాథమిక విద్యా చట్టాన్ని రూపొందించి 'స్థానిక ప్రభుత్వాలు నిర్బంధ విద్యను అమలు చేసే అవకాశం కల్పించాలని ప్రతిపాదించాడు. దీన్ని బ్రిటిష్ ప్రభుత్వం తిరస్కరించింది. ఇలా మొదలైంది భారతదేశంలో అందరికీ 'తప్పనిసరి ప్రాథమిక విద్య' డిమాండు.**




స్వాతంత్రం వచ్చాక మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల్లో దీనికి స్థానం దక్కకున్నా ఆదేశిక సూత్రాల్లో చేర్చి (ఆర్టికల్ 45) 1960 కల్లా 14 ఏళ్ల పిల్లలందరికీ విద్యనందించాలని ఒక లక్ష్యంగా చెప్పుకున్నాం. కానీ జరిగిందేమిటి? నూతన విద్యా విధానాన్ని 1986లో రూపొందించుకునేటప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటే 6 -11 వయస్సు పిల్లల్లో 50 శాతం బడి మొహమే చూడ్డం లేదని. కానీ దురదృష్టవశాత్తు పాలక పార్టీలే కాదు ప్రతిపక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, విప్లవ సంస్థలు, సామాజిక ఉద్యమకారులు, మాధ్యమాలు సైతం మనదేశంలో దీన్ని విస్మరించాయనీ, దీనికి భిన్నంగా లాటిన్ అమెరికా లాంటి దేశాల్లో పాపులర్ రాడికల్ రాజకీయాలకు కూడా విద్య కేంద్ర బిందువుగా వుందనీ, మనకీ తాత్వికత ఎందుకు అబ్బలేదని వారు లోతైన చర్చ చేస్తారు.

ఇప్పుడు మళ్లీ నూతన విద్యా విధానం(2020) అమల్లోకి వచ్చింది. ఇది పాడుతున్నదీ పాత పాటే! కనీస మౌలిక అక్షర జ్ఞానం, సంఖ్యా జ్ఞానం దేశంలో ఐదు కోట్ల మంది పిల్లలకు అబ్బడం లేదట! తక్షణం మూడో తరగతి పిల్లలకు ఈ పఠన సంఖ్యా జ్ఞానం అందించాలట ! దీనికోసం National Literacy Mission on Fundamental Literary and Numeracyని ఏర్పాటు చేయాలట! దీనర్థం ఏమిటి? పద్నాలుగేళ్ళ వరకు చదువు గాదు మన మహత్తర నూతన విద్యా విధానం మూడో తరగతి దగ్గరే దోగాడుతున్నద నేగా? మరి మనం ఎక్కడ దారి తప్పాం? కనీసం ఉన్నంతలో ఏది ప్రత్యామ్నాయం? దీన్నిపుడు ముచ్చటించుకుందాం.

**మొదటి విషయం రాజకీయదృక్పథం**

అందరికీ విద్య దగ్గరికి వచ్చేటప్పటికి సమకాలీన ప్రపంచంలో భారతదేశం ఒక మినహాయింపు అంటాడు సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త మైరన్ వైనర్. తమ తమ ఆర్థిక రాజకీయ వ్యవస్థలు ఏవైనా ఆధునిక ప్రపంచదేశాలన్నీ వీలున్నంత తక్కువ గడువులో పౌరులందర్నీ అక్షరాస్యుల్ని చేయడం తమ తక్షణ కర్తవ్యాలుగా అంగీకరించాయి. వియత్నాం, క్యూబా, నికరాగ్వా వంటి దేశాలు యుద్ధాలతో సతమతమవుతున్న కాలంలోను అత్యంత వేగంగా ప్రాథమిక విద్యను అందరికీ అందించాయి. రష్యా, చైనాలు యుద్ధ ప్రాతిపదికన ఈ లక్ష్యాన్ని చేరుకున్నాయి. శ్రీలంక లాంటి అంతర్గత సంక్షోభాల్ని ఎదుర్కొంటున్న దేశం సైతం అద్భుతమైన ప్రాథమిక విద్యను అందిస్తోంది. ఇక అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు ఇప్పటికీ ప్రభుత్వ రంగంలో కామన్ స్కూల్ విధానాన్ని పాటిస్తున్నాయి. కొంచెం నిలదొక్కుకున్నాక మంచి బడిని మొదటి అవసరంగా గుర్తించని దేశాల్ని వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. కానీ మన దేశం ఒక్కటే ఇలా మిగిలిపోయింది ఎందుకని? దీనికి అందరికీ విద్యను చారిత్రకంగానే వ్యతిరేకించిన మన కుల వ్యవస్థ కారణమా ? మన సంస్కృతే పెద్ద ప్రతిబంధకమా ? ఈ ప్రశ్నలు కూడా మైరన్ వైనర్ లేవనెత్తుతాడు. పేదరిక నిర్మూలన జరిగే దాకా అందరు పిల్లలు బడికి వెళ్ళలేరనీ, గ్రామీణ ఉత్పత్తి అవసరాలకోసం ప్రస్తుతానికి బాల కార్మిక వ్యవస్థ తప్పదనీ సిద్ధాంతీకరించే ధోరణి భారత దేశంలోనే చూస్తున్నామని కూడా ఆయన అంటాడు. ఈ విమర్శను మనం అంగీకరించవచ్చు, అంగీకరించకపోవచ్చు. మన సంస్కరణోద్యమాలన్నీ విద్యకు, మరీ బాలికా విద్యకు పెద్ద పీట వేశాయి. కాని, స్వాతంత్రం వచ్చాక మాత్రం ఒక రాజకీయ సామాజిక తక్షణ లక్ష్యంగా విద్య మన అజెండాలోకి రాలేకపోవడం మాత్రం

పచ్చి నిజం. మన సమాజమే దీన్ని అత్యవసరాంశంగా గుర్తించ లేకపోయింది. దీనికి భిన్న దృక్పథం గల దేశాల్లో అవి ఎంత పెద్ద దేశాలైనా, ఎంత వెనుకబాటులో వున్నవైనా, విసిరేసినట్టు ఎన్ని ముక్కలు ముక్కలుగా చీలి వున్నా వీటన్నిటిని అధిగమించి అత్యంత వేగంగా సాక్షరతను సాధించాయి. ఇలా ప్రపంచమంతా సార్వత్రిక ప్రాథమిక విద్యను ఒక ఆధునిక ప్రజాస్వామిక యుగ అవసరంగా మార్చుకున్నాయి. భారతదేశమే దీనికి మినహాయింపు. కానీ కళ్ళ ముందే భారత్‌లోనే కేరళ దీనికి భిన్నంగా ఎలా వుండగలిగింది? ఇప్పుడు హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు సార్వత్రిక విద్యలో ఎలా అగ్రపీఠానికి చేరుకోగలిగాయి ? అదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ వంటి సంపన్న రాష్ట్రాలు సైతం ఎందుకు వెనకబడ్డాయి ? ఇలా చూస్తే ఎక్కడో మన రాజకీయ దృక్పథంలోనే లోపముంది. దీని నుంచి మనం పాఠాలు ఎలా తీసుకోవాలి. ఆధునిక రాజ్యంగా మనం మారాలంటే, ప్రజాస్వామ్య సమాజంగా మనం నిలదొక్కుకోవాలంటే, ఉత్పత్తిలో శ్రామికశక్తిలో కొత్త పుంతలు తొక్కాలంటే పాఠశాల విద్యపై సర్వశక్తులు ఒడ్డడం మినహా మార్గం లేదు. సమాజం మొత్తం దీన్నిలా అర్థం చేసుకొని ముందు నిలబడేలా, అన్ని పార్టీలు దీన్ని తమ జండాల్లోకి తెచ్చుకునేలా మన రాజకీయాలు మొదట మారాలి. దానికి తగ్గ సామాజిక ఒత్తిడి కావాలి. అయోధ్య చుట్టూ నడిపిన భావోద్వేగాలని ఎనిమిదో తరగతి దాకా మంచి చదువు కోసం ఎందుకు నడపలేరు? అన్నిటికంటే ప్రధానమైనదిగా ఊరి బడిని ఎందుకు మార్చలేరు?

### రెండో విషయం కేంద్రం బాధ్యత :

ప్రాథమిక విద్యావ్యాప్తిలో కేంద్ర ప్రభుత్వపాత్ర నామమాత్రంగా వుంటోంది. విద్యా విధానాలను వల్లించడం, లక్ష్యాల్ని నిర్దేశించడం తప్ప కేంద్రం పైసా విదిలించడం లేదు. అంతా రాష్ట్రాల మీదనే భారం పడుతోంది. ఇటీవల మధ్యాహ్న భోజనం, టీచర్లకు శిక్షణ లాంటి వాటికి డీపీఈపీ నుంచి ప్రారంభించి, సమగ్ర శిక్షాభియాన్ వరకు కొంత సాయం అందిస్తున్నట్టు కనిపిస్తున్నా ఇవన్నీ ప్రాజెక్టులు. తాత్కాలిక కార్యక్రమాలు. మరీ ఈ మధ్య 1990ల తర్వాత అంతర్జాతీయ ద్రవ్య సంస్థల దయాదాక్షిణ్యా లకు ప్రాథమిక విద్యను వదిలేయడం ప్రారంభమైంది. మన జీడీపీలో ఆరు శాతం విద్యకు కేటాయించాలని కొఠారి అన్నాడు. దీన్ని 1985 -86 నాటికి సాధించాలని ఒక గడువు కూడా పెట్టాడు. కానీ 1985-90 మధ్య సగటు వ్యయం 3.6 శాతానికి మించలేదు. తర్వాత 1997-2003 మధ్య కూడా ఇది 3.6 శాతంగానే వుంది. ఒక్క 1999లో మాత్రం 4.6 శాతానికి చేరింది. ప్రపంచంలోని 113 దేశాల సగటు విద్యావ్యయం వాటి జీడీపీలో 4.6 శాతమైతే, క్యూబా ది ఏకంగా 12.8 శాతం! అమర్త్యసేన్, జీన్ డ్రీజ్‌ల అంచనా ప్రకారం 1991 నుంచి 97 మధ్య ప్రాథమిక విద్యకు ఏడాదికి 1.4 శాతం మాత్రమే తలసరి వ్యయం పెరిగింది. ఈ వైఖరి మారాలి. అందరికీ విద్యలో మొదటి బాధ్యత కేంద్రానిది కావాలి. ఆరు శాతాన్ని జీడీపీలో విద్యకు కేటాయించడమే కాదు దానిలో మూడవ వంతు ప్రాథమిక విద్యకు దక్కాలి. అదే మోతాదులో కనీసం రాష్ట్రాల బడ్జెట్లో 20 శాతం విద్యకు కేటాయింపులు వుండాలి. అందులోనూ మూడవ వంతు 14 ఏళ్లలోపు పిల్లల విద్య కోసం కేటాయించాలి. మరీ వెనకబడ్డ రాష్ట్రాలకు కేంద్రం నుంచి భారీ సాయం అందాలి. ఇప్పటికీ గిరిజనుల విద్య కోసం మనం చేస్తున్నది చాలా తక్కువ. ఇదేదో ఆర్థిక కేటాయింపులకు సంబంధించిన అంశం కాదు. రాజకీయాంశం!

### మూడవది శాస్త్రీయ విద్యావిధానం :

ఇటీవలి నూతన విద్యా విధానం రాష్ట్రాల్ని తోలుబొమ్మలుగా మారుస్తోంది. సర్వం కేంద్రీకృతం చేస్తోంది. సాంప్రదాయక జ్ఞాన వ్యవస్థలంటూ రాగాలు తీస్తోంది. మూసపోసినట్టు ప్రతి దాన్నీ ఏకశిలాసదృశం చేస్తోంది. ఈ విధానంతో ఎప్పటికీ పరిస్థితి మారదు గాక మారదు. దీనికి ప్రత్యామ్నాయ విధానం కావాలి. అది కామన్ స్కూల్ విధానాన్ని రాజకీయ దృక్పథంగా పేర్కొనాలి. మన వైవిధ్యాల్ని, అసమానతల్ని గుర్తించి, వాటికి దగ్గ వ్యవస్థల్ని, వ్యూహాల్ని బోధనా విధానాల్ని ముందుకు తేవాలి. ఏ రాష్ట్రానికా రాష్ట్రం, ఏ ప్రాంతానికా ప్రాంతం తన అవసరాలకు తగ్గ ప్రణాళికలు రూపొందించుకునే స్వేచ్ఛ వుండాలి. ఇంటి ముందు ఏదో ఒక బడి పెడితే చాలు. అది సాంస్కృతికంగా సైతం అక్కడి పిల్లలకు అత్యంత సన్నిహితంగా వుండాలి. ఇంత వైవిధ్యం, దానికి తగ్గ స్వేచ్ఛా సృజనాత్మకతలు లేకుండా మంచి ప్రాథమిక విద్య అందరికీ అందడం అసంభవం. అలాగే బడి వారి అవసరాలను తీర్చగలగాలి. వారి నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంచగలగాలి. అన్ని వైపులా వారిని ఒక మెట్టు ఎక్కించగలగాలి. పిల్లలచేత నీతి వాక్యాలు వల్లింపజేస్తే సరిపోదు. పరాయికరిస్తే అసలే పనికిరాదు. దీనికి కేరళ, హిమాచల్ వంటి రాష్ట్రాల అనుభవాలను ఆదర్శంగా తీసుకోవచ్చు. లాటిన్ అమెరికా దేశాల్ని అనుసరించవచ్చు. బడి పనితీరు, టీచరు, పాఠ్యాంశాలు, బోధనా రీతులు, మొత్తం బడి వాతావరణం పేద పిల్లల సొంత వాతారణంగా మార్చడం ఎలా అనేది ఏ విద్యా విధానానికైనా అసలైన సవాలూలు, సారమూ! తమ ప్రపంచం నుంచే ప్రారంభించి సవిశాల ప్రపంచం వైపు పిల్లల్ని మళ్లించడమే శాస్త్రీయ విద్యావిధానం!

### నాలుగవది మంచి బడి

మన దేశంలో 1990ల దాకా గ్రామీణ ప్రాథమిక పాఠశాలలు వీధిబడి స్థాయిని దాటలేదు. అయినా గ్రామం దానికి వెన్నుదన్నుగా నిలబడ్డంతో ఒక ఉన్నత, మధ్యతరగతి వర్గాల

వరకు అది అంతో ఇంతో వుపయోగపడింది. కానీ మెజారిటీ విద్యార్థులకు వీటివల్ల ప్రయోజనం అంతంత మాత్రంగానే వుండిపోయింది. అందువల్లనే అప్పటి నూతన విద్యా విధానం 50 శాతం పిల్లలు బడి మొహమే చూడ్డం లేదని ఒప్పుకోక తప్ప లేదు. కానీ ఆ తర్వాత కొంత మార్పు వచ్చింది. దేశంలోకి నూతన ఆర్థిక విధానాలు చొచ్చుకొచ్చాయి. ప్రపంచీకరణతో ప్రపంచబ్యాంకు రంగప్రవేశం చేసింది. అది అనేక అధ్యయ నాలు చేసింది. ఆ కాలంలో వచ్చిన "భారతదేశంలో ప్రాథమిక విద్య" అనే ప్రపంచబ్యాంకు ఉద్గ్రంథం ప్రాథమిక విద్య తీరు తెన్నులు, దాని అవసరాలు, ప్రయోజనాలపై విస్తృతంగా చర్చకు పెట్టింది. అంతర్జాతీయంగా మనం అట్టడుగున వున్నామని వేలెత్తి చూపింది. ఫలితంగా ప్రాథమిక విద్యపై ఎప్పుడూ లేని చర్చలు మొదలయ్యాయి. అర్జెంటుగా అందరికీ ప్రాథమిక విద్యనందించి తీరాలన్న హడావిడి మొదలైంది. దీంతో కేంద్ర ప్రాయోజిత పథకాలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల సాయంతో ప్రాజెక్టులు ఎక్కడికక్కడ వెల్లువెత్తాయి. మరోవైపు వయోజనుల కోసం సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమాలు కూడా హోరెత్తాయి. ఫలితంగా తమ పిల్లల చదువుపట్ల స్పృహ నిరుపేదల్లో సైతం విపరీతంగా పెరిగింది. మధ్యతరగతి మంచి చదువు కోసం ఎంత తెగింపుకైనా సిద్ధపడ సాగింది. గొప్ప డిమాండ్గా విద్య ముందుకు వచ్చింది. భారతదేశ విద్యారంగ చరిత్రలో ఏదో కీలక ఘట్టం. దీన్ని గుర్తించి, ఒక అవకాశంగా మలుచుకొని బలమైన పాఠశాల వ్యవస్థల్ని నిర్మించుకొని వుంటే, ప్రజాకాంక్షలకు దగ్గ విద్యనందించగలిగి వుంటే చరిత్ర మరోలా వుండేది. దీనికి భిన్నంగా "శిక్షా కర్మి" లోక్ జుంబుష్, "విద్యా హామీ పథకం"లాంటి ప్రాజెక్టులు విదేశీ ద్రవ్య సంస్థల సాయంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో వేలం వెర్రిగా ప్రవహించాయి. 'ప్రజల ముంగిట','ప్రజల సారథ్యంలో', 'పేదలకనుగుణంగా' అంటూ ఇవి అందరిని భ్రమల్లో తేలియా డించాయి. కానీ ఇప్పటికే ప్రపంచమంతా ఆధునిక కామన్ స్కూల్ విధానం వ్యవస్థీకృతమై వుంది. మనకిదేమీ కన్పించ లేదు. ఇదే కాలంలో DPEP వంటి పథకాల పుణ్యమా అని మారుమూల పల్లెల్లోనూ ప్రాథమిక పాఠశాలలు కోకొల్లలుగా వెలిసాయి. అందుబాటు (access) సమస్యను తీర్చినట్లు బయటకు కనిపించినా ఇవన్నీ ఒకరిద్దరు టీచర్లతో, ఒక గదీ వరండాతో వెలసిన స్కూళ్లు! దీనికి తోడు పేరా టీచర్లు, విద్యా వాలంటీర్లు పాఠశాలల్లోకి ప్రవేశించారు. ప్రాథమిక విద్యకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చి "అక్షర జ్ఞానం అందిస్తే సరి" అని ప్రపంచ బ్యాంకు చెప్పుకొచ్చింది. ఆపైన వారే ఆకాశాల్ని అందుకోగల శక్తిమంతులవుతారని కొత్త సిద్ధాంతాలు వల్లించసాగింది. ఒక లెక్క ప్రకారం 1993కి 94 శాతం పిల్లలకు బడి అందుబాటు లోకి వచ్చింది. కానీ ఇవి ఆధునిక విద్యావసరాలకు ఏ మాత్రం పనికిరానివి. పెరిగిన ఆకాంక్షల కేమీ. ఇవి సరిపోక పోవడంతో దిగువ మధ్యతరగతి సైతం ఊరి బడికి వీడ్కోలు చెప్పి ప్రైవేటు బడిని ఆశ్రయించసాగింది. వాళ్ళు వెళ్లిపోవడంతో సర్కారు బడి అలనా పాలనా లేక నిర్వీర్యమైపోయింది. యునెస్కో అంచనా ప్రకారం ప్రపంచ పాఠశాల విద్యార్థుల్లో 2012లో 12% ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతుంటే, భారత్లో 40% పిల్లలు ప్రైవేటు బాట పట్టారు. ముఖ్యంగా ఎగువ, మధ్యతరగతి వర్గాల పిల్లలు ప్రభుత్వ స్కూళ్లను వదిలేశారు. దీన్ని సాకుగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ను తగ్గించసాగాయి. ఈ ధోరణితో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు పిల్లలు లేక వెలవెలపోవడం, మూతపడ్డం, విలీనం కావడం మామూలైపోయింది. ఆ కాలంలో నడిచినదంతా ఒక అడ్ హాక్ ధోరణి. అమర్త్య సేన్, జీన్ డ్రీజ్లు చెప్పినట్లు వీటిలో ఏ నాణ్యతకూ, ఏ సమానత్వానికీ, ఏ సుస్థిరత కూ తావులేదు. ఇవన్నీ సెకండ్ ట్రాక్ అరేంజ్మెంట్స్, అంతా తాత్కాలికం. అధునిక యుగావసరాలకు ఏ మాత్రం వుపయోగ పడని వ్యవహారం. "విద్యాహక్కు చట్టం రిపోర్టు" ప్రకారం కేవలం పది రాష్ట్రాల్లో 81,647 ప్రాథమిక పాఠశాలలు అంత రించాయి తరగతికొక టీచర్ ఉన్నవి 20 శాతం కూడా లేవు. ఒకే టీచర్ ఉన్నవి 20 శాతం. ఇద్దరు టీచర్లు ఉన్నవి 50 శాతం. ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా లేనట్టు నేడు 12,243 ప్రాథమిక పాఠశాలలు (మూడో వంతు పైగా) ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. ప్రాణం వున్న పాఠశాలలు 10 శాతం వుంటే ఒట్టు. ఇదో పెద్ద సంక్షోభం. అంతంత అధ్యయనాలు చేసి భవిష్యత్తును భూతద్దంలో చూపగల ప్రపంచ బ్యాంకుకు ఈ మాత్రం తెలియకే ఇలా జరిగిందా? లేక పథకం ప్రకారమే ఇలా జరిగిందా? దీనికి పరిష్కారం బలమైన ప్రాథమిక పాఠశాల విద్యావ్యవస్థ మాత్రమే. మన పాఠశాలలు ఆధునికంగా వుండాలి. కాలానికి తగ్గ హంగులు, సాంకేతిక, సౌకర్యాలు వుండి తీరాలి. వీటిలో తరగతికి ఒక గది, ఒక టీచరు వుండి తీరాలి. వాటిలో శిశు విద్య కూడా వుండాలి. కనీసం పంచాయతీకి ఒక అన్ని హంగులు గల ప్రాథమిక పాఠశాల తప్పనిసరి. ప్రైవేటు స్కూళ్ళు ఈ నియమాన్ని పాటిస్తున్నప్పుడు, బహుళ తరగతి బోధనతో, ఒకరిద్దర టీచర్లతో ప్రభుత్వ పాఠశాలలు ఎలా బతుకుతాయి? బతికినా వాటితో ఫలితం ఏమిటి ? ఇలాంటి మంచి నమూనా కోసం మనకు ఎక్కడికో పోనక్కర్లేదు. కేరళలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేని ఏ ప్రాథమిక పాఠశాలా లేదు. డిజిటలైజ్ కానీ ఏ ఒక్క తరగతి గదీ వాటిలో లేదు. ఈ మధ్య అవి మరింత ఆధునికతను సంతరిం చుకుంటున్నాయి కూడా. అందువల్లనే పెరుగుతున్న ప్రజల ఆకాంక్షల్ని తీర్చగలిగి మధ్య తరగతిని కూడా ఆకర్షించగలుగు తున్నాయి. ఆమ్ ఆద్మీ అధికారంలోకి వచ్చాక ఢిల్లీ అనుభవం కూడా ఇదే. ఈ రెండు చోట్లా ప్రభుత్వపాఠశాలల్లో పిల్లలు బాగా పెరిగారు. పట్టణ విద్యకు ఎలాంటి వ్యూహం పాటించాలో, ప్రభుత్వ పాఠశాలల్ని పట్టణాల్లో కాపాడుకోవడం ఎంత కీలకమో

కూడా ఢిల్లీ అనుభవం చెబుతుంది. ఉదారంగా నిధులివ్వకుండా ఆదర్శాలు వల్లింపుతోనే ఇది అసాధ్యం.

ఇక మన రాష్ట్రాన్ని తీసుకుంటే మనకు ప్రస్తుతం 33,106 ప్రాథమిక పాఠశాలలు ప్రభుత్వ రంగంలో వున్నాయి. (ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలలు బాగా తగ్గిపోయాయి) అలాగే 13,325 గ్రామ పంచాయతీలు వున్నాయి. పట్టణాలనీ, నగరాలనీ కూడా కలుపుకొని నిర్దిష్ట జనాభా, ప్రాంతం ప్రాతిపదికగా సుమారు 16 వేల ప్రాథమిక పాఠశాలల్ని, ప్రాథమికోన్నత పాఠశాలలను కేరళలో లాగా తీర్చిదిద్దవచ్చు. క్రమంగా వీటిలో ఇతర ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పిల్లలు కూడా చేరుతారు. కామన్ స్కూల్స్‌గా ఇవి రూపాంతరం చెందుతాయి. పాఠశాలకు ఒక కోటి ఖర్చు చేసినా కలిపి 16 వేల కోట్ల ఖర్చుకు మించదు. ఒక్క అమ్మ ఒడికే రాష్ట్రం 55 నెలల్లో రూ.26,067 కోట్లు ఖర్చు చేసింది. మరి మనకు కావలసింది ఏమిటి? దార్శనికత! ప్రభుత్వవిద్య పట్ల నిబద్ధత!!

**ఐదవది నాణ్యత**

ఇప్పుడు మనకు పాఠశాలల అందుబాటులో ఏ కొరతా లేదు. దేశంలో సగటు లక్ష జనాభాకు 83 పాఠశాలలుంటే ఆంధ్రప్రదేశ్‌లో 92 ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి. ఇది కేరళ కంటే కూడా చాలా ఎక్కువ. సమస్య ఏమంటే ఇవేవీ ప్రస్తుత అవసరాలకు ప్రజల ఆకాంక్షలకు ఏ మాత్రం తగినట్లు లేవు. ఏ అధ్యయనం ప్రకారం చూసినా ఇవి పరమ నాసిరకం పాఠశాలలు. మన చదువులు ఏ నాణ్యతా లేనివి. నాణ్యత అంటే రెండు రకాలు. ఒకటి నైపుణ్యాలు, రెండు విలువలు. నైపుణ్యాల దగ్గరకు వస్తే 2018 అసర్ సర్వే ప్రకారం ఐదో తరగతి పిల్లల్లో 22.4 శాతం పిల్లలు మాత్రమే రెండో తరగతి వాచకం చదవ గలరు. మూడో తరగతిలో 38.4 శాతం మాత్రమే కూడికలు చేయగలరు. ఎనిమిదో తరగతిలో 47.60 శాతం మించి భాగాహారాలు చేయలేరు. ప్రపంచబ్యాంకు అధ్యయనం ప్రకారం ఐదేళ్ల చదువు పూర్తిచేసిన మన పిల్లల్లో 50 శాతం మందికి కనీస పఠన సంఖ్యా జ్ఞానాలు లేవు. మాతృభాషలో కూడా పరిస్థితి ఇలానే వుందని USAID చెబుతోంది.

అజీం ప్రేమ్ జీ ఫౌండేషన్ 2005-10 మధ్య ఐదేళ్లలో మన చదువుల్లో ఏ మార్పు రాలేదనీ, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుందని నిర్ధారించింది. ఇక బ్రిటీష్ కౌన్సిల్ 2019 జూలైలో ప్రకటించిన రిపోర్టు విద్యా ప్రమాణాలు ఇలా పడిపోవడానికి స్థోమత గల వారంతా పట్టణాల్లోని ప్రైవేట్ స్కూళ్ళకి వెళ్లి, నిరుపేదలు మాత్రమే ప్రభుత్వ స్కూళ్లలో మిగలడం కారణంగా పేర్కొంది. ఇటీవల అసర్ - 2023 మరీ ఘోరమైన వాస్తవాలు ప్రకటించింది. దీని ప్రకారం 9వ తరగతి (14 ఏళ్ల) పిల్లలు 25 శాతం రెండవ తరగతి వాచకం చదవలేరు. అలాగే 52.7% మందికి సాధారణ భాగాహారం తెలియదు. అంతెందుకు 55% పైగా పిల్లలు గడియారం చూసి సమయం కూడా చెప్పలేరు. ఇక ఆంగ్ల వాక్యాలు చదవగల వారు కేవలం 53.7% మాత్రమే. అయినా స్మార్ట్‌ఫోన్ మాత్రం 90 శాతం మందికి అందుబాటులో వుంది ! ఇదంతా ప్రభుత్వ పాఠశాలల దుస్థితే కాదు ప్రైవేటు స్కూళ్ళ పిల్లలు సంగతి ఇంతే !

ఇక విలువల దగ్గరకు వస్తే కార్పొరేట్ విద్య ఎంత కుహనా సంస్కృతిని తెచ్చిందో, తరగతి గదిని ఎంత విధ్వంసం చేసిందో ICR IERC(Indian Council for Reaserch on International Economic Relations) విజిటింగ్ ఫెల్లో రష్మీశర్మ కళ్ళకు కట్టిస్తాడు. తరగతిలో పిల్లల్ని మార్కుల వారీగానే గాదు కులాల వారీగా కూడా విడదీయడం, ఆరో తరగతి నుంచి ఐఐటీ కోచింగ్ పేరుతో బట్టీ పట్టించడం, భాషల్ని సామాజిక శాస్త్రాల్ని అటకెక్కించడం, విపరీతమైన పోటీల్లోకి నెట్టి ప్రపంచానికి దూరం చేయటం, తల్లిదండ్రుల్లో వల్లమాలిన వ్యామోహాల్ని పెంచడం, ప్రభుత్వాలు నిశ్చేతనంగా చూస్తుండిపోవడం ఆయన అధ్యయనంలోని కీలకాంశాలు. ఇక బ్రిటిష్ కౌన్సిల్ మరో అడుగు ముందుకేసి ఇంగ్లీష్ మీడియం ఈ నాసిరకపు చదువులకు మూలమంటూ సుదీర్ఘంగా చెప్పుకొచ్చిం ది. దీన్నిప్పుడు మనం School Illiteracy అనీ, 'అభ్యసన సంక్షోభమనీ' కొత్త కొత్త నామధేయాలతో పిలుచుకుంటున్నాం .వీటిని కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నాం. మరీ ఆత్మవంచన ఏమంటే ఈ పిల్లలే పదో తరగతిలో 90% పైగా ఉత్తీర్ణులవుతున్నారు. ఇంగ్లీషులో కూడా వందకు వంద మార్కులు తెచ్చుకుంటున్నారు.

ఒక స్పష్టమైన శాస్త్రీయమైన అకడమిక్ విధానం లేకపోవడమే దీనికి కారణం. "ప్రాథమిక పాఠశాల ఇంటికి కొనసాగింపు" (Primary school is the extension of home) అని విద్యావేత్తలంటారు. చిన్న వయసులో బడి వాతావరణం అలా లేకుంటే పిల్లలు పరాయికరణ చెందుతారు. మరీ గ్రామీణ గిరిజన ప్రాంతాల పిల్లలు తమది ఏ మాత్రం కాని ప్రపంచం లోకి ఉన్నట్టుండి తోసేసినట్టవుతారు. ఇది పిల్లల్ని బడికి విముఖుల్ని చేస్తుంది. తమకీ చదువు సాధ్యం కాదనే భయాన్ని కలిగిస్తుంది. ఇది వాళ్ళ అభ్యసనంపై తీవ్ర ప్రభావం చూపు తుంది. దీనికి తగ్గట్టు తరగతి గదీ, టీచరూ, బోధనా, అక్కడి భాషా సంస్కృతులూ, పాఠ్యాంశాలూ ప్రతిదీ వాళ్ళకి ఏమి సంబంధం లేనివి. దీనికి ఇక ఇంగ్లీష్ మీడియం కూడా తోడైతే చెప్పాల్సిన పనిలేదు. అందువల్ల ప్రాథమిక విద్య పిల్లల సొంత ప్రపంచంతో ప్రారంభం కావాలి. పిల్లలు కేంద్రంగా సాగాలి. అసలు పిల్లల నుంచి, వాళ్ళ సమాజం నుంచి బడి మొదట పాఠాలు నేర్చుకోవాలి. ఇదొక పెద్ద ప్రజాస్వామిక బోధనా విధానం. మొత్తం విద్యావ్యవస్థను పిల్లలకి అనుగుణంగా పైనుం

చి కిందికి ప్రజాస్వామ్యకరించినపుడే ఇది సాధ్యమవుతుంది.

ఇక ఇంగ్లీషు మీడియం ప్రాథమిక విద్యలో అర్థరహితమే గాదు ప్రమాదకరం కూడా. సాక్షాత్తు బ్రిటిష్ కౌన్సిల్ సైతం ఇదే చెప్పుకొచ్చింది. ప్రాథమిక దశలో మొదట ఇంగ్లీషు వినడం మాట్లాడడం వరకు నేర్పవచ్చు. పరిచయం అయ్యాక మెల్లగా ఆరు నుంచో, తొమ్మిది నుంచో కాకుంటే 11వ తరగతి నుంచో ఇంగ్లీష్ మీడియం లోకి మార్చవచ్చు. అసలు ఒక భాషగా ఆంగ్లం నేర్పడం, ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవడం రెండూ ఒకటి కాదు. పరిసర భాషను పసి వయస్సు నుంచే దూరం చేస్తే తప్ప ఇంగ్లీషు వొంట పట్టదన్న ప్రస్తుత విద్యావిధానం పరమవికారమైంది. అశాస్త్రీయమైంది.

మన అకడమిక్ వ్యవస్థలను కూడా పునర్నిర్మాణం చేయాలి. వీటిని ప్రజాస్వామ్యీకరించాలి. రాష్ట్ర విద్యా పరిశోధన మండలాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల, సమూహాల అవసరాల్ని తీర్చగల పరిశోధనలు చేయాలి. సామగ్రిని రూపొందించాలి. దీని కోసం ప్రజల నుంచి, వారి సంస్కృతుల నుంచి చాలా నేర్చుకోవాల్సి వుంటుంది. భిన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహించేవారు విద్యా పరిశోధన సంస్థల్లో బాధ్యతల్లో ఉండాలి. ఇదే సూత్రం జిల్లా స్థాయికీ వర్తిస్తుంది. సాధారణ టీచర్ల నుంచి అకడమిక్ అవసరాలన్నిటికీ తగిన నిపుణుల్ని ఎంపిక చేసుకోవాలి. వారే శిక్షణలివ్వాలి. అకడమిక్ పర్యవేక్షణలు చేయాలి. అలాగే స్థానికతకు తగ్గ వ్యూహాల్ని మాత్రమే కాదు సామగ్రిని సైతం వారు రూపొందించుకునే స్వేచ్ఛనివ్వాలి . కర్ణాటక ప్రయోగం "నలికలి" ఈ విషయంలో గొప్ప అనుభవం.

నూతన విద్యా విధానం పైపైన స్థానికత అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంది గానీ చివరికి చిన్న పిల్లలకు ఏ కథలు చెప్పాలో కూడా పైనుంచే నిర్ణయిస్తుంది. అందులో మళ్ళీ 'కాశీ మజిలీ కథలే' తప్ప 'నసీరుద్దీన్' కథలు పనికిరావు. ఈ ధోరణి పేద పిల్లల భావోద్వేగాల్ని విధ్వంసం చేస్తుంది. బడి అంటేనే మొహం మొత్తేలా చేస్తుంది. వీటన్నింటినీ చూడనిరాకరిస్తూ నూతన విద్యా విధానం కునారిల్లుతున్న ప్రమాణాల నివారణకు "రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీని" బ్రహ్మాస్త్రంగా ప్రకటిస్తోంది. ఆధునిక బోధనా రీతుల్ని, మెళకువల్ని, సాంకేతికతనూ మనం అలవర్చుకోవాలి. కాలం చెల్లిన భట్టీయాల్ని, మొద్దురాతలను వదిలించుకోవాలి. ప్రాథమిక దశలో భాష చాలా కీలకం. ఇప్పుడు ఏడాదిలో అద్భుతంగా చదవడం నేర్పే విధానాలొచ్చాయి. అలాగే బోధనతోపాటు గురు శిష్యుల సంబంధాల గురించి మన ఆలోచనా ధోరణుల్లో తీవ్రమైన మార్పులు రావాలి. ఇదొక సాంస్కృతికాంశం కూడా. మనం ఫాలోఫెయిరీ నుంచి కాదు గదా గిజూబాయి నంచి కూడా ఏమీ నేర్చుకోలేకున్నాం. అందువల్లనే ఎన్ని శిక్షణలచ్చినా మన టీచర్లు పాతవిధానాన్ని వదిలి పెట్టడం లేదు. "భూమ్మీద పుట్టిన ప్రతి బిడ్డా చదవడం, రాయడం, లెక్కించడం సులభంగా నేర్చుకోగలరు. ఇదేమీ బ్రహ్మ విద్య కాదు" అని మొదట ఉపాధ్యాయులు ఒప్పుకోవాలి. పేద వెనకబడ్డ వర్గాల పిల్లల్లో ప్రత్యేక సామర్థ్యాలుంటాయి. అసలు అందరికీ ఒకే అంశంలో ఒకే ప్రమాణాలు ఎలా వుంటాయి ? ఎందుకుండాలి? మనం పిల్లల్లోని అద్భుతమైన సామర్థ్య వైవిధ్యాన్ని అంగీకరించాలి. వారిని నమ్మాలి. ప్రేమించాలి. ఈ ధోరణులను విద్యారంగంలో ప్రయత్నం పూర్వకంగా విస్తరింప చేయాలి. బాధాకరం ఏమంటే నూతన విద్యా విధానం దీనికి పచ్చి వ్యతిరేకం. దానిది వెనక్కు నడిపించే, బోధనారంగంలో సైతం "అన్నీ మన వేదాల్లోనే వున్నాయియుష" అనే ధోరణి.

మన రాష్ట్రంలో ప్రాథమిక విద్యను రెండు ముక్కలు చేయడం ఆత్మహత్యాసదృశ్యం. ఏ అధ్యయనమూ, అనుభవమూ దీన్ని శాస్త్రీయం అనడం లేదు. మూడు నాలుగు ఐదు తరగతులకు సబ్జెక్టు టీచర్లు బోధించాలన్న సిద్ధాంతం అర్థరహితం. ప్రాథమిక విద్య ఒకటి నుంచి ఐదు తరగతులతో ఒక యూనిట్. దానికి అనుబంధంగా శిశువిద్య వుండాలి. దీన్ని కాదని ఊరిబడిని ముక్కలు చెయ్యడం వల్ల ఒకటి రెండు తరగతులుమాత్రమే మిగిలిన పాఠశాలలు ప్రాణం లేనివయ్యాయి. ఇక 3-5 తరగతులు పరాయీకరణ చెందాయి. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేనట్టు 12,343 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి మూతకు సిద్ధమయ్యాయి. దీన్ని తక్షణం ఉపసంహరించుకొంటే తప్ప మన ప్రాథమిక పాఠశాలలు బతికి బట్ట కట్టవు.

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లోకి బైజూస్, టోఫెల్, ఐబి లాంటి ఎక్కడా లేనివన్నీ వచ్చి కొలువుదీరాయి. కృత్రిమ మేథతో సందేహనివృత్తి "ఆప్" వస్తోంది. DUOLINGO సహకారంతో జాపనీస్, ఫ్రెంచి భాషలు సైతం నేర్పబోతున్నారు. Future Skillsను గురించే ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న చర్చంతా. అలాగే 'నాడు-నేడు' తదితరాల పేరుతో మరోవైపు ప్రభుత్వం చెప్పుకోతగ్గ నిధుల్నే ఖర్చు చేస్తోంది. తమ "దార్శనికత" పట్ల అది చాలా ధీమాగా కూడా వుంది. అయినా ఈ ఏడాది మూడు లక్షలకు పైగా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్ని వదిలేయడం పైనా, ప్రమాణాలు ఘోరంగా వున్నట్టు అసర్, NAS సర్వేలు చెప్పడం పైనా మాత్రం ఎవ్వరూ పెదవి విప్పడం లేదు. పాఠశాలల్లో ఒక్క చదువు తప్ప అన్నీ వున్నందు వల్లే ఇలా జరిగింది. ఇక పనిలో పనిగా దాదాపు ఇరవై వేల టీచర్ పోస్టులకు ప్రభుత్వం మంగళం పాడిందనేది కూడా దాచేస్తే దాగని సత్యం!

చివరిగా పర్యవేక్షణా నిర్వహణల గురించి ప్రభుత్వ పాఠశాలల మీద ఉన్న పెద్ద అభియోగం అవి సరిగా పనిచేయవని. టీచర్లు సరిగా హాజరు కారని, వచ్చినా పాఠాలు చెప్పరని. మన ప్రాథమిక పాఠశాలలు ఎవరికీ పట్టని ఒంటరివని. ఉత్తరభారత

వెనకబడ్డ రాష్ట్రాల ప్రాథమిక పాఠశాలలపై విస్తృతంగా అధ్యయనం చేసిన "ప్రోబ్" (పీపుల్స్ రిపోర్ట్ ఆన్ బేసిక్ ఎడ్యుకేషన్ – 1999 ) ఈ సర్వే చేస్తున్న సమయంలో 49% పాఠశాలలో ఏ బోధనా కార్యక్రమం జరగడం లేదని చెప్పింది. అసలు సమస్య బడి పనితీరేననీ, ప్రమాణాల్ని సైతం అదే నిర్ణయిస్తుందని అది విశ్లేషిస్తుంది. ఇది చాలా విలువైన రిపోర్టు. అమర్త్యసేన్ ప్రారంభించిన "ప్రతీచి" కూడా టీచర్లకు జవాబు దారితనం లేమీ, గ్రామీణ పాఠశాలల పనితీరూ అసలు సమస్యలంటూ చెప్పుకొచ్చింది. బ్రిటిష్ కౌన్సిల్ మధ్యతరగతి దూరంగా అవడంతో ప్రభుత్వ స్కూళ్ళు దివాలా తీశాయని విశ్లేషించింది. ఎన్ని భవనాలు కట్టినా, ఎన్ని సౌకర్యాలు కల్పించినా, ఎన్ని శిక్షణలిచ్చినా ప్రభుత్వ స్కూళ్ళలో పిల్లలెందుకు తగ్గుతున్నారని, అభ్యసన వైఫల్యాలు ఎందుకు ఎదురవుతున్నాయని పెద్ద చర్చ నడుస్తోంది. ఇందులో తమ బాధ్యత ఏమీ లేనట్టు ప్రభుత్వాలు కూడా ఈ వ్యవస్థపై మరింత నమ్మకం సడలేలా టీచర్లపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏది ఏమైనా ఒకటి వాస్తవం. ప్రజలకు ప్రభుత్వ బడిపై విశ్వాసం నానాటికి తగ్గిపోతోంది. మరి దీనికి మార్గం ఏమిటి? దీని కోసం ఎక్కడికో వెళ్ళనక్కరలేదు.

మనదేశంలోనే దీనికి మంచి నమూనాలున్నాయి. కేరళ అనుభవం వీటిలో చాలా గొప్పది. అక్కడ పాఠశాలల నిర్వహణ అంతా పంచాయతీలదే. బాధ్యత వాటిదే. ఆ పంచాయతీలు ఎంతో బలమైనవి. ప్రభుత్వం నియామకాలు, వేతనాలు, అకడమిక్ విధానాలకు పరిమితం అవుతుంది. రోజువారీ నిర్వహణ అంతా పంచాయతీలదే. అలాగే తమిళనాడులో స్వాతంత్రం రాక ముందు నుంచి ఎంతో సమర్థవంతమైన 'పేరెంటు టీచర్స్ అసోసియేషన్స్' వున్నాయి. భవన నిర్మాణాల నుంచి మధ్యాహ్న భోజనం, టీచర్ల సెలవుల దాకా ఇవే నిర్ణయిస్తాయి, పర్యవేక్షిస్తాయి. ఇటీవలి కాలంలో హిమాచల్‌ప్రదేశ్‌ను దీనికి మరీ మంచి ఉదాహరణగా చెబుతున్నారు. ప్రజా సహకారం, ప్రజా ప్రమేయం, మరీ బడి చుట్టూ తల్లులు రక్షణ కవచంగా నిలబడడం దీని ప్రత్యేకత. హిమాచల్‌లో 1961కి కేవలం 11 శాతంగా వున్న 15–19 బాలికల అక్షరాస్యత 1991 నాటికి 86 శాతానికి ఎదగడంలోని రహస్యమంతా ఇదేనంటారు జీన్ డ్రేజ్, అమర్త్యసేన్లు. మధ్య తరగతి పిల్లలు సైతం ప్రభుత్వ స్కూళ్ళలోనే చదువుతుండడం. టీచర్ల, పిల్లల ఆర్థిక నేపథ్యాలు కూడా ఒకటిగానే వుండడం పాఠశాలలు సమర్థవంతంగా పనిచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వాళ్ళంటారు. మహిళా శ్రామిక శక్తి, సంఘటన శక్తి బలంగా ఉన్నచోట కూడా పాఠశాలలు బాగా నడుస్తాయని, బాలికా విద్య పటిష్టంగా వుంటుందని మరికొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. వాస్తవానికి ప్రపంచమంతటా బడి నిర్వహణలతో స్థానిక కమిటీలదే ప్రధాన బాధ్యత. అన్ని దేశాల్లోనూ స్థానిక ప్రజావ్యవస్థలదీ, తల్లిదండ్రులదే ప్రధానపాత్ర నిధులకు, పాలసీలకు ప్రభుత్వాలు పరిమితం. మన దేశం మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. మన వ్యవస్థ మొత్తం బ్యూరోక్రట్ల మీద ఆధారపడినడుస్తోంది. బడి అధికారులకే తప్ప ప్రజలకేమీ జవాబుదారీ కాకపోవడం మన దేశంలోనే చూస్తున్నాం. అలాగే ఉపాధ్యాయులను నమ్మాలి. వారికి స్వేచ్ఛనివ్వాలి. బాధ్యతలను అప్పజెప్పాలి. సమాజానికి జవాబుదారీ చెయ్యాలి.

మరి దీనికి నూతన విద్యావిధానం చెబుతున్న పరిష్కారం ఏమిటి? మరింత విద్యా శాఖ నియంత్రణ లేదా స్వీయ నియంత్రణా నిర్వహణా పద్ధతులూ ! ఈ రెండింటిలోనూ ప్రజల ప్రమేయం ఆవంత కూడా లేదు. ప్రజావ్యవస్థల పాత్రకు చోటే లేదు. బడి సమాజం నుంచి దూరమై ఏకాకిగా మారడం పట్ల ఏమాత్రం దీనికి దృష్టి లేదు. మన పాఠశాల విద్యా కమిటీలు కేవలం పేద ప్రజలతో కూడినవి కావడంతో ఏ జోక్యం చేసుకోలేనివన్న స్పృహ దీనికి లేదు.

**వాస్తవానికి "విద్యా హక్కు చట్టం" పిల్లల విద్యా హక్కుకు ప్రభుత్వం, టీచర్లు, తల్లిదండ్రులు ముగ్గురూ గ్యారంటీ ఇవ్వాలంటుంటుంది. ఆ దృష్టితో చూచినా పాలనా నిర్వహణల్లోనూ వీరి ముగ్గురి ప్రమేయం ఉండాలి. దీన్ని నూతన విద్యా విధానం పట్టించుకోలేదు. కేరళ, హిమాచల్ వంటి రాష్ట్రాల అనుభవాలను అది చూడ నిరాకరిస్తోంది. దీన్నంతా మూడు ముక్కల్లో చెప్పొచ్చు. ఒకటి ప్రభుత్వమే అందరికీ నాణ్యమైన విద్యకు పూచీ పడాలి. రెండు బలమైన వ్యవస్థల్ని నిర్మించాలి. మూడు వాటి నిర్వహణలో ప్రజాస్వామిక దృక్పథం వుండాలి. ప్రజా వ్యవస్థల్ని తోడు తెచ్చుకోవాలి. అయితే ఇవన్నీ ఏమీ గాల్లోంచి రావు. రాజకీయాలు ప్రజాస్వామికంగా మారితే తప్ప, విద్యారంగాన్ని ప్రజాస్వామ్యానికి పునాదిగా గుర్తించే దృక్పథం వుంటే తప్ప మన ప్రస్తుత ప్రాథమిక విద్య ఇంత కంటే మెరుగుపడే అవకాశం లేదనిపిస్తోంది.**

దీనికి తగ్గ ఒత్తిడి సమాజం నుంచి రావాల్సిన తరుణమిది. అట్లని అందరికీ మంచి ప్రాథమిక విద్య అసాధ్యం కూడా కాదు. చాలా దేశాలు దీన్ని సాధించి చూపించాయి. మనదేశంలోనే కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దీన్ని సులభంగానే సాధించాయి. మనసుంటే మార్గం వుంది! ❑

# 2020 నూతన విద్యా విధానానికి ప్రత్యామ్నాయం-కొన్ని పరికల్పనలు



- ఎస్.గోవిందరాజులు

**కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 గత రెండు సంవత్సరాలుగా దేశం లోనూ, రాష్ట్రంలోనూ అమలవుతోంది. ఈ విధానం వలన తలెత్తుతున్న తీవ్ర పర్యవసానాలను గురించి అభ్యంతరాలు లేవనెత్తినప్పుడు ఎదురయ్యే ప్రశ్న ప్రత్యామ్నాయ విధానం ఏమిటని. నిజమే! కేవలం ప్రభుత్వాల విధానాలను విమర్శించడమే కాక, విద్యకు సంబంధించి ప్రజల పక్షాన కొన్ని అంశాలను ప్రతిపాదించవలసిన అవసరం ఉంది. వీటి గురించి ప్రస్తావించే ముందు ఒక మౌలిక వాస్తవాన్ని స్పష్టం చేయాలి.**

ఇప్పటికే చాలా మంది వ్యక్తులు, సంస్థలు, ఎన్ఈపీ-2020 స్థానంలో కొన్ని ప్రజానుకూల ప్రతిపాదనలను సూచించినప్పటికీ అవి చెవిటివాడి ముందు శంఖమూదిన చందంగా తయారయ్యాయి. కారణం స్పష్టమే. ప్రయోజనాల దృక్కోణంలో పాలకులకు, ప్రజలకు మధ్య పొసగని వైరుధ్యం నెలకొని ఉండడం. రెండు వర్గాలుగా విడివడి ఉన్న సమాజంలో పాలకులు గుప్పెడు ఆర్థిక-సామాజిక ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు కొమ్ముకాస్తున్నప్పుడు, విస్తృత ప్రజా ప్రయోజనాల యెడల శ్రద్ధ వహిస్తారని ఆశించలేము. ఒక్క ఉదాహరణ చాలు. అరవయ్యవ దశకంలోనే అప్పటి ప్రభుత్వమే నియమించిన అత్యంత పేరొందిన కొఠారి కమిషన్ విద్యకు జీడీపీలో ఆరు శాతం నిధుల కేటాయిపును సిఫార్సు చేసింది. అప్పటి నుండి నేటి వరకు గద్దెలెక్కిన ఏ ప్రభుత్వమూ ఆరు శాతం సంగతి అటుంచితే, కేటాయింపులను క్రమంగా తగ్గిస్తూ, ప్రజలకు విద్యనందించే బాధ్యతకు తిలోదకాలిస్తూ, విద్య ప్రైవేటీకరణ వరద గేట్లను పెద్దవిగా చేస్తూ వస్తున్నాయి. స్వాతంత్ర్య అనంతరం మొదటి సారిగా అసలు సిసలు జాతీయ విద్యా విధానాన్ని రూపొందించామని ప్రస్తుత ఢిల్లీ పాలకులు ఒకవైపు ఊదరగొడుతూ, మరోవైపు విద్యకు నిధుల కేటాయింపులలో కోత పెట్టారు. వీరు అధికారంలోకి రాకముందు, అనగా 2014లో విద్యారంగానికి కేంద్ర బడ్జెట్లో 4.46 శాతం నిధులు కేటాయించగా, గత బడ్జెట్ లలో 3.8 శాతానికి పడిపోయాయి. తాజాగా వచ్చే జనరల్ ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన 2024-25 కేంద్ర తాత్కాలిక బడ్జెట్ లో




కూడా విద్యకు నిధులు 3.29 శాతానికి తగ్గిపోయాయి. నిధుల కేటాయింపులు లేకుండా చెప్పే మాటలన్నీ నీటిమీద రాతలే. కావున జీడీపీ అంకెల గారడీకి స్వస్తి చెప్పి, కేంద్ర బడ్జెట్లో 10 శాతం నిధులను గ్యారంటీ చేయాలి.

## విద్య లక్ష్యం

ప్రత్యామ్నాయ విద్యా విధానం గురించిన చర్చలో విద్య లక్ష్యం ఏమిటి అనే ప్రశ్న అత్యంత ప్రధానమైంది. ఎన్ఈపీ-2020 కూడా ఒకవైపు 21వ శతాబ్దపు నైపుణ్యాలను సాధించడం విద్య లక్ష్యమని నొక్కి చెబుతూ, మరోవైపు భారతీయ ప్రాచీన సంస్కృతి-వారసత్వం ఈ విధానానికి దీపధారి అని ప్రకటించింది. కొందరు ఈ పదాల బాహ్య రూపాన్ని మాత్రమే చూసి, ఇందులో తప్పేముందని అడగవచ్చు. అయితే ఈ విధాన రచన యొక్క కంటెంట్ బట్టి కాకుండా ఇంటెంట్ బట్టి చూస్తే ఈ పదాల గాఢత అర్థమవుతుంది. నైపుణ్యాలు అన్నప్పుడు విద్యను వృత్తుల పరిజ్ఞానానికి (ఒకేషనలైజేషన్) మాత్రమే పరిమితం చేయాలనే ప్రపంచ బ్యాంకు నిర్దేశిత విధానం విధాన కర్తలకు శిరోధార్యంగా ఉంటుంది. ఇక భారతీయ ప్రాచీన సంస్కృతి-వారసత్వం అన్నప్పుడు హిందుత్వ వాదం ఆధిపత్యం వహిస్తుంది. అనగా విద్యార్థులు లోతైన జ్ఞానాన్ని, మేధస్సును, స్వతంత్ర అలోచనా శక్తిని పొందడానికి అవకాశం లేకుండా, వారిని కొన్ని నైపుణ్యాలతో (కార్పెంటర్ నుండి కంప్యూటర్ వరకు) చీప్ లేబర్ ఫోర్స్ గా తయారు చేసి, ఆర్థిక ఆధిపత్య వర్గాలకు అందుబాటులో ఉండాలి. అందుకే విద్య యొక్క అన్ని స్థాయిల్లో టీచింగ్-లర్నింగ్ ప్రక్రియను నిర్వీర్యం చేసే సిఫార్సులు ఎన్ఈపీ-2020లో అడుగడుగునా కనిపిస్తాయి. అదే

సమయంలో హేతుబద్ధత, శాస్త్రీయతను కాలదన్ని కేవలం ప్రాచీన నమ్మకాలు, విశ్వాసాల ఆధారంగా సమాజాన్ని దర్శించే మనుషులను అంచనా వేసే ఒక తరాన్ని తయారు చేయడం. సారాంశంలో ఈ రెండింటి విచిత్ర మిళితమే ఎన్ఈపీ-2020 అని చెప్పవచ్చు. ఈ విషయంలో బహుళజాతి-కార్పొరేట్ సంస్థల మరియు హిందుత్వ శక్తుల ప్రయోజనాలు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోవడం చాలా సహజంగా జరిగింది.

ఎన్ఈపీ-2020 సంగతి అలా ఉంచి, ఆధునిక పెడగాగికల్ సిద్ధాంతాల ప్రకారం విద్య లక్ష్యం ప్రాథమికంగా జ్ఞానార్జన, జ్ఞాన అన్వేషణ, వ్యక్తిత్వ నిర్మాణం. ఉద్యోగం, ఉపాధి ఒక అంశం మాత్రమే. ఆనాటి సోక్రటీస్ నుండి నేటి ఫాలో ఫెరి వరకు చెప్పిన వివిధ సిద్ధాంతాల సారంలో ఇదే కనిపిస్తుంది. అయితే దీని అర్థం ఆధునిక సాంకేతిక అభ్యిద్ధికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకోవడం విస్మరించాలని ఎంత మాత్రం కాదు. కనీసం పదేళ్ల పాఠశాల స్థాయి వరకు విద్యార్థులు సామాజిక, ప్రకృతి శాస్త్రాల మౌలిక అంశాలలో ప్రాథమిక జ్ఞానాన్ని ఆర్జించడం చైతన్యవంతులైన పౌరులుగా ఉండడానికి తప్పనిసరి. కనీసం రెండు భాషలలో (మాతృభాష మరియు ఇంగ్లీషు) మంచి సామర్థ్యాలను సాధించటం, సాహిత్యం, సామాజిక విలువల యెడల అనురక్తిని, పట్టింపును విద్యలో పెంపొందించడం మనుష్యులుగా రూపొందే ప్రక్రియకు దోహదం చేస్తుంది. ఈ విధమైన పదేళ్ల పాఠశాల విద్య తరువాత విద్యార్థులు వారి ఆసక్తి మేరకు ఏవైనా నైపుణ్యాలను నేర్చుకోవడానికి అకడమిక్, టెక్నికల్ కోర్సులను వేరువేరుగా విభజన చేయడం శాస్త్రీయం. అలాకాకుండా కడుపు నింపడానికి, ఉపాధికి విద్య అని చాలా మొరటుగా నిర్వచించి, పాఠశాల విద్యలోనూ, ఆపై ఉన్నత విద్యలోనూ అకడమిక్ మరియు ఒకేషనల్ కోర్సులను కలగాపులగం చేసి, మొత్తం విద్యకు ఒకేషనల్ ఓరియెంటేషన్ ఇవ్వడం చాలా ప్రమాదకరం. ఇలా చేస్తే విద్యార్థులు మానవీయత, సామాజిక స్పృహ, వ్యక్తిత్వం లేకుండా మనిషి రూపంలోనున్న యంత్రాలుగా తయారవుతారు.

### పాఠశాల విద్య

విద్యా వ్యవస్థకు పునాది పాఠశాల విద్య. పాఠశాల విద్యలో అంతర్భాగమైన రెండేళ్ళ పూర్వ ప్రాథమిక విద్య మరియు పది లేదా పన్నెండు సంవత్సరాల పాఠశాల విద్య యావత్తూ పబ్లిక్ రంగంలో, ప్రభుత్వ నిధులతోనే నడవాలి. నైబర్ హుడ్ పాఠశాల వ్యవస్థ తరహాలో ప్రతి ఆవాసానికి  ఒక కిలో మీటరు పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల, మూడు కిలో మీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల ఉండాలి. ధనిక-పేద వ్యత్యాసం లేకుండా వయో సంబంధిత పిల్లలందరూ తప్పనిసరిగా అదే పాఠశాలలో చేరాలి. పట్టణాలలో, నగరాలలో కూడా వివిధ ఆర్థిక స్థాయిలకు అనుగుణంగా ఉండే పలు రకాలైన పాఠశాలల దొంతరలకు విరుద్ధంగా ఒకే విధమైన, ఒకే స్థాయి విద్యా ప్రమాణాలున్న పాఠశాలల్లోనే పిల్లలందరూ చదవడం నిర్బంధం చేయాలి. సామాజిక సమానత్వాన్ని సాధించడానికి ఇది మొదటి మెట్టు.

### 1).పూర్వ ప్రాథమిక విద్య

ఐదు సంవత్సరాల ప్రాథమిక విద్యను విభజించి ఒకటి, రెండు తరగతులను అంగన్వాడీలలో కలపాలని, మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలని ఎన్ఈపీ-2020 సిఫార్సు చేసింది. దీనికి భిన్నంగా రెండు సంవత్సరాల పూర్వ ప్రాథమిక విద్యను ఒక సమగ్ర ప్రణాళికతో 3 నుండి 5 సంవత్సరాల పసిపిల్లల పోషక ఆహారం, ఆరోగ్యం, శారీరక అభివృద్ధి, మానసిక ఎదుగుదల తదితర అంశాలపై శ్రద్ధవహించాలి. ఈ పనిని అంగన్వాడీ ఆయాలతో నిర్వహించడం సాధ్యం కాదు. కావున ఈ వయస్సులోని పిల్లల సైకాలజీ, ప్రవర్తనల గురించి మంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులను, ప్రత్యేకించి మహిళలను నియమించాలి. వీరు అత్యంత శ్రద్ధతో, ప్రేమతో పిల్లల్లోని సిగ్గును, భయాన్ని, అపరిశుభ్ర అలవాట్లను తొలగించాలి. ఈ దశలోని పిల్లలను మాతృభాష (లోకల్ భాష) మాధ్యమంగా ఆటపాటలతో, హాస్య కథలతో నిమగ్నం చేయాలి. ప్లే బేస్డ్, డిస్కవరీ మెథడ్ లో బోధన ఉండాలి. అందుకు తగిన ఆధునిక సాంకేతిక, డిజిటల్ వస్తు సామగ్రిని, మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలి.

### 2). ప్రాథమిక విద్య

ఐదేళ్ల ప్రాథమిక విద్యను ప్రతి తరగతికి ఒక గదిని, బాగా శిక్షణ పొందిన 5మంది ఉపాధ్యాయులతో మంచి ప్రమాణాలతో విద్యను మాతృభాషలోనే గరపాలి. ప్రతి తరగతిలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20కి పరిమితం చేయాలి. ఈ దశలోని ఫౌండేషనల్ అయిన మొదటి మూడు తరగతులకు నిర్దేశిత పాఠ్య పుస్తకం ఉండరాదని ఎన్ఈపీ-2020 చెప్పినట్లు కాకుండా, పిల్లల కాగ్నిటివ్ శక్తులు పెంపొందడానికి అనుగుణమైన ఒక సిలబస్ ను, ఫార్మల్ తరగతి బోధనను ప్రారంభించాలి. నాలుగు, ఐదు తరగతులలో వివిధ సబ్జెక్టులలో ప్రాథమిక సమాచార జ్ఞానాన్ని అందించాలి. ముఖ్యంగా మాతృభాషలో తప్పులు లేకుండా మంచి ఉచ్చారణతో చదవడం, రాయడంవంటి సామర్థ్యాలను తప్పక సాధించాలి. అలాగే ఇంగ్లీషును ఒక భాషగా సరళ పదాలను, వాక్యాలను చదవడం, రాయడం నేర్పించాలి.  ఈ విధమైన భాషా సామర్థ్యాలతో పాటుగా చరిత్ర, జాగ్రఫీ, సైన్సు (విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి చరిత్ర, ప్రముఖ శాస్త్ర వేత్తల జీవిత కృషి), గణితం, పరిసరాల విజ్ఞానం తదితర అంశాలపై సాధారణ అవగాహనను కల్పించాలి. ఐదవ తరగతి పూర్తి అయ్యేసరికి బీజగణితం (కూడిక, తీసివేత, హెచ్చింపు, భాగహారం) తప్పని సరిగా రావాలి.

### 3).ఉన్నత పాఠశాల (సెకండరీ) విద్య

ఆరు నుండి పది తరగతుల వరకు భావించే ఉన్నత పాఠశాల విద్యలో ఎన్ఈపీ-2020 నిర్దేశించిన విధంగా 3,4,5 తరగతులను కలపడం పూర్తి అశాస్త్రీయం. ఈ సిఫార్సును ప్రభుత్వాలు కొత్తగా ఉపాధ్యాయులను నియమించకుండా, ఉన్న వారిపై భారాన్ని మోపడానికి ఉపయోగించుకుంటున్నాయి. ఈ స్థాయిలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:30కి మించకుండా, సబ్జెక్టు టీచర్స్ తో బోధనను ప్రారంభించాలి. ఈ దశలోని విద్యార్థులకు వివిధ విజ్ఞాన, సామాజిక శాస్త్రాల మౌలిక అంశాల జ్ఞానాన్ని అందించాలి. మాతృభాష, ఇంగ్లీషులలో మంచి పట్టును, ఆ భాషలలోని ఉత్తమ సాహిత్యంతో పరిచయాన్ని కలిగించాలి. మరొక మూడో భాషను విద్యార్థుల ఇచ్ఛ మేరకు ఐచ్ఛికంగా ఉంచాలి. ఈ స్థాయిలో పిల్లలలో మేధస్సు, కాగ్నిటివ్ శక్తులు పరిపూర్ణ రూపాన్ని పొందే విధంగా బోధనా పద్ధతి ఉండాలి. ప్రశ్న, పరిశీలన, ప్రయోగం, రుజువు, నిర్ధారణ, తర్కబద్ధ విశ్లేషణ అనే సైన్సు పద్ధతి ద్వారా ఆలోచనా శక్తిని పెంపొందించాలి. అలాగే తదుపరి హయ్యర్ సెకండరీ (ఇంటర్) స్థాయిలో విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా సైన్సు, సామాజిక, మానవీయ శాస్త్రాల విభాగాలలో ఒక దాన్ని ఎన్నుకునే స్థాయిని కలిగి ఉండాలి. ఈ స్థాయిలో ప్రతి తరగతికి పాస్-ఫెయిల్ పద్ధతిన సంవత్సరాంత పరీక్షలు, మూల్యాంకనం, చదువులో వెనుకబడిన విద్యార్థుల యెడల అదనపు శ్రద్ధ ఉండాలి.

ఈ స్థాయిలో ఎన్ఈపీ-2020 భావిస్తున్నట్లు 10వ తరగతి బోర్డు పరీక్షలను తొలగించాలని, ఒకేషనల్ కోర్సులను, మల్టీ డిసిప్లినరీ అధ్యయనాన్ని ప్రవేశపెట్టాలని సూచించడం ఏ విధంగానూ సముచితం కాదు. ఇది విద్యార్థుల జ్ఞానార్జన ప్రక్రియను దెబ్బతీసి, ఎందులోనూ పట్టులేని వారిగా తయారు చేస్తుంది. మల్టీ డిసిప్లినరీ కింద 9 నుండి 12వ తరగతులలో 24 సబ్జెక్టులను, అదనంగా 40 ఐచ్ఛిక అంశాలను, సెమిస్టర్ విధానాన్ని ఉంచాలని నిర్దేశించడం వలన విద్యార్థులపై ఎంతో మానసిక ఒత్తిడిని, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని కలిగిస్తాయి. ఇది పాఠశాల స్థాయికి ఆయువు పట్టు అయిన బోధన-అభ్యాసన ప్రక్రియను నీరుగారుస్తుంది. ఎన్ఈపీ-2020 చాలా వేగంగా అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే బోధన, అభ్యాసనం అటకెక్కి, విద్యా ప్రమాణాలు ఘోరంగా క్షీణించిన వాస్తవం కళ్ళముందు కనిపిస్తోంది. ఉపాధ్యాయులతో చదువుకు సంబంధం లేని సవాలక్ష పనులు చేయించడం, కేవలం పిల్లలతో వర్క్ బుక్కులు రాయించడం జరుగుతోంది. 10 ఏళ్ల పాఠశాల విద్య తరువాత మాతృ భాషలో చదవడం, రాయడంరాని పిల్లలు పెద్ద సంఖ్యలో ఉండగా, విచిత్రంగా 3వ తరగతి నుండి టోఫెల్ శిక్షణ ఇవ్వడం హాస్యాస్పదం.

### 4).హాయ్యర్ సెకండరీ (ఇంటర్) విద్య:

ఇంటర్మీడియట్ ను పాఠశాల విద్యా స్థాయిగా లేక ఉన్నత విద్యాస్థాయిగా పరిగణించాలా అనే ప్రశ్న ఎంతో కాలంగా ఉంది. ఎన్ఈపీ-2020 మాత్రం 11, 12 తరగతులను పాఠశాల స్థాయిలోనే ఉంచాలని చెప్పింది. అయితే ఆ స్థాయికి తగిన విధంగా పాఠశాలలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అవసరమైనంత ఉపాధ్యాయుల నియామకం వంటి ముఖ్యమైన బాధ్యతలను పూర్తిగా విస్మరించింది. ఇంటర్మీడియట్ ను పాఠశాల విద్యలో భాగం చేసినా లేక విడిగా ఉంచినా ఏదిఏమైనా, దీన్ని ఉన్నత విద్యకు సన్నద్ధం చేసే స్థాయిగా భావించాలి. ఈ స్థాయిలో విద్యార్థులు తమ ఆసక్తి మేరకు సైన్స్, ఆర్ట్, కామర్స్, హ్యూమానిటీస్ లలో ఏదో ఒక విభాగాన్ని ఎన్నుకొని ఆయా సంబంధిత గ్రూప్ సబ్జెక్టులలో సెకండరీ స్థాయి కంటే లోతుగా జ్ఞానాన్ని పొందాలి. మాతృభాష, ఇంగ్లీషు, మరే ఇతర భాషలకు చెందిన సాహిత్య అధ్యయనం యెడల ఆసక్తిని, అభినివేశాన్ని కలిగించాలి. అలాగే సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిల్లో ల్యాబ్స్, లైబ్రరీలు, ఆట స్థలాలు, క్రీడా సామగ్రి తదితర సదుపాయాలను తప్పని సరిగా ఏర్పాటు చేసి, విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు చాలా ప్రాధాన్యత నివ్వాలి. వారిలోని సృజనాత్మక శక్తులను పెంపొందించే కళలలో అభినివేశాన్ని పెంపొందించాలి. సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమాలను నిర్వహించాలి. ఈ స్థాయిలలో వ్యక్తిత్వ నిర్మాణం, మంచి ప్రవర్తన, ఉన్నత విలువలు, మహనీయుల జీవిత చరిత్రలు విద్యా బోధనలో అంతర్భాగం కావాలి.

ఈ విధమైన విద్యా ధ్యేయాలకు పూర్తి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిలలో ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ప్రాబల్యం వహించి, ఎంతటి అవాంఛనీయ పరిణామాలకు దారి తీశాయో అందరికీ తెలిసిందే. 12 గంటల పని వేళలు, తప్పుడు బోధనా పద్ధతులు, ప్రతి నిత్యం పరీక్షలు మొదలైనవి విద్యార్థులపై తీవ్ర శారీరక, మానసిక ఒత్తిడిని కలుగజేస్తూ ఆత్మహత్యలు జరగడానికి కారణమవుతున్నాయి. వీటిని నివారించడానికి తక్షణం విద్యా ప్రైవేటీకరణ, వ్యాపారీకరణను నిషేధించాలి.

### ఉన్నత విద్య

ఉన్నత విద్యను గంపగుత్తగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి అవసరమైన సిఫార్సులు ఎన్ఈపీ-2020లో చాలా ఉన్నాయి. వాస్తవంలో పబ్లిక్ రంగంలో ఉన్న డిగ్రీ కాలేజీల, విశ్వవిద్యాలయాల ఉనికిని ప్రశ్నార్థకం చేసే చర్యలు చాలా కాలం క్రితమే ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులను దశాబ్దాలుగా భర్తీ చేయకుండా కాంట్రాక్టు, గెస్ట్ అధ్యాపకులతో నెట్టుకురావడం జరుగుతోంది.

సెమిస్టర్ పద్ధతి అనేది తరగతి బోధన సమయాన్ని హరించి విద్యా ప్రమాణాలను దిగజార్చింది. ఇక యువతరాన్ని జ్ఞానం యెడల ఆసక్తిని చంపి వేయడం వలననూ, ఇంజినీరింగ్, కంప్యూటర్, మేనేజ్ మెంట్ కోర్సుల యెడల అవాంఛనీయ వ్యామోహాన్ని పెంపొందించడం వలననూ అకడమిక్ డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య ప్రతి ఏడూ తగ్గిపోతోంది. ప్రస్తుతం ఎన్ఈపీ-2020 ద్వారా చాలా హడావిడిగా అమలవుతున్న నాలుగేళ్ల డిగ్రీ, సింగిల్ మేజర్, మల్టీ డిసిప్లినరీ క్రెడిట్ కోర్సులు, కమ్యూనిటీ సర్వీస్, ఇంటర్న్ షిప్ మార్పులు, ప్రైవేటు మరియు విదేశీ యూనివర్సిటీలకు అనుమతి మొదలైనవి ఉన్నత విద్యను వధ్యశిల మీద నిలుపుతున్నాయి. ప్రస్తుతమున్న మూడేళ్ల డిగ్రీలో మూడు పరస్పరం సంబంధమున్న మూడు కోర్ సబ్జెక్టులను చదవడం వలన జరిగే నష్టమేమిటో, నాలుగేళ్ల డిగ్రీలో సింగిల్ మేజర్ ఔచిత్యమేమిటో ఎన్ఈపీ-2020లో ఎక్కడా ఒక్క వాక్యం కూడా చెప్పకుండా కేవలం విదేశీ మోడళ్లను మక్కీకి మక్కీ కాపీ చేయడంలో విధానకర్తల భావ దారిద్ర్యం, పాలకులకు దాసోహమైన బానిసత్వం కనిపిస్తాయి. డిగ్రీ, పీజీ కోర్సుల్లో మౌలిక ప్రకృతి, సామాజిక, మానవీయ శాస్త్రాలను అధ్యయనం చేయడం తగ్గిపోతే భవిష్యత్తులో పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో ఈ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు ఎక్కడి నుండి తయారు అవుతారో కనీసం ఆలోచించని దూర దృష్టి వీరిలో కొరవడడం చాలా విచారకరం.

ప్రస్తుతం అమలులోనున్న ఉన్నత విద్యలో పెద్దగా మౌలిక మార్పులు అవసరం లేదు. మూడేళ్ల డిగ్రీని, రెండేళ్ల పీజీని యథాతథంగా కొనసాగించాలి. చేయవలసిందల్లా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో, యూనివర్సిటీలలో ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయడం. మౌలిక సదుపాయాలను మెరుగు పర్చడం. సెమిస్టర్ స్థానంలో సబ్జెక్టు అంతటిపై సంవత్సరాంత పరీక్షలు పెట్టడం. అంతగా అవసరమైతే మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ పరంగా మెరుగైన పరిస్థితులున్న కొన్ని కాలేజీలను ఎంపిక చేసి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని పరస్పరం సంబంధమున్న మూడు కోర్ సబ్జెక్టుల కాంబినేషన్ తో ప్రవేశ పెట్టవచ్చు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే ఆసక్తి, స్తోమత ఉన్న అతి కొద్దిమంది ఆనర్స్ చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇక డిగ్రీ, పీజీ కోర్సుల మార్పులు, చేర్పులు, ఆధునీకరణ వంటి అకడమిక్ అంశాలను ఆయా సంబంధిత యూనివర్సిటీలలోని అకడమిక్ కౌన్సిల్ లేదా బోర్డ్ ఆఫ్ స్టడీస్ నిర్ణయించాలి. వీటిలో ఉన్నత విద్యా మండలి లేదా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వంటి ప్రభుత్వ బ్యూరోక్రాటిక్ శాఖలు లేదా యూజీసీ, ఏఐసీటీయూ, ఎన్ఎంసీ వంటి కేంద్ర సంస్థలు జోక్యం చేసుకోవడాన్ని అనుమతించకూడదు. ఈ శాఖలు, సంస్థలు కేవలం విద్యలో ఏకరూప ప్రమాణాలను, ఉన్నత స్థాయిని నెలకొల్పడానికి సలహాలు, సూచనలు చేయడానికి పరిమితం కావాలి. అన్నింటికంటే ముఖ్యంగా యూనివర్సిటీల వైస్-చాన్సలర్స్ నియామకాల్లో రాజకీయ జోక్యం లేకుండా సమర్థత, నిజాయితీ, నిబద్ధత కలిగిన విద్యావేత్తలను నియమించడం ఉన్నత విద్య ముందున్న అతి పెద్ద సవాలు.

**పరిశోధన**

మనదేశంలో పరిశోధనకు ఇస్తున్న ప్రాధాన్యత గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. యూనివర్శిటీలలో జరిగే పరిశోధనల ప్రామాణికతను పక్కకు పెట్టినా, ప్రఖ్యాత పరిశోధనా సంస్థలలో కూడా నిధుల కొరత పరిశోధనలను బాగా కుంటుపరుస్తోంది. మనదేశంలో పరిశోధనకై జీడీపీలో కేవలం 0.6 శాతం మాత్రమే కేటాయించబడుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఇజ్రాయెల్ దేశ జీడీపీలో 4.22 శాతం, అమెరికా 4 శాతం కేటాయిస్తున్నాయి. చాలాకాలం నుండి రీసర్చ్ స్కాలర్స్ ఉపకార వేతనాలు అందడం లేదు. ఉన్నత విద్యలో విద్యార్థులకు, స్కాలర్స్ కు ఇచ్చే ఫెలోషిప్ లు బాగా తగ్గి పోయాయి.


> **ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ-2020 అమలులో భాగంగా నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్)ను ఏర్పాటుచేసింది. దీనితో మనదేశంలో ఇప్పటి వరకు పరిశోధనలకు నిధులను సమకూర్చేందుకు ఉన్న సీఎస్ఐఆర్, యూజీసీ వంటి సంస్థలన్నీ రద్దవుతాయి. ఈ ఎన్ఆర్ఎఫ్ వ్యవహారాలకు ప్రధాని అధిపతిగా ఉంటాడు. ఈ విధంగా ప్రధానమంత్రి ద్వారా పరిశోధనకు సంబంధించి ఎంచుకునే అంశాన్ని కూడా ఎన్ఆర్ఎఫ్ నియంత్రించడం ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇలా రాజ్య నియంత్రణలో జరిగే పరిశోధనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండవు. కొత్త వెలుగును చూపే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉండదు.**

ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం పరిశోధనకు కేంద్రం నిధులు పెంచేటట్లు, అందుకు సంబంధించిన వ్యవహారాలన్నింటినీ, రాజ్య జోక్యం లేని స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థలకు వదలివేయాలని ఒత్తిడి చేయడం. ప్రస్తుతం ఉన్నట్లుగా రెండేళ్ల పీజీ తరువాత యూనివర్శిటీలలో ఎం.ఫిల్, పి.హెచ్.డి ప్రోగ్రామ్స్‌ను కొనసాగించాలి.

**ఆన్లైన్ మరియు డిజిటల్ విద్య**

ఈ మధ్య కాలంలో మరీ **(మిగతా 65వ పేజీలో)**

# మోదీ రాజకీయం లోగుట్టు



- డి.వి.వి.ఎస్.వర్మ

**మోదీ రాజకీయం మామూలు రాజకీయం కాదు. సంప్రదాయ రాజకీయానికి పూర్తిగా భిన్నమైంది. ఈ ప్రత్యేక తరహా రాజకీయాన్ని ఆవిష్కరించడానికి, విశ్లేషించడానికి సంప్రదాయ రాజకీయ కొలబద్దలు పనికిరావు. ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ రచనలలోని భావజాలం మనకు ఉపకరిస్తుంది. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని రూపొందించడానికి అది దారి చూపిస్తుంది. ఈ భావజాలం నేపథ్యంలో మోదీ రాజకీయాన్ని అర్థం చేసుకోడానికి మనం కొత్త ఉపకరణాలను రూపొందించుకోవాలి. ప్రతిఘటించడానికి కొత్త మార్గాలను అన్వేషించుకోవాలి.**



నిత్య జీవితంలో ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారు అయినా మోదీని ఆమోదిస్తున్నారు. ఇది మన కళ్ల ముందు కనిపిస్తున్న రాజకీయ వైరుధ్యం. పాలకులు ప్రజల నెత్తిన భారాలు పెడితే వారు దానిని నిరసించాలి, ప్రతిఘటించాలి. పాలకులు ప్రజాదరణ కోల్పోవాలి లేదా పరాజయం పొందాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. పప్పులు, నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీలు చేస్తున్నాయి. నిరుద్యోగం కొవిడ్‌కి ముందే తారస్థాయికి చేరింది. తర్వాత ఉపాధి స్థితి అధ్వాన్నం అయింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర పెరగకపోగా ఉన్నదీ పోతోంది. కొత్త వ్యవసాయ చట్టాలు, కొత్త కార్మిక చట్టాలు, కొత్త పౌరసత్వ చట్టాలు అన్నీ ప్రజా వ్యతిరేకమైనవే. పౌరహక్కుల మీద, ప్రజా స్వామ్య వ్యవస్థల మీద నిత్యం దాడులు జరుగుతున్నాయి. పెద్ద నోట్ల రద్దుతో కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఎన్ని ఉద్దీపనలు ఇస్తున్నా తిరోగమనంలోనే వుంది. కొవిడ్ కాలంలో ప్రజలు పడ్డ, పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిత్య జీవితంలో ప్రజలు ఇన్ని కష్టాలను భరిస్తున్నారు. ఒకనాడు ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రభుత్వాలు పడిపోయిన దేశంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు కష్టాలను భరించడానికి సిద్ధం అవుతున్నారు. కాని మోదీని వదిలించుకోవాలని భావించడం లేదు.

2021 జనవరిలో ఇండియా టు డే నిర్వహించిన "మూడ్ ఆఫ్ ది నేషన్" సర్వేలో మోదీ జనాకర్షణ కించిత్తు కూడా తగ్గలేదని, ఎన్నికలు జరిగితే 302 సీట్లు గెలుస్తారని వెల్లడించింది. ప్రజలు మోదీ పాలనలో కష్టాలను భరించడానికి ఎందుకు సిద్ధం అవుతున్నారు ? మోదీ పట్ల మోజును ఎందుకు వదులుకోవడం లేదు ? మోదీ రాజకీయంలోని ఈ ప్రత్యేకతను ఎలా అర్థం చేసుకోవాలి అన్న దానిని లోతుగా పరిశీలించాలి.

2014 ఎన్నికలలో మోదీ ఘన విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలలో అధికార మార్పిడి సహజం. ఈ అధికార మార్పిడి సంప్రదాయ రాజకీయ పరిణామంగానే జరిగిందా ? లేక సంక్షోభకాలపు ప్రత్యేకత వల్ల జరిగిందా అన్న అంశాన్ని విశ్లేషించుకోవాలి. 2014 ఎన్నికల నాటికి దేశంలో రాజకీయ సంక్షోభం లేదా నాయకత్వ సంక్షోభం చోటు చేసు కుంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల పరం పరలో చిక్కుకుంది. అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం కోసం అన్నాహజారే ప్రారంభించిన ఉద్యమం దిల్లీని కది లించింది. దేశవ్యాపిత ఉద్యమ రూపం ధరించింది. రాజకీ యాలకు దూరంగా వుండే మధ్యతరగతి వర్గాలు ఈ రాజకీయ ఉద్య మంలో పాత్రధారులయ్యారు. సోనియాగాంధీ చేతిలో కీలు బొమ్మ ప్రధానిగా మన్మోహన్‌ను నిర్ణయాలు తీసుకోలేని

అసమర్థునిగా భావించారు. అలాగే ముంబై పేలుళ్లపై పాకిస్తాన్‌తో దీటుగా వ్యవహరించలేదన్న విమర్శలు చేశారు. ఎన్నికల నాటికి పాలక పార్టీ "నాయకత్వ సంక్షోభం"లో పడింది.

**ఇలాంటి రాజకీయ సంక్షోభాలపై ఆంటోనియో గ్రాంసీ తన రచనలలో చాలా లోతైన విశ్లేషణలు చేశారు. పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించ లేని స్థితి మరో పక్క ప్రతిపక్షాలు దానిని తొలగించ లేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటప్పుడే రాజకీయ రంగంలో సమ్మోహనా శక్తులకు ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోల కోసం, ప్రజల వెదుకులాట ప్రారంభమవుతుంది. ఇది స్థూలంగా గ్రాంసీ విశ్లేషణ సారాంశం.**

2014 నాటికి కాంగ్రెస్ పార్టీ అధికారానికి నూకలు చెల్లాయి. కాని దాని స్థానాన్ని ఏ ఒక్క పార్టీ ఆక్రమించగల స్థితిలేదు. అలాగే ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు అధికారం చేపట్టగల స్థితి కనిపించలేదు. గ్రాంసీ పేర్కొన్నట్లు ఇలాంటి అనిశ్చితి కాలంలో ప్రజలు హీరోల కోసం వెదుకులాడడం సహజం. అయితే దీనిని మోదీ గాని బీజేపీ గాని ముందుగానే పసిగట్టిన దాఖలాలు లేవు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో హిందుత్వాన్నీ, రామాలయాన్ని తెరవెనుకనే వుంచారు. అందరికీ మంచి రోజులు, అందరికీ అభివృద్ధి, యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాలలో వున్న అవినీతి సొత్తు తెచ్చి తలా 15 లక్షల పంపిణీ వంటి సాధారణ వాగ్దానాలనే ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో సాధించిన విజయాలనే దేశమంతా విస్తరింపజేస్తాననే ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అయితే ఈ నినాదాలు ఆయన విజయానికి ఎంత వరకు దోహదం చేశాయో తెలియదు కాని ప్రజలు, ప్రత్యేకించి యువత ఆయన వాగ్దానాల కోణం నుండి కాకుండా దేశాన్ని రక్షించే, నడిపించే హీరోగా ఓట్ల ప్రభంజనాన్ని సృష్టించారు. ఈ ఎన్నికల్లో ఆయన వాడిన నినాదాలకంటే "నాయకత్వ సంక్షోభం" కాలపు ప్రజల మనోస్థితి ప్రధానపాత్ర వహించింది. ఇది మోదీ నినాదాలు సృష్టించిన ప్రభంజనం కాదు. సంక్షోభ కాలంలో ప్రజల మనోస్థితి సృష్టించిన ప్రభంజనం. అందువల్ల మోదీ బలం ఆయన ప్రచారం చేసిన నినాదాలలోకంటే ప్రజల మనోభావాల స్థితిలో వుందన్న అంశాన్ని మనం గుర్తించాలి.

### మోదీని హీరోని చేసింది ఎవరు ?

పౌర సమాజంలో భావజాల ఆధిపత్యం లేదా ప్రాబల్యం నిర్వహించే పాత్రపై గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతంలో విపులంగా చర్చించారు. పాలకవర్గాలు తమ పాలన సాగించడానికి బలప్రయోగ పద్ధతులతోపాటు పౌరసమాజ సమ్మతిని పొందడం కూడా సాధనం చేసుకుంటారు. ఈ పౌర సమాజ సమ్మతికి ప్రభుత్వేతర పౌర సంస్థలన్నింటి ద్వారా అంటే పాఠశాలలు, మత సంస్థలు, సాంస్కృతిక సంస్థలు వగైరాల న్నింటినీ వినియోగించుకుంటారు. ఈ భావజాల ప్రాబల్యాన్ని సాధించడంలో సవర్గ మేధావుల పాత్రను ఆయన వివరించారు. ఇది పాలకవర్గాల హెజమనీ సాధనలోనూ, దానికి ప్రత్యామ్నాయంగా రూపొందే కౌంటర్ హెజమనీ సాధనలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ విశ్లేషణ నేపథ్యంలో మోదీని హీరోని చేసిన అంశాలను పరిశీలించడం అవసరం.

**2017లో అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ సంస్థ భారత ప్రజల రాజకీయ అభిప్రాయాల మీద సర్వే నిర్వహించింది. దేశంలో ఎలాంటి మినహాయింపులు లేని ప్రజాస్వామ్య ప్రభుత్వమే వుండాలన్న స్పష్టమైన నిబద్ధతను ప్రకటించిన వారు కేవలం ఎనిమిది శాతం వున్నారు. 67 శాతం మంది ప్రజాస్వామ్యంపై కొంత విశ్వాసం ప్రకటించినప్పటికీ వారు ప్రజాస్వామ్య రహిత ప్రభుత్వాలపై కూడా సానుకూలతను వ్యక్తం చేశారు. 55 శాతం మంది నిరంకుశ ప్రభుత్వాలను సమర్థించారు. 27 శాతం మంది "బలమైన నాయకుడు" అవసరమన్నారు. అంతేకాదు 53 శాతం మంది సైనిక పాలన అవసరంగా భావించారు. భారతదేశానికి పాకిస్థాన్ "అత్యంత" ప్రమాదకరమైన దేశంగా భావించారు.**

ఈ సర్వే 2017లో నిర్వహించినా ఇలాంటి భావాలు చాలా కాలంగా దేశంలో వ్యక్తమవుతూనే వున్నాయి. దీనికితోడు బీజేపీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ 95 ఏళ్లుగా చరిత్రనీ, సంస్కృతిని వక్రీకరిస్తూ మత విద్వేష భావజాలాన్ని, గత కాలపు హిందూ వైభవాలను, మత జాతీయవాదాలు వగైరాలను నూరిపోస్తూనే వుంది. పైగా మన చరిత్ర రచన నేటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నది. పురాణాలనే చరిత్రగా భావించడం, దుష్ట శిక్షణకు యుగ పురుషుల అవతారాలపై ప్రచారం నేటికీ నడుస్తూనే వుంది.

రాజకీయ రంగంలో "నాయకత్వ సంక్షోభం" తలెత్తినప్పుడు,

హీరోల కోసం వెదుకులాటలు ప్రారంభమైనప్పుడు పౌర సమాజంలోని ఇలాంటి భావజాలం కీలకపాత్ర పోషిస్తుంది. మన పౌర సమాజంలో నెలకొనివున్న ఈ భావజాలానికి తగిన ప్రతినిధిగా మోదీ కనిపించారు. ఆయనను ఈ భావజాలమే హీరోని చేసింది. దేశాన్ని ఐక్యపరిచిన వ్యక్తిగా ప్రాచుర్యంలో వున్న "సర్దార్ పటేల్"కు నివాళిగా ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహ నిర్మాణాన్ని మోదీ ప్రకటించారు. ప్రజలు మోదీలోని "ఉక్కు మనిషి"ని అందులో చూశారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రచారంతో "మోదీ వికాస్ పురుష్" అయ్యాడు. గుజరాత్ అల్లర్లలో ముస్లింలను "ఉక్కు పాదంతో" అణిచివేసిన తీరుతో "ప్రతీకారేచ్ఛకు" ప్రతిరూపం అయ్యాడు. భార్యను విడనాడి భరతమాత సేవకు అంకితమైన "సర్వసంగ పరి త్యాగి" "భారత్ మాతాకి జై" అంటూ దేశం కోసమే జీవిస్తున్న హీరోగా కనిపించాడు. మొత్తం మీద పౌర సమాజంలో నెలకొని వున్న ఈ భావజాలం కోరుకున్నది "దేశ రక్షకుడైన ఉక్కు మనిషిని", దేశానికి "ప్రమాదకారి" అయిన ముస్లిం పాకి స్థాన్‌కు తగిన బుద్ధి చెప్పగల హిందూ జాతీయవాదిని, గత కాలపు "పురాణ" వైభవాలను పునరుద్ధరించే హీరోనే. మోదీ విజయం తర్వాత ప్రజలు ఆయన పాలనను ఈ భావజాలపు కళ్లద్దాలతోనే చూస్తున్నారు. నిత్య జీవితానికి సంబంధించిన మోదీ వైఫల్యాలు వారికి అంతగా పట్టకపోవడానికి ఇదే కారణం.

## ప్రజా సమస్యలకు దూరం - జనాకర్షణకు మార్గం

మోదీ ఒక సాధారణ రాజకీయవాదిగా వ్యవహరించడం లేదు. ప్రభుత్వ పాలన తనకు సంబంధం లేనట్లు వ్యవహరి స్తున్నారు. ఆయన ప్రసంగాలలో ప్రజలు నిత్య జీవితంలో పడుతున్న కష్టాలను ప్రస్తావించడం లేదు. వాటిని మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి వదిలేశారు. వాటివల్ల వచ్చే అసంతృప్తికి తాను గురికాకుండా జాగ్రత్తపడుతున్నారు. తాను హిందూ జాతీయ వాదినని ప్రకటించుకున్నారు. తానొక సన్యాసిగా, యోగా సాధకునిగా, సంసార జంఝాటం లేని వాడిగా, భౌతిక వస్తువుల సంపదపై ఆసక్తి లేని వానిగా అందరి దృష్టినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన భారతదేశాన్ని కేవలం రాజకీయవేత్తగా కాకుండా సామాజికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా నడిపించే నేతగా కనిపించే ప్రయత్నాలు చేస్తు న్నాడు. ఆయన తపస్సు గురించి, యజ్ఞం గురించి, యోగా గురించి, గత కాలపు హిందూ వైభవం గురించి అనేక ప్రస్తావ నలు చేస్తున్నారు. కష్టాలు పడకుండా సుఖాలు, ముక్తి దక్కదన్న భావన కల్పిస్తున్నాడు. ఈ మార్గంలో ఆయన రాజకీయ అభిమానులని కాకుండా భక్తులను సృష్టించుకుంటున్నాడు. భక్తులకు వచ్చే కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు. వారు కష్టాలను అనుభవిస్తారే తప్ప తమ ఆరాధనని వదులుకోరు. పైగా మరింత పెంచుకుంటారు. దేశానికి మోదీ అవసరం అన్న నినాదం దీని నుండి పుట్టుకొచ్చిందే. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే నాయకుడు అన్న నినాదం అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తుంది. వైవిధ్యాన్ని తొలగిస్తుంది. నియంతృత్వానికి, ఫాసిజానికి ద్వారాలను తెరుస్తుంది.

అందువల్ల మోదీ రాజకీయాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే. ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే. కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావ జాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తే సరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో నెలకొన్న భావజాలం మీద జరగాలి. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. ప్రజల లోక జ్ఞానంలో భాగమైన ఈ భావ జాలాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే కొత్త రూపంలో, సరికొత్త నినాదాలతో జరగాలి. పౌర సమాజంలో అలాంటి ప్రజా ప్రత్యామ్నాయ భావజాలం మీద సాగించే ఉద్యమాల రూప కల్పనకు గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది.

అందుచేత మోదీని, బి.జె.పిని ఓడించడానికి నిర్దిష్టమైన ప్రత్యామ్నాయ రాజకీయం కావాలి. అది బి.జె.పి మత జాతీయ వాదానికి భిన్నంగా, దాని ఆర్థిక, రాజకీయ విధానాలకు భిన్నం గా ఒక కొత్త దారి చూపించేది కావాలి. ఎందుకంటే పాత రాజకీయ పద్ధతులతో బి.జె.పిని ఓడించడం సాధ్యపడదు. అది సంప్రదాయ రాజకీయానికి భిన్నమైంది. దానిని ప్రతిఘటించ గల కొత్త రాజకీయం కావాలి. బి.జె.పి హిందూత్వ జాతీయ వాదాన్ని ప్రతిఘటించగల "భారత జాతీయ వాదాన్ని" నిర్వచిం చాలి. ప్రజల్ని విభజించడానికి బదులు వారిని ఐక్యపరిచేది, ప్రాంతీయ పరమైన, భాషాపరమైన మతపరమైన బహుళ త్వాన్ని ఇముడ్చుకోగలిగే భారత జాతీయ వాదాన్ని ముందుకు తేవాలి. ప్రజాస్వామ్యానికి పౌరులు ప్రాతిపదిక. వారి మత విశ్వాసాలు కాదు. ఇక్కడ పుట్టిన వారికి, నివసిస్తున్న అందరికీ పౌరసత్వం పొందేలా చట్టాలను మార్చే ప్రత్యామ్నాయాన్ని ప్రకటించాలి.

విద్యా బోధనలో చరిత్రకీ, సంస్కృతికి కృత్రిమమైన మత ప్రాతిపదికకు బదులుగా దాని బహుళత్వ పునాదిని ప్రకటించే ప్రత్యామ్నాయం రూపొందాలి. ఆర్థిక రంగంలో కార్పొరేటీకరణ


ను అదుపు చెయ్యడం వాటిని నిరోధించడం లక్ష్యంగా ప్రత్యామ్నాయ విధానాలు వుండాలి. వ్యవసాయ బిల్లులు, కార్మిక చట్టాల మార్పులు, పౌరహక్కులపై దాడికి ప్రతిగా ప్రత్యామ్నాయ విధానాలు వుండాలి. ప్రభుత్వ రంగం పటిష్టతకు, ఉపాధి విస్తరణకు తగిన ప్రత్యామ్నాయ విధానం ప్రకటించాలి.

పేదలు, ఉప శ్రేణులకు నివాసం, చదువు, వైద్యం, ఉపాధి, కనీస ఆదాయం, హక్కుగా ప్రకటించాలి. దీనిని సాధించడానికి కొద్ది మంది చేతులలో పోగుపడిన సంపదను పునఃపంపిణీ చేసే చర్యలు ప్రకటించాలి. ఇవి కొన్ని మాత్రమే ఇలాంటి ప్రత్యామ్నాయ రాజకీయం ప్రాతిపదికగా ఏర్పడే కూటములు మాత్రమే అన్ని తరగతుల ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాయి. హిందుత్వ మతోన్మాద నినాదాల నిజ స్వరూపాన్ని బహిర్గతం చేస్తాయి. అలాంటి ప్రత్యామ్నాయ రాజకీయమే మోదీని, బి.జె.పిని ప్రతిఘటించగలుగుతుంది. ❑

# 2020 నూతన విద్యా విధానానికి ప్రత్యామ్నాయం-కొన్ని పరికల్పనలు


**(62వ పేజీ తరువాయి)**

ముఖ్యంగా కోవిడ్ వ్యాపించిన సమయంలో ఆన్లైన్ మరియు డిజిటల్ విద్య విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ప్రభుత్వ అధికార వర్గాలు కూడా దీన్ని ప్రత్యామ్నాయ విద్యా పద్ధతిగా అభివర్ణిస్తున్నాయి. ఎన్ఈపీ-2020లో కూడా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)ని విస్తృతంగా వినియోగించాలని, 50 శాతం మంది విద్యార్థులను దీని పరిధిలోకి తీసుకురావాలని నొక్కి చెప్పడం జరిగింది. ప్రత్యేకంగా పూర్తిస్థాయి డిజిటల్ యూనివర్శిటీలనే ఏర్పాటు చేయాలనే పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా బైజూస్ అనే ఒక కార్పొరేట్ ఎడ్యుటెక్ కంపెనీతో వేల కోట్ల రూపాయల ఒప్పందం చేసుకొని, ఆ కంపెనీ అందించే కంటెంట్ తో ట్యాబ్లను ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తోంది. ఇలా పాలకులు ఐసీటి వినియోగానికి ఎక్కువ శ్రద్ధ చూపడం వెనుకనున్నఉద్దేశం స్పష్టమే. ఇది తరగతి గదిలో ఉపాధ్యాయుని ప్రత్యక్ష బోధన ద్వారా విద్యార్థి నేర్చుకొనే టీచింగ్-లర్నింగ్ ప్రక్రియనే ధ్వంసం చేయడానికి ఉద్దేశించిన అనేక ఇతర చర్యలతో పాటు ఇదొకటి తప్ప మరేమీకాదు. అలాగే ప్రభుత్వాలు కొత్తగా విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయులను నియమించడం, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం వంటి బాధ్యతల నుండి తప్పుకోవడానికి మంచి అవకాశంగా ఉపయోగించుకుంటు న్నాయి. ఈ ఆన్లైన్ మరియు డిజిటల్ విద్య కూడా ఆర్థికంగా స్తోమతగల వారికి బాగా అందుబాటులో ఉన్న సౌకర్యం కావున సమాజంలో ఇది మరొకరకమైన అసమానతను సృష్టిస్తుంది. ఒక విషయం వాస్తవమే. ఐస్సీటీ అనేది ఉపాధ్యాయుని మెరుగైన బోధనకు తప్పక సహాయకారిగా ఉంటుందని చెప్పవచ్చు. అలాగే విద్యార్థులు తమ జ్ఞానాన్ని, సమాచారాన్ని పెంపొందించు కోవడానికి తోడ్పడుతుందని కూడా చెప్పవచ్చు. కావున ఉపాధ్యాయుని బోధనతో పాటుగా ఆన్లైన్ మరియు డిజిటల్ సమాచారాన్ని అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంచే సదుపాయాలను కల్పించాలి.




### విద్యా విధానాల రూపకల్పన, విద్యా వ్యవస్థ నిర్వహణ

ప్రత్యామ్నాయ విద్యా పరికల్పనల గురించిన చర్చలో చివరగా విద్యా విధానాల రూపకల్పన ఎవరు చేయాలి? విద్యా వ్యవస్థను ఎవరి అధీనంలో నిర్వహించాలి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రభుత్వాలు మాత్రం మేము నిధులిస్తున్నాం కావున మా కనుసన్నలలో, మేము నియమించిన బ్యూరోక్రాట్ల ఆధీనంలో విద్యా విధానాలు రూపొందాలి, వారి ఆదేశాల ప్రకారం అంతా నడవాలి అని చెబుతాయి. వాస్తవానికి ఎన్ఈపీ-2020ని తయారు చేసింది, దాన్ని అమలు చేస్తున్నది బ్యూరోక్రాట్లే. ఇలా చేయడం విద్యకు సంబంధించిన ప్రజాస్వామ్య సూత్రాలకు పూర్తి విరుద్ధం. చరిత్రను పరిశీలిస్తే యూరోపియన్ పునరుజ్జీవనోద్యమ కాలంలో ఉద్భవించిన భావన ప్రకారం విద్యను రాజ్య నియంత్రణ నుండి వేరుచేసి, విద్యావేత్తలతో విద్యా విధానాలు రూపొందించాలి, విద్యతో సంబంధమున్న ప్రతినిధులతో విద్యా వ్యవస్థ నిర్వహింపబడాలి, విద్యకు అవసరమైన నిధులను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలి తప్ప విద్యపై నియంత్రణాధికారం చెలాయించరాదు. మహా అయితే నిధుల సక్రమ వినియోగానికి ఆడిట్ చేయవచ్చు. విద్యావ్యవస్థలో ప్రజాస్వామ్యమంటే ఇదే. సంక్షిప్తంగా ప్రత్యామ్నాయ విద్యా పరికల్పనలివి. ఇవి ఆచరణలో సాకారం కావాలంటే బలమైన ప్రజా ఉద్యమం ఆవశ్యకం. ❑




నవ్విపోదురు గాక
నాకేటి సిగ్గు !

మోడీ.. ఇట్స్ గాన్ !









ఈ వేగం తట్టుకోలేరు !


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 2 - Issue No : 6 March 2024




## ఎన్నికల ఎజెండాలు కొన్ని పుస్తకాలు 2024




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.